# గురువులు

వచన

# ఆచార్య పురుషుల చరిత్ర


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

"నేను" గా ఉండటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి. కనుక తమవంతుగా భక్తి,జ్ఞాన ప్రచారార్థం TTD(తిరుమల తిరుపతి దేవస్థానం) వారు ఉచితంగా విలువైన గ్రంధాలను ఆన్ లైన్ లో eBOOK(PDF) అందిస్తున్నారు. వారు చేస్తున్న జ్ఞాన యజ్ఞానికి సాయి రామ్ కూడా తమవంతుగా సహాయం చేసే కార్యక్రమంలో భాగంగా వారి గ్రంధాలను సాయి రామ్ ద్వారా కూడా అందచేస్తున్నాము, ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం చేసిన ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(www.google.co.in), మైక్రోసాఫ్ట్ సైట్ (www.microsoft.com) వారికి కూడా మేము ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇంట్లో ఆధ్యాత్మిక గ్రంధాలయం ఉండాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) TTD(తిరుమల తిరుపతి దేవస్థానం) వెబ్ సైట్: http://ebooks.tirumala.org
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సాయి రామ్ సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము.


**గమనిక:** భక్తి,జ్ఞాన ప్రచారార్థం **ఉచితంగా eBook** రూపంలో TTD(తిరుమల తిరుపతి దేవస్థానం) సహాయంతో ఇవ్వడం జరిగింది. ఈ గ్రంధముపై వ్యాపార,ముద్రణ హక్కులు రచయిత,పబ్లిషర్స్ కి గలవు.

**SaiRealAttitudeManagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)**

* సర్వం శ్రీ సాయి నాథ పాద సమర్పణమస్తు *

## TTD(తిరుమల తిరుపతి దేవస్థానం)

**http://ebooks.tirumala.org**



# అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# ఆచార్యపురుషుల చరిత్ర

★

మొవ్వ శ్రీనివాస పెరుమాళ్లు

★

మతగ్రంథాలకు సహాయం అందించే కార్యక్రమము క్రింద, శ్రీ తిరుపతి - తిరుమల దేవస్థానమువారి ధనసహాయముచే నీ గ్రంథము ముద్రింపబడినది.

PLACED ON THE SHELF
Date.........

హక్కులు గ్రంథకర్తవి

ప్రతులు 1000

వెల రు. 15-00

SRI VENKATESWARA
CENTRAL LIBRARY &
RESEARCH CENTRE.
Acc. No 33623
Date..........
TIRUPATI.

వలయువారు
శ్రీ మువ్వ శ్రీనివాసరెడ్డిగారు
శ్రీ వేణుగోపాలసేవాశ్రమము
పూడివాడ
వయా : నగరం, పల్లపట్ల తాలూకా
గుంటూరు జిల్లా.

THIS BOOK IS

PUBLISHED WITH THE FINANCIAL ASSISTANCE OF

TIRUMALA TIRUPATI DEVASTHANAMS

UNDER THEIR SCHEME

"AID TO PUBLISH RELIGIOUS BOOKS"

# కృతజ్ఞత

ఈ గ్రంథముద్రణమునకు, తిరుపతి-తిరుమల దేవస్థానము నుండి ధనసహాయమందించిన, దేవస్థానము కార్యనిర్వాహణాధికారి శ్రీమాన్ జి. కుమారస్వామి రెడ్డి, I.A.S., గారికిని,

మహాకవి తెల్లజాలు-సహృదయసత్తములు శ్రీ తి. తి. దేవస్థానము P. R. O. శ్రీమాన్ రావుల సూర్యనారాయణ మూర్తి, M. A; B. Ed. గారికిని,

విమర్శకాగ్రేసరులు తి. తి. దేవస్థానము సంపాదకులు శ్రీమాన్ కె. సుబ్బారావు, M. A. గారికిని, నా హృదయ పూర్వక కృతజ్ఞతాభివందనములు.

ఈ పుస్తకమును చక్కగా ముద్రించియిచ్చిన, విజయ ఆర్టుప్రెస్ - తెనాలి, అధిపతి T. కోటిరెడ్డి గారికిని, అందలి సిబ్బందికిని నా మెచ్చుకోలు.

—గ్రంథకర్త

శ్రీ వేంకటగురుభ్యోనమః

# స్తుతి

శ్లో॥ జన్మక్షేమ లయాశ్చ యస్య జగతాం లీలాభవం త్యంజసా
రవ్యాదిగ్రహ సంతతి ర్భ్రమతి ఖే యస్యేచ్ఛయా సంతతమ్
యత్పాదాంబుజసేవనం భవతి నై నిశ్రేయసప్రాప్తయే
సోయం వేంకటశైలరాట్కలయతు శ్రేయాంసి భూయాంసి నః

శ్లో॥ శ్రవణాత్కీర్తనాద్యస్య స్మరణాన్మూర్తి దర్శనాత్
ఆనందం లభతే జంతుః తం వన్దే వేంకటాధిపమ్

శ్లో॥ యస్యాః కటాక్షామృతలేశయోగాత్
లభంతి మర్త్యాః భువిదేవ భోగాన్
తతో భవాంతే పరముత్తమం పదమ్
తాం పద్మగేహాం ప్రణమామి నిత్యమ్

శ్లో॥ త్రయీ శిఖ పరిష్కారం శ్రీనివాసం పరం మహః
ధ్యాత్వా శ్రీమహాపురుషచరితం క్రియతే మయా

శ్లో॥ జననీ రాఘమాంబా చ జనకో వేంకటాహ్వయః
ఉభౌ తౌ నిత్య మస్మాకం దదాతాం శ్రేయ ముత్తమమ్

శ్రీమతే రామానుజాయ

శ్రీ వేంకట పరబ్రహ్మణే నమః

# భాష్యకారులు ఆమోదము

శ్లో॥ సమస్త చిదచిద్వస్తు శరీరాయాఖిలాత్మనే
శ్రీమతే నిర్మలానందో దన్వతే విష్ణవే నమః

చిదచిన్మయంబగు ఈ జగంబంతయు ఈశ్వరాధిష్ఠితంబు. చిత్తును (జీవుడు) అచిత్తును (ప్రకృతి) రెండును కలిసి ఈశ్వరునకు శరీరము. ఈ మూడింటియందును అచిత్తు ఒక్కటే సూక్ష్మస్థూల పరిణామము కలదియగుటచే మనకు ఇంద్రియగోచరమగుచున్నది. చిత్తు, పరమాణుస్వరూపుడు. ఈశ్వరుడు విభువు, అందువలన ఈ ఇద్దరు గోచరించరు. ప్రకృతి జీవునకు భోగ్యమైయున్నది. దీనిని ధరించియే ఈ జీవుడు కర్మకుకర్తయై ప్రకృతిఫలము ననుభవించుచున్నాడు. జీవుడు కర్మబద్ధుడగుటచే ఫలము ననుభవింపకదప్పదు. ఈశ్వరుడు చిదచిత్తులరెంటిని శరీరముగా ధరించియున్నాడు. ఇతని ఆదేశములేనిదే ఈ చిదచిత్తులు రెండును నిలువవు. ఈశ్వరునకు ప్రకృతియు జీవుడును శరీరముగానున్నను ఆయా ఫలములు అతనినంటవు. ఎందువల్లనన, ఈశ్వరుడు ఈ రెంటిని ఇచ్ఛానుసారముగా ధరించుచున్నాడు. కాన ఆత్మ అనబడువస్తువు చాలచిత్రమైనది. ఈ ఆత్మను ఆశ్చర్యవస్తువుగా ఒకడు చూచుచున్నాడు. మరియొకడు దీనిని ఆశ్చర్యవస్తువుగా చెప్పుచున్నాడు. ఇంకొకడు అట్లే వినుచున్నాడు. ఇట్లు చూచియు చెప్పియు వినియు దీనియథార్థమునెరింగిన వాడో

కర్తుడులేడు. అని భగవానులు సెలవిచ్చియున్నారు. అట్టి జీవుడు కర్మబద్ధుడై యాతనా శరీరాదులధరించి అనేక బాధలకు లోనై శ్రమపడుచున్నాడు. వీడు ఈశ్వరారాధనచేయక సుఖపడడు. ఈశ్వరుడు అతీంద్రియుడు. వాక్కునకు మనస్సునకందనివాడు, సనకసనందనాది యోగులకందడు. (యతో వాచో నివర్తంతే అప్రాప్యమనసా సహ) సర్వేశ్వరుని కొనియాడవలెనని తలంచి వేదములు కొంతదూరముపోయి మనస్సుతో కూడ వెనుకకు తిరిగినవి. అని మొదటివాక్యము. అట్టి ఈశ్వరుని ఈజీవుడు మరిఎట్లు ఆరాధించవలె నన్నచో ఈశ్వరుడు భక్తపరాధీనుడు. భక్తి కొక్కదానికే లొంగును. శ్రుతియు నట్లే కొనియాడుచున్నది. (భక్తిరేవైనం గమయతి. భక్తివశః పురుషః) భక్తి ఒక్కటియే భగవంతుని పొందించుచున్నది. భక్తికే అతడువశుడు. భగవానుడు భక్తితప్ప ఇతరములగు కర్మజ్ఞాన యోగాదులకు అందడు. భక్తి అనగా ఎల్లప్పుడు అవిచ్ఛిన్నమైన తైలధారవలెనుండు ప్రేమతో సర్వేశ్వరుని తలంచుట. దీనినే భాష్యకారులు మిక్కిలి కొనియాడియున్నారు. (భవతు మమ పరస్మిన్ శేముషీ భక్తిరూపా) పరబ్రహ్మమునందు నా మనస్సు భక్తిరూపముగా మారిపోవలెనని భావించిరి.

ఈ భక్తియొక్క పరాకాష్ఠయే ప్రపత్తి అని పెద్దలు కొనియాడుచున్నారు. గీతనంతయు బోధించి అంతమునందు భగవానులు బోధించినదదియే.

"సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః"

నీవు సర్వపుణ్యకార్యములువదలి అనగా, స్వరూపత॥ వదలుటకాదు. వానిఫలము వదలవలెను. పుణ్యకార్యములన్నియు చేయవలసినదేకాని వాని ఫలములనన్నిటిని నాయందుంచి సర్వకర్తను సర్వభర్తను నేనని తలంచి భారములనన్నిటిని నాయందుంచి నాకొక్కనికే ప్రపత్తిచేయుము. నేను నిన్ను సర్వపాపములనుండి విడిపించెదను. అప్పుడునీవు పుణ్యపాపములనుండి విముక్తుడవయ్యెదవు. అప్పుడు నీకు భగవత్ప్రాప్తికలుగును. (పుణ్యపాపే విధూయ) అని శ్రుతి. మోక్షగామికి పుణ్యపాపములు రెండును నశించవలెను. ఇదియే సుళువైనమార్గము. దీనికి ధనము అవసరములేదు. జాతికుల వ్యత్యాసములేదు. లింగవ్యత్యాసము సున్న. కాలవ్యవస్థ లేదు. కన్నులువాచునట్లు ఖేచరి భూచరి మొదలగు ముద్రలు సాధించుపనిలేదు. శరీరేంద్రియాదులు శుష్కించునట్లుచేయు కఠినోపవాసములు అవసరములేదు. మరియేమి చేయవలెనన్నచో

శ్లో॥ నధర్మనిష్ఠోస్మి న చాత్మవేదీ నభక్తిమాం స్త్వచ్చరణారవిందే
అకించనోనన్యగతి శ్శరణ్య త్వత్పాదమూలం శరణం ప్రపద్యే

ఓ సర్వేశ్వరా! నాకు ధర్మమేమో తెలియదు. ఆత్మజ్ఞానముసున్న. దేవరవారి పాదారవిందములయందు భక్తియు పూర్తిగాలేదు. మరేమన నాదగ్గర ఏమియులేదు. వేరుగతి

లేదు. కావున నీ పాదారవిందములకు ప్రపత్తి చేయుచున్నాను. అని సర్వభారములు భగవానుని యందుంచి ప్రపత్తి చేయుట. దీనినే నిగమాంతదేశికులు కొనియాడిరి.

శ్లో॥ శరీర పతనావధి ప్రభనిషేవణాపాదనా
ద బింధన ధనంజయ ప్రశమదం ధనందం ధనమ్
ధనంజయ వివర్ధనం ధన ముదూఢగోవర్ధనం
సుసాధన మబాధనం సుమనసాం సమారాధనమ్.

శరీరపతనమువరకు ప్రభువుల నాశ్రయించి వారిదయచేత సంపాదించినధనము దంధనము. మరియునది మెరుపుతీగవంటిది. అదియొక లెక్కలోనిది కాదు. అర్జునుని వృద్ధిపొందించినదియు గోవర్ధనము నెత్తినదియు సులభమైనదియు దేవతలచే నారాధింపబడుచున్నదియగు ధనమేధనము. బాధలేనిది, భక్తికి సాధ్యమైనది, అనగా అట్టిది శ్రీకృష్ణుడనుధనము మాకుకలదు అనెను. పాండవగీతయందుకూడ భక్తినే ఎక్కువగా కొనియాడెను.

శ్లో॥ వాసుదేవస్య యే భక్తా శ్శాంతా స్తద్గతమానసాః
తేషాం దాసస్య దాసోహం భవే జ్జన్మని జన్మని

ఎవ్వరు వాసుదేవునియందు భక్తిగలవారో వాసుదేవపరాయణులెవ్వరో శాంతిపొందిన మనస్సుకలవారెవరో అట్టి మహాపురుషులకు నేను దాసుడనై వచ్చెడు జన్మములయందు పుట్టుదునుగాక. ఆచార్యపురుషులగు పరాశరభట్టరువారు

ఆశించిన జన్మమును తెలుసుకొన్నచో సర్వేశ్వరుని విషయము మన కవగతమగును.

“శ్లో॥ న జాతు పీతామృతమూర్ఛితానాం నాకౌకసాం నందన
వాటికాసు రంగేశ్వర త్వత్పురమాశ్రితానాం రథ్యాశునా
మన్యతమో భవేయమ్.”

ఓ శ్రీరంగనాయకా ! నాకు నీవు జన్మము నీయదలంచినచో నందనవనవిహారము ఆకాశగంగాస్నానము అమృతపానము దివ్యాప్సరస్సంగమముకలిగిన స్వర్లోకప్రాప్తి దయసేయకుము. ఏమికావలెనన్నచో స్వామీ ! నీ రాజధానియగు రంగనగరమునందు వీధులయందుతిరిగెడు అంగామి కుక్కగా పుట్టించుము. అది నాకుచాలును. బ్రహ్మ పైవర్తము నందున్న విషయము చూడుడు.

శ్లో॥ విశిష్ట పుత్రం లభతే హరిదాసం గుణాన్వితమ్
సంకటం నిస్తరేత్పూర్ణం శత్రుభీత్యా ప్రముచ్యతే

మంచిగుణములు గలవాడును హరిదాసుడునునగు పుత్రుడు ఎవనికిపుట్టునో అట్టివాడు శత్రుభీతినొందడు శత్రువులనగా సామాన్యమానవులేకాక అరిషడ్వర్గముకూడ దీనివలన ధ్వనించుచున్నది.

ఈ జీవసంతతి ధరించునట్టి ఉపాధులు (అనగా) జన్మములు 84 లక్షల రూపములుకలవి అని పెద్దలు వక్కాణించుచున్నారు. అందులో (దుర్లభో మానుషో దేహః) మనుష్యజన్మమువచ్చుట దుర్లభము. నిద్రాహారభయమైథునములు

అన్ని జంతువులకు సమస్తమైనను మానవులకు జ్ఞానముకలిగి యుండటయొక విశేషమైయున్నది. అన్ని జన్మములకు కావలసిన పుణ్యపాపముల నీ జన్మమునందే యార్జించవలసియున్నది. ఇతరజన్మముల కధికారములేదు. అట్టి మానవులకు (శతాయుః పురుషః) నూరు సంవత్సరములకాలము ఆయుఃప్రమాణమై యున్నది. అందు బాల్యకౌమార యౌవనవార్ధకములకు నాల్గు దశలకు25వత్సరములుగా విభాగింపబడియున్నది. బాల్యమునకు వార్ధకమునకు ఏబదివత్సరములకాలము పరిమితము ఈ రెండు దశలయందును మానవుడు ఏ ప్రయత్నము చేయులేడు. మిగిలిన దశలకు పరిమితమగుకాలము 50 వత్సరములు. అందు నిద్రకై 25 సంవత్సరములు పోవును. మిగిలినకాలమునందే ఈ మనుజుడు పరలోక ప్రయత్నము చేయవలెను. ఇది నూరువత్సరములు జీవించినవానిక్రమము. అట్టివారు ఇప్పుడు చాల అరుదుగానున్నారు.(ప్రాప్యేమాం కర్మభూమిం నభజతి మనుజో యస్తపో మందభాగ్యః) కర్మభూమియు పవిత్రావనియగు ఈ భరతఖండమునందుపుట్టి పరలోకప్రయత్నములేక ఊరక చచ్చినవాడు వ్యర్థుడు. అని మహాయోగి భర్తృహరి వచించెను. అన్నిటికన్న ఆయువు గొప్పది. అది క్రమముగా తరిగిపోవుచున్నదని ఒక్కడు గమనించడు.

శ్లో॥ నందంత్యుదిత ఆదిత్యే నందం త్యస్తమితే రవౌ
ఆత్మనో నావబుధ్యంతే మనుష్యా జీవిత క్షయం

ఇదిగో సూర్యుఁడుదయించుచున్నాఁడు. మన కార్యము లన్నియు చేసికొనవచ్చును. మరల నస్తమించుచున్నాఁడు. రాత్రి కాలమునందు భోగములనుభవించవచ్చును. అని మానవులు సంతసించుచున్నారేకాని తన ఆయుఃకాలమునందొక దినము గడచిపోయినదని ఒక్కఁడు తలంచఁడు. అని భగవద్వాక్యము. అయితే భగవదుపాసన అసాధ్యమా కదా అన్నచో కాదు పెద్దలు అనేకులు అట్టివిషయము లాచరించి మనకు బాటలు వేసిపోయిరి. నూరువత్సరములు భగవద్విషయమునందుమగ్నులై కాలమును గమనించక కొండగుహాయందుగడపిన భక్తిసారయోగి మహదాఖ్యయోగియు. ఏబదివేల వత్సరములు తపస్సుచేసిన విశ్వామిత్రమహర్షియు మూఁడువేల వత్సరములు బ్రహ్మను గురించి తపంబొనరించి ఆకాశగంగను భూమికి తెచ్చిన భగీరథుడును ఆరుమాసములలో భగవానుని ప్రత్యక్షీకరించిన ధ్రువుడును. ఆరువత్సరముల ప్రాయమున నారసింహస్వామిని దర్శించిన ప్రహ్లాదుడును వీరందరును మానవులే. అయితే దీని యందు సులభమగు మార్గమొకటికలదు.

ప్రారంభదశ యందే విరగబడిపోవక మెల్లమెల్లగా నారంభింపవలె. అట్లే భగవానులుకూడ సెలవిచ్చిరి. (శనైశ్శనైరుపరమేత్ బుద్ధ్యా ధృతగృహీతయా) ఈ భక్తియోగమును మెల్లమెల్లగా నారంభింపుము. వివేకముగల బుద్ధిగలిగి చేయుము. ఇంద్రియముల జయించి మనస్సును నిగ్రహించి చేయువలెనన్న ఇది ప్రథమదశయందు సమకూడదు. మొదట

పట్టుదలతో నారంభించి కొంచెము కొంచెముగా చేసినచో అనగా, వందసార్లు రామనామము నుచ్చరింపుము. పది పర్యాయములు వ్రాయుము. గమనించునప్పుడు కూర్చొనియున్న సమయమున పడుకొనునప్పుడు భగవన్నామ ముచ్చరింపుము. దానిని క్రమముగా హెచ్చింపుము. ఇట్లుచేసినచో అది క్రమముగాపెరిగి కుల్యప్రాయమై నదీతుల్యమై తుదకు సముద్ర సదృశమగును. పట్టుదలమాత్రము వీడకూడదు. (భర్తృహరి వాక్యము) (ప్రారబ్ధముత్తమగుణాన పరిత్యజంతి) ప్రారంభించిన కార్యమును అనగా ఉత్తమకార్యమును ధీరులగువారు వదలి పెట్టరు. శ్రియఃపతిని ఆటలాడించి లోకమునంతయు నుద్ధరించి వైష్ణవమయముగావించిన ఆళ్వారుల ఆచార్యపురుషులచరితము దివ్యసూరిచరితము ప్రపన్నామృతము మొదలగు గ్రంథములయందు గీర్వాణభాషయందున్నది. తరువాత ఆచార్యసూక్తిముక్తావళి అనుగ్రంథము తెలుగు నందున్నను అది ఛందోబద్ధమగుటచే సామాన్యజనులకు దురవగాహమై యున్నది. అందువలన సులభశైలిలో వచనరూపముగా వ్రాసిన కొందరైనను చదివి కృతార్థులగుదురను నుద్దేశముతో ఈ గ్రంథమును వ్రాయవలెనని తలంచితిని. 'అది భగవదాజ్ఞ' తరువాత అది ముద్రణయగుటయెట్లని ఆలోచించితిని. భగవదాజ్ఞచే రచించిననాకు ముద్రణవిషయము మనకేలదుకు ? వ్రాయించిన జగదీశ్వరుడు అచ్చువేయించడాఅని తలంచి మూడుభాగములుగా వ్రాసితిని. మొదటిది పూర్వాచార్య చరిత్రము రెండవది దివ్యసూరి హృదయము మూడవది

మహాపురుషుల చరిత్రము దీనికై ముద్రణధనమునంతయు శేషాద్రినాధుండును కోటిసూర్యప్రకాశమానుండును లక్ష్మీ విభ్రాజమాన వక్షస్థ్సలుండునునగు జగదీశ్వరుండనుగ్రహించె. అట్టి శ్రీనివాసుని దివ్యమంగళ విగ్రహంబునకును దయా స్వరూపిణియు జగన్మాతయునగు పద్మావతీ అమ్మవారికిని అనేక సహస్ర సంవత్సరములు మంగళములగుగాక! మనుజుం డట్టి కార్యమునైనను (సత్కార్యమును) సత్సంకల్పముతో ప్రయత్నించిన భగవానులు దానిని నెరవేర్చగలడు. దుష్కా ర్యము ఫలించదాయన్నచో అదియు ఫలించును. దానికిని సర్వే శ్వరుడే కర్త, అయినను దుష్కార్యము చేయవలెనని తలంచుట తప్పుగదా. పుణ్యపాపములకు సర్వేశ్వరుడేకర్త దేనికితగిన ఫలము దానికిచ్చుచుండును. ఈనాసాహసమును మన్నించి సహృదయులు గుణగ్రహణపారీణులు అసూయారహితు లగు సుధీవరులు నన్ననుగ్రహింతురుగాక.

శ్లో॥ దేవోనశ్శుభమాతనోతు దశధా నిర్వర్తయన్ భూమికాం
రంగేధామ నిలబ్ధనిర్భర రసైరధ్యక్షితో భావుకైః।
యద్భావేషు పృధగ్విధేష్వను గుణాద్భావాన్ స్వయంబిభ్రతీ
యద్ధర్మైరిహ ధర్మిణీ విహరతే నానాకృతిర్నాయికా

నిగమాంత దేశికులు



మొవ్వ శ్రీనివాస పెరుమాళ్లు వీరి ధర్మపత్ని

శ్రీమతే రామానుజాయనమః

శ్రీవేంకట గురుభ్యోనమః

# ఆచార్య పురుషుల చరిత్ర

## శ్రీ పరాశరభట్టరువారి చరితము

శ్రీపరాశర భట్టార్యః శ్రీరంగేశపురోహితః ।
శ్రీవత్సాంకసుత శ్శ్రీమాన్ శ్రేయసే మేఽస్తుభూయసే ॥
వైశాఖమాస్యనూరాధా జాతం భట్టార్యదేశికమ్ ।
గోవిందయతిపాదాబ్జ చంచరీక మహంభజే ॥

చోళదేశంబున కలంకారంబై, శ్రీరంగనాథునకు రాజధానీనగరంబై, ఉభయకావేరీ మధ్యప్రదేశంబున శ్రీరంగ నగరంబు విరాజిల్లుచుండు. అందు భక్తాగ్రగణ్యులైన ఆళ్వారులును, మహానుభావులైన ఆచార్యులును నివసించుచు, శ్రీరంగేశ్వరుని నిరంతరము సేవించుచు కాలమునుగడపి, తనువులు చాలించి త్రిపాద్విభూతికి నేగుచుండిరి.

శ్రీరామానుజ యోగీంద్రులు ఆ శ్రీరంగమునందు నూటయిరువది సంవత్సరములు వసియించి, లోకమునెల్ల నుద్ధరించి, జగతీతలంబెల్ల భాగవతమయం బొనరించి వైష్ణవమత సామ్రాజ్యంబును, పాలించి రంగనాథానుమతింబడసి, పరమపదం బలంకరించిరి.

తదుపరి కూరేశతనయుండును, గోవిందమిశ్రుల శిష్యుం
డునునగు పరాశరభట్టరు శ్రీ వైష్ణవమతంబునకు ప్రభుం
డయ్యెను. ఇట్లు వైష్ణవదర్శన స్థాపకుండై పరవాది మత్తేభ
కంఠీరవుండై శిష్యులకు భాష్యాద గ్రంథంబులు బోధించుచు,
రంగేశ్వర మంటపంబున గోష్ఠి చేసియుండెను. ఆ సమయమున
రంగరాజాభిమానపుత్రుండును, విద్వత్కులాలంకారుండునునగు
ఆ పరాశరభట్టార్యుని, అనేక విద్వాంసులు పరివేష్టించి యుం
డిరి. అట్టి సమయంబున, మేలునాటనుండి యొక విప్రుండు
తీర్థయాత్రాపరుండై శ్రీరంగమునకువచ్చి శ్రీరంగనాథునిదర్శించి
పరాశరభట్టరు వేంచేసియున్న మంటపంబునకువచ్చి, పరాశర
భట్టరునకు నమస్కరించి కూర్చుండెను. అపుడు పరాశరభట్టార్యు
లా బ్రాహ్మణునిజూచి, "అయ్యా! మీ దేదేశము? మీనామ
ధేయంబేమి? ఎటనుండి ఎటకేగుచు నీతావునకు వచ్చినారు?"
అని ప్రశ్నించెను.

ఆ భూసురుం డా సరసవాక్యంబుల కలరి "ఆర్యా
నాది మేలునాడు. నేను తీర్థయాత్రాపరుండనై దివ్యదేశంబుల
దర్శించుచు, శ్రీరంగధామంబునకు చనుదెంచితి. శ్రీరంగేశ్వర
పాదారవిందంబుల దర్శింపగలిగితిని. తాము దైవసములని,
తమకీర్తి విశేషంబును, జనులెల్లరు కొనియాడుచుండ నాక
ర్ణించి, తమ్ముదర్శించి ధన్యుడనయ్యెదగాతమని తలంచి యిచ్చటి
కేతెంచి మిమ్ము దర్శించితి. కృతార్థుండనైతి. మీవంటి దివ్య
పురుషుల సందర్శనభాగ్యము త్రికాలఫలదంబుగదా!

సాధూనాం దర్శనం పుణ్యం స్పర్శనం పాపనాశనమ్ ।
సంభాషణం కోటితీర్థం వందనం మోక్షదాయకమ్ ॥

"సాధువులగువారి దర్శించినచో మహాపుణ్యము కలుగునని యు, వారిని స్పృశించినచో సకలపాతకంబులు నశించునని యు, వారితో కొలదికాలము భాషించినచో కోటితీర్థములందు మునిగినఫలము లభించుననియు, వారికి వందన ప్రణామాదులనాచరించినచో అపవర్గఫలప్రాప్తి యగుననియు పెద్దలు వచింతురు" అని వినయముతో విన్నవించి విరమించెను.

ఆమాటలాలించి పరాశరభట్టరు సంతసించి ఆ బ్రాహ్మణునింగాంచి, "అయ్యా! మీరాదిమేలు నాడనుచుంటిరి. ఆమేలు నాటియందు ఒకానొక బ్రాహ్మణుండు మహావిద్వాంసుండుండవలె. అతండు క్షేమముగనుండెనా?" యని ప్రశ్నించెను.

అందుల కాబ్రాహ్మణుం డాశ్చర్యచకితుండై "ఆర్యా! మీరాతని నెఱింగితిరోగాని అతడు మహాపండితుండు. వేదవేదాంగపారంగతుడు. న్యాయవైశేషికాది సమస్త శాస్త్రముల గండూషించిన ధీశాలి. అంతస్తంత్రములయం దధికతముండు. పాతంజలాది విద్యలయందు అందెవేసినచేయి. వాగ్ధాటియం దపరబృహస్పతి. షణ్మతస్థాపకుడు. అతనితో వాదించి అనేకులు పరాజితులై పారిపోయిరి" అని తెల్పెను.

ఆ వాక్యముల నాలకించి పరాశరభట్టరు ఆ బ్రాహ్మణునితో "ఓ విప్రవర్యుడా! అతడు చదివిన విద్యలన్నింటియందును మేము నిష్ణాతులము. కాని రెండువిద్యలయం దాతని

కన్న మేమధికులము. ఆవిద్య లేవియందువా! "తిరుక్కురుం దాండకం" "తిరునెడుం దాండకం" అనునవి. నీవు మేలు నాడుకుపోయి ఆవిద్వాంసునితో నిట్లనుము. "అయ్యా! శ్రీరంగమునందు ఒక్క శ్రీవైష్ణవవిద్వాంస ప్రకాండుండుకలండు. అతండు నీతోవాదింపవలయునని యుత్సహించుచున్నాడు. ఓడినవాడు జయించిన వానికి శిష్యుడగునట్లు పన్నిదము" అని చెప్పుము అని తెలిపెను.

అందులకా విప్రవరుం డంగీకరించి మేలునాటకుంబోయి ఆ మహావిద్వాంసునిదర్శించి పరాశరభట్టరు చెప్పినవాక్యముల నెల్ల నాతనికిం దెలిపెను. ఆవాక్యంబులువిని యాబాడబుం గాంచి యా విద్వాంసుండు "ఏమేమీ! నాతోవాదింపగల సమర్థుండు శ్రీరంగమునందుండెనా! ఒక్క శ్రీరంగమునందే కాదు. అనంత ప్రపంచమునందే లేడని నావిశ్వాసము. అతండు వచించిన ఆ రెండు విద్యలును, ఏశాస్త్రములందుగాని, ఏనిఘంటువులందుగాని కానుపింపవు. ఆవిద్యలయందు కృతపరిశ్రముండను కానిచో ఆ విద్వాంసునితో మార్కొనుటయెట్లు? షణ్మత స్థాపనాచార్యబిరుదంబు నిలుపుకొనుటయెట్లు!" అని విచారించుచుండెను.

ఇచ్చట శ్రీరంగమునందు పరాశరభట్టరు తన మనంబున "రామానుజ యోగీంద్రులు తమ అవసానకాలమున నన్నుం గాంచి "వత్సా! నీ తదనంతరము ఈవిష్ణుదర్శన స్థాపనదక్షుడీ శ్రీరంగమునం దొక్కండును లేడు. మేలునాట వేదాంతియను పేరుగల ఒక జన్నిగట్టుగలడు. నీవాతనిని జయించి తీసికొని

వచ్చి ఈ దర్శనస్థాపనయం దాతనిని నియమించి నీవు నిత్య విభూతిం జేరరమ్ము" అని ఆదేశించి తిరునాడలంకరించిరి. ఆతనింగాంచి భాషింపవలయునను కుతూహలము నాకత్యధిక మగుచున్నది. కావున పోయివచ్చెద"నని మనంబున తలంచెను.

ఒకానొక సుముహూర్తంబు నిర్ణయించికొని, శ్రీరంగే శ్వరున కీవిషయంబు నివేదించి వారియాజ్ఞయైనచో పోయి వచ్చెదనని భావించుకొని ఆలయంబున కేగి శ్రీరంగేశ్వరునకు తద్విషయమును విన్నవించుకొనియెను. శ్రీరంగధాముం డా వాక్యంబులకలరి పరాశరభట్టరుం జూచి "వత్సా! నీయిచ్ఛాను సారంబుగా పోయిరమ్ము. నీకు జయమగుత. నీవావేదాంతితో వాదించునపుడు నేను నీజిహ్వాపై తాండవించి అతని నోడించి నీకు శిష్యుని గావించెద" నని వాక్రుచ్చెను. ఆరేయి రంగేశ్వ రుడు దేవాలయాధికారి స్వప్నమునందోచి అతనితో "ఓయీ! పరాశరభట్టరు రంగరాజాభిమాన తనూజుండని లోకవిదితము కదా! దానికితగినట్లు పరాశరభట్టరు విషయమై మీారందఱును ప్రవర్తింపవలె. ఇప్పుడాతడు మేలునాటనున్న వేదాంతి నెదు ర్కొన నేగుచున్నాడు. కావున నాదివ్య శిబికయు, నాదివ్య విభూషణంబులును, మదీయ పరివారమును, పంచమహా వాద్య ములును నాతనికిమ్ము" అని ఆజ్ఞాపించి అదృశ్యుండయ్యెను.

ఆదేవాలయాధికారి మేల్కాంచి స్వప్నవృత్తాంతమును మనస్సునందలంచి ఆశ్చర్యనిమగ్నమానసుండై "ధన్యోఽస్మి కృతకృత్యోఽస్మి" అని తలంచి కల్యంబున పరాశరభట్టరు

దివ్యావాసంబునకుంజని సాష్టాంగదండవత్ప్రణామంబులాచరించి వారితో నిట్లనిరి. "అయ్యా! మీరు దైవసమానులు. పూజ్యులు. ఇంతదనుక మిమ్ము సామాన్య మానవమాత్రులుగా తలంచితిమి. కాని మీరు సాక్షాద్రంగేశ్వర స్వరూపులరని ఎఱుంగనైతిమి" ఈవిధముగా వారిం గొనియాడి స్వప్న వృత్తాంతమంతయు వివరించి రంగేశ్వర పరివారమును అందోళికము నొసంగెను.

ఆ సమయమున నాపరాశరభట్టరు దివ్యమకుటమును ధరించి కర్ణవేష్టనంబులుదాల్చి హార కటకోర్మికాది భూషణంబులుగైసేసి దివ్య శిబికనధిరోహించి మహావైభవముతో బయలుదేరెను. ఒకడు శ్వేతచ్ఛత్రమును పట్టెను. మరియొకడు వింజామరము చేబూనెను. భూ నభోంతరములు నిండునట్లు పంచమహావాద్యములను కొందఱు ప్రమోయించుచుండిరి. కొందఱు వేత్రహస్తులై బరాబరులు తెలుపుచుండిరి. వందిమాగధులు

శ్రీవత్సాంక మిశ్రతనయా !
రంగరాజాభిమానపుత్రా !
పరవాది మత్తేభ కంఠీరవా !
సమస్త విద్వత్కులాలంకారా !

శ్రీ శ్రీ పరాశరభట్టార్యా ! బహుపరాక్-బహుపరాక్ అను బిరుదముల నుగ్గడించుచుండిరి.

ఇట్టి దివ్యవైభవముతో బయలుదేరి మరుద్వృధానది నుత్తరించి అనేక గ్రామంబులను నదీనదపర్వతారణ్యంబులం

గాంచుచు పశ్చిమదిశాభిముఖులై ప్రయాణమై మేలునాటకు వచ్చుచుండిరి. ఇట్లు పయనించుచు మార్గమధ్యంబున కనకాపగా తీరంబుననున్న లక్ష్మీపురాగ్రహారాపరనామధేయంబగు సిరి కత్తూరునకుం బోయిరి.

అపురంబున రామానుజయోగీంద్రుల శిష్యుండగు అనంతాళ్వారను మహాపురుషుండు నివసించియుండెను. అతండు పరాశరుల ఆగమనంబు నెఱింగి ప్రత్యుత్థానం బాచరించెను. భట్టరు వారాతనింగాంచి అందోళిక నవతరించి ఆ యనంతునకు సాష్టాంగదండప్రణామంబు లాచరించి చేతులు జోడించి నిలువబడియుండెను.

అనంతు డా భట్టరును ప్రేమపూర్వకముగా కౌగిలించుకొని శిరస్సుమూర్కొని చెక్కులు పుణుకుచు నాతనితో "తండ్రీ! నీవు జన్మించినది మొదలు రంగేశ్వరుని దివ్యవిమాన ప్రాంగణంబున చరించుటతప్ప నెప్పుడును ఇతర ప్రాంతములకు వచ్చినవాడవుకావు. అతి సుకుమారుండవు. దివ్యవైభవోపేతుండవు. అట్టినీవు ఈదుర్గమ గహనప్రదేశంబుల కేలవచ్చితివో యెఱుంగ వచింపదగుదేని తెలియజేయుము" అని యడిగెను.

అందులకు పరాశరులు "అయ్యా! రామానుజయోగీంద్రులు మేలునాటగల వేదాంతినిజయించి వానింగొనివచ్చి శ్రీరంగధామంబునందు దర్శనస్థాపనకు నియమింపవలసినదిగా నాజ్ఞాపించిరి. వారి యాజ్ఞానుసారముగా తదర్థమై బయలు దేరితిని. అని రామానుజులయాజ్ఞను" తెలియ జేసిరి.

ఆ మాటలువిని అనంతాళ్వారు సంతోషించి అతనిని స్వగృహంబునకుం దీసికొనిపోయి అనేకవిధంబుల సత్కరించి ఆతిథ్యంబు నొసంగెను. పరాశరులా ఆతిథ్యంబును స్వీకరించి రెండుమూడు దివంబులందు విశ్రమించి ఆ యనంతునితోఁగూడి బయలుదేరిరి.

శ్లో॥ యాదవాద్రిం జిగమిషా యేషాం కేషాం చ విద్యతే।
తేషాం దేశేయమభటా నాగచ్ఛంతి కదాచన ॥

యాదవాచలంబునకు పోవుటకు నిచ్ఛగించియున్న వారే దేశంబునకలరో ఆదేశంబును యమకింకరులు పొరపాటు చేతనైన ప్రవేశింపరు. అను ప్రతీతి కలిగిన ఆ తిరునారాయణ పురంబునకు అనంతాళ్వారులతో పరాశరభట్టరువారు చనిరి.

ఈవిధముగా యతీంద్రుల కత్యంత ప్రీతిపాత్రంబగు యాదవాద్రికింజని పరాశరభట్టరు స్వపరివారంబునెల్ల నొక యుద్యానవనంబున విడియ నియమించిరి. వారు కల్యాణపుష్కరిణియం దవగాహనంబుచేసి దివ్యవస్త్రములు ధరించి ద్వాదశ స్థలంబుల శ్రీచూర్ణరేఖాలంకృత శ్వేతమృద్ధూర్ధ్వ పుండ్రంబులుదాల్చి భగవచ్ఛాసనంబులు యథావిధి నిర్వర్తించి యుండిరి.

యాదవాద్రీశ్వర పరివారమంతయు పరాశరభట్టార్యుల రాకనువిని శఠగోపంబును దివ్యవిమానమునందుంచుకొని మంగళ మహావాద్యములతో పూర్ణకుంభంబునుధరించి యెదురు వచ్చిరి. పరాశరభట్టరు భగవత్పరివారంబున కంజలించి శఠ గోపంబునకు సాష్టాంగవందనంబులాచరించిరి. అర్చక పరిచారి

కాది సందోహమంతయు పరాశర పాదారవిందంబులకు ప్రణమిల్లెను. అనంతరము భగవచ్ఛేషమాల్యంబులతో పరాశరుల నలంకరించి దేవాలయమునకుం గొనివచ్చిరి.

పరాశరభట్టార్యులు చతురానన దివ్య గోపురంబునకు జోహారు లొనరించిరి. దేవాలయ ప్రాంగణంబున ప్రవేశించి ఆలయంబునకు ప్రదక్షిణ లాచరించిరి. బలిపీఠంబుకడ ప్రొక్కులు చెల్లించిరి. ధ్వజదండంబున కంజలించిరి. జయవిజయులకు నతులొనర్చిరి. అనంత విమానమధ్యంబున బీబీనాచ్చియారను పేరుగల సుల్తాను ముద్దుపట్టింగూడి దివ్యభూషణ భూషితుండై వేంచేసియున్న శెల్వంపిళ్ళను కనులారగాంచిరి. ఆనందపులకిత శరీరులై సర్వేశ్వరుని ఆపాదమస్తకం బనుభవించిరి. మంగళాశాసనం బాచరించిరి. తదనంతరము తీర్థప్రసాదంబులు స్వీకరించి సర్వేశ్వరు ననుమతిచే అచ్చోటువాసి శ్రీ భూనీళాది దివ్య మహిషీ సమేతుండై హారకిరీటకేయూరాది దివ్యాలంకారాలంకృతుండై చేతనాభిముఖ్యంబు నిరీక్షించుచు బద్ధచేతనులనుద్ధరించుచు కోటిసూర్యప్రకాశమానుండై వేంచేసియున్న తిరునారాయణస్వామిని దర్శించిరి.

శ్రీవిష్ణు చిత్తోక్త గాథల ననుసంధించుచు "సత్యం జ్ఞానమనంతంబ్రహ్మ" అను సూక్తి చొప్పున సత్యజ్ఞానమే స్వరూపముగనున్నదా యనునట్లున్న సర్వేశ్వరుం దర్శించి అపరిమితానందతుందిల హృదయులై శ్రీవారికి మంగళాశాసనము కావించిరి. తదుపరి తద్దివ్యానుగ్రహాలబ్ధమైన తీర్థప్రసాద శఠగోపము

లను తిరుమాలెయు, తిరుప్పరివట్టంబును గ్రహించి "ధన్యోఽస్మి కృతకృత్యోఽస్మి" అని సంతసించి భగవద్దివ్యాజ్ఞచే కదలి, యాదవాద్రినుద్ధరించిన శేషమూర్తినిదర్శించి "యోనిత్య మచ్యుత" మను తనియను పఠించి విష్ణుచిత్తాది సూరులదర్శించి దేవాలయంబు వెల్వడి ఉద్యానవనంబునకు చనుదెంచిరి. అనం తారళ్వానుతోకూడి దివ్యశిబిక నధిరోహించి సమస్త వాద్య ఘోషములతో సపరివారులై మేలునాటకు ప్రయాణమైరి.

ఈవిధముగాపోయి వేదాంతి నివసించుచున్న గ్రామం బున కనతిదూరంబునకుపోయిరి. అచ్చట నియువురు విప్రులు కలరు. వారు భట్టరుంజూచి "అయ్యలారా! మీది ఏదేశము? ఇప్పుడు మీరెచ్చటికి పోవుచుండిరి?"అని ప్రశ్నించిరి. ఆమాట లకు పరాశరభట్టరు "విప్రవరులారా! అపరవైకుంఠమగు శ్రీరంగము మానివాసధామము. శ్రీరంగరాజదయా పాత్రు లము. ఈగ్రామమున నొక మహాసమర్థుండగు వేదాంతికలడని ఎఱింగితిమి. ఆవిద్వాంసుని ఓడించి ఆతనిని మామతమునందు ప్రవేశపెట్టవలయునను భావముతో నిచ్చటి కేతెంచితిమి" అని తెలిపిరి.

ఆమాటలకలరి ఆ బ్రాహ్మణపుంగవులు "ఆర్యా! మీరీ పరిభవముతో దివ్యవేషముతో ఆవేదాంతిని సమీపింప జాలరు. మీకాయన దర్శనమే లభింపదు. ఆ విద్వాంసుని బహిర్వితర్ది కలమీద ఆతని శిష్యప్రశిష్యులు, మహాపండితులు చాలమంది ఉపవిష్టులై యుందురు. వారు ఎంతటి పండితు నైనను నేరుగాలోనికిపోనీయరు. ఆవచ్చిన పండితునితో వాద

మునకుదిగి అతనిని చీకాకుపరచి విడిచెదరు. వారితో వాదిం చుట కెట్టిమహావిద్వాంసునికైనను నెలలకాలముపట్టును" అని వివరించిరి.

ఆమాటలకు భట్టరచ్చెరువొంది "అట్లైనచో మేము వేదాంతితో వాదించుటకు తెఱంగు వివరింపు" డని అభూసుర వర్యులను వేడికొనిరి.

వారు భట్టునకు మార్గము నుపదేశింప నుత్సహించిన వారై "ఆర్యా! మీరీ వైభవమునంతయు నొకచోటనుంచి మీరొంటరిగా పాదచారులై వేదాంతి గృహమున కరుగుడు. అతడు మహాధనవంతుడు. అతడనుదినము నొక అన్న సత్ర మును నిర్వహించుచుండును. ప్రతినిత్యమును ఎందరెందరో ధరణీ సురవరు లచ్చటికి భోజనార్థమై విచ్చేయుదురు. మీరును వారివలెనే అన్నార్థులుగా నచ్చటకుపొండు.

అచ్చట నామహాపండితుడు ఒక మంటపమునగల వేదికపై చిత్రాస్తరణమునందు కూర్చుండి వేదాంతోపన్యాసము నొసంగుచుండును. ఆవేదికకు నలుపైపుల మణ్ణిప్రతిష్ఠాపనా చార్యులు జిగీషచ్చులు ఎవ్వరైనవచ్చిన వాదింపవచ్చునని వ్రాయబడిన ఫలకములు వ్రేలుచుండును. మీరప్పు డాతనిని సమీపించి వాదింపవచ్చును. ఇదియే సరియగు మార్గము" అని తేటతెల్లముగా తెలియజేసిరి.

పరాశరభట్టరు తద్వాక్యప్రకారము వర్తింప నిచ్ఛించి గ్రామము వెలుపలగల ఒకానొక ఆరామమునందు తన పరివా

రమునంతయును నిలిపివేసెను. భూషణముల నన్నింటిని తీసివైచెను. ధావళి నొకదానిని పరిధానముగాధరించి శాటి నొకదానిని శరీరముపై నాచ్ఛాదించి అదేవేషముతోనున్న అనంతాళ్వానుతో జలకుండికలుధరించి వేదాంతి గృహమునకు పోయెను. అచ్చట కాపున్న దౌవారికుడు వీరి నిరువురను లోని కరుగుట కనుమతి నొసంగెను.

వారిరువురును లోపల ప్రవేశించిరి. నేరుగా అన్న సత్రంబునకు పోవుత్రోవను విడనాడి వేదాంతియున్న మందిరోపకంఠంబునకు చేరజనిరి. వేదాంతి వారిరువురనుగాంచి వారన్నార్థులై వచ్చిరని భావించి "అయ్యలారా! అదిగో ఆ కనుపించుచున్నదే భోజనశాల. మీరచ్చటికని బయలుదేరి పొరపాటున నిచటికివచ్చినారు" అని పలికెను.

ఆమాటలువిని భట్టరు "అయ్యా! మే మన్నార్థులము కాము. తమతో వాదభిక్షకై విచ్చేసితిమి" అనగా విని వేదాంతి విస్మయావిష్టుడై "అహో-ఏమి వీరి దాంభికవచనంబులు. ఈదారకుండు నాతో వాదింపవచ్చెనట. ఎందరెందరో మహామహా విద్వాంసులు నన్నెదిరించి పలాయన మంత్రంబు పఠించిరి. ఈతడు నా విశేషశక్తియు- తన అల్పత్వము నెఱుంగని మహా సాహసికుండు కావలయు. కానిచో నన్నిట్లు వాదమున కాహ్వానించునా?" యని మనంబున వితర్కించి పరాశరులతో "అయ్యా! మీపేరేమి? మీయూరేది?" అని ప్రశ్నించెను. అందులకు పరాశరులు "నాపేరు పరాశరభట్టరు. మాది శ్రీరంగ దివ్యదేశము" అని బదులుచెప్పెను.

అప్పుడు వేదాంతి గుభాలునపైకిలేచి, "ఓహో! నీవా! తీర్థవాసియగు నొకానొక విప్రుండువచ్చి నాతో "శ్రీరంగంబు నందొక మహా విద్వాంసశ్రేష్ఠుండు గలండు. అతండు నన్ను జయింపదలచియున్నాడు" అని తెలిసిపోయెను. అట్టి పరాశర భట్టార్యుండవు నీవన్నమాట" అని పలుక, పరాశరులు గంభీరముగా 'నేనే'యని సూచించునట్లు శిరస్సు నాడించి చిరునవ్వు నవ్వి యూరకుండిరి.

అపుడా వేదాంతి "వాదివై వచ్చితివో ఈమంటపము పైకిరమ్ము" అని ఆహ్వానించి షణ్మతస్థాపనాచార్య బిరుదంబు గలపీఠము నవరోహించి మరియొక చిత్రాస్తరణంబున కూరుచుండెను. వేరొక చిత్రాస్తరణమును పరాశరులకు వేయించి "తదాసీనులుకండు" అని మనవిచేసెను.

అపుడు పరాశరులు మదఘూర్ణితగంధగజేంద్రంబుపైకి లంఘించు పంచాస్యంబుచాడ్పున నా మంటపము నధిరోహించి తనకు నిర్దేశింపబడిన ఆసనంబున ఆసీనుండై వేదాంతింజూచి "సుధీనిధానా! నీవు నిత్యమును కూర్చుండు ఆసనమును విసర్జించితివేల?" అని ప్రశ్నించెను. అందులకు వేదాంతి "ఆర్యా! నేనిప్పు డా యాసనము నలంకరించుటకుతగను. మిమ్ము జయించిన తరువాత మరల నుపవిష్టుడనయ్యెద" నని వివరించెను.

తరువాత వారిరువురును కొంతసేపు సామాన్యముగా సంభాషించి మతచర్చకు పూనుకొనిరి. ఆసమయమున పరాశరభట్టరు వేదాంతితో "అయ్యా! నేనిపుడు కొంత విషయము నుపన్యసించెద వినుము.

"వేదము రెండుభాగములు. అందు మొదటిభాగమంతయు కర్మప్రతిపాదకము. రెండవది మోక్ష ప్రతిపాదకము. అదియే ఉపనిషద్భాగము. మరల నది నాల్గువిధములు. అందు కొన్ని శ్రుతులు జీవేశ్వరులు భిన్నులనియు, కొన్ని అభిన్నులనియు, మరికొన్ని శ్రుతులు సర్వేశ్వరుడు నిర్గుణుడనియు, ఇంకకొన్ని శ్రుతులు సర్వేశ్వరుడు సమస్త కల్యాణగుణస్వరూపుండనియునుకొనియాడినవి. ఈశ్రుతులనన్నింటిని శ్రీ మద్రామానుజాచార్యులవారు సమన్వయపరచియున్నారు.

నిత్యం హేయగుణావధూనన పరాన్నైర్గుణ్య వాదాశ్రుతౌ
స్పష్టార్థా స్సగుణోక్తయః శుభగుణ ప్రఖ్యాపనాద్బ్రహ్మణః ।
అద్వైతశ్రుతయో విశిష్టవిషయా నిష్కృష్టరూపాశ్రయాః
భేదోక్తిస్త్వదిహాఖిలశ్రుతిహితం రామానుజీయం మతమ్ ॥

నిర్గుణుడని చెప్పిన శ్రుతులకు సర్వేశ్వరుడు గుణహీనుడని అర్థముచెప్పుట తగదు. దుర్గుణములు లేనివాడని వచింపవలె. మనమొక వ్యక్తినిజూచి "వీడుగుణహీనుడు" అని పల్కుదుము. ఆమాటకు, వానియం దేగుణమును లేదని అర్థము కాదు. వానియందు మంచిగుణములు మాత్రమే లేనివాడని భావము. అనగా వానియందు దుర్గుణములు మాత్రమే నెలకొని యున్నవని పిండితార్థము. అవిధముగనే భగవంతుడు నిర్గుణుడనగా సర్వకల్యాణగుణ పరిపూర్ణస్వరూపుడని అర్థమును చెప్పవలె. సగుణశ్రుతులకు శుభగుణవిశిష్టుడని యుపపాదింపవలె. జీవేశ్వరులు అభిన్నులని చెప్పిన శ్రుతులకు సూక్ష్మచిద

చిద్విశిష్టుడగు సర్వేశ్వరుడే స్థూలచిదచిద్విశిష్టుడగు సర్వేశ్వరుడని వచింపవలె. అనగా ప్రకృతి జీవునకు శరీరము. జీవుడు ప్రకృతియు సర్వేశ్వరునకు శరీరము. దీనినే సామానాధికరణ్యమందురు.

ఇక భేదశ్రుతులగూర్చి విచారింతము. వాని ప్రకారము జీవేశ్వరులు భిన్నులు. జీవులనంతములు. సర్వేశ్వరుడుమాత్ర మొక్కడే. ఈశ్వరునకు జ్ఞాతృత్వ విశిష్ట శేషిత్వమే స్వరూపము. జీవునకు జ్ఞాతృత్వ విశిష్ట శేషత్వమే లక్షణము" అని వివరించెను.

వేదాంతి దాని నంతయువిని యనువదించి తన అద్వైత మతోక్తులతో యుక్తియుక్తముగా పరాశరసిద్ధాంతమును ఖండించెను.

వేదాంతి ఖండనమునెల్ల ఖండించి పరాశరభట్టరు తన పూర్వ సిద్ధాంతమును మరల స్థిరీకరించెను. దానిని వేదాంతి సంపూర్ణముగ పూర్వపక్ష మొనరించెను. ఈవిధముగా వారిరువురు సింహంబులభంగి మదేభములమాడ్కి సాగరంబుల రేవ పోరుచుండ అష్టవాసరములు గడచిపోయెను.

అనిదంపూర్వమైన ఆ అద్భుత వివాదమునకు సాక్షిభూతులుగానున్న పండితు లాశ్చర్యచకితులై "ఔరా! వీరిరువురును దేవతాంశసంభూతులుగాని సామాన్యులుకారు. వీరు జ్ఞానమున ప్రజాపతితుల్యులు వాగ్ధాటియందు దేవగురు సంకాశులు. నరనారాయణాకృతులు వీరిరువురియందు జయాపజయంబులు నిర్ణయించుటకు సాధ్యముకాదు" అని భావించుచుండిరి.

అంత తొమ్మిదవనాటి ఉదయకాలమునందు రంగరా జాభిమాన తనూజుండగు పరాశరభట్టరు శుంభదభంగరంగ ద్గంగా ప్రవాహంబుననుకరించునదియు, ఝంఝూవాత సము ద్భూతరంగత్తుంగతరంగ విలసితజలనిధి ఘోషంబు నతిక్రమించు వాక్ప్రవాహంబును బయలుపరచెను. బ్రహ్మతర్క సహస్ర యుక్తుల తన సిద్ధాంతమును నెలకొల్పి వేదాంతివాదమును వేయివిధముల పూర్వపక్ష మొనర్చి తుత్తునియలు గావించెను.

వేదాంతి తనమత స్థిరీకృతమాచరించు నుపాయంబు గానక నిర్విరపడి కొంత చింతించి, తలపంకించి స్వీయా స్త రణంబునందు నుండిలేచి చేతులు రెండును జోడించి పరాశరు నితో "మహాత్మా! మీరు సామాన్యమానవులరుకారు. సాక్షా ద్రంగేశ్వరుడే మీరూపంబున అన్యమార్గాను రక్తుండనైన నన్ను కటాక్షింప నిచ్చటికేతెంచెను. నేను పరాజితుండనైతి. మీకు శిష్యుండనయ్యెద. నన్ను కటాక్షింపు"దని పలికి అయన పదపద్మములపైబడి లేవకుండెను.

పరాశరభట్టరు వేదాంతిం గటాక్షించి గ్రుచ్చియెత్తి కౌగిటం గదియించి పంచసంస్కారాది హితంబు లాచరించెను. అర్థపంచకము నుపదేశించెను. ఆకారత్రయంబును తెలిపెను. అపుడు వేదాంతి సంతుష్టుడై అనంతాఖ్యానుతోగూడ పరాశరు లను తన స్వీయావాసంబునకు తోడుకొనిపోయెను. భక్తియుక్త ముగా ఆతిథ్యం బొసంగి అమూల్యాభరణంబులును ప్రక్చందన నాది దివ్య విలేపనంబులును నొసంగి పూజించెను.

అంత పరాశరభట్టరు అనంతాళ్వానుం గూడి వేదాంతి వెంటరాగా నగర బాహ్యోద్యానంబునకు చనుదెంచిరి. అచ్చట విడిచియున్న పరివారమంతయు భట్టరున కెదురువచ్చి నమస్కరించెను. పరాశరులు వారి నందర కటాక్షించి కిరీట హార కేయూరకటకోర్మికాదుల నన్నింటిని ధరించి, దివ్య పల్యంకంబధిరోహించి, గజ తురగ పరివారము వెన్నంటి నడువ శ్రీరంగ నగరాభిముఖుడై బయలుదేరెను.

ఆ వైభవమును గనులార గాంచిన వేదాంతి ఆశ్చర్యానందవార్ధి నోలలాడుచు "ఎన్ని పూర్వజన్మంబులందు నేనేమి సుకృతంబులాచరించితినో? ఇట్టి మహానుభావునకు శిష్యుండనైతి"నని యుప్పొంగుచు గురువరు పదసరోజసన్నిధి కృతప్రణాముండై లేచి హస్తములు మోడ్చి "అయ్యా! నాకేమి సెలవు? నా స్థితి యేమి? నా కర్తవ్యమేమి?" ఆనతిండు అని వినయమున విన్నవించెను.

పరాశరభట్టరు వేదాంతిని చేరబిలిచి, దక్షిణహస్తంబున నాతని మేనునిమిరి "వత్సా! నేనుగా విశేషించి నీకు చెప్పదగిన దెద్దియును లేదు. నీవు మహావిద్వాంసుడవు. నీవు మా వాడవై శ్రీకార్యపరుడవై యీ దేశంబున సుఖివై చరింపుము తదీయారాధనమును విస్మరింపక, శఠగోప, విష్ణుచిత్త పరకాలాది దివ్యసూరి ప్రోక్త శ్రీసూక్తుల ననుసంధించుచు, కుశలివై ప్రవర్తింపుము" అని పలికి, అచ్చటనే వేదాంతిని నిలిపి శ్రీరంగమునకు పయనమయ్యెను.

ఈ విధముగా, ప్రయాణించుచు యాదవాచలంబునకు చేరిరి. అచ్చట వేంచేసియున్న శ్రీనారసింహస్వామిని దర్శించి కల్యాణి పుష్కరిణిని, పరిధానశిలను, శ్వేతమృదాకరము మొదలగు తీర్థంబులు సేవించుచు. తిరునారాయణస్వామివారి అజ్ఞగైకొని లక్ష్మీపురమను పేరుగల సిరిభేత్తూరు చేరెను. అందు అనంతాళ్వాను గృహమునందు రెండు దినంబులు వసించి, వారి సపర్యలు స్వీకరించి, వారిని వీడ్కొని, అనేక పుణ్యతీర్థంబులు-కమలాకరంబులు-మహాదుర్గమవనంబులు-నదీనదంబులు-జనపదంబులు దర్శించుచు, కతిపయదినంబులు పయనించి శ్రీరంగమునకు వేంచేసెను.

ఆ విధముగా శ్రీరంగంబును ప్రవేశించి, కావేరీనదియం దవగాహించి, తన ఆగమన వార్తవిని యెదురు వచ్చిన రంగవాసుల యోగక్షేమ ప్రశ్నలతో సంతృప్తుల జేయుచు, రంగధామంబు ప్రవేశించి, రంగేశ్వరునకు నమస్కరించి, తాను పోయివచ్చిన విశేషంబులెల్ల స్వామికి నివేదించి, స్వగృహంబునకేగి, తల్లి పదారవిందంబులకు నమస్కరించి, విషయమంతయు విన్నవించి సుఖంబుండెను.

ఇక్కడ వేదాంతి, గురునకు వీడ్కోలొసంగి, తదానతి తలదాల్చి తన గృహంబునకేగెను. తులసీనలినాక్ష మాలాలంకృత కంధరుండై, ద్వాదశోర్ధ్వ పుండ్రధారియై తదీయారాధనపరుండై, గురుదేవుని విషయము మాటిమాటికి తలంచుచు, కాలమును గడపుచుండెను.

ఒకనాడు వేదాంతి స్నానార్థమై నదికి పోవుచుండెను. ఆ సమయమున నిరువురు వైష్ణవు లన్నార్థులై అరుగుదెంచిరి, వారిం జూచి వేదాంతి "స్వాములారా! దయతో మాగృహ మీరు కరుగుడు. అచ్చట నాభార్యల నడిగితి రేని, వారు మీకు సంతృప్తికరముగా భోజనమును వడ్డింతురు. నాపడి వెళ్ళ వలసినది" అని వచించెను.

ఆ వైష్ణవద్వయ మదే ప్రకారముగా నాతని గృహ మ్మున కరిగెను. వేదాంతి భార్యలంగాంచి "అమ్మలారా! మేము వైష్ణవులము. మీ భర్తయగు వేదాంతిని దర్శించి భోజన మర్థించితిమి. అతండు మమ్ము మీయొద్దకు పంపించెను. మాకింత యన్నము పెట్టినచో తినిపోవుదుము. మిక్కిలి క్షుద్బాధతో తాళజాలకున్నాము" అని పలికిరి. ఆ వాక్యములు విని, ఆ గృహిణు లదరిపడి "మీరు వైష్ణవులైన మాకేమి? శైవులైన మాకేమి? మీకు వార్చి వడ్డించుట కెవ్వరుండిరి! మీకు వండి వడ్డించుటకు ఓపిక లేదు. ఇచ్చట అన్నమును లేదు-సున్నమును లేదు. మీతో నెవరు చెప్పిరో వారి యొద్దకే పొండు. ఆయనే పెట్టగలరు. పొండు. పొండు" అని అనేక విధములుగా కసరికొట్టిరి.

ఆ వాక్యములు విని వైష్ణవులు మిక్కిలి బాధనందిరి. చేయునది లేక వెనుదిరిగిపోవుచుండిరి. వేదాంతి స్నానమును ముగించుకొని, తిరిగి యింటికి వచ్చుచు, నెదురువచ్చుచున్న వైష్ణవులం గాంచి "అయ్యలారా! భుజించి వచ్చుచున్నారా!"

యని ప్రశ్నించెను. ఆమాటలకా వైష్ణవులు "అయ్యా! చక్కగా భుజించితిమి. అన్నము కాదు. మీభార్యలు పెట్టిన చివాట్లు కడుపునిండ ఆరగించితిమి. చాలుచాలు." అని నిష్ఠురములాడుచు జరిగిన విషయమంతయు వివరముగా తెలియజేసిరి.

వేదాంతి మనస్సు చివుక్కుమనెను. బతిమాలి ఆ వైష్ణవుల తనయింటికిం గొంపోయి, భోజనంబిడి, వారల సంప్రీతి చేసుక్కొలుజేసి, వారలపంపించి, యొక వివిక్త స్థలంబున గూర్చుండి తన మనంబున నిట్లు వితర్కించెను.

ఈ చతుర్దశ భువనాత్మకంబైన బ్రహ్మాండంబునందు ఎనుబదినాల్గు లక్షల జీవరాసులున్నవని పెద్దలు వక్కాణింతురు. అన్నింటియందును, "దుర్లభోమానుషో దేహః" అను శాస్త్ర వాక్యానుసారము మానవజన్మమెత్తుట దుర్లభము. అందును బ్రాహ్మణ జన్మమెత్తుట మరియు విశేషము. అట్టి మానవజన్మమున విప్రజాతి యందు జనించితి. మానవ జన్మమెత్తినందులకు జ్ఞాన సముపార్జనమే అనంతఫలము. గృహస్థ ధర్మంబవలంబించిన ప్రతిమానవుడును 1. బ్రహ్మ యజ్ఞము 2. దేవయజ్ఞము 3. పితృయజ్ఞము 4. భూత యజ్ఞము 5. నృయజ్ఞమునను పంచ మహాయజ్ఞంబుల నాచరింపవలెను. బ్రహ్మయజ్ఞ మనగా వేదాధ్యయనము. శాస్త్రాధ్యయన భారత భాగవతాద్యుద్గ్రంథములను పఠించుట. దేవయజ్ఞ మనగా ఆజ్యాక్షత లాజలు మొదలగు వస్తువులు అగ్నియందు

హోమ మొనర్చుట. పితృయజ్ఞమన శ్రాద్ధాదులుపెట్టి తర్ప ణాదులు విడుచుట. భూతయజ్ఞమనగా, సకలభూతములకు బలిదానము లొసంగుట. నృయజ్ఞమన, అతిథిపూజాదులు నిర్వర్తించుట. ఇటువంటి పంచ మహాయజ్ఞంబుల నాచ రించితిని. స్వాధ్యాయరూపంబగు ఋషిఋణము, యజ్ఞ రూపంబగు దేవఋణమును, పుత్రోత్పత్తి రూపంబగు పితౄ ణంబును తీర్చికొని, ఈ మూడు ఋణములనుండి విముక్తుండ నైతి. ఈ సంసారరూపజంజాల నిమగ్నుడనై యున్న నన్ను పరాశరభట్టరు, ఉద్ధరించినారు.

"శ్లో॥ సాక్షాన్నారాయణో దేవః కృత్వా మర్త్య మయీం తనుం
మగ్నా నుద్ధరతే జంతూన్ కారుణ్యాచ్ఛాస్త్ర పాణినా
ఆచార్యశ్చ హరిః సాక్షాత్, చరరూపేన సంశయః"

కేవల నారాయణుడే మానవరూపమును ధరించి, దయతో సంసారమగ్నులైన మనుష్యుల, ఆచార్యరూపమున శాస్త్ర మను హస్తమున పట్టి ఉద్ధరించుచున్నా"డని శాస్త్రములు పలుకుచున్నవి. ఆ విధముగనే పరాశరభట్టరు, శ్రీరంగము నుండి ఏతెంచి, నన్ను అనుగ్రహించి, జ్ఞానదృష్టి నొసంగి నారు. జ్ఞాని యగువాడు, తెలిసితెలిసి [illegible] చిక్కుకొనియుండుట శ్రేయస్కరముకా[illegible] కావున [illegible] గృహస్థాశ్రమమును పరిత్యజించుట మేలు. [illegible] వివాహమాడిన భార్యలను విడనాడుటయు[illegible] ధర్మమకరాదు.

[library stamp]

కాని భగవద్విషయమున ప్రతికూలత లేనిచో భార్యలను విడువ రాదు. కాని, ఏతత్కార్యమున కానుకూల్యము తటస్థింపనిచో నెవరినైన విసర్జించుటయే లెస్స.

సంసార సంబంధు లందరును సోపాధిక బంధువులు. సర్వేశ్వరుడు నిరుపాధిక బంధువు. సర్వేశ్వరుడు తప్ప నిరుపాధికబంధువులు వేరు లేరు. కావుననే, న సంసారాత్పరో రిపు॥" సంసారమునకన్న శత్రువు లేడని పెద్దలు నుడువుచున్నారు.

శ్లో॥ "వరం హుత వహజ్వాలా-పంజరాం తర్వ్యవస్థితిః
న శౌరి చింతా విముఖ జనసంవాస వైశసమ్।

సర్వేశ్వర చింతనములేని, బద్ధసంసారుల మధ్య వసించుట యను జంపపుకోత ననుభవించుటకంటె జ్వలించుచున్న అగ్నిజ్వాల యందుండుటయే మేలు. కావున ఇచ్చటనేయుండి బాధలుపడుట అర్థరహితము. ఏమియులేని దౌర్భాగ్యుడు క్షుద్బాధానివారణార్థమే ఆకులో అలములో నములవచ్చును. సర్వవిధ సంపన్నుండగువాడు ఆకు లలము లేల మేయవలె. అజ్ఞానులకు సంసారమే భోగ్యనిధానముగాని, జ్ఞానుల కిది అవశ్య పరిత్యజనీయము. నే నీ భార్యలను, గృహారామాది సకల సంపదలను త్యజించి పరాశరభట్టార్యుల పదపద్మము లాశ్రయించి, ఆ చెంతనే పడియుండెదగాక" అని నిశ్చయించుకొనెను.

ఆ మరున్నాడు, వేదాంతి తన భార్యల నిరువురను పిలిపించి, వారితో "గృహిణీమణులారా!" ఋణానుబంధ

రూపేణ పశుపత్నీ సుతాలయా," పశువులుగాని, భార్యలుగాని, పుత్రులుగాని, గృహములుగాని ఋణమున్నంతవఱకు మాత్రమే యుండునని శాస్త్రములు వక్కాణించుచున్నవి. మీకును నాకును, ఇంతవఱకు మాత్రమే ఋణమున్నయది. ఇప్పుడా ఋణము తీరిపోయినది. నాకున్న ధనమంతయు మూడు భాగములు చేసెదను. మనము ముగ్గురమును, ఆమూడు భాగములను తీసికొందము. అవియు సమానభాగములే. ఆ భాగములను స్వీకరించి, ఎవరికిచ్చ వచ్చినట్లు వారు జీవింపవచ్చును. అందులకు మీ కిష్టమే కదా "యని యడిగెను.

కొలుత వా రిష్టము లేనట్లు వచించినను, కొలది సేపటికి వారి అంగీకృతిని తెలియజేసిరి అనుకొన్న విధముగా యావదాస్తిని విభజించి, భార్యలకు వారి వారి భాగము లొసంగి, తన భాగమును తాను గ్రహించినవాడై, తురీయాశ్రమమైన సన్న్యాసమును స్వీకరించి, గురుదేవుల పదపద్మంబులు మనంబున నిలిపి, ధనముతో సహా శ్రీరంగమునకు బయలుదేరి, మార్గమధ్యమున గల లక్ష్మీపురాగ్రహారంబు జేరి, అనంతాళ్వాను నివాసంబునకుంజని, వారి శ్రీపాదములకు ప్రణమిల్లెను.

అనంతాళ్వాను, వేదాంతిని గ్రుచ్చి యెత్తి గాఢ పరిష్వంగ సౌఖ్యంబొసంగి, అతనితో "వత్సా! నీవేల ఈ తురీయాశ్రమమును స్వీకరించితివి? చెమటపట్టినపుడు స్నానముచేసి, ఆకలి యగు సమయమున తృప్తిగాభుజించి, దాహము వేసిన

తిరి చల్లనిమంచినీరమును గ్రోలి, ప్రారబ్ధమున్నంతవఱకు ఇహలోకమున కాలముగడపి, ఆపై త్రిపాద్విభూతికింబోయి శ్రీవైకుంఠ నగరంబున, తిరుమామణి మంటపమునందు నేను శ్రీ పరాశరభట్టార్యుని ఛాత్రుండ నని చెప్పినచో అచ్చట నిన్ను కాదనగల వారెవ్వరు! నిన్ను కాదనగల అధికారమందెవ్వరికిని లేదే? ఇట్టి సాహసంబేల చేసితివి? జరిగినదేదియో జరిగిపోయినది. దానింగూర్చి విచారించుట వ్యర్థము. నిశ్చల భక్తియుక్తుడవై గురు సన్నిధానంబునకు పోయిరమ్ము" అని ప్రియమ్ములాడి, "బిడ్డా! ద్వయమంత్రంబున పుట్టి తిరుమంత్రంబున వృద్ధినందుమా!" అని ఆశీర్వదించి వీడ్కొలిపెను.

వేదాంతి, మనంబున నలరి, అచ్చటినుండి బయలుదేరి శ్రీరంగమునకు వచ్చెను. కావేరీనదీ పవిత్ర వారియందవగాహనంబు సలిపి, ద్వాదశోర్ధ్వపుండ్రములుదాల్చి గురు సన్నిధానంబున కేతెంచి, శ్రీ పరాశరభట్టరు పాదద్వయిచెంత సాష్టాంగప్రణామం బాచరించి, లేచి నిలువబడి, రెండు చేతులును జోడించి, "అయ్యా! మాధవదాసుడ-వేదాంతి"నని చెప్పుకొనెను.

పరాశరభట్టరు ఆశ్చర్యానందాంభోనిధి తుంగభంగముల తేలియాడి గుభాలున పైకిలేచి కరుణారసాకరములైన నిర్మలదృష్టుల సేవ దేర్చుచు, బిగియార కౌగిలించుకొని "నంజియ్యారే' అని పలికెను. అప్పటినుండియు, మాధవ

దాసు, వేదాంతి' యను నామంబులుపోయి ఆయనకు నంజియ్యా రను పేరు ప్రసిద్ధమై నిలిచిపోయెను.

నంజియ్యారు తాను తెచ్చిన ధనము నంతయు గురువు నకు కానుకగా సమర్పించెను. పరాశరు లందులకు సంతసించి శిష్యునితో "నంజియ్యారూ ! త్వత్సమర్పిత ధనంబునకు నేను తుష్టిం జెందితిని. కాదనను, కాని ఇది ధనంబనియు, ఇది యే మనకు సర్వదా ప్రయోజనకారి యనియు భావింపవలదు. ఇది మనకు అసలు ధనంబు కాదు. మన పెన్నిధిని చూపించెద నమ్ము" అని చేయిపట్టుకొని సప్తప్రాకారావేష్టిత సహస్ర స్తంభనిర్మితానేక మంటపాలంకృతంబగు శ్రీరంగనాథ దివ్యాలయంబునకు గొంపోయెను. హిమధామ సమధామ కమనీయంబగు అనంతశయనంబున దివ్యపాదారవిందంబులు చాచి, ఒక శ్రీహస్త ముపధానముగా శిరస్సు క్రింద నిడు కొని, ఒక శ్రీహస్తమును చాచి, పవ్వళించియున్న శ్రీరంగే శ్వరుని చూపించెను. అంత వేదాంతి పరమభక్తియుక్తుండై

శ్లో॥ శింజాన శ్రుతి శింజినీ మణిగణైః వజ్రారవిందధ్వజ
చ్ఛత్త్రీ కల్పకశంఖ చక్రముఖరై స్తైస్తైశ్చ రేఖామయైః
ఐశ్వర్యేణ జయం త్రి విక్రమముఖం ఘుష్యద్భిరా
మ్రేడితమ్
శ్రీరంగేశయ పాదపంకజయుగం వందామహే సుందరమ్॥

వేదములనెడు రత్నమయములైన చిరుగజ్జెయలు కలిగినదియు, వజ్రము, అరవిందము, ధ్వజము, గొడుగు, కల్పకము,

శంఖము, చక్రము, అద్దము మొదలైన దివ్యరేఖా చిహ్నితమై త్రివిక్రమావతార సమయమున జగత్తులను కొలిచినపుడు గుర్తింపబడినదియునగు, శ్రీరంగనాథుని దివ్యపాదారవింద యుగళికి నమస్కరించుచున్నాము. అని యనేకవిధముల స్తోత్రముచేసి, గురువర్యునితో గూడి తిరిగి గృహమున కేతెంచెను.

కాలము గడచుచుండెను. వేదాంతి మిక్కుటమైన భక్తితో గురుని సేవించుచుండెను. ఇట్లుండగా నొక సమయమున పరాశరభట్టరు, నంజియ్యరు నాదిగాగల శిష్యులను వెంటనిడుకొని ధనుష్కోటికింబోయి, అందు వేంచేసియున్న శ్రీరఘురాముని దర్శించి మరలివచ్చుచుండెను. మార్గమంతయు అరణ్యావృతము. వారు ఒక ఘోరారణ్యము మధ్యమునకు వచ్చుసరికి సూర్యభగవానుడ స్తమించెను. మిట్ట పల్లముల సమతలముగావించుచు, గాఢాంధకార మావరించెను. సమీపమున నొక పల్లెగాని, పట్టణముగానియున్న ఆశ వారికి లేకుండెను. చేయునది లేక వారు విచారించుచుండ నాయటవి మధ్యమున వారికొక కిరాతగృహము కనువిందొనరించెను. వారలందఱు నాకిరాతగృహమున కేగిరి.

ఆ కిరాతుడు వైష్ణవులంగాంచి, పరమభక్తితో వారికి నమస్కరించి, ఆదరవచనములతో గౌరవించెను. గబగబ తనపట కుటీరమును శుభ్రపరచి యొక కుక్కిమంచము (ఆతని కున్న ఆస్తిసర్వము నదియే)ను వేసి "అయ్యా! దీని పైకి దయచేయుడు" అని ప్రార్థించెను.

పరాశరభట్టరా మంచముపై పవ్వళించెను. శిష్యులందరు ను పరివేష్టించి యుపవిష్టులైయుండిరి. కిరాతుడు కొలది దూరమున నొడగి కూరుచుండియుండెను. పరశరులా కిరాతునిం జేర బిలిచి వానితో "ఓయీ! నీవీ యరణ్యమునందేమి చేయుచుందువు?" అని ప్రశ్నించెను.

అంగులకాతకు "అయ్యా? నేను ప్రతిదినము వేటాడుచుందును. మృగములను పక్షులను పట్టుకొని. వాని మాంసములతో పొట్టనింపుకొనుచుందును. నాకుటుంబ సభ్యులందరకును నిదియే వృత్తి. మా కుటుంబమునకు సరిపోగా మిగిలిన మాంసమును, క్రొక్క పల్లెలకు తీసికొనిపోయి, దాని నచ్చట అమ్ముకొని, ఆ ధనముతో మాకు కావలసిన వస్తువులను తెచ్చుకొందుము."అని చెప్పెను.

ఆ మాటలకు పరాశరభట్టరు మందహాస మొనరించి "ఓయీ! ఈవేళ నీ దినచర్యయేమి! ఈ రోజు నీవీ యరణ్యమునందేమి చేసితివో చెప్పుము." అని అడిగెను.

ఆ వాక్యములు విని, "అయ్యా! శ్రద్ధగావినుడు. నేను మామూలుగా ధనుర్బాణములను ధరించి అరణ్యమునకు పోయితిని. పక్షులుగాని, మృగములుగాని, ఏవియు లభించినవి కావు. నేను విచారించుచు, వెనుదిరిగి వచ్చుచుండగా, నొక కొండ్రముచ్చుపిల్ల నాకంటబడినది. ఉరులొడ్డి దానిని బంధించి తీసికొని వచ్చుచుంటిని. అపుడు దానితల్లి నాకెదురువచ్చి, నిలువబడి వెక్కి వెక్కి ఏడ్చుచుండెను. దాని దుఃఖమును

గాంచిన నాకు. గుండె కరగిపోయినది. గుండె నిండ జాలి మెండు కొన్నది. వెంటనే ఆ కొండముచ్చు శాబకమును విడిచి పుచ్చితిని. అప్పు డాతల్లి కొండముచ్చు ఆనందము నేమని చెప్పవలె. బిడ్డను మూచూచి, గంతులు వైచుచు, ఆనందముతో, కృతజ్ఞతా పూర్వకముగా నాకంక జూచి, పరుగు పరుగున అరణ్యములో నికింబోయెను. నేనును, ఏదో అనిర్వచనీయానందముతో ఇంటికి చేరితిని. ఇది నాకథ" అని చెప్పి విరమించెను.

మనీషి శేఖరుండగు పరాశరభట్టరా వాక్యములు శ్రద్ధతో నాలకించి, శిష్యులతో "అయ్యలారా! వింటిరికదా! ఇందు మీ కేమి వేదాంతము గోచరించినదో తెలుపుడు"అని కొంత విరామమొసంగి మీకు తెలియదు. నేను చెప్పెద వినుడు. ఈతడు వృత్తిచే పశుపక్షి మృగఘాతకుడు. అక్షర శూన్యుడు. విజ్ఞానహీనుడు. ఐనను, మనయందు దయాదరమును ప్రదర్శించి, మర్యాదచేసి, ఈరేయి మన కాశ్రయమొసంగినాడు. మనము అభిజాత్య సంపన్నులమనియు, వైష్ణవాగ్రేసరుల మనియు, ప్రత్యక్షపరమపదంబగు శ్రీరంగ దివ్యధామ నివాసులమనియు, విద్వచ్ఛిఖామణుల మనియు వాడెరుంగునా! లేదు. "అభ్యాగత స్స్వయం విష్ణుః" అభ్యాగతుడు విష్ణుస్వరూపుడను సూక్తి యాతనికి తెలియునా! తెలియదు ఐనను మనల నాదరించినాడు. దానికి కారణమేమి! "వీరు మనయింటికి వచ్చినారు. వీరిని మనకున్న

దానికి తగినట్లు ఆదరించుట మన విధి" యను అభిమానమే దానికి కారణము. ఈ కిరాతుడే, ఆశ్రయించిన మనకు రక్షణ కల్పించెనుకదా ! దయాసముద్రుడు సర్వశక్తి సమన్వితుడు, అఘటనఘటనా సమర్థుడునైన శ్రియఃపతి సర్వేశ్వరుడు. విశ్వనియంత. అట్టివాడు విశ్వసించిన వారిని రక్షించునా లేదా, అని సంశయింపవలసిన అవసరము లేదు.

ఈ కఱకుగుండెబోయ కొండముచ్చు పిల్లను వదలి వచ్చితి ననిగదా వచించినాడు. ఇది అతని వృత్తికే వ్యతిరేకము. కాదా ! ఐనను దీనియందు శరణాగతి స్వరూపమున్నది.

"త్యక్త్వా దారాంశ్చ పుత్రాంశ్చ రాఘవం శరణం గతః" అని విభీషణుడు పలికిన శ్లోకార్థము కొండముచ్చునకు గాని, దానిపిల్లకుగాని తెలియదు. "మిత్రభావేన సంప్రాప్తం నత్యజేయం కథంచన" అను సూక్త్యర్థ మీతనికి తెలియదు. కాని కొండముచ్చు తన కెదురుగానిలిచి ఏడ్చుచున్న కారణమున అది తనకు ప్రపత్తి నాచరించినటుగా నెంచి, యాతడా కొండముచ్చు బిడ్డను విడిచి వచ్చినాడు. అందువలననే దేశకాల నియమము లేక ప్రపదనము, అవ్యవధానముగా ఫలించునని పెద్దలు చెప్పుదురు. ప్రపత్తియే సిద్ధసాధనము" అని వివరించెను. ఈ విధముగా ఆ రాత్రి యంతయు వచ్చుటగడపి, యుదయముననే లేచి, కిరాతుని అనేకవిధముల నాశీర్వదించి, శిష్యసమేతుడై శ్రీరంగమున కేగెను.

మహాపురుషులగు భగవత్పరుల కన్నియు భగవత్పరములుగనే గోచరించును. బద్ధసంసారులకు వ్యర్థములుగా కనపడుచుండునని పై సన్నివేశముచే నవగత మగుట లేదా! ఒకడొక గ్రంథమును దెచ్చి మరియొకని కొసంగెను. అదిచాల పెద్దదిగా నుండుటచే నాతఁడ్దానిని తలగడ (దిండు)గా నుపయోగించుకొనుచుండెను. అతని మిత్రు డింకొక డద్దానిం జూచి, "ఏమయ్యా! ఈ పుస్తకమును నాకిమ్ము. పసుపు కుంకుములు పొట్లములు గట్టుటకు కాగితములు లేక బాధపడుచుంటి ననెను. అచ్చటనేయున్న మరియొక మిత్రుడు మందు మాత్రలు పొట్లము గట్టుకొందును. అందు సగము నాకిమ్ము అని కోరెను. వారు దానిని మధ్యలోనికి చింపుటకు యత్నించుచుండిరి. అప్పుడదే త్రోవవెంట నొక మహాపండితుఁడటు పోవుచు నాగ్రంథమునుగాంచి "అయ్యలారా! ఆ గ్రంథమేమియని భావించిరి? అది వాల్మీకి మహర్షి ప్రణీతమగు శ్రీమద్రామాయణము. దాని విలువ తెలియని మీరు దానిని పొట్లములు గట్ట నుంకించుచుంటిరి. అహో! దౌర్భాగ్యము" అని వారిని చీవాట్లుపెట్టి వారుకోరిన మూల్యము నొసంగి అతడాగ్రంథమును తీసికొనిపోయెను. కావున, మహాత్ముల ఆలోచనలు, ఉత్తమములుగనే యుండునుకదా!

పరాశరభట్టరు ఉభయవేదాంతసారముల శిష్యులకుపదేశించుచు శ్రీరంగంబున సుఖంబుగానుండెను. చోళ భూపతి యగు వీరసుందర బ్రహ్మరాయుడు శ్రీరంగేశ్వరున

కోట ప్రాకారమును కట్టింప నిశ్చయించుకొని ప్రారంభించెను. ఆప్రాకారమునకు పిళ్లప్పిళ్లయాళ్వానుడను మహాభక్తాగ్రేసరుని గృహం బడ్డమువచ్చెను. రాజా గృహంబును పడగొట్టించి, ప్రాకారంబు కట్టింప నుద్యుక్తుండయ్యెను. పరాశరభట్టరది యెఱింగి, చోళభూపతిని పిలిపించి, ఆయనతో "రాజా! పూర్వము పరకాలుడు శ్రీరంగనాథునకు ప్రాకారంబు కట్టించు సమయంబున తొండరడిప్పొడియాళ్వారు గృహంబడ్డముగా నిలిచె. భక్తుల గృహములు పడగొట్టరాదని భావించి, అతడు ప్రాకారమును వంకరగా త్రిప్పి కట్టించెను అట్లే నీవును, పిళ్ళప్పిళ్లయాళ్వాను గృహంబును వదలి కట్టింపుము. కాని దానిని పడగొట్టవలదు. భాగవతుల కపచారంబు గావించిన వారిని సర్వేశ్వరుడు క్షమింపనని "నక్షమామి వసుంధరే!" యని భూదేవితో చెప్పియున్నాడు. కావున నాగృహము జోలికి పోవలదు" అని హితముపదేశించి పంపించెను.

పరాశరుడు తన గురుదేవుండైన కూరత్తాళ్వాను కుమారుండని యైన అభిమానింపక, ఆచార్యపుత్రుండను ప్రేమలేక, ఆ వాక్యములకు భగ్నమండిపోయెను. మరుమాటాడక అచటినుండి లేచిపోయెను. అతడు పరాశరభట్టరు వాక్యంబుల నిరాదరించి భాగవతాపచారం బొనర్చినవాడు దగ్ధంబగునని యు, భాగవతాపచారంబు నిత్యసూరులనైనను, తలక్రిందుగా పడవైచుననియు చింతింపక, రాజ్యగర్వాంధకారంబున కన్నుమిన్నుగానక, పిళ్ళప్పిళ్ళయాళ్వాని గృహంబు ధ్వంసంబు గావించి, ప్రాకారంబు కట్టించెను.

ఆ పాపకృత్యంబునుగాంచి, పరాశరభట్టరు ఇట్టి నికృష్టుం డగు రాజు రాజ్యంబున నుండరాదు.

"త్యజేద వృత్తికాం భూమిం
వృత్తింసోపద్రవాం త్యజేత్
త్యజే త్పాపిష్ఠ రాజానం
మాయా బన్ధూన్ పరిత్యజేత్"

"బ్రదుకు తెరువులేని భూమి యందును, ఉపద్రవయుక్తమగు వృత్తి గలిగిన దేశమును, పాపకర్ముండగు రాజును మాయా రూపులగు బంధువులను విడిచి పొమ్ము" అని శాస్త్రము నిర్దేశించుచున్నది. కావున నీ ప్రదేశము విడిచి ఎటకేని నేగుట ప్రశస్తము" అని భావించి తిరుకోట్టియ్యూరను ద్రవిడ నామంబుగల గోష్ఠీపురంబునకు బయలుదేరెను.

అది వేసవికాలము. వేడిగాలులు వీచుచుండెను. ఎండ మిక్కుటముగా నుండెను. పరాశరభట్టరును, శిష్యులును, మిక్కిలి సుకుమారులగుటచే నడువలేక నడువలేక నడచు చుండిరి. మార్గమధ్యమున నొక పెద్ద వటవృక్షముకలదు. పరాశరభట్టరు దాని శీతలచ్ఛాయం జేరి, మార్గాయాస ఖిన్నుండై కూరుచుండెను. నంజీయ్యాయ దూరమున వచ్చు చుండెను. సొమ్మసిలిన పరాశరభట్టరు, దూరమునగల శిష్యునిం గాంచి, "నంజీయ్యారే" అని కేకవైచెను. నంజీయ్యారు త్వర త్వరగా నడచిపోయి రంగనాధ భక్తశేషంబగు అమృతోప మానంబును నగు దధ్యోదనమును, శీతల పానీయంబును సమ

ర్పించెను. అతడా ప్రసాదంబు నారగించి, మంచినీరమును గ్రోలి, సేదదీరి కూరుచుండెను.

శిష్యులందరును వారిని పరివేష్టించిరి. నంజియ్యారు గావించు గురు శుశ్రూషకు గురుభక్తికి నచ్చెరువందుచు, నంజియ్యారు. తదితర శిష్యులతో గోష్ఠీపురమును ప్రవేశించెను. అచట నొక తిరుమాళిగయందు వసించుచు, శిష్యసంతతికి ఉభయ వేదాంత తత్త్వముల నుపదేశించుచుండెను.

ఒకానొకనాడు ఒక వైష్ణవుం డరుగుదెంచెను. పరాశరునితో "స్వామీ! తిరువృత్తమునకు అర్థము సెలవిండు" అని కోరెను. పరాశరులు నంజియ్యారుంగాంచి, "వత్సా! రంగేశ్వరుని విడిచివచ్చిన నాటనుండియు, నాయింద్రియ సర్వంబును సారవిహీనంబై నా వశముగాకున్నది. కావున వచించుటకు నేను సమర్థుండగాను. నీవే యీతనికి సంతి జెప్పు"మని యాదేశించెను.

నంజియ్యారు చెప్పుచుండెను. కొంతకాలము గడచినది. పరాశరునకు, రంగేశ్వరుని, శ్రీరంగమును దర్శింపవలయునను కుతూహల మంతకంత కగ్గలమై రెండు శ్లోకములను సాయించెను.

శ్లో॥ "పూగీకంఠ ద్వయ సరసస్స్నిగ్ధ నీరోపకంఠాం
అంతర్మోద స్తిమిత శకునానూదిత బ్రహ్మఘోషాం
మార్గేమార్గే పథిక నివహైరుంఛ మానాప వర్గాం
పశ్యేయం తాం పునరపి పురీం శ్రీమతీం రంగధామ్నః"

పోకవృక్షముల కంఠమువఱకు గలిగిన నీరముచే సమృద్ధము లగు కమలాకరములు గలదియు, బ్రాహ్మణుల వేదపాఠముల ననుకరించుచు, మానసికానందముతో ధ్వనిచేయుచు, స్తిమితములై యున్న పక్షులు కలిగినదియు, మార్గమధ్యములందు బాటసారుల సమూహములచేత తర్కింపబడుచున్న మోక్ష విషయము కలిగినదియునైన శ్రీరంగేశ్వరుని దివ్యధామమును, మరల నెన్నడు చూడగలను ?

శ్లో॥ కస్తూరీ తిలకోర్ధ్వ పుండ్రకలితం కర్ణాంతలోలేక్షణం
కించి ద్విస్మిత కోమలాధరపుటం-ముక్తాకిరీటోజ్జ్వలం
పశ్యన్మానస పశ్యతోహరతిరం పర్యాయపం కేరుహం
శ్రీరంగాధి పతేః కదాను వదనం సేవేయ
భూయోప్యహమ్"

కస్తూరీ తిలకోర్ధ్వపుండ్రము కలిగినదియు, విశాలమైన సుందర నేత్రములు కలిగినదియు, మధురమందహాస చంద్రికా కాంతులతో కూడినదియు, దివ్యకిరీటముతో ప్రకాశించుచున్నదియు, దర్శించుచున్నవారి మనస్సులను హరించునదియు, పంకజ సదృశమునగు శ్రీరంగనాథుని దివ్యముఖారవిందము నెన్నడు దర్శింపగలనో కదా !"

ఈ విధముగా, ఆర్తితోలుకుకనట్లు శ్లోకములు చెప్పగా, చోళభూమీశుండగు వీరసుందర బ్రహ్మరాయడు మరణించెను. ఆ వార్తను విని పరాశరభట్టరు శిష్యులుపోయి, ఆండాళమ్మ కద్దాని నివేదించిరి. ఆమె ఆ వాక్యములు విని, గృహాంబు

లోనికిం జని, తలుపులు బిగించుకొని, గొంతెత్తి బిగ్గరగా రోదించెను. అది విని ఆ శిష్యులు "అమ్మా! ఇది సంతసింప దగిన సమయము కదా! మీరు శోకించుటకు హేతువేమి?" అని ప్రశ్నించిరి.

అందులకామె "నాయనలారా ఈచోళభూపతి నాభర్తయైన కూరత్తానువారి శిష్యుడు. అట్టి సంబంధము కలిగియు నాతడు భట్టరు నెడ నపరాధంబు గావించె. అంతమున పశ్చాత్తాపమైన చెందక, యమకింకర హస్తగతుండయ్యె గదా! యని దుఃఖించుచుంటి"నని బదులు చెప్పెను.

అపుడు పిళ్లప్పిళ్లసూరి ఆ విషయమంతయు నెఱింగి, గోష్ఠిపురంబున కరుగుదెంచి, పరాశరభట్టరులో భూపతి మరణ వార్తను తెలియజేసెను. పరాశరభట్టరు అపరిమితానందము జెంది రంగేశ్వరుని మనస్సున దలంచి, ఆనందపడుచు, తన అంతేవాసులతోగూడి, శ్రీరంగంబునకు వచ్చి రంగేశ్వరుని సందర్శించి, స్వగృహంబున కరిగి, తల్లి పదారవిందంబుల కెఱగి సుఖంబుండెను.

ఇట్లుండ నొకానొక సమయంబున వల్లవరాయండను నొక భగవద్భక్తుడు పరాశరుల యొద్ద కేగెంచెను. పరాశరు నకు నమస్కరించి, "ఓ స్వామీ! ఈ ఆత్మకు తంజమేమి?" (రక్షకమేమి?) యని ప్రశ్నించెను. అందులకాతడు "ఓ భాగవతుడా! ఈ ఆత్మకు రక్షకము దక్షిణ సముద్రతీర"మని పలికెను. అందుల కాతడేమియు తెలియమి, "గురూ!

మీరాగ సెలవిచ్చినది ఈదాసునకు అవగతము కాదయ్యెను. దక్షిణసముద్ర తీరమనగా, అందున్న వృక్షములా, ఇసుక రేణువులా, లేక జలజంతువులా! ఏవి రక్షకములు" అని ప్రశ్నించెను.

పరాశరభట్టరు నవ్వి "ఓయీ! నీవు చెప్పిన వేవియు రక్షకములు కావు. రావణ సంహారణార్థము సుగ్రీవుని సైన్యములు రాముని వెంబడి బయలుదేరెను. సముద్రతీరమున సేనలన్నియు విడిదచేసెను. పగలు ఆ సైన్యములోని వానరు లందఱును, ఎవరికి వారు, "నేనే పోయి, రావణ కుంభకర్ణులను పరిమార్చి వచ్చెద. ఈ రాక్షసులనెల్ల హతమార్చుటకు నే నొకరుండను చాలనా! మీరందరు నేల? మీరందఱును కిష్కింధానగరంబునకు తిరిగిపొండు" అని ప్రగల్భములాడి సూర్యాస్తమయము కాగానే, ఎక్కడి వారచ్చటపడి నిద్ర పోయెడివారు. అపుడు రామలక్ష్మణు లిరువురును, "ఇది రాక్షసభూమి. వీరందరును మనల విశ్వసించి మనవెంట వచ్చి యున్నారు. వీరి కేమియైన ఆపద తటస్థించునేమో!" యని భావించి తెల్లవారు దనుక సైన్యముచుట్టును తిరుగుచుండిరి. కనుక ఆ రామచంద్రస్వామియే మనకు రక్షకము" అని యుపన్యసించెను. అందుల కాతడానందపడి, అచ్చట నుండి తన నిలయమునకు వెడలిపోయెను.

ఇట్లుండగా నొకప్పుడు త్రిభువన వీరదేవరాయుడు అను నరపాలుం డొకడు వచ్చి భట్టరు ప్రభావమునకు ముగ్ధుడై

నమస్కరించి "అయ్యా! తమరు నాగృహంబున కొకసారి దయచేయుడు." అని వేడుకొనెను.

అందులకు పరాశరభట్టరు నరపాలునింగాంచి, "రాజా! ఈ రంగాధి నాథుడు నన్ను పెంచబెట్టి గెంటినను, నీ విటనుండ వలదు. పొమ్ము అని శాసించినను, అతని దేవళపు పంచ టరుగు మూజూరునైన పట్టుకొని వ్రేళ్ళాడెదగాని, మీావంటి భూజానుల గృహంబులకురాను." అని స్పష్టపరచెను. ఈ యర్థమునే కులశేఖర దివ్యసూరి తన ముకుందమాలా స్తోత్రము నందు

శ్లో॥ "నాథేనః పురుషోత్తమే త్రిజగతామేకాధిపే చేతసి,
సేవ్యే స్వస్య పదస్య దాతరి సురేనారాయణే తిష్ఠతి,
యం కంచిత్పురుషాధమం కతిపయ గ్రామేశ మల్పార్థదం
సేవాయై మృగయా మహేనర మహోమూఢా
వరాకావయమ్"

మూడులోకములకు, ప్రభుండును, సేవించువారికి తన దివ్య పదంబు నొసంగువాడును, శ్రియఃపతియునగు నారాయణుండు రక్షించుచుండ, సామాన్యులును, కతిపయ గ్రామాధిపతులును నగు మానవాధి నాథుల సేవించువారు మూఢులు. వారు గ్రుడ్డిగవ్వతో సమానులు అని వచియించెను.

పరాశరభట్ట రొక దినంబున శిష్య పరివృతుండై రంగేశ్వరుని సేవింప తత్సన్నిధానమున కేగెను. ఆ సమయమున

రంగనాథుని అర్చకులలో, నొకడు, పరాశర భట్టరును, దూషించుచు, ఏవిధమో నిందారోపణములు గావించుచు, ప్రక్కవానితో చెప్పుచుండెను. అతడు భట్టరును చూడడయ్యె. ఆ వాక్యములు విని భట్టరు శిష్యులు, ఆ యర్చకుని దండించుటకై అతనిపైకి దుమికిరి. వారిని వారించి పరాశరభట్టరు, "వత్సలారా! మీరా యర్చకుని జోలికేగవలదు. నేను ఇంతకుముందు రంగేశ్వరునితో "స్వామీ! నేను మహాపాతకుండను. దుష్టవర్తనుడను"అని పలుమార్లు చెప్పుకొంటిని. కాని అందులకు సర్వేశ్వరు డంగీకరింపక "అందులకు సాక్షిని తెమ్ము" అని నన్నాదేశించెను. కావున నేను దుర్మార్గుడనని రంగేశ్వరుకడ సాక్ష్యము చెప్పగల మహోపకారి యెవ్వరాయని చింతించుచుంటిని. అప్రయత్నముగా నీ మహానుభావుడు నా నీచత్వమును గూర్చి రంగనాథునికడ సాక్ష్యమిచ్చుచున్నాడు." అని పలికెను.

ఆ మాటలు విని అర్చకుడు లజ్జించి. భట్టరు పాదముల మీదపడి అపరాధమును క్షమింపుమని వివిధ విధముల వేడుకొనెను.

ఒకానొక సమయంబున ఒక శిష్యు డేతెంచి, పరాశర భట్టరుతో "ఆర్యా! ఈయడి యేనికి తిరువారాధన క్రమంబును వ్రాసియిండు" అని ప్రార్థించెను. గురుపరుం డందుల కంగీకరించి రెండుగంటల కాలముచేయుటకు సరిపడునట్లు తిరువారాధన క్రమంబును వ్రాసియిచ్చెను. అత డద్దానిని

తీసికొనిపోయి, ప్రతిదినమును తిరువారాధనము చేయుటకు, కాలమధికముగుటచే చాలబాధను పడుచుండెను. ఒకనా డాతడు గురుని మందిరమున కరుగుదెంచి, గురుదేవుండు తిరువారాధన మెంతసేపు కావించునో చూడవలయునని వేచి యుండెను. అంతపరాశరుని అర్ధాంగి వంటను పూర్తిగావించి, పదార్థము లన్నింటిని స్వామి సన్నిధింబెట్టి భర్తనుజూచి "స్వామీ! వంట పూర్తియైనది. భగవదర్చన కావింపుడు" అని కోరెను.

పరాశరభట్టరు, దైవసన్నిధికిం బోయెను. స్వామి కర్ఘ్య పాద్యము లొసంగి, ధూపదీపంబులు సమర్పించి ద్వయోత్తర ఖండంబు పఠించి, సురభిముద్రను చూపించి, నైవేద్యం బొసంగి హారతినిచ్చి తిరిగివచ్చెను. ఇది గమనించి శిష్యుడు తన మనంబున "ఇది యేమి? నాకు తిరువారాధన క్రమ మును చాలపెద్దదిగా వ్రాసియిచ్చినారు. తాను మాత్రము చాల సులువుగా, అలతివ్యవధానమున పూర్తిగావించు చున్నారు." అని వితర్కించుచుండెను. అంతలో పరాశరుల మహిషి, భర్తకును, శిష్యులకును భోజనములు వడ్డించెను. అందరును తమతమ విస్తరుల ముందుపవిష్టులైరి. పరాశరుల భార్య నేతికిబదులు, అందరకును వేపనూనియ వడ్డించెను. పరాశరు లక్ష్యముగ తలంపక హాయిగాభుజించుచుండిరి. శిష్యులు గురుపత్నిం జూచి "అమ్మా! మీరీ వేపనూనె వడ్డించుటచే పదార్థము లన్నియు చేదెక్కినవి. ఇవి భోజ్యా ర్హములు కావు" అని మిన్నక కూరుచుండిరి.

అపుడు పరాశరులు వారితో "నాయకులారా! భగవ దర్పితములైన యీ పదార్థములు పరమభోగ్యములు. స్వామి ఆరగించి విడిచిన కాలకూటమైనను అమృతతుల్యంబగు. మాకుమాత్ర మీ పదార్థములు మిక్కిలి రుచికరములుగ నున్నవి. మీరును భుజింపుడు" అని కోరెను.

ఆ మాటలకు వారాశ్చర్యధుర్యులై "స్వామీ! మీరు రంగేశ్వర ప్రతిరూపులు. మీ కవ్వి రుచికరములుగా నుండు టలో ఆశ్చర్యమేమి! మాకు మాత్రము భుజించుటకు సాధ్యముకాక యున్నవి" అని వివరించిరి. అపుడు గురుపత్ని వారి ఆకుల యందున్న ఆ పదార్థముల నన్నింటిని తొలగించి, అన్యపదార్థములు వడ్డింపగా, నందరును సంతృప్తిగా భుజించిరి.

భుక్తాయాసములు తీర్చుకొనిన తరువాత శిష్యులు గురుదేవుని ప్రోలకూరుచుండిరి. అపుడా తిరువారాధన శిష్యుడు గురునింగాంచి, "దేవా! మిమ్మొక విషయ మడుగ వలయునని యున్నది. తమ రాగ్రహింపనని మాట నొసగినచో విన్నవించుకొందు"నని మనవిచేసెను. అపుడు పరాశరులు నవ్వి "వత్సా! నిరభ్యంతరముగా నీ సంశయమును స్పష్ట పరపుము. సంశయములు దాచుకొనరాదు. "సంశయాత్మా వినశ్యతి" అని గదా భగవానుని నిర్దేశము. నీ సందియ మును దీర్ప సన్నద్ధుడనై యుంటి" నని తెలిపిరి.

అపుడాతడు గురుముఖమున దృష్టినిలిపి "గురు చంద్రమా! నాకు తిరువారాధన క్రమమును చాల విరివిగా

వ్రాసియిచ్చితిరి. దానిని సంపూర్తిగా నిర్వహించుటకు ప్రతి దినమును ఒక యామము సమయము పట్టుచున్నది. నేను ఉదయము తొమ్మిదిగంటలకు ప్రారంభించినచో, పన్నెండు గంటల కాలమువఱకును, ఈ కార్యక్రమము కొనసాగుచున్నది. మీరా క్రతువునెల్ల నిమేషమాత్ర కాలమున చాల లఘువుగా నిర్వహించుచున్నారు. ఈ తారతమ్య మేమియా యని సందియము పీడించుచున్నది" అని పలికెను.

ఆ మాటలకు పరాశరులు మందహాస మొనర్చి "బిడ్డా! సర్వశాస్త్రములు శోధించినను, తిరువారాధనక్రమమున నాకింతకంటె గొప్పది లేదు. నీ కింతకన్న తక్కువదియు లేదు. అది పాత్రతను బట్టి యేర్పడును. నాస్థితికి వచ్చినప్పుడు నీకును అంతియే. భగవన్నివేదిత పదార్థము లన్నియు, మాకత్యంత ప్రేమపాత్రములు. పరమభోగ్యములు. విషమైనను, మా కమృతఫలమే. మీ కటుల గోచరింపదు. ఆ పదార్థమున నే రుచి లోపించినను, అది మీకు కొట్టవచ్చినట్లు కన్పించును. స్వామి కర్పించిన వేపనూనియ నాకు పరమ ప్రీతమయ్యె. మీకు అది అపేయంబయ్యె. పొగరుబోతు గిత్త కాడిక్రిందకు వచ్చువఱకును దాని కాలికి మెడకును కట్టవలయును. ముకుదాడు వేయవలె. అది సక్రమమైన స్థితికి వచ్చునపుడు పూర్వపు శిక్షలన్నియు తొలగింపవలె. మీకు బుద్ధిపక్వమై సర్వమును రంగనాథాకృతిగా గోచరించు వఱకును, ఇట్టి యనుష్ఠాన మవశ్య మనుష్ఠేయము. మనస్సు

నిర్మలత్వమును దాల్చి సత్వసంపన్నులై సర్వమును భగవ ద్రూపముగా దర్శింపగల మహనీయుల కివి యన్నియు నవస రము లేదు. మేము, పూర్తిగా నిట్టి యనుష్ఠానమును విర మించినచో, మీబోంట్లు సంశయాస్పదులగుదురని శావించు చుంటిమే కాని, లేనిచో మాకవి కూడ అవసరములేదు. బోయెత ఎంగిలిచేసిన ఫలములు భగవదర్పణమయ్యెగాదె. ఆమె రాముడు వచ్చునని పదునాలుగేండ్లుగా ఎదురు చూచుచుండెను. ఆ పదునాలుగేండ్లును, ఆమె అట్లే ప్రతిదినమును ఫలములను కొనివచ్చి, వాని రుచిచూచి, మంచి రుచికరములైన వాని నేరి రామున కర్పింప భద్రపరచు చుండెను. మరునాడుదయముననే వానిని పరిహరించి, క్రొత్త పండ్లు తెచ్చియుంచుచుండెను. ఇట్లు చేయుచుండగా ఒక నాడు శ్రీరామచంద్రుడు తమ్మునితో రానే వచ్చెను. ఆనాటి ఫలములను భక్తితో తన యిష్టదైవమునకు సమర్పిం చెను. రాము డాస్వాదించినదిమాత్ర మొక్కనాడే. కాని ఈ పదునాల్గువత్సరములు శబరిచేసిన పరిశ్రమయంతయు రామార్పణమయ్యెను. అందువలన మేము చెప్పినట్లు మీ రాచరింపవలెగాని మా నడవడిక మార్గదర్శకముగా గ్రహింప రాదు." అని విపులముగా విశదీకరించి చెప్పెను. శిష్యునకు, తద్ధర్మ సూక్ష్మమర్థమైనది. తన సందేహము పటాపంచలై నది. వెంటనే, గురుమూర్తి పాదపద్మములపై వ్రాలి "స్వామీ! సర్వాపరాధిని క్షమింపుడు" అని ప్రార్థించి, దేశికుని అనుమతితో స్వీయగృహంబునకు వెడలిపోయెను.

పరాశరునకు, యువకుడైన యొక వైష్ణవ శిష్యుండు గలడు. అతఁ డొకానొకదినమున, మహాసూపసి యగు దేవదాసి నొండుగాంచి, మదన శరపీడితహృదయుండై, మన్మథజ్వరంబున, ఆమెను సమీపించి "ప్రేయసీ! నీతో నొక్కపరి సంభోగింపవలయునని, మనస్సు కుతూహలము చెందుచున్నది. నా తనువు నావశము కాకయున్నది. కటాక్షింతువా!" అని వేడుకొనెను.

ఆ దేవదాసి, ఆ యువకునిం బారజూచి, "అయ్యా! అది ఏమంతభాగ్యము. నీతో వచ్చుటకు నాకెట్టి అభ్యంతర మును లేదు. కాని, సాక్షాద్రంగేశ్వర ప్రతిములైన భట్టరు వారికి శిష్యుండవు. అట్టి నీవు, ఈ నికృష్టకార్య మాచరించి నచో, లోకులు నిన్నుగాక, గురుస్వామిని తప్పుపట్టుదురు' గురులు వేదనం జెందుదురు. కావున నీవు పరాశరభట్టరు వారి సంబంధమును వీడి వచ్చినచో, నీ ముద్దు చెల్లించెద.' నని బదులు చెప్పెను.

అందులకా యువకుడు "దేవీ! నీవు నిజముగా అను గ్రహింపవలెగాని, భట్టరునేకాదు. ఈ సకల ప్రపంచమును వీడివచ్చెద." ఆ యువకుడు గురు సన్నిధానమున కేతెంచెను. గురుడు ప్రశాంత నిర్మలవదనుండై చుట్టునున్న శిష్యుల కేదో ప్రవచించుచుండెను. అప్పుడాయువకుడు దుడుకుతనము సుడివడ గురునితో "స్వామీ! ఈ దినమునుండియు మన గురుశిష్య సంబంధమును విడిచిపుచ్చుచున్నాడ. మీరును ఇకముందు నన్ను శిష్యునిగా భావింపకుడు." అని చెప్పి పరువిడుచుండెను.

పరాశరులు పరువెత్తుచున్న అతనింజూచి, మంచిబలిష్ఠులైన యిరువురు భాగవతులను, "వానిని పట్టితెండు. అతనికీ దుర్బుద్ధియేల జనించినదో తెలియవలె"నని చెప్పి పంపించెను. వారు మహావేగముగ పరువెత్తి అతనిని పట్టుకొనిరి. "నేను గురు సన్నిధికి రాను. వారితో నాకు పనిలేదు. నన్ను విడిచిపొండు. నాతో మీకేమి పని?" అని పలుకుచు గింజుకొనుచున్న అతనిని బలవంతముగా గురుదేవుని చెంతకు తీసికొని వచ్చిరి. వాడు గురునితో "అయ్యా! మీ సంబంధమును వదలుకొంటిని. నన్నేల బలవంతపెట్టెదరు? నేను మీ యొద్దనుండను." అని వాగును పారిపోనుంకించుచుండెను.

అపుడు పరాశరులు, తమ పాదరక్షనుగ్రహించి, ఆయువకుని నెత్తిమీద రెండుమార్లు తాటించిరి. అపుడు బంధించి తెచ్చిన వారిని పట్టువిడువుడని యాజ్ఞాపింప వారాతని విడిచిపెట్టిరి. ఐనను అతడు అచ్చటినుండి పరువెత్తక యూరక నేస్పుచునిలుచుండెను. అపుడు గురుంగు "అర్భకా! నాసంబంధము నీకేల పరిత్యాజ్యమైనది? పోవుదువామరి? నీకేల యిట్టి పాడుకోరిక పొడమినది?" అని ప్రశ్నించెను.

అంతనాతడు గురుదేవుని పాదజలజంబులు కన్నీటితో ప్రక్షాళించి, "అయ్యా! నేడు నేను మహాసౌందర్యవతియైన యొక వేశ్యను గాంచితిని. ఏలకో ఆమెతో కలియ వలయునను వాంఛపొడమినది. ఆవాంఛ నామెకు తెలిపితిని. పరాశరుల వారితో సంబంధమున్నంతవఱకు నది నన్ను గ్రహింప

వని తెలిపినది. కావున తత్సంగము కాంతూ తత్పరుడనై మిమ్ము వదలుకొన నిశ్చయించితిని'' అని సమాధానము చెప్పెను.

అపుడు గురుండు, "సరియే నాయనా! ఇప్పుడే మందువు! నా సంబంధము కావలయునా! తద్వేశ్యా సంభోగము కావలయునా? పూర్వమువలె నుండ నేర్తువా!" యని ప్రశ్నించెను. అపు డాతడు కరకమలంబులు మొగిడ్చి "అయ్యా! నాకీ విపరీతబుద్ధియేల జనించినదో అవగతముగుట లేదు. ఎక్కడ వేశ్య! ఎక్కడి సంగమము! మీా సంబంధమును వదలుకొనుట యనిన రౌరవాది మహానరక సంబంధమును కోరుకొనుటయే నాకిట్టి కోరిక గలుగుటకు హేతు వేమో దేవరవారే వివరింపవలె''నని తెలిపెను.

అపుడు పరాశరభట్టరు "నీకీ కోరికయేల కలిగినదో చెప్పెద. ఈనాటి దినచర్యనంతయు వరుసగా తెల్పుము''అని కోరెను. అందుల కాతడు "స్వామీ! నా దినచర్యలో భేద మేమియును లేదు. అంతయు మామూలే. విశేష మేమన ప్రతిదినమును నేను భోజనానంతరము తాంబూలమును సేవింతును. ప్రతిదినమును ఇంటియొద్దనే వేసికొనెడివాడను. ఈవేళ ఆకులు-వక్కలు తీసికొని, సున్నమును మరచిపోయి రంగనాథాలయమునకు పోయితిని. అందొక మంటపమునందు గూటిలో సున్నమున్నది. ఏ భాగవతులో తాంబూల సేవన మాచరించి, దాని నచ్చట విడిచియుందురని భావించి, దానిని గ్రహించితిని." అని తెలిపెను.

ఆ సున్న మెచ్చటిదో తెలిసికొని రమ్మని పరాశర భట్టరు ఇరువురు వైష్ణవులను పంపించెను. వారచ్చటకుపోయి విచారింపగా, కుంభహారతి నొసంగుటకై దేవళమునకువచ్చిన వేశ్యలు, తాంబూలమున కాసున్నము నుపయోగించి, శేషము నచ్చట విడిచిపోయిరని గమనింపగలిగిరి వారు వచ్చి గురు దేవున కీ వృత్తాంతము నెల్ల వివరించిరి. అపుడు గురుదేవు డా యువ శిష్యునితో "వత్సా! నీ కీ దుర్బుద్ధి యేల కలిగినదో వివరించెద వినుము. నీవనుభవించిన సున్నము, రాజస తామస ప్రకృతులగు వేశ్యల యుచ్ఛిష్టము. దానిని సేవించు టచే నీ కీ దుష్టవాంఛ పొటమరించినది. అది మదీయ స్పర్శచే తొలగిపోయినది"

"ఆహార శుద్ధౌ సత్వ శుద్ధిః సత్వశుద్ధౌ ధృవాస్మృతిః"

సాత్వికాహారమును స్వీకరించుట చేతనే సత్వగుణము ప్రకోపించును. సత్వమెప్పుడు పెరుగునో అప్పుడే జ్ఞాన మభివృద్ధి యగును." అని తెల్పి ఆతనిని పంపించివైచెను.

ఒకానొక దినంబున పరాశరభట్టరు శిబిక నధిరోహించి, పోవుచుండెను. నంజియ్యరు గురునివెంట జనుచు, ఆయనకు తెలియకుండ బోయీలతో గలిసి అందోళికాదండమును వహించి నడచుచుండెను. అభ్యాసము లేని హేతువున, ఆతని నడక అస్తవ్యస్తమగుచుండెను. పరాశరభట్ట రది గ్రహించి, గుభాలున శిబికనుండి దూకి, నంజియ్యరునుగాంచి, "వత్సా!

త్రిదండి, గృహస్థును మోయవచ్చునా ! ఇట్టి సాహసమున కేల పూనితివి ?'' అని యడిగెను.

అందులకు నంజీయరు "గురుదేవా ! తమ పదదాస్యమునకు ఆటంకము కలుగునని తలంచి, గృహస్థమును వీడి తురీయాశ్రమ స్వీకారము గావించితి. ఇదికూడ తమ శుశ్రూషకు విరుద్ధమని దేవరవారు సెలవిచ్చుచున్నారు. అట్టి ఈ ఆశ్రమ స్వీకృతి నాకేల !'' యని పలికి, త్రిదండమును మోకాటబెట్టి విరచుటకు యత్నించుచుండెను. పరాశరభట్టరు, శిష్యుని భక్తిప్రపత్తుల కమితానందము నొంది, నంజియ్యరును గట్టిగా కౌగిలించుకొని, త్రిదండమును విరచుటనుండి విరమింప జేసి, ఆతనితో తిరిగి స్వీయగృహమున కేగుదెంచెను.

శ్రీరంగమునందు కాళబత్తుండను పేరుగల విశ్వకర్మ యొక్కరుండు గలండు, ఆతని దేహమును వృద్ధత్వము బెబ్బులివలె ఆవేశించెను. శరీరము జీర్ణించెను. ఇంద్రియములు శిథిలములయ్యెను, వెంట్రుకలూడిపోయెను. అవయవములన్నియు వడంక జొచ్చెను. శిరస్సు స్వాధీనముకాక యుండెను. వాక్కు అస్పష్టంబయ్యె, నోటికి అరుచి యొదవెను. వార్ధకమునందు రావలసిన లక్షణము లన్నియు పొడివి కొనెను. భార్యాపుత్రులు కొలదికాలము పరిచర్యకావించి, విసిగి, వేసారి, ఏవగించుకొని అన్నపానీయము లొసంగక యింటినుండి వెడలనడిపిరి.

కాళబత్తుడు చేయునదిలేక, ఒక కఱ నూతగా గ్రహించి, వడకుచు, మెల్లమెల్లగానడచి, శ్రీరంగమునకు వెలుపలగల జీర్ణదేవాలయమునందు ప్రవేశించిపరుండెను. "అన్యధా శరణంనాస్తి, త్వమేవశరణం మమ" యనునట్లు, వేరురక్షణ లేని కాళబత్తుని చిత్తము శ్రీరంగేశ్వరుని వైపు మళ్ళినది. అతని కన్నుల నీరుగ్రమ్మినది. భక్త్యావేశుడై, రంగనాధుని గూర్చి "రంగేశ్వరా! నేను జనించినది మొదలు ఇప్పటివఱకు, జీవితము నంతయును సంసార కార్యములకే వెచ్చపెట్టితిని. భార్యాపుత్రుల ఆనందమే స్వకీయానందముగా శ్రమించితి. యౌవన గర్వితచిత్తుండనై మున్ను నే కావించిన అకృత్యంబు లెన్నని విన్నవింతు! ఎన్ని అసత్యములాడితినో! ఎందరికి ద్రోహముచేసితినో! ఊహింపనైనలేను. క్షుద్రుడను, నృశంసుడను, నీచుడను, శరీరమునందు పాటవముండగా నిన్ను గురించి యొక్క నిముసమైన వెచ్చించి యెఱుగ. త్వద్దేవాలయ ప్రదక్షిణంబు గావించి యెఱుంగ. నీ నామ ముచ్చరించి యెఱుగ. నీ కొక తులసీదళమైన సమర్పింపనైతి. కాని, నేటికి సత్యము గుర్తించితి. ఫలమేమి! కాలము దాటి పోయినది. చేతులు కాలిన పిదప నాకులుపట్టుకొన్నట్లైనది.

నా శక్తి బలవీర్యైశ్వర్యములు సంసారప్రయోజనమునకే వినియోగించుకొంటిని. భార్యపుత్రులు సత్యమని విశ్వసించితి. గృహములు-ఆరామములు-పశువులు-క్షేత్రములు-పుత్రులు-మిత్రులు-బంధువులు-శాశ్వతమని భావించితి. శరీర పాటవ

మున్నే యుండుదని తలంచితి. సౌందర్యవతులైన స్త్రీలకు వశుడనై పెంపుడు కుక్కవలె, వారికి బానిసనై వారి యింటి పంచలపడి యుంటిని. పెద్దలు వచించిన వాక్యములు నిరాదరించితి. వేదశాస్త్ర పురాణేతిహాసములు, అబద్ధములనియు, బూతులబుంగలనియు ప్రచారమొనర్చితి. నీయవతార విశేషంబుల పరిహసించితి. నీ భక్తుల పొత్తు పరిహరించితి. పరలోకమొకటున్నదాయని యధిక్షేపించితి. మద్యమాంసాదులు ధారకపోషకములుగా గ్రహించి భోగించితి. పెద్దలు పురాణప్రవచనంబులు కావించు తావులకేగి, వికట ప్రశ్నలతో వారిని విసిగించి, హేళన కావించి గోలచేసితి. ఇతరులతో గోలచేయించితి. పాంథుల కుపయోగించు నీరాగారములకు చిచ్చిడి వాని భస్మపటలంబు గావించితి. ఆకసమున చుక్కల లెక్కింపవచ్చును. భూమియందలి యిసుకరేణువుల నెన్నవచ్చు. సముద్రమునందలి కంకణంబుల పేరు కొనవచ్చు, నా పాతకములు మాత్రము లెక్కించుటకు సాధ్యముకాదు. నీ సద్గుణము లెట్లనంతములో, నాదుర్గణములును అట్లే అనంతములు. నే నెవ్వరిని, నావారని విశ్వసించితినో, అట్టి వారందఱును ఇపుడు నన్ను విడనాడిరి. వీరందఱును సోపాధికులు గావున, నిప్పుడు వారికి నాతో ప్రయోజనములేదు. వారు నన్ననేక రీతుల నిందించిరి. బాధించిరి. తుదకు వీధిలోని కీడ్చిరి.

నీవే కాలుండవు. నీవే కాలస్వరూపుండవు. ఈ బ్రహ్మాండముల కధినేతవు. సృష్టిస్థితి లయకర్తవు. నీవుంటి

వనియు, నీ సంసారము నశించుననియు తలంచనైతి. నాపరమ పాపకృత్యములకు ఫలము అనుభవమునకు వచ్చినది. నేత్రములు కన్పింపవు. చెవులు వినిపింపవు. శరీరమున పట్టుసడలినది. నడచుటకు కాళ్లురావు. ప్రాణములు తావులు తప్పుచున్నవి.

ఓ దయానిధానా! ఓ అశరణ్యశరణ్యా! ప్రభూ నీకు నమస్కార శతంబులు. జీవులకెల్ల నీవునిరుపాధికబంధుండవు. నిన్ను త్రికరణశుద్ధిగ తలంచుకొనువానికి, నీవు వశంవదుడవై నిన్ను నీవాతనికి సమర్పించుకొందువు. దిక్కులేనివారికి నీవే దిక్కు. నీకన్న నాకెన్నదగిన రక్షకులులేరు. దీనాతిదీనుండనగు నన్ను క్షమించి రక్షించిన నీ దొరతనమునకు కొఱతరాదు. నిన్నుకొనియాడ నేనెంతవాడ! వాఙ్మానసాతీతుండవగు నిన్ను నేనేమని నుతింతు? వేదంబులకందవు. వాదంబులచెందవు. అట్టి దేవాదిదేవుండవగు నీపదారవిందంబుల నకించనుండనై శరణాగతి చేయుచుంటిని. శ్రియఃపతీ నీపదంబులకు జోహారు. నీదివ్యబాహువులకు దండంబులు. నీసర్వాంగంబులకు నమస్కారశతంబులు. నీముందునకు వందనము. నీవెనుకభాగంబునకు, కైమోడ్పు. నీచుట్టును అంజలిబంధములు. పురుషోత్తమా! పుండరీకాంతా! దామోదరా! పురాణపురుషా!.. దయాజలధీ! ఆశ్రితావనా! త్రిజగన్మోహనస్వరూపా! నమః-నమః-నమః నన్నేమిచేసినను నీదేభారము. అవధరింపుము. మార్గములన్నియు మూడిపోయినవి" అని మనసార శరణాగతికావించెను.

కాళబత్తుని మనస్సు రంగేశ్వర పదపద్మలగ్నమై స్థిరత్వమువహించెను. "సర్వధర్మాన్ పరిత్యజ్య-మామేకం శరణంవ్రజ అహంత్వా సర్వపాపేభ్యో - మోక్షయిష్యామి మాశుచః"అని గీతాశాస్త్రమున భగవానుడు సాయించిన ప్రకారము కాళబత్తుడు శరీరవిషయమున స్వప్రయత్నమును విరమించుటచే, పురుషోత్తముడే ఆతని రక్షణభారమును స్వీకరించెను.

రంగేశ్వరుడా పాడుబడిన ఆలయమున ప్రవేశించి, మూడులోకములకును కర్మానుసారముగా బత్తెమునుకొలిచి యిచ్చునదియు, బలిచక్రవర్తియొద్ద దానపరిగ్రహణార్థమై ముందునకు సాచబడినదియు, శ్రీదేవి శరీరమునకు నూత్నాలంకార ప్రాయమైనదియు, ముప్పదిమూడుకోట్ల దేవతలకు అమృతాహార దానంబొనర్చినదియు, దివ్యకటకాంగుళీయకోపేతంబైన కుడిచేతినిసాచి, కాళబత్తుని లేవదీసెను.

కాళబత్తు దతికష్టముపై లేచి కూర్చుండెను. ఆయాగంతకునిజూచి "అయ్యా! తామెవ్వరు? ఏమిపనికై యిటకు విచ్చేసితిరి? నాతో మీకేమిపని? నావల్లకాదగిన దేద్దియు లేదుగదా! యని యడిగెను.

అందులకు సర్వేశ్వరుడు కాళబత్తునింజూచి "అయ్యా! నేనెవ్వండనైన నీకేమి? ఇదిగో పాయసమును వచ్చితిని. స్వీకరింపుము"అని కోరెను. అంతట కాళబత్తు "నేను మొగముకడిగి మూడుదినములైనది. యసంబెట్లు

LIBRARY

ఆరగింతు ! అందులకు రంగేశ్వరుడు "వత్సా ! ఇదిగో నీరము. తీసికొనివచ్చితిని. ముఖప్రక్షాళన మాచరింపుము" అని పలికెను.

"అయ్యా ! నాచేతులు బిగుసుకొనిపోయినవి. ముఖము కడుగుకొనుటకు శక్తిచాలకున్నది. ఎట్లు కడుగుకొందును ?" అని కాళబతుడు బదులాడెను.

అట్లైన నేనేకడిగెదను. రమ్ము" అని రంగేశ్వరుడే అతని మొగమునుకడిగి, పాయసమును తినిపించి వెడలిపోయెను

ఈ విధముగా స్వామి అతనికి పదునైదుదినములు పరిచర్యకావించి, అతనికి దివ్యలోక ప్రాప్తినొసంగెను.

ఈ విషయము సర్వజ్ఞులగు పరాశరభట్టరునకు తెలియును. ఆయన ఒకదినమున రంగనాథాలయమునకుంబోయి, స్వామినిసేవించి, "స్వామీ ! ఏల ఇట్లు అస్వస్థతతో కానుపింతువు ! పదునైదుదినములు పాయసపుగిన్నెలు మోచి, మోచి, మాడుమంటపుట్టుచున్నదా ? పరిచర్యకావించుటచే చేతులు నొచ్చుచున్నవా ! ఇక ఈ రోజుతో ఆ బాధతప్పినట్లేనా !" యని ప్రశ్నించెను.

ఆమాటలువిన్న శిష్యుల కదియేమో అవగతము కాలేదు. అచ్చెరువైనది. తిరిగి పరాశరు లింటికిరాగానే శిష్యులు "గురువరా ! మీరు రంగనాథునితో," ఈనాటితో ఆబాధతప్పినట్లేనా ! అని ప్రశ్నించితిరి ఆయన బాధయేమి ? ఆయనకు మాడుమంటయేమి ! పాయసపుగిన్నెలు మోయుటేమి ! చేతులు నొచ్చుటేమి !" అని ప్రశ్నించిరి.

పరాశరులు కాళబత్తుని విషయమును, రంగనాథుడు సేవించిన విధమును పూసగ్రుచ్చినట్లు వివరించిరి. ఆ విషయమును విని తచ్ఛిష్యులు సందేహమును ప్రకటించిరి. అపుడు పరాశరులు, "మీకు సందేహమున్నచో ఫలాన దేవాలయము నకుపోయి చూచిరండు. ఆ ఆలయమునందు కాళబత్తుని కళేబరమున్నది." అని వచించిరి. శిష్యులందరును ఆ జీర్ణాలయమునకుపోయి, యందున్న శవమునుగాంచి అచ్చెరువందిరి.

ఒకనాడు పరశరభట్టరు శిష్యులతోకూడి కావేరీనదికి స్నానార్థమై యేగుచుండెను. ఆసమయమున గగనమునందొక పుణ్యకోటివిమానము దృగ్గోచరమయ్యెను. దానినిగాంచి పరాశరులు "ఇది లీలావిభూతినుండి జీవులను నిత్యవిభూతికి గొనిపోవు దివ్యవిమానరాజము. ఇది ఎవరికోసము వచ్చినదో కదా !" యని పరికించుచుండిరి. ఆ పరిసరసీమలందొక కుక్క చనిపోయి పడియుండెను. దాని దేహమునుండి యొక దివ్య జ్యోతిలేచి ఆ పుణ్యకోటివిమానము నలంకరించెను. ఆ దివ్య యానము మహావేగంబున త్రిపాద్విభూతికి చనుచుండెను. ఆ యద్భుతసన్నివేశమును తిలకించి పులకించి, రంగనాథునిం దలంచి, పరాశరభట్టరు,

శ్లో॥ నజాతు పీతామృత మూర్ఛితానాం
నాకౌకసాం నందనవాటికాసు
రంగేశ్వర త్వత్పుర మాశ్రితానాం
రథ్యాశునామన్యతమో భవేయమ్.

హేరంగేశ్వరా! స్వర్గలోకనివాస సౌఖ్యమునుబడసి, అమృత పానమొనర్చి నందనవన విహారంబొనరించునట్టి దేవతాత్వము నాకెప్పుడును ప్రసాదింపవలదు. దేవరవారి దివ్యధామంబగు ఈ రంగరాజధాని యందొక వీధి కుక్కగాపుట్టింపుము" అని విన్నవించుకొనిరి.

ఒకానొక సమయంబున అసూయాగ్రస్తులైన కొందరు, పండితమ్మన్యులు, వాదమున పరాశరు నెదురింపవచ్చి, పరాజితులైరి. పరాజయక్రోధముతో పరాశరునిపై కసితీర్చుకొన నెంచి, ఒక భయంకర కాలోరగంబును తెప్పించి, దాని నొక కుండయందుంచి, దానిపై వస్త్రమును బిగించి కట్టి దానిని పరాశరుల యొద్దకుం దెచ్చి "ఈ ఘటమునందేమియున్నదో, మీరు కనుగొనజాలినచో, మీరు గొప్పవారని మేముభావింతుము"అని పలికిరి. ఆ కుమతుల, విమతులగావింప పరాశరులు, "ఈ పాత్రయందొక శ్వేతచ్ఛత్రమున్న"దని సెలవిచ్చిరి. ఆమాటవినవారు సంతసించి, "అయ్యా! మీ దివ్యదృష్టి పస తెల్లమైనది. మీ రోడిపోయినారు. ఓటమి నంగీకరింతురా?" యని నవ్వుచు, ఆ కుండపై గట్టిన వస్త్రమునూడదీసిరి. ఆక్రూర సర్పమేమైనదో రంగేశున కెఱుక. అందొక చక్కని శ్వేత చ్ఛత్రముండెను. ఈ సంఘటనకు, వారందఱును విస్మయావిష్టచిత్తులై, సాక్షాద్రంగేశ్వరుడీ రూపమును వరించెనని భావించుచు, చేతులుమోడ్చి, పరాశరుల నెన్నోవిధముల కీర్తించి పాదములపైబడి క్షమింపవేడుకొని వెడలిపోయిరి.

ఒకానొకనాడు నంజీయ్యరు పరాశరులంజూచి గురువరా! ఈ రంగనాథుడీ ప్రదేశమునందు, ఈ ప్రకారంబుగా శయనించి యుండుటకు కారణమేమి?''అని ప్రశ్నించెను.

అంకులకారుడు "వత్సా! నాకొఱకే సుమా! పూర్వము గజేంద్రుడు మొఱలిడగా కొలనియొద్దకు వచ్చెను. నేను మొఱలిడకుండగనే ఈ పుష్కరిణి చెంతనుండెను.''అని సమాధానము చెప్పెను.

ఆ మాటలువిని నంజీయ్యరు మారుమాటాడక మెదలక, కదలకయుండెను.

అపుడు పరాశరు డాతనింజూచి "వత్సా! నేచెప్పినది నీకర్థమైనదా? చెప్పెదవినుము. భగవదవతారములు చేతనుల రక్షించుటకే అన్ని యూరులందును, భగవదాలయముల రూపమున వెలసియున్నవి. గ్రామవాసులందఱును ఒకచోట చేరవలయునన్న, అందఱకును సొంతప్రదేశము దేవాలయమే కదా! అందుచేత మంచిపనులు జర్పింతురు. పురాణకాలక్షేపములు జరుగును, రామభజనలు నిర్వహింపబడుచుండును. అచ్చట ఎందరికో అన్నదానము జరుపబడుచుండును. శ్రీరామ నవమి పర్వదినములలో, ఆరోజు శ్రీరామచంద్రుని పేర నెంత అన్నదానము జరుగుచున్నది? ఎందఱు పురాణప్రవచనము కావించుచుండిరి? ఎందరు హరికథాగానములు కావించుచున్నారు? మార్దంగికాది వాద్యనిపుణులకు, నాట్యకారులకు కళాకారులకు చేతినిండ పనిదొరకుచున్నది. ఈ కార్యక్రమ

ముల కన్నింటికిని ఎంతయో ధనము వ్యయమగుచున్నది. అది యంతయు భగవదర్పణగా అనేకుల కనేకవిధముల నుపయోగపడుచున్నది.

వసంతనవరాత్రములు శ్రీరామనవమితో నంతమగుచున్నవి. ఈ యుత్సవములు మహానందదాయకములుగా జరిగిపోవుచున్నవి. ఇవి ఆబాలగోపాలమునకు లోకమునకెల్ల ఆనందప్రదములే. ఇట్టి వైభవమంతయు రామావతార ప్రాప్తిచే కదా సంభవించినది.

రంగనాథుని ఆలయమిచ్చటనుండుటచే, వేలకొలదిగా ప్రజలరుదెంచి, దర్శనభాగ్యమున తరించి, పోవుచున్నారు. రాజవీథులన్నియు ప్రజాసమాజములతో క్రిక్కిరిసియున్నవి. ఒక్కొక్క ఉత్సవసమయమున ప్రజలందరు నానందోత్సాహములతో, నూతనవసనంబులు ధరించి, గృహముల ననేకరీతుల నలంకరించి, కదళీనారికేళాదిశాఖల గృహప్రాంగణంబులనాటి, తోరణంబులుతీర్చి, రంగవల్లులుదిద్ది సుగంధధూపములువేసి, శ్రీరంగేశ్వరుడు దివ్యవాహనారూఢుడై వీథులవెంటరాగా, ప్రజలుభక్తితో నారికేళఫలాదులు సమర్పించుచున్నారు. కర్పూరఖండములు వెలిగించి నివాళులెత్తుచున్నారు. నవ్యసుగంధకుసుమ స్రజములు సమర్పించుకొనుచున్నారు. పట్టణమంతయు మహాకోలాహలముగా నుండును. ఇది యంతయు రంగేశ్వర ప్రభావముకాదా! భగవానుని యొక్క ఈ అర్చావతారములేనిచో ఈ పట్టణమేలేదు. ఈ వైభవములేదు. ఇక జనులెచ్చటినుండి వత్తురు! ఏల

వత్సరు!" అని వివరముగా చెప్పెను. ఈవిధముగా పరాశరుల వెన్నంటి సంచరించుచు, వారియొద్ద నంజియ్యారు, ద్రవిడవేదాంతమునంతయు నధికరింపదలంచెను.

యతీంద్రులైన లక్ష్మణసూరి యాజ్ఞచే పూర్వము తిరుక్కురహప్పిరాన్పిళ్లాన్ అను పేరుగల ఒకసాధుసత్తముండు నమ్మాళ్వారిచే చెప్పబడిన తిరువాయిమొళికి. ఆరాయిరప్పడి యను వ్యాఖ్యానమును సంతరించెను. అదియెల్ల సమగ్రముగా పరాశరులు నంజియ్యారునకు బోధించిరి, అదియెల్ల నామూలాగ్రముగ ఆకళించుకొని, నంజియ్యారు, తిరువాయిమొళికి నవసహస్ర పరిమితంబగు వ్యాఖ్యానమునుగూర్చెను. దానిని పరాశరులు పరిశీలించి "వత్సా! ఈ వ్యాఖ్యానము, హృదయరంజకమై చాలసొంపుగానున్నది"యని మెచ్చుకొనిరి.

ఈవిధముగా వైష్ణవదర్శనస్థాపకుండై, సమస్త వైష్ణవులును శిష్యులై తనను సేవి పుచుండ, నంజియ్యారు మొదల నంతేవాసులంగూడి, పరాశరభట్టరు, శ్రీవైష్ణవమతసామ్రాజ్య పట్టభద్రుండై పరిపాలించుచుండెను. భట్టరువారి కీర్తిదశ దిశలందువ్యాపించెను. శ్రీరంగము పరమపదంబుగా ప్రకాశించెను.

ఇట్లుండ నొకానొక కౌశిక ద్వాదశియందు రంగనాథ స్వామివారికి గొప్పయుత్సవము నిర్వర్తింపబడుచుండెను. శ్రీభూనీళాది దివ్యమహిషీ సమేతుండగు రంగేశ్వరుని నొక దివ్యమంటపమునందు వేంచేపుచేయించిరి. సహస్రసంఖ్యలో

జనులు స్వామిని కన్నులార దర్శించుచు పరివేష్టించియుండిరి. అర్చకపరిచారికాది పరివారమంతయు స్వామిని సేవించుచుండిరి.

ఆ సమయమున పరాశరభట్టరు, భగవన్మహిమమును గూర్చి అత్యద్భుతముగా నుపన్యసించుచుండిరి. ప్రజలందరును తన్మయులై దేహేంద్రియ ప్రపంచంబులు విస్మరించి, చిత్రార్పితమూర్తులవలె నిశ్చలముగా కూర్చుండి ఉపన్యాసము నాకర్ణించుచుండిరి. ఆ యుపన్యాసశ్రవణముచే రంగనాథునకు పరవశత్వము కలిగెను. ఆనందపూర్ణహృదయుడై "వత్సా! పరాశరా! నీ వాక్ప్రవాహమునకు, నీ స్థిరతమభక్తికి సంతసించితి. ఈ ప్రాకృతలోకంబున నీవింకనుండదగదు. నాదివ్యధామమైన శ్రీవైకుంఠనగరంబున దివ్యభోగముల ననుభవించుచు సుఖంబుండుము" అని అనతిచ్చెను.

పరాశరు లానంద తుందిల హృదయమందిరుండై "ప్రభూ! ఆజ్ఞ. మీ అనతి వెంట నచ్చటికే పోయెద. కాని ఒకవిషయము. ఈ నీదివ్యస్వరూపము, కస్తూరీతిలకాంచితంబగు ఈ నీతిరుముఖమండలము, ఈ నీదీర్ఘబాహువులు, ఈ నీదివ్యసౌందర్యము, అచ్చట ఆ తిరుమామణిమంటపమునందు శేషశయానుండగు శ్రీమన్నారాయణునకు ఉండెనా, వారిని సేవించుచు నచ్చటనేయుండెద. లేనిచో, శిరియతిరువడి ఓషధీనగంబును పెకలించి తెచ్చిన విధంబున శ్రీవైకుంఠనగరంబును పెల్లగించుకొని ఈ శ్రీరంగమునకు తెచ్చెద." నని పలికెను.

రంగేశ్వరుండు నవ్వి "వత్సా! అట్లే పోయిరమ్ము." అని తాను ధరించియున్న పూదండలు వేయించి, చందనాదుల నొసంగి తన దివ్యభూషణములతో నలంకరింపించి, తన దివ్య యానంబుపై నధిరోహింపజేసి, వీడుకొలిపెను. అర్చిరాది మార్గంబున జను ముక్తపురుషునకు చేయు దివ్యాలంకారమా యనునట్లు, రంగేశ్వరునిచే నలంకరింపబడిన పరాశరులు తిరువీథులన్నియు తిరుగుచువచ్చి స్వగృహంబుజొచ్చి తల్లిపదంబుల ముందు మోకరిల్లెను. తల్లియు తనయుని, అలంకారముల గాంచి, ఆనందపడి "తండ్రీ! అనంతమయ లోకంబు లందు ఏలుమా!" యని పలికెను.

పరాశరులు వైష్ణవులనెల్లర పిలిపించి, భోజనాదులు పెట్టించెను. వారందరును సంతృప్తిగా నాపడిరి. తదుపరి పరాశరులు నంజియ్యరును పిలిపించి, "వత్సా! నీకొకహితం బునుపదేశించెద. శ్రద్ధగా వినుము. సంస్కృత విద్యాపారంగతుడవనియు, షణ్మతస్థాపనాచార్య బిరుదగాము ప్రసిద్ధుండవనియు, భాగవతకైంకర్య దీక్షాదక్షుండవనియు, అపారధనమును గురుదక్షిణగా నొసంగినవాడవనియు, అధీత ద్రవిడవిద్యాపారగుండవనియును తలంచి, గర్వించి, చెడిపోకుము. ఎంబెరుమానారు దివ్యతిరువడిగళే శరణంబని విశ్వసించియుండుము. కలకాలంబును, మావాడవై శ్రీరంగమందుండి, విష్ణుదర్శనస్థాపనయందు అప్రమత్తుండవై యుండి, నీయనంతరము నీవంటివాని నొకని, నీదర్శనస్థాపనకార్యంబున నియోగించి నిత్యవిభూతికి

రమ్ము"అని ఆదేశించి. గురుదేవుండగు గోవిందమిశ్రుల శ్రీపాదములు హృదయమునందునిలిపి, నిత్యవిభూతి నలంక రించెను.

నంజియ్యారు మొదలగు శిష్యులు గురువిశ్లేషంబున కోర్వజాలక దుఃఖాబ్ధిమగ్నులై దిక్కు-దెలియక కొంతవడి పడియుండిరి. కొంతసేపటికి తెప్పరిల్లి గురునకు బ్రహ్మమేధాది సంస్కారములు కావించిరి. పరాశరభట్టరు అనుజుండగు వ్యాసభట్టరు అన్నను తలంచుకొని మిక్కిలి దుఃఖించుచుండెను. అపుడు తల్లియగు ఆండాళమ్మ వ్యాసభట్టరుతో "ఓయీ! నీవు జ్ఞాతివనిపించితివి. అన్న దివ్యలోకములకు పోవుటను సహింపజాలక దుఃఖించుచుంటి"వని పలికెను. ఆ మాటల కాతడు చిన్నబుచ్చుకొని "తల్లీ! క్షమింపుము. తెలియక దుఃఖించితి' నని శోకమును త్యజించెను.

నంజియ్యారు మఠమునందు ప్రవేశించి, లోపలికవాట ములు బంధించుకొని, మూడుదినములు తలుపులు తెఱువక అందేపడియుండెను. అపుడు భాగవతు లరుదెంచి గోలపెట్టగా నంజియ్యారు మెల్లగా తలుపులు తెఱచి, మొకమూల ముసుగు వైచుకొని కూరుచుండెను. భాగవతు లాయనను సమీపించి నమస్కరించి, "స్వామీ! మీరేల ఈమూల నీలీల మొదిగి యున్నారు?"అని ప్రశ్నించిరి. నంజియ్యారు వారితో "అయ్యలారా! మగడుపోయిన క్రొత్తవితంతువు గుభాలున బయట సంచరింపగలదా!"అని బదులుచెప్పెను.

ఆవాక్యము లాలకించిన భాగవతులందఱును, నంజి య్యారు గురుభక్తి ననేకరీతుల కొనియాడిరి.

ఓమ్ తచ్ఛాంతిః ఓ తచ్ఛాంతిః

# నంజీయర్ వైభవము

శ్లో॥ ఫాల్గునోత్తర ఫల్గున్యాం జాతం వేదాంతినం మునిమ్
శ్రీ పరాశరభట్టార్య పాద రేఖా మయంభజే
నమో వేదాంతవేద్యాయ జగన్మంగళహేతవే
యస్య వాగమృతాసారపూరితమ్ భువనత్రయమ్".

పరాశరభట్టార్యులు నిత్యవిభూతి నలంకరించిన పిదప, నంజీయర్ విశిష్టాద్వైతస్థాపకుండై ఉభయవేదాంతములు శిష్యులకుపదేశించుచు, పరవాదిమత్తేభ కంఠీరవుండై యుండెను. సాక్షాత్ భగవద్రామానుజులే ఈ రూపమున వేంచేసిరని నంజీయరును సమస్తప్రజలును కొనియాడుచుండిరి.

శ్రీరంగమున ననేకులు పీఠాధిపతులుగలరు. కాని నంజీయర్ ప్రభావముముందు వారందఱును సూర్యకాంతి యందలి కరదీపికలవలె వెలవెలపోవుచుండిరి. నంజీయర్ ప్రభావము దిగంతవిశ్రుతమై భాసించుచుండెను. నంజీయర్ ప్రభావమునువిని, దేశదేశములనుండి జనులు తండోపతండము లుగావచ్చి నంజీయరును దర్శించిపోవుచుండిరి. కొందరాతనికి శిష్యులై మఠమునందే నిలిచిపోవుచుండిరి.

నంజీయర్ శిష్యులకు భాష్యభగవద్విషయములు చెప్పుచుండెను. పూర్వము నంజీయర్ గురువరుండగు పరాశర భట్టరు ననుమతిచే శతకోటిప్రోత్సాహంబగు తిరువాయిమొళికి అశీతిసహస్ర వ్యాఖ్యానము వ్రాసియుండెనని చెప్పితిమికదా!

దానికి సాఫువ్రాయింపవలయునను తలంపు నంజియ్యరుకు కలిగెను. అతడు శిష్యులతో "నాయనలారా! నేను తిరువాయి మొళికి వ్యాఖ్యానము వ్రాసితినని మీరందరెరుంగుదురుకదా! దానిని చక్కగా తప్పులేకుండ వ్రాయింపవలయును. తగిన వ్రాయసగాని మీరెవ్వనినైన నెఱింగియున్నచో తెలుపుడు" అని కోరెను.

అందొక శిష్యుడులేచి "అయ్యా! కనకాపగాదక్షిణ తటంబున నొక అగ్రహారంబు గొప్పదు. ఆఱువేల నియోగి శాఖకుచెందిన ఒక విప్రోత్తముండందుగలడు. అతనిని నంబూరి వరదరాజని ప్రజలు వ్యవహరింతురు. అతడు వ్రాతయందు మహాసమర్థుడు అతడు ప్రతిదినము శ్రీరంగమునకువచ్చి కొంతమంది శిష్యులకు శాస్త్రపాఠములుపదేశించి సాయం వేళకు తనగ్రామమున కేగుచుండు'నని చెప్పెను. ఆ మాటల కలరి నంజియ్యరు శిష్యునిజూచి "వత్సా! రేపు నీవాయన యొద్దకేగి, నామాటగా నాహ్వానించి యిక్కడకు తోడ్కొని రమ్ము"అని ఆదేశించెను. అతడు గుర్వాజ్ఞ శిరసావహించి పోయి నంబూరి వరదరాజును తీసికొనివచ్చెను.

నంబూరి వరదరాజు నంజియ్యరును దర్శింపగనే "దాసోహం"అని దండవత్ప్రణామంబు లాచరించి గురుని యానతిగొని, ఒకప్రక్కగా కూరుచుండెను. అపుడు నంజియ్యరు వరదరాజుంగాంచి "విప్రోత్తమా! నీతో మాకొకపనిబడినది. మీరు మాకొకగ్రంథమును సాఫువ్రాసిపెట్టవలె. తత్కారణ

మున నిన్నుపిలిపించితిని. నీ వ్రాతసొంపు నెట్టిదో చూడవలయు ఏనీ నాల్గుపంక్తులు వ్రాసియుండు"అని యొకపత్రము నొసంగెను. ఆ బ్రాహ్మణోత్తము డాపత్రమును స్వీకరించి, దానిపై నొకశ్లోకమును వ్రాసిచూపించెను. గురుండా వ్రాలు చూచి, ముచ్చటపడి "ఓయీ! మంచిముత్యములు పోహళించినట్లున్న నీవ్రాలు చాలఅందముగానున్నది. సంతసించితి. మరి మాకొకగ్రంథమును సాఫుచేసి పెట్టగలవా?" యని యడిగెను.

ఆమాటలకలరి వరదరాజు "దేవరవారి యాజ్ఞయైనచో నటులే వ్రాసియిచ్చెద."నని బదులాడెను.

గురుండందుకొని "వత్సా! ఇది అప్రాకృతుండగు శఠగోపముని ప్రణీత తిరువాయిమొళికి వ్యాఖ్యానము. పెద్దలు వ్రాసిన యనేక వ్యాఖ్యానము లవలోకించి, అవలోడించి, ఈ బృహద్వ్యాఖ్యానమును గూర్చితి. వైష్ణవస్ఫూర్తి లేని వాడీ గ్రంథమును స్పృశించుటకూడ నర్హుడుకాడు. మఱి అట్టి దివ్య గ్రంథమును నీకొసంగుట యెట్లు!" అని పలికెను.

అందుకు వరదరాజు "అయ్యా! నాకాగ్రంథమును స్పృశించుట కధికారమెట్లుకలుగునో, అట్లుకావించి, ఆ గ్రంథము నొసంగుడనికోరెను. ఎట్టివానికైనను, మంచి దినములు వచ్చునపుడు పెద్దలయందు విశ్వాసమేర్పడుట సహజమేకదా!

నంజీయ్యరు ముదమంది ఆతనికి పంచసంస్కారం బొనరించెను. అర్థపంచకంబుపదేశించెను. ఆకారత్రయంబు నుపన్యసించెను. ఆతనిని వైష్ణవునిగానొనర్చి, తాను రచించిన వ్యాఖ్యానమంతయు నొక్కసారి ఆమూలాగ్రముగా వినిపించి, యీరీతిగావచించెను. "శిష్యా! ఈ గ్రంథంబొకయెత్తు. నీప్రాణంబొకయెత్తుగా దీనిని కాపాడవలయు. ఇయ్యది యొక్కటియే ప్రతి. ఇది ఏరీతిగానైనను పోయినచో, నిట్టి ఉత్కృష్ట గ్రంథము లోకమునలభ్యముకాదు" ఇట్లుచెప్పి ఆ గ్రంథము నొసంగెను.

ఆగ్రంథమును స్వీకరించి వరదరాజు "ఆచార్యా! నేనిచ్చటనుండి యీ గ్రంథమును వ్రాయుటకు సాధ్యపడదు. నేను ప్రతిదినమును శ్రీరంగమునకువచ్చి, శిష్యులకు శాస్త్ర పాఠములుపన్యసించి, సాయంవేళకు మాగ్రామమునకు పోవలసియున్నది. ఈ గ్రంథమును మాగృహంబునకు తీసికొనిపోయి, నాకు తీరికయగునపుడెల్ల దీనిలిఖించి దేవరవారికి సమర్పించెద." నని పలికెను. గురుండంగీకరించెను. వరదరాజసూరి గురునకు నమస్కరించి, సెలవుదీసికొని స్వగ్రామంబునకుబయలుదేరెను.

మార్గమధ్యమున కావేరిని దాటవలయునుగదా! గ్రంథమును చక్కగా ఉత్తరీయమునందు మూటగట్టుకొని, దానిని భద్రముగా శిరస్సునకు చుట్టుకొని, నదియందుదిగెను, తానొకటి దలచిన దైవము వేరొండు తలచునుకదా! అట్లు నదిలో కొంత దవ్వేగుసరికి, గగనతలమెల్ల మబ్బులుగ్రమ్మెను. కారు

మేఘముల గర్జనములు మెండుకొనెను. తత్ప్రదేశమెల్ల అంధకారబంధురంబయ్యె. కన్నులు మిరుమిట్లుగొలుపునట్లు మెరుపుతీవలు తీవరించె. ప్రభంజనము ప్రబలమయ్యె. ఏనుగు తొండముతో సమానములగు ధారలు, భూమ్యాకాశము లనేక మొనర్చెను. కావేరీస్రవంతి ఉభయపార్శ్వతటంబుల నాక్రమించుచు, గంభీరాంభస్సముద్భూతోత్తుంగ తరంగసంఘ భయదంబై, ఆకసమును స్పృశింపనున్నదాయనునట్లు ప్రవహింపజొచ్చె. ఆ ప్రవాహమధ్యంబున దిక్కుదోచని వరద రాజసూరి రంగనిడెందంబున భద్రపరచి, ఈదుచు, మునుగుచు, తేలుచు, అతిప్రయత్నంబున దక్షిణతటంబునకు చేరెను. తన శిరముపై గల ఉత్తరీయము, గురుగ్రంథము గంగపాలైనవి.

కొలదికాలముననే మేఘములువిచ్చుకొన్నవి. సూర్యుడు నిర్మలకాంతులచే ప్రకాశింపజొచ్చె. వాయువు మందత్వము వహించె. ఆ అద్భుతసంఘటన కెంతయు వంతనొంది యబ్బుధాగ్రణి "అయ్యో! నాథయామున రామానుజాది దివ్యాచార్యుల కాలమునుండి వచ్చిన సంప్రదాయగ్రంథమును చేజేతుల నేటిపాలుగావించితి. నేనెంత దౌర్భాగ్యుండను. ఇది గురుద్రోహము. ఈ గ్రంథము మరియొక ప్రతిలేదని గురువుగారు ముందేసాయించిరి. నేనేమి సేయుదు! గ్రంథము కావేరి పాలైనదని చెప్పినచో నాచార్యు లెట్లు కోపింతురో! ఎట్లు బాధనందుదురో! ఆచార్య ననుగ్రహంబునకు కాక నిగ్రహపాత్రుండనైతి. ఇది గురుద్రోహమే కాదు. ఇట్టి మహోత్తమ

గ్రంథము జగతీ జనులకందకుండ జేసి లోకద్రోహమును గావించితి." నని యనేకవిధముల తన మనంబున దుఃఖించుచు, నదీ తీరంబున నిలిచియుండెను.

ఆసమయమున ఆయన మనస్సున ఏదియో వాఙ్మయ ప్రవాహముప్పొంగుచుండెను. గురుండు తనకు చెప్పిన వ్యాఖ్యాన మంతయు స్మృతియందు కదలుచుండెను. అపుడు ఆ సుధీ వరుడు "ఆహా! ఏదియో దివ్యవిషయవాహిని మన్మనః క్షేత్రంబున తరంగితంబగుచున్నది. నాలో దివ్యావేశ మేదియో కట్టలు తెంచుకొని ఉత్తుంగతలూగుచున్నది. ఏదో దివ్యవాణి కర్తవ్యోపదేశము చేయుచున్నట్లున్నది. కానిమ్ము. దీనినంతయు గ్రంథస్థముగావించి గురుచంద్రునకు చూపించెద. పిదప ఏమి కానున్నదో. అన్నింటికిని రంగేశ్వరుడేసాక్షి"అని మనంబున దిటవు చెంది తనగృహంబునకుపోయెను.

వరదరాజు స్వస్థచిత్తుడై మనస్సునకుతోచిన విషయ మంతయు గ్రంథస్థ మొనర్చుచుండెను.

కొన్నిమాసములు జరిగిపోయినవి. నంజియ్యరునకు వరదరాజు విషయములేమియు తెలిసినవికావు. ఒకనాడు నంజియ్యరు శిష్యులతో "నాయనలారా! నంబూరి వరద రాజునకు గ్రంథంబొసంగి చాలకాలమైనది. అతడు దానినేమి చేసెనో తెలియకున్నది. శ్రీరంగమున కాతడు ప్రతిదినమును వచ్చుచున్నాడో లేదో విచారింపవలసినది"అని కోరెను.

అదేప్రకారము శిష్యులు విచారించిరి. వారు గురు సన్నిధింజేరి "గురూత్తమా! సుమారు నాలుగైదుమాసముల నుండియు నాతడు శ్రీరంగమునకు వచ్చుటలేదట" అని చెప్పిరి. చేయునదిలేక నంజియ్యారు నూరకుండెను.

వరదరాజసూరియు తన మనోగోచరమైనదంతయు గ్రంథస్థమొనరించెను. ఒకనాడు ఉదయముననే బయలుదేరి గ్రంథమునుతీసికొని, శ్రీరంగమునకుం జనుదెంచి, గురుని మఠంబునప్రవేశించి, గురునకు గ్రంథమును సమర్పించి, సాష్టాంగవందనప్రమాణంబు లాచరించి, ఆచార్యాజ్ఞ చే నుప కంఠమున ఉపవిష్టుండయ్యె.

నంజియ్యారు మహోత్కంఠతో గ్రంథమునువిప్పి పఠింప సాగెను. ఆనందముతో నాయనకనులు విస్ఫారజొచ్చెను. మోమునకాంతి అతిశయింపదొడగెను. అతడు గ్రంథము నచ్చటచ్చటజూచెను. తనకు సందేహములున్న తావున తాను కుండలీకరణములనుంచెను. అవియున్నియు దీనియందు సరిచేయ బడియుండెను. గురుండాశ్చర్యచకితుండై "నాసందేహముల నీతడట్లు సవరింపగలిగెను! చిత్రముగానున్నది." అని భావించి, "వత్సా! నేనిచ్చిన గ్రంథమును చూచియేవ్రాసి తివా?" యని ప్రశ్నించెను.

వరదరాజ శిరముపై పిడుగుపడినట్లయ్యెను. గురుప్రోక్త గ్రంథమునకు, తానువ్రాసిన గ్రంథమునకు సంబంధమున్నదో

లేదో యని భయపడుచున్నవాడు కావున, ఆందోళితచిత్తుడై గురునిపాదములకు నమస్కరించి, చేతులుజోడించి "స్వామీ ! మీరు క్షమించెదనని అభయమిచ్చినచో జరిగినవృత్తాంతము విన్నవించుకొనియెద" నని వేడుకొనెను.

గురుని అంగీకృతిమీద జరిగిన విశేషమునెల్ల పూస గ్రుచ్చినట్లు వివరించెను. అందులకు నంజీయ్యరు అమందానంద స్వాంతుడై వరదరాజును గట్టిగాకౌగిలించుకొని "నంబిళ్లై" యనిపలికెను. మహాత్ములవాక్యములు వ్యర్థముకావు కనుక, అప్పటినుండి అతనికదియే నామమైయొప్పెను. అప్పటినుండి నంబిళ్ళ ఒక నిమేషమైనను గురునివీడక శుశ్రూష కావించు చుండెను.

"కార్తికేకృత్తికాజాతం వేదాన్తి పదసంశ్రయమ్
కలయామి కలధ్వంసదా సంజ్ఞానామృతార్ణవమ్"

నంబిళ్లై గురుండగు నంజీయ్యరు నొద్ద ద్రవిడవేదములనెల్ల సాంగముగా పఠించెను. శారీరక మీమాంసాభాష్యమును చదువుచుండెను.

ఒకనాడు నంజీయ్యరు నంబిళ్ళనుజూచి "వత్సా ! పరిచారకులు వంటగావించి స్వామిసన్నిధింబెట్టిరి. శ్రీహరికి అర్చకావింపుమా !"అని ఆదేశించిరి.

అందులకాతడు "గురువరా ! ఈ దాసునకు అర్చా విధము తెలియదు. తద్విధానము నానతిచ్చినచో అట్లే చేసెద" నని తెలిపెను.

అపుడు గురుండు "బిడ్డా! ద్వయమంత్రమునందలి ఉత్తరఖండమును చదివి సర్వేశ్వరుని కర్ఘ్యపాద్యాదులొసంగి అర్చనావింపుము" అని తెలిపెను.

"సర్వేశ్వరుని మూర్తులనేకములున్నవికదా! ఏమూర్తి కని చేయుట?" ప్రశ్న.

"సర్వమంగళ శాలిపదము దానికితగిలించి అర్చనావింపుము" సమాధానము.

అంత నంబిళ్ళ అర్చాకార్యక్రమమును ముగించుకొని వచ్చెను.

ఒకనాడు నంబిళ్ళ నంజియ్యారుతో "దేవా! భాగవతాపచారంబననేమి? యని ప్రశ్నించెను.

"భాగవతులనుజూచి, వీరును ప్రాకృతులే. వీరికిని మనవలె రెండుకాళ్ళు రెండుచేతులు. వీరును మనవంటివారే. వీరి ఆధిక్యమేమి? యని తలంచుట భాగవతాపచారము" అని గురుండు తెలిపెను.

"అయ్యా! వైష్ణవుండగువాడెట్లుండవలె?" నని శిష్యుడు ప్రశ్నించెను.

"సర్వేశ్వరుని అర్చారూపమునందే భక్తికలిగియుండవలయు" నని దేశికుండాదేశించెను.

ఒకప్పుడు గురునితో నంబిళ్ల "అయ్యా! అనేక మంత్రంబులు అంగన్యాస కరన్యాసములతోకూడియుండును

వాని నన్నింటినివదలి ప్రపత్తిచేయుమని నిూరానతిచ్చు చున్నారు. ప్రపత్తి యన్న గొప్పతనమేమి!''అని ప్రశ్నించెను.

“వత్సా! ప్రపత్తియనగా న్యాసవిద్య. సర్వభార ములును సర్వేశ్వరునియందు నిక్షేపించుట. దీనికొక ఉదాహరణ మును చెప్పెద వినుము. ఒకడు తనయొద్దనున్న ధనమంతయు నిధియం (Bank) దుంచి, వారిచ్చుపత్రమును మాత్రమే చేకొని, తనకు కావలసినచోటికి పోవుచున్నాడు. మరియొకడు తన ధనమునంతయు తన యొద్దనే యుంచుకొనిపోవుచున్నాడు. వీరిద్దరిలో నెంతభేదమున్నదో చూడుము. ధనము నొద్దనుంచు కొనువానికి, అడుగడుగున భయము. ప్రతిక్షణము సందేహము. నిధిపత్రముకలవాడు నిర్భయముగా పయనింపగలడు. అట్లే మనము మనభారములన్నియు సర్వేశ్వరుని యందుంచినచో మనకు హానిలేదు. అదియే న్యాసవిద్య. మనపూర్వులలో మహర్షులందఱును తపోజ్ఞానయోగాదు లొనరించిరి. శఠగోప, నాథ, యామున రామానుజాదియోగులెల్లరు నీన్యాసవిద్యనే ఆశ్రయించిరి. ఇది సర్వేశ్వరునిపొందుటకు సులువైనమార్గము” అని పలికెను.

నంబిళ్లె గురువుగారిచే, తిరువాయిమొళికి అర్థమును నూరుపర్యాయములు చెప్పించుకొనెను. గురుదేవునకు శతాభి షేకంబులు కావించెను. నంబిళ్లెకు 'కలివైరిదాసు' అను బిరుదనామంబుగలదు.

ఆ కలివైరిదాసునకు పెరియవాచ్చాంబిళ్ళె, పిన్‌బళకియ పెరుమాళ్లజియ్యరు, యీణ్ణిమాధవుండు, శ్రీకృష్ణపాదదేశి

కుంభ మొదలగు వైష్ణవోత్తములు శిష్యులైరి. వారందరు నంబిళ్ల పాదముల నాశ్రయించి సేవించుచుండిరి. దివ్యాను ముట్టించిన దిపిటీవలే నంబిళ్ల నంజియ్యారునకన్న గొప్పవాడని ప్రసిద్ధికెక్కెను. గురువునుమించిన శిష్యుడని, ప్రజలు నంబిళ్లను కొనియాడుచుండిరి.

ఒకానొక వైష్ణవునకు శరీరజాడ్యము సంభవించెను. అతడే కార్యమును చేయుటకును అశక్తుడై యుండెను. అత డొకనాడు కొందరు శ్రీవైష్ణవోత్తములరావించి "అయ్యాలారా! నాఆరోగ్యము కొఱకై మీరందఱును శ్రీరంగేశ్వరునకు ప్రపత్తిగావింపుడు" అని వేడుకొనెను. వారట్లు కావించిరి.

కొందరు వైష్ణవు లీవిషయము నెఱింగి నంబిళ్ళగారి సన్నిధికేగుదెంచి "ఆర్యా! వైష్ణవుడగువాడు స్వార్థము గోరరాదుకదా! పిన్ బళహర పెరుమాళ్లుజియ్యారు, తన ఆరోగ్యముకొఱకై వైష్ణవులచే సర్వేశ్వరునకు శరణాగతిచేయించి నాడు. ఇట్లుచేయింపవచ్చునా?" యని ప్రశ్నించిరి.

నంబిళ్ల ఆదాసుని పిలిపించి "నీవట్లేల చేయించితి" వని విచారించెను. అందులకాతడు గురునితో "దేశికసార్వభౌమా! స్వార్థమునకు ప్రపదన మొనరించుటదోషమే. అయినను నావిన్నపమాలింపుడు. ప్రతిదినమును తమరు ఉదయకాలమున అభ్యంజనముగావించి, పాకశాలలో నటునిటుతిరుగుచుందురు.

అపుడు వీరి మొగముపై తోచెడు స్వేదబిందువులు మంచి ముత్యములవలే భాసించుచుండును. ఆ సమయమున సురటి చేబూని వీరికు వీవవలయునను అభిలాషనాలోకడుంగడు పెల్లుబుకుచున్నది. కాని తత్కార్యమునకు నేనశక్తుడను. నాకు శక్తికలుగుటకు, అట్లుచేయుంచితి."నని తెలిపెను.

అదివిని, ఆతని గురుభక్తికందఱును సంతసించి, అచ్చటనున్న వారందరాతనగ్గించిరి.

ఒకానొకదినమున, శ్రీరంగమునందలి ఒకవైష్ణవుడు పరమపదించెను. ఆతనిభార్య నోదార్పవలయునని నంబిళ్ళ శిష్యులతో తద్భాగవతుని నివాసమునకేగెను. ఆవైష్ణ వోత్తము నిల్లాలు, ఉల్లాసముతో చిరునవ్వులుచిందించుచు వచ్చి నంబిళ్ల పదసరోజములపై వ్రాలి లేచినిలుచుండెను. నంబిళ్ల ఆమెను పరామర్శించి, మరలియింటికివచ్చెను.

శిష్యులపుడు నంబిళ్లగారిని "అయ్యా! ఆ గృహిణి భర్తపోయినందులకు శోకింపకపోగా, నిర్వికారముగా, ఉత్సాహముతోనున్నది. ఇదియేమివింత!"అని ప్రశ్నించిరి.

అపుడు నంబిళ్ల "శిష్యులారా! ఆమెభర్త జీవించి యుండగా, ఆమెకెట్టి అపకారమునుచేసినవాడుకాడు. అందువలన నామె నవ్వుచున్నది"అని సమాధానముచెప్పెను.

అందులకాశిష్యులు "ఆర్యా! అట్లైనచో, ఆ స్త్రీ యింకమరి మరి, కుమిలికుమిలి యేడ్వవలయునుగదా"అని పలికిరి.

అపుడు నంబిళ్ల "వత్సలారా! లోకమున సామాన్యుల విషయము మీరు చెప్పినట్లేయుండును. తన భర్త దివ్యలోకము నకు పోయినాడని యీపడతి యెరుంగును. ఆలోకమునందున్న వైభవమెట్టిదో ఆమెకు తెలియును. తనభర్త అత్యంత సౌఖ్యముల తేలుచున్నాడనియు, వందులకామె హర్షింప వలయుననియు, భావించి, యట్లు సంతోషముగనున్నది' యని నుడివెను.

వేరొకదినమున మరియొక వైష్ణవుడు లోకాంతరగతుం డయ్యెను. ఆయనగృహిణి నోదార్పవలయునని నంబిళ్ళ శిష్యసమేతుడై తద్దాసుని గృహమునకుపోయెను. ఆ యిల్లా లును, ఆపె సంతానమును గోడుగోడున నేడ్చుచువచ్చి నంబిళ్ళకు వందనమాచరించెను. ఆమెను సమయానుకూల వచనములతో నోదార్చి నంబిళ్ల మరలివచ్చెను.

అపుడు శిష్యులు "గురూత్తమా! ఈసాధ్వి మరణిం చిన భర్త బాధించియుండునా! ఈమె మిక్కిలివగచుచున్నది." అని ప్రశ్నించిరి.

అందులకు నంబిళ్ల "కాదు. పరమభాగవతుడైన తన భర్తృమరణమునకీసాధ్వీచింతించుటలేదు. అట్టి పరమభాగవ తోత్తమునితో నిత్యసంబంధము పోయెగదాయని దుఃఖించు చున్నది"అని సమాధానముచెప్పెను. శిష్యులీవాక్యములకు మిక్కిలి అక్కజంపడి సంతుష్టాంతరంగులైరి.

ఈవిధముగా నంబిళ్ళ దినదినప్రవర్ధమాన వైభవంబున శ్రీరంగమున నివసించుచు, శిష్యులకు, తిరువాయిమొళి మొదలగు గ్రంథములందలి శ్రీమద్భగవద్వైభవమును ప్రవచించుచుండెను. ఆయన గంభీరవేదాంతోపన్యాసములను జనులనేకవిధముల కొనియాడజొచ్చిరి. దేశదేశవాసులును చనుదెంచి, నంబిళ్ళ గోష్ఠియందు చేరుచుండిరి.

శ్రీరంగక్షేత్రంబున కందాళతోడప్పరను శ్రీవైష్ణవుం డొకండుకలడు. అతడు సాక్షాత్ శ్రీభగవద్రామానుజులకు భాగినేయుడైన మొదలియాండానునకు పౌత్రుడు. అతడు సమస్తశాస్త్రపారంగతుడు. వేదవేదాంగము లభ్యసించినమేటి. అతనికి నంబిళ్ళ వైభవము కన్నుకుట్టయైనది. అతడొకానొక దినమున తనమనంబున నిట్లువితర్కించెను "ఈ నంబిళ్ళగాని దేయూరు? ఏకులము? ఏడు నియోగిబ్రాహ్మణుడు. ఈతని కింగొప్పతనమేల? నిజమునకు మేమాచార్య పురుషులము. మాకులేనిగౌరవము ఈతడు పొందుటెట్లు? ఎట్లైనను పదుగురిలో నీతని నగౌరవింపవలె. వీనికి శృంగభంగమైనగాని పొగరణగదు."

ఇట్లుతలంచి, ఆవైష్ణవు డొకనాడు రంగేశ్వరాలయంబున కరిగెను. స్వామినిదర్శించి వెనుదిరిగివచ్చుచుండెను. ఆసమయమున నంబిళ్ళ శిష్యసమేతుండై రంగేశ్వరదర్శనమునకై పోవుచుండెను. సరిగా స్వామి ప్రాకారములోనికిజనుసరికి వైష్ణవు డెదురువచ్చెను. ఆ వైష్ణవుడిది యదనుగదాయని మనిందలంచి,

నంబిళ్ళను ఉచ్చనీచములెల్లగూసెను. అనేకవిధముల దుర్భాష లాడి యవమానించెను. నోటికివచ్చినదే మాటగావదలి వైచెను. నంబిళ్ళ శిష్యులాగ్రహోదగ్రులై నంబిళ్ళ అను మతికై వేచియుండిరి. గురుండానతి యిచ్చినచో, శుకసారణు లకు రామసైన్యమునపట్టినగతి పట్టియుండెడిది. నంబిళ్ళ కదలక, బెదరక, మెల్లగా, అపరాధిని, సర్వాపరాధిని అని అంజలిబద్ధుడై నిలిచియుండెను. అతని వినయము, వైష్ణవునకు మరింత అలుసునొసంగెను. అతడింకను విజృంభించి, నోటికి వచ్చినట్లెల్ల తిట్టివెడలిపోయెను.

నంబిళ్ళ రంగేశ్వరునిదర్శించి మరలి యిరవున కరుగు దెంచెను.

నంబిళ్ళను దూషించి, వైష్ణవుడింటి కేగునప్పటికి సూర్యాస్తమయమయ్యెను. మసకచీకటు లలముకొనియె. గృహమునందతని అర్ధాంగి కన్పింపకపోయెను. ప్రతిదినమును తానింటికివచ్చుసరికి నవ్వుచు నెదురువచ్చు ప్రేయసి ఎదురు రాకుండుట అతనికి బాధగాతోచెను. అత డంతఃపురములోనికిం బోయెను. తనభర్త ఆచార్యుండగు నంబిళ్ళ నవమానించి నాడని, ఆ వైష్ణవి కెవ్వరో తెలియపరచిరి. అందులకామె అకారణముగ ఆర్యులనిందించుట మేలుకాదనితలంచి, యింటి యందలి దీపములన్నియు తీసివైచి భూషణంబులు పరిహరించి, కటికనేలపై ముసుంగిడుకొని పవ్వళించియుండెను.

తో నప్పుడు ఆస్థితిలోనున్న భార్యనుగాంచి, చలించి ఆమెను సమీపించి "తన్వీ! నాపై నిట్లు కోపింప కారణంబేమి! నీవు నన్నుపరిణయంబాడినది మొదలు, దేహములువేరైనను, మనస్సులొకటిగా ప్రవర్తించితిమి. సుఖదుఃఖములు సమముగా ననుభవించుచున్నారము. "నాతిచరామి"యను మంత్ర వాక్యమున కింతవఱకు కన్యథాత్వము లేదు. నాదోసంగేమి యో ప్రసంగించినచో, దిద్దుకొనియెద. నీవిట్లు నేలపడియుండుటకు నామనస్సు సహించునా! నన్ను పరీక్షింపదలంచితివా! ఏల మాటాడవు"అని అనేకవిధముల ప్రణయ వాక్యముల నామెను బుజ్జగింపసాగెను.

అందులకాతని యర్ధాంగి "ఆర్యా! నాపట్ల మీరెసు మంతయైనను దురుసుతనమెరుంగరు. కాని లోకపూజ్యుండగు నంబిళ్ళ శఠారాత్యవతారమని పెద్దలువిశ్వసించుచున్నారు. అట్టి నంబిళ్ళగారియెడ మీరీదినమున కావించిన అపచార మపారము. భాగవతాపచార మొనర్చినవారిని "పద్మకోటి శతేనాపి నక్షమామి వసుంధరే" భాగవతాపరాధంబు గావించినవారిని పద్మకోటి శతసంవత్సరములకైనను క్షమింపనని భగవానుడు భూదేవికి చెప్పియుండెనని మీరెరుంగరా! అట్టి వారిని రాక్షసయోనులందు బుట్ట జేయుదుననియు తెల్పియుండె గదా! ఈ విషయము మీరెన్నోపర్యాయము నాతో చెప్పితిరి. అట్టి మీరే యిట్లువర్తించుటమంచిదా! మీరేల భాగవతాపచారంబునకు పూనవలె! పొరపాటున భాగవతాప

చారముగావించినవారు పశ్చాత్తప్తులైనచో కొంతశాంతి లభించునని పెద్దలందురు. మీరు పశ్చాత్తాపమునందలేదు. ఇది నాపురాకృత దుష్కృతముగా తలంచుచుంటిని. భార్యగా మీఘోరపాతకములందు నేను పాలుపంచుకొన వలసియున్నది. ఇంతపాపంబాచరించినపిదప మీతో సంసార సుఖంబులనుభవించి తుదకు శరీరమునువిడిచి కుంభీపాకాదులైన నరకాదులకుపోవుటకంటె యిప్పుడే శరీరమూడ్చి దివ్యలోక ములకేగెద. మాతండ్రి అగ్నిసాక్షికముగా ఈశరీరమును మీకు దత్తముచేసినారు. ఇదిగో ఈ శరీరమునేమైన చేసి కొమ్ము. నాఆత్మ ఆచార్యాధీనము. కావున తదర్పణ కావించుచున్నాను.”అని పలికి దుఃఖించుచుండెను.

తొండప్పరు భార్యనుజూచి, “ప్రేయసీ ! నీవాక్యము లన్నియు సత్యబద్ధంబులు. వీనియందిసుమంతయైన సందియంబు లేదు. మరి ఈ దురాగ్రహావేశము నామనస్సున నేలజనించి నదో తెలియకున్నది. నేనెంతమూరుచున్నను నంబిళ్ళ మారు పలుకలేదు. ఈ నియోగివానికింత గౌరవమేలవచ్చెనను ద్వేష దవానలమే నన్నింతకుతెచ్చినది. నాయిష్టమువచ్చినట్లు ప్రేలి తిని. ఇది బుద్ధిపూర్వకముగా గావించిన అపచారమేకాని, తెలియకచేసిన అపచారముకాదు. సత్యమునకు నేనుచేసిన పాపమునకు ప్రాయశ్చిత్తములేదు. దేవీ ! లెమ్ము. నీవు నావెంటవచ్చినచో పోయి యానంబిళ్ళ పాదములపై బడి క్షమింపుమని వేడుకొందము”అని పలికెను.

ఆమహిళామతల్లి ఆ వాక్యములకలరి యొక్క దీపమును కేలంగిలించి, భర్తతో నంబిళ్ళ సన్నిధికింబయలుదేరెను.

నంబిళ్ళ తోడప్పరుతో తిరస్కరింపబడి గృహంబును బ్రాపించి, "అయ్యో! నేనెంతపాపిష్ఠుడనో! మొదలియాండు భగవద్రామానుజులకు త్రిదండప్రాయులు. అతనికి సాక్షాత్పౌత్రుడు తోడప్పరు. అట్టివానికి నిష్కారణంబుగా నామీద నేల ఆగ్రహంబు జనింపవలె! నిత్యవిభూతి వారిసొత్తు. రంగేశ్వరుడు వారికి పిత్రుపైతామహధనము. అట్టివానికి నాపైకినుక జనించినచో నాకేమిదిక్కు! నేనాయనయింటికి పోయి పాదములమీదపడి అపరాధము క్షమింపుమని ప్రార్థించెద"అని తలంచి భోజనంబొనరింపక కట్టుకొన్న పరిధానమే శిరస్సునకు ముసుగువైచుకొనివచ్చి తోడప్పరువాకిట నడ్డముగా పరుండియుండెను.

ఆసమయమున తోడప్పరును, అతని భార్యయు దీప సహాయముతో పోవదలంచి గృహకవాటంబు తెఱచిరి. వారు వెలుపలకురాగనే పండుకొన్న నంబిళ్ళ కన్పించెను. "ఎవరు వారు, వాకిటకడ్డముగా శయించియున్నారు!"అని ప్రశ్నింప నాతడు "అయ్యా! నేను కలివైరిదాసుండ. నన్ను నంబిళ్ళ యందురు"అని పలికెను.

అపుడు తోడప్పరు భార్యతో "ప్రేయసీ! నంబిళ్ళ మహానుభావుండని తెల్పితివి. చూడుము. నేను తిట్టినందులకు ప్రతీకారము తీర్చుకొనుటకై, యీ చీకటిలో నొంటరిగా

ముసుంగునిడుకొని మనయింటికివచ్చినాడు. కొంపకు నిప్పంటించుటయో, లేక యింకేదైన మహాద్రోహముచేయుటకో యీతడు చనుదెంచియుండును. కానిచో నీ యర్ధరాత్రమ్మున నీతనికిచ్చట పనియేమి!" అని పలికెను.

ఆ మాటలాలకించి, నంబిళ్ల తోడప్పరు పాదములమీఁదబడి, "అయ్యా! ఈ దాసుడట్టి నీచకార్యమొనర్పజాలడు. మీరు ఆచార్యపురుషులు. ఈ మతమున కధిపతియగు రామానుజయోగీంద్రున కాంతరంగికులు. ఈ దివ్యరంగధామము మీకు కాణాచి. శ్రీరంగేశ్వరుడు మీ సన్నిధానము. నిత్యవిభూతి మీపెద్దలకు సొంతనెలవు. అట్టి మీవంటి మహానుభావులకు మావంటియల్పులపై నాగ్రహంబుకలిగినచో, ఇహపరంబులు రెండింటియందును మాకుగతిలేదు. అందుచే మీ శ్రీపాదములమీదబడి క్షమాపణము వేడుకొనుటకై యిచ్చటి కరుగుదెంచితి" నని మనవిచేసికొనియెను. దుఃఖపరవశుడై తోడప్పరు పాదయుగ్మకముపై వ్రాలి లేచి చేతులు జోడించి నిలువబడియుండెను.

తోడప్పరు ప్రసన్నుండై నంబిళ్ళను బిగియారకౌగిలించుకొని, "ఆర్యా! యింతవఱకు మీరు కొందఱికే గురువులు. ఇకముందు లోకగురుండవై వర్ధిల్లుము." అని దీవించి యింటిలోనికి తీసికొనిపోయెను. అప్పటినుండియు నంబిళ్ళకు లోకాచార్యుండను బిరుదనామంబు ప్రసిద్ధమైవన్నెకెక్కెను.

తోడప్పరునంబిళ్ళ కాతిథ్యమునొసంగెను. మధుపర్కమును సమర్పించి. గంధము, తాంబూలము మొదలగు ద్రవ్యముల నొసంగిపూజించెను, తోడప్పరును, అతని భార్యయును నంబిళ్లగారి పాదారవిందములకు సాష్టాంగవందనప్రణామంబు లాచరించిరి. నంబిళ్ళవారిరువురి యొద్దను సెలవుగైకొని, తనగృహంబునకరిగెను.

ఈవిధముగా నంబిళ్ళ మహావైభవంబున శిష్య, సజ్జనౌఘంబులకు ఉభయవేదాంతోపదేశము కావించుచుండెను.

ఇట్లుండ నంజియ్యరునకు శతవత్సరములునిండెను. ఒకానొకదినంబున నొకవైష్ణవుండేతెంచి, నంజియ్యరునుంగాంచి "గురుచంద్రమా! తాము తెలియని వారలుకారు. మీకు చెప్పునట్టి శక్తికలవాడనుకాను. కాని మీరువ్యర్థముగా కాలమును గడుపుచున్నారు. శ్రీకార్యపరులట్లు వ్యర్థముగా దినములు గడుపవచ్చునా! మీరు ద్వయానుసంధానము ననుసంధింపవచ్చునుకదా!" అని పలికెను.

ఆమాటలకు ఆసూరిసత్తముండు మందస్మితముగావించి, "నాయనా! శరీరపాటవము పక్రమముగానుండగా, నింద్రియములన్నియు, చక్కగాపనిచేయును. అప్పుడు భగవంతుని మనంబున సంధింపవలయును. ఇప్పుడు నేనువృద్ధుడను. శరీరావయవములన్నియు, కీళ్లుసళ్లువదలినవి. శరీరపాటవము తగ్గినది. మనంబువశంబుకాదు. వయః పాటవంబుననున్న నీవు ఆమంత్రరాజమును నిరంతరమనుసంధింపవలె. అట్టివి

నీవాచరింపక, నాకుపదేశించుచుంటివా ! మేమీమంత్రమును మొదటినుండియు ననుసంధించుచున్నారము. ఇపుడు మాకవసరములేదు. నీబోటియజ్ఞులు మాత్రము ద్వయ విశ్వానుసంధానమాచరింపవలె'' నని సమాధానించెను. అందులకా వైష్ణవుండు సిగ్గుపడి వెడలిపోయెను.

ఒకదినమున తెరాృ-ళ్వాననను, పేరుగలయొకడు నంజియ్యరు సమీపమునకువచ్చి పాదాభివందన మాచరించి "స్వామీ ! దేవరవారి కెయ్యదిఅభీష్టమో సెలవిండు. ఈ దాసుడు దానిని శిరోధార్యంబుగా నిర్వహించుటకు సంసిద్ధుడై యున్నాడు''అని పలికెను.

ఆ మాటలకా దేశికశిఖామణి "వత్సా! నాకు ఐహిక సుఖభోగములపై కాంక్షలేదు. నీవు రంగేశ్వరునిపాలికరిగి, నాకు సర్వస్వదానంబు ననుగ్రహించునట్లు ప్రార్థింపుము''అని కోరెను.

ఆ వైష్ణవునకా వాక్యంబుల కర్థంబు తెలియక, మరి యొక పండితున కీవిషయమును చెప్పెను. అతండు నేపోయి చెప్పివచ్చెదనని, రంగేశ్వరసన్నిధికింబోయి నంజియ్యరు వాంఛితము నెఱుకపరచెను.

కృపాపారావారమగు నారంగేశ్వరుండు నంజియ్యరు మనోభీష్టంబు నెరవేర్చెనని మెు.

ఈవిధముగా కుమారుని ఔన్నత్యమునుశిలకించి యానందించు తండ్రివలె నంబిళ్ళ వైభవంబునుగాంచి పరవ

శించుచు నంజియ్యరు కాలముపుచ్చుచుండెను. నూరేండ్లునిండి నంతనే నంజియ్యరు దేహపరిత్యాగంబు కావింపవలయునని భావించెను. నంబిళ్లై మొదలగు శిష్యులనెల్లరావించెను. వారికి భగవద్రహస్యముల నెన్నింటినో కొఱతలేకుండ తెలియ జేసెను.

తదుపరి శిష్యులనెల్లం గలయఁగాంచి "నాయనలారా! మాకు పరమపదగమనమునకు భగవదాజ్ఞయైనది. మీరందఱును భగవత్పరులై యీ నంబిళ్లైజూపిన మార్గమునందు శ్రీవైష్ణవులై సంచరించి, నిత్యవిభూతికిరండు"అని అజ్ఞాపించెను.

నంబిళ్లై గురుపదారవిందద్వయముపై వ్రాలి అంతిమ సందేశము నానతిమ్మనిగోరెను.

అపుడా దేశికోత్తముండు "వత్సా! మద్గురువర్యుండగు పరాశరభట్టరు అంతిమదశయందు నన్నుద్దేశించి, చెప్పిన హితంబు నీకుపదేశించుచున్నాడ. ఆలకింపుము. గురునియొద్ద తిరువాయిమొళి అర్థానుసంధానపూర్వకంబుగా నూరుపర్యాయము లధికరించినవాడనని గర్వింపకుము. గురునకు శతాభిషేకంబులాచరించిన వాడనని మొగసిపడకుము. ద్రావిడవేదంబునందపారపాండిత్య ప్రకర్షకలవాడననియు, పెద్దల ఆదరాభిమానంబులచూరగొన్నవాడనను దురభిమానంబుపొందకుము. అట్లు నీవు అధికుండనని తలంచినచో చెడిపోవుదువు. ఎంబెరుమానారు దివ్యతిరువడిగళే శరణమ్మని నమ్మియుండుము.

నాపిదప నీవైష్ణవమతసిద్ధాంత సింహాసనంబున నెలకవై పరి పాలించుచు, చివఱకు నీవంటివాని నొకని నీదర్శనమునకు పట్టాభిషిక్తు నొనరించి, నిత్యవిభూతికిరమ్ము. ఇది మదీయా చార్యుండొసంగిన సందేశము, ఆ రహస్యంబు నీకు తెలిపి, జాగ్రత్తసుమా" యని ప్రేమతో నుగ్గడించెను.

అపుడు నంజియ్యారు భగవత్సేనాపతిమిశ్రుల ఉత్సం గంబునందు తిరుముడియుంచి, పెన్నళహియ పెరుమాళ్లు జియ్యారు నంకమునందు శ్రీపాదములుంచి, పెరియభట్టరు శ్రీపాదంబులు స్మరించుచు కేలుదోయి జోడించి తిరునా డలంకరించెను.

నంబిళ్లె మొదలగుశిష్యులు గురునివియోగంబునకు సహింపలేనివారై కడువడి కళవళించి, కొంతవడికి తెలిసిన వారలై నంజియ్యారు శరీరంబునకు బ్రహ్మమేధాది సంస్కా రంబులన్నియు పూర్తిగావించి, దుఃఖోపశమనంబుగావించు కొని, యెవరియిండ్లకువారుపోయి నివసింపసాగిరి.

## నంబిళ్లె వైభవము

నంజియ్యారు తదనంతరము నంబిళ్లె శ్రీవైష్ణవమత సిద్ధాం తమునకు ఏకచ్ఛత్రాధిపత్యమును వహించెను. శిష్యులకు నిరంతరము వేదాంతబోధనలు కావించుచు, శ్రీవైకుంఠమును శ్రీరంగంబునకు దింపెనను ప్రఖ్యాతితో వర్తింపజొచ్చెను.

ఒకనాడు శిష్యులు నంబిళ్ళగారితో "స్వామీ! నంజీయ్యరుగారికి రంగేశ్వరుడు సర్వస్వదానము గావించెనని విని యుంటిమి. సర్వస్వదాన మనగానేమి?"యని ప్రశ్నించిరి.

"సర్వస్వదానమనగా తనకున్నయావదాస్తిని ప్రదర్శించుట. సర్వేశ్వరుడు సర్వస్వదాన మొనర్చుటయనగా, తన దివ్య మంగళవిగ్రహమునున్నది యున్నట్లుగా చూపించుట. గురుండు శిష్యునకు సర్వస్వదానమొనర్చుటనగా, వంచనలేక, తనకు తెలిసిన ఉన్నతవిషయములనెల్ల శిష్యునకు బోధించుట. శిష్యుడు గురునకు సర్వస్వదానమొనర్చుటయన, ఆచార్య శరీరపోషణార్థము, తన ధనమెల్ల గురునకు సమర్పించుట"అని నంబిళ్ళ సర్వస్వదాన విషయమును విశదమొనర్చెను.

ఒకనాడు నంబిళ్ళ శిష్యులతోగూడి కావేరినితరించి తిరువెళ్లరునకుపోయి, అచ్చటవేంచేసియున్న లక్ష్మీదేవిని దర్శించి, శ్రీరంగమునకు మరలివచ్చుచుండెను. ఆ సమయమున కావేరీ నది, మహాప్రవాహభరితమై యుల్లోలకల్లోలితమై ఉత్తుంగ తరంగసంగతమై, రెండుదరుల నొరసికొని ప్రవహించుచుండెను. అచట ఒక మంచిపడవయు లేకుండెను. రంగనాథుని సేవాకాలము నతిక్రమించుచున్నది. అచ్చట ఆవేళ నొకబానల తెప్ప యుండెను. నంబిళ్ళ దానినధిరోహించెను. శిష్యులందరును ఎక్కి దానింగాంచి, కర్ణధారుడు "అయ్యలారా! ఈ తెప్పరి. యిందరిబరువును మోయజాలదు, మీరెల్లరునెక్కితిరి. కొంద

రైనను తెప్పదిగవలసినది. అప్పుడీతెప్ప అవ్వైపునకు చేర గలదు. లేదా మధ్యలో మునిగిపోవును" అని వచించెను.

గురునితోపాటు ప్రయాణింపనుత్సహించిన ఆశిష్యులలో తెప్పదిగుటకెవ్వరును అంగీకరింపరైరి. వారును తెప్పను నదిలోనికిత్రోసెను. అది నదీమధ్యమునకేగి అటునిటు నూగుచుండెను. ఆకర్ణధారు డదిగాంచి, "అయ్యా! మీలో నొక్కరును ఆదరినిదిగరైతిరి. ఇప్పుడీతెప్ప ఆదరిజేరుట సందియంబు"అని పలికి వారిలో నొకస్థూలశరీరిణియగు ముదుసలి యవ్వనుగాంచి," యీయమ యొక్కతె దిగియున్నను సరిపోయెడిది. పడవసుళువుగా నావైపునకు చేరియుండు" ననెను.

అ పడవవాని మాటలాలించి ముదుసలియవ్వ తన మనస్సున "లోకగురుండును, సహృదయపారిజాతమును నగు నంబిళ్ళ జీవించియున్నచో, నావంటిచేతనుల నెందరినో ఉద్ధరింపగలడు. నావంటి యొక కించిజ్ఞురాలులేకున్న లోకమున కేమిలోపము! ఎల్లైనను గురుదేవుని రక్షింతుగాక"యని తలంచి, కావేరీప్రవాహమునదూకెను. ఆమె దూకినదూకునకు తెప్పఅల్లకల్లోలముగా అలలపై తేలియాడనారంభించెను.

ఈ ఆకస్మికసంఘటనకు నంబిళ్ల చలించెను. అయ్యో! ముదుసలి అనవసరముగా ప్రాణపరిత్యాగ మొనర్చికొనినది. చూచుచుండియు రక్షింపలేకపోయితిమే యని పరిపరివిధముల చింతించుచుండెను. ఇంతలో తెప్పయొడ్డునకుచేరినది. లోక గురుండు విచారవదనముతో ముదుసలియవ్వకొఱకు యేటి

కెరటాలవంక కన్నార్పకచూచుచుండిరి. దైవమునుతలంచి "ఓ రంగేశ్వరా! ఏమి నీ లీల? నాకొఱకాముదుసలి యేటి నీటిపాలైనది. ఒక స్త్రీయొక్క ఆత్మహత్య దర్శింపవలసి వచ్చినది. దేవా! నీవు దీనబాంధవుండవు. ఆమెను రక్షింపుము" అని భావించుచు తెప్పనుండిదిగెను.

ఆ ముదుసలిపడినవెంటనే, ఒక ప్రవాహముపైత్తుగా లేచి, గాలివాలున నామె నొడ్డునపడవైచిపోయెను. ఆ జరఠి తడిగుడ్డలుపిండుకొనుచు నంబిళ్ళగారి నుద్దేశించి "ఓ గురూత్తమా! మీరు నాకొఱకై దిగులుపడవలదు. నేను జీవించియే యుంటిని. ఒడ్డునకుచేరితిని" అని గొంతెత్తి యరచెను.

నంబిళ్లయు శిష్యులును, దైవలీల కక్కజముచెందుచు ఆమె యొద్దకుపోయిరి. ఆమె గురుభక్తియే ఆమెను బ్రతికించినదని శిష్యులు భావించిరి.

ఆముదుసలి గురునింగాంచి "అయ్యా! నాకు ఈత చేతగాదు. ఈ ప్రవాహమున నీదుటకు గజయీతగాండ్రే తల్లక్రిందులగుదురు. నేనెట్లు బ్రతికిదరిచేరితినో చెప్పుడు" అని యడిగెను.

ఆ జరఠమాటలకు నంబిళ్ళ "అవ్వా! నీకున్న ఆచార్య భక్తియే నిన్నుబ్రతికించినది. శిష్యుడు జలజమువంటివాడు. గురుండుజలము. సర్వేశ్వరుడు భాస్కరుడు. తామరసము సలిలమునందుండగా సూర్యునకు నెయ్యము. భానూదయముచే పద్మకోరకము వికసించును. ఆదేసరోజము నీటినుండి బయట

పడినచో అదే విరోచనుడు దానిని మూడ్చివైచును. అట్లే ఆచార్యభక్తికలిగినవారిని లక్ష్మీధవుం డెల్లవేళల కాచిరక్షించు చుండును. నీయాచార్య భక్తికిసంతసించితి"నని పలికెను. అందరును సంతసించుచు శ్రీరంగమును జేరిరి.

నంబిళ్ళ ప్రతిదినమును ఉభయవేదాంతముల గూర్చి మనోహరోపన్యాసముల నొసంగుచుండెను. వారి ఉపన్యాస కూటమునకు జనులు తండోపతండములుగా వచ్చుచుండిరి. ఆ జనసంఖ్య దినదినప్రవర్ధమానమగుచుండెను. వారికా కాల క్షేపకూటము చాలదయ్యెను. అప్రక్కనే యొకానొక స్త్రీకి విశాలమైన స్వస్థలముకలదు. నంబిళ్ళ అనుమతిపై కొందఱు శిష్యులుపోయి, కాలక్షేపార్థమాస్థలము నీయవలసినదిగా అర్థించిరి. ఆమె "ఆ చోటును, నేనూరక యీయజాలను. సక్రమమైన మూల్యమునకు విక్రయింతును"అని పలికెను. ఆమాటలు శిష్యులు గురునితో వచించిరి.

ఆయన ఆయమనుపిలిపించి "అమ్మా! నీకు స్థలము చాలకలదు. మాకు ప్రస్తుతకాలక్షేపకూటము ఇరుకైనది. నీస్థలమున కొంతభాగము మాకిచ్చినచో నీకులోపమేమి! ఆ ప్రదేశమంతయు వ్యర్థముగనే యుండుచున్నదిగదా!"అని పలికెను.

అందులకామె "స్వామీ! ఊరకనారుణ్యనిచ్చువార లెందైనగలరా! వినిమయముగావింపుడు"అనెను.

ఆతడు "అవ్వా! మాయొద్ద విద్యాధనము, భక్తి ధనము పుష్కలముగానున్నవికాని నీ భూమిని కొసరదగు ధనము నాయొద్దలేదు" అనెను.

ఆమె నవ్వి "గురూత్తమా! ఆధనమేచాలును. మీ ధనము శాశ్వతమైనది. ఈ ధనముపోవుచుండును. వచ్చుచుండును. ఈ ధనముతో నాకుపనిలేదు. నేనిచ్చట మీ కెంత నేలయిచ్చుచుంటినో, మీరు నాకు అంతనేల నిత్యవిభూతి యందు దయసేయుడు. మీరట్లు కావించినచో నాచోటు మీకిచ్చెద" నని వచించెను.

ఆమె మాటాపేక్షకు గురుండలరి "సాధ్వీ! పరమ పదంబున చోటునీయవలయునన్న శ్రీరంగనాధునకేసాధ్యము. ఇతరులకు సాధ్యముకాదు. నేనిట్లీయ నేర్తును?" అని ప్రశ్నించెను.

ఆమాటలకా జరఠ "గురువరా! ఏల యీమాటలు! శ్రీరంగనాధుండు మీకు వశంవదుడు. మీమాటదాటి పోగలడా! శ్రీరంగేశ్వరునితో చెప్పి మీరేయిప్పింపుడు" అని అభ్యర్థించెను.

నంబిళ్ళ సంతోషించి "అట్లైనచో నిచ్చెద" నని పత్రమును తెప్పించి దానిమీద "ఈ వృద్ధసాధ్వికి, ఫలానా మాసమునందు, ఫలానతిధియందు, ఫలానరోజున నిత్యవిభూతి దయచేయు" మని శ్రీరంగనాధునకు విజ్ఞప్తిచేయుచు, వ్రాసి యిచ్చెను. ఆ ముదుసలి ఆ పత్రిక కన్నులకద్దుకొని సంతో

మమున నింటికిపోయెను. దైవచిత్రముగా నంబిళ్ళ వ్రాసిన సమయమునందే ఆముదుసలి దేహమునువిడిచి నిత్యవిభూతి నలంకరించెను. పత్రికవ్రాసి పరమపదమునకు పంపించుపంతము శ్రీనంబిళ్లకే చెల్లినదని ప్రజలు వేనోళ్ళకొనియాడిరి.

ఒకానొకదినమున నొకవైష్ణవుడు నంబిళ్ళ యొద్దకు వచ్చెను. వారిరువురకును, ఈ క్రిందివిధముగా సంభాషణ జరిగెను.

వైష్ణవుడు :- ఆత్మకు తంజ (రక్షకము) మేమి ?

నంబిళ్ళ :- వత్సా ! ఆత్మలన్నింటికిని రక్షకము దక్షిణ సముద్రతీరము.

వైష్ణవుడు :- (నవ్వి) స్వామీ ! దక్షిణసముద్రతీరమునగల రాలా ? రప్పలా ? యిసుకతిప్పలా ? అచ్చట చరించు మృగములా ? జలజంతువులా ? లేక అచ్చటి వృక్షములా ? ఏవి రక్షకములు.

నంబిళ్ళ :- (నవ్వి) వత్సా ! అవియేవియుకావు. విపులముగా చెప్పెద. సావధానముగా వినుము. వానరసైన్యము లెల్ల కిష్కింధనుండి రాముని వెంట బయలుదేరి దక్షిణ సముద్రతీరమును జేరి అచ్చటవిడిసెను. పగటిభాగమున, వానరులు మహోత్సాహముతో, ఎవనికివాడే "నేనొక్కడనే రావణుని, వాని సేనలను సంహరించి రాగలను. మీరందరేల !" అని ప్రగల్భములాడియాడి

ప్రొద్దుగ్రుంకగనే, ఎక్కడి వారక్కడపడి నిద్రపపక్ర మించెడివారు. ఆసమయమున రామచంద్రుడు, "పాపము, వీరందఱును నన్ను నమ్ముకొనివచ్చిరి. రాత్రివేళ వీరికేమైన ఆపదతటస్థింపగల"దని భావించి, ధనుర్బాణధారియై రేయియంతయు వానరుల కాపాడు చుండెడివాడు. కావున అట్టిరాముని దివ్యకోదండమే మన ఆత్మలకెల్ల తంజము.

ఒకదినమున నంబిళ్ళ గ్రామాంతరమునకుపోయెను. అచ్చట తళిహాచేసికొనుటకు తగినస్థలము గోచరింపదయ్యె. ఏమియుతోచక, ఆ గ్రామసమీపమునగల, యొకతోటలో నొక చెట్టుక్రింద, చుట్టును వస్త్రమాచ్ఛాదించి, వంటచేసి కొనెను. దానిని నంబెరుమాళ్లు కారగింపుగానించి, భోజనము చేసి, కొంతసేపచ్చటనే విశ్రమించెను. సాయంకాల మచ్చట నుండి బయలుదేరిరి.

శిష్యులు నంబిళ్లంగాంచి, "ఆర్యా! ఈ వృక్షరాజము, పూర్వజన్మమునందొక భాగవతోత్తముడై యుండును. మన కీవృక్ష మెంతయోయుపకారముచేసి ఆశ్రయమొసంగినది. కావున తాము దివ్యచిత్తమున నవధరించి, ఈ వృక్షమునకు మోక్షమిప్పింపుడు" అని ప్రార్థించిరి.

నంబిళ్ల హర్షించి, బాహుద్వయముసాచి, ఆ వృక్ష మును కౌగిలించుకొని, "ఓ భూజసార్వభౌమా! మాగురు దేవుల యనుగ్రహముచే ఈ భవబంధములువీడి నిత్యసూరి

నిలయంబగు నిత్యవిభూతికింజనము'' అని ఆశీర్వదించి శ్రీరంగ మునకు వెడలిపోయెను.

ఆమరునాటి సాయంసమయమున కాచెట్టు ఆకుల నన్నింటినూడ్చి మోడువారెను. అయర్ధరాత్రసమయమున ఆ వృక్షమునుండి ఒక దివ్య తేజస్సు లేచి గగనమును వెలిగించుచు దివ్యలోకమునకుంబోయెను. ఆ వృక్షమువిరిగి భూమిపై బడెను. అదిచూచి, తెలిసినవారందఱును నంబిళ్ళ ప్రభావమును భావించి అత్యాశ్చర్యధుర్యులైరి.

కొందఱు బ్రాహ్మణు లొకదినమున నంబిళ్ళ దర్శనార్థమరుదెంచి, నంబిళ్ళతో "ఆచార్యవర్యా! దేవతలందఱును సమానమని శాస్త్రములుఘోషించుచున్నవి. కాని మీకు దేవతలలో కొందరసేవ్యులుగా, కొందఱు సేవ్యులుగా నున్నారు. కొందరదర్శనీయులుగానుండిరికూడ. సకలభూతములను సమముగా చూడుమని సర్వమతములు వచించుచున్నవి. మీ వైష్ణవులుమాత్రము దేవతలందు భేదభావమును ప్రదర్శించుచున్నారు. శాస్త్రముల ధిక్కరించి, మీరిట్లు చేయుటకు కారణంబేమి!" యని అడిగిరి.

నంబిళ్ళవారింజూచి "విప్రముఖ్యులారా! సావధానచిత్తులుగండు. దేవతలలో నెవ్వరితోడను శ్రీవైష్ణవుల మగు మాకు విరోధములేదు. దేవతలందఱు నొక్కటియే. నారాయణుడు మాత్రము పరదైవము. మేమేకార్యము ననుష్ఠించినను, అంగదేవతలుగా దేవతలనందఱిని పూజింతుము. అంగి

మాత్రము నారాయణుడొక్కడే. మేము చెప్పుటకాదు. మీరందఱును ఉదయమున లేచి చేయుచున్న దేమియో ఆలోచించితిరా! ఆలోచించినచో మీరిట్లు ప్రశ్నింపరు. ఆసేతు హిమాచలమందున వైదికులందఱును, "హరిః ఓమ్" అని తొలుతగా ఆరంభించి సంధ్యావందనాదుల నెరవేర్చుచున్నారు. కేశవాదిద్వాదశనామము లుచ్చరించుచున్నారు. మహావిష్ణో రాజ్ఞయా యని పఠించుచున్నారు. కాని మరియొక దేవత పేరైన ఎత్తరు. ఈ ఒక్కటే యననేల! మీరు కావించు షోడశకర్మలు విష్ణుపరములుగా లేవా? వివాహాది మంగళ కార్యములందు వరుని లలాటమున ఊర్ధ్వపుండ్రమునే దిద్దుదురు గాని తిర్యక్పుండ్రమునుంచరు. ఏ దేవతాలయమునందైనను, ఆ దేవతానామముచ్చరించి ఆ దేవతాలయమనియే వచింతురు. శివాలయములయందు మాత్రము 'ఆరామక్షేత్రే' యని పఠింతురు. వారణాసీక్షేత్రమున, విశ్వేశ్వరాలయమునందు, మహాశ్మశానే'యని చెప్పుదురు. విష్ణ్వాలయములందు మాత్రము 'భగవదాలయే, భగవత్సన్నిధౌ'అని చదువుదురు. శ్రాద్ధాదులయందు విష్ణుస్థానమునుంచుదురు. 'శ్రాద్ధసంరక్షకాయ, శంఖచక్రగదాధరాయ'యని చెప్పుచున్నారు. విష్ణుపరత్వము నీరీతిగా నిర్ధరింపవలసివచ్చినచో నెన్నిదినములైనను, ఎన్ని సిద్ధాంతములైనను చాలవు.

వేదేతిహాసపురాణాదులన్నియు విష్ణుపరత్వమునే స్థిరీకరించుచున్నవి. అందువలన మేము నారాయణుని పూజించు

చుంటిమి. ఇతర దేవతలను మీరంగ దేవతలుగా నంగీకరించి పూజించుచున్నారు కదా!" అట్టిచో మీరు, శివకాళికాద్యాలయములకు మీరేలరారాదు!" అని ప్రశ్నింతురేమో! దానికి సమాధానమొసంగెద. వినుడు. శివకాళికాద్యాలయముల యందు తామసమంత్రయుక్తమగు తామసక్రియలు నిర్వర్తింపబడు వేదబాహ్యమైన తంత్రవిధిచే ఆయా దేవతల పరాత్పరత్వము ప్రకటింపబడు. ఆ పూజలుగాని, మంత్రములుగాని తామసప్రధానంబులగుటచే మేమచటికి రాము" అని ఆ విషయములెల్ల అమూలాగ్రముగా విపులతరముగా గంభీరముగా నుపన్యసించెను. ఆవచ్చిన విప్రులు మోములువాల్చుకొని వెడలిపోయిరి.

ఒకనాడు కొంతమంది సాత్వికులు నంబిళ్ళను "స్వామీ! వైష్ణవులు, ఇతరమతస్థుల సభలయందెట్లుందురు?" అని ప్రశ్నించిరి.

నంబిళ్ళవారిం జూచి ఈ విషయమై ఒకగాథ వివరించెద నాలకింపుడు.

పూర్వమొకానొక వైష్ణవుం డొక శైవసత్తముండగు రాజసభకుంబోయెను. ఆ రాజు అచ్చటికివచ్చిన పండితుల నందరిని ద్రవ్యవస్త్ర తాంబూలాదులతో సత్కరించి పంపుచుండెను. కాని ఆ రాజు ఈ వైష్ణవుసివంక కన్నెత్తి కాంచలేదు. ఒక్క రాగిరూకయు నీయడయ్యెను. అపుడా వైష్ణవుండు రాజును సమీపించి 'రాజా! సభాసమాగతులైన పండి

తుల నందరినీ పూజించితివి. నాయందుదాసీనుండవై నన్ను నిరాకరించి నిరాదరించితివి. నాకు వేదపాండిత్యము లేదని తలంచితివా! లేక శాస్త్రప్రసంగము చేయజాలనని యెంచితివా! నన్నేల బహుమానింపవు?" అని ప్రశ్నించెను.

అందులకారాజు వైష్ణవోత్తమునిగాంచి, "సాత్త్వికోత్తమా! నీకు వేదములు రావని నేను తలంపనైతి. నీవు శాస్త్రప్రసంగములు చేయలేని వాడవును కావు. నిన్ను పూజింపకుండుట కివ్వియెవ్వియు కారణములు కావు. నీవు విష్ణుభక్తుండవు. కావుననే నిన్ను పూజింపనైతిని"అని సమాధానమొసంగెను.

ఆ రాజవాక్యములువిని విప్రోత్తముడు తన యుత్తరీయమును పైకెగురవైచుచు, ఆనందనృత్యముగావించుచు 'ఆహా! నాభాగ్యము. రాజా! ఇంతమందిలో నన్నొక్కనినే వైష్ణవునిగా నెన్నినాడవు. ఆనందము. మహానందము.' అని కేకలువైచుచు, తాండవముతోనే సభనుండి నిష్క్రమించెను." అని ఈ కథను చెప్పి నంబిళ్ళ యిట్లుపలికెను.

వైష్ణవులు పరవాదుల సభలకుగానీ, పరమతస్థులు గావించు సన్మానములకుగాని పోరాదు. పోయినచో అమర్యాదాభాజనులగుదురేగాని గౌరవభాక్కులు కాజాలరు. ఐనను నారాయణాశ్రితులు ఇందరి యొద్దకుబోయి ఆశ్రయించి యాచింపనేల!"

శిష్యులు గురునితో "స్వామీ! సర్వేశ్వరుడు మమ్ము రక్షించుననందురా! మేము నిత్యమును గావించు తపోజపాదు లెంత? భగవద్విషయమే పాటి? మేము చేయు నీప్రపత్తి భగవద్రక్షణకు నోచుకొనజాలియున్నదా?" యని సందేహమును వెలిబుచ్చిరి.

నంబిళ్ళ వినెను. నవ్వెను. "వత్సలారా! మీకిట్టి సందియమేలకలిగెనో తెలియకున్నది 'సంశయాత్మా వినశ్యతి' యను భగవద్వాక్యము నెఱుంగరా? దీనికొక కథ చెప్పెద. శ్రద్ధగా ఆకర్ణింపుడు.

పూర్వమొక చమత్కారియగు విప్రయాచకుడు యాచనకై యొక పంటకళ్ళములోనికేగెను. ఆ కళ్ళమొక బట్టతల కాపునకు సంబంధించినది. ఆ ఖర్వాటుడు బ్రాహ్మణుని వంక కన్నెత్తియైన చూడక, తనపని తాను చూచుకొనుచుండెను. అపుడా నిపుణుడైన విప్రుడాతనితో "అయ్యా! కాపు కులావతంసా! ఇంద్రనీలరత్నము లగఁదెగడు చున్న ముంగురులు ముఖపద్మమునందు మిళిందములవలె ముసురుచుండ, మంచి ముత్తియముల చాలువంటి స్వేదబిందువులు, పద్మపత్ర తుషారకణములవలె భాసింప, మీరును శ్రమించుచుంటిరేల? భృత్యులు చేసినది చాలదా?" యనెను.

ఆకాపు బ్రాహ్మణుని స్తోత్రపాఠమునకు చొక్కి తూమెడు ధాన్యమునొలిచెను. ఆ ధాన్యమును గోతము నందు మూటగట్టుకొని ఆ విప్రుడు పోవుచుండెను. ఆ ప్రక్క

చేనిలో నింకొక ఈర్ష్యాళువైన కాపు పనిచేసికొనుచుండెను. ఈ జరిగినదంతయు నాతడు గమనించుచునేయుండెను. అతడు వచ్చుచున్న బాడబునింగాంచి,

'బాపనయ్యా! ఈ ధాన్యమును నీకెవరిచ్చిరి?' అని ప్రశ్నించెను. అందులకు సమాధానముగా నాభూసురుడు "అయ్యా! అదిగో ఆ చేనిలోని బట్టతలకాపు దయచేసె"నని తెల్పెను.

ఆ మాటలువిని ఆ ఈర్ష్యాపూరితుడు నవ్వుచు బట్టతల కాపుంజూచి "ఏమయ్యా! వింటివా! ఇంతసేపు నిన్ను-నీముంగురులను వర్ణించిన ఈ బాపడు నిన్ను బట్టతలకాపు-అనుచున్నాడు''అని పిలిచిచెప్పెను.

ఆమాటలకు ఖర్వాటు డాగ్రహావేశపరవశుండయ్యెను. అజ్యసిక్తంబగు నగ్నివలె విజృంభించి, "ఏమేమీ! ఈ విప్రు డింత తూలనాడెనా? కానిమ్ము. తత్ఫలితంబిప్పుడే చవిచూడ గలడు"అని పలుకుచు నొకముల్లుగఱ్ఱ చేబూని 'ఓయీ! దాసరిబాపడా! నిలు. ఏమంటివి ధాన్యమిచ్చిన నెఱదాత నగు నన్ను బట్టతలవాడందువా? పాఱకు. పారకు. ఇదిగో ఇప్పుడు నీకీ బడితపూజ తప్పదు'అని కారులరచుచు భూమి ద్రెక్కదల గబగబపరువెత్తుకొని వచ్చుచుండెను.

కాలరుద్రునివలె వచ్చుచున్న కాపునుచూచి బ్రాహ్మణుని పైప్రాణములు పైనే లేచిపోయెను. తనకు శృంగభంగము తప్పదనితలంచెను. దైవముపై భారమువైచి, వచ్చుచున్న

కాపుంజూచి "ఓహో! ధనికశేఖరా! ఏలయిట్లు పరువెత్తు కొని వచ్చుచున్నారు! కోదమకు మ్మోద పిండుకొక్కగమిని ధిక్కరించుచు, వాలపాశంబులబోని శిరోజంబులు జాలువారు యమునానదీమతల్లినానేల జీరాడుచుండ మహాశ్రమతో విచ్చేయుచున్నారు. కారణంబేమియో గదా!" అని పలికెను.

చంద్రోదయావసర సముద్రంబు భాతి నాతని వాక్యంబులకు కాపుమానస ముప్పొంగెను. ఆ బ్రాహ్మణునితో "విప్రోత్తమా! దయచేయుడు." అని పంటకళ్ళములోనికిం దీసికొని పోయి మరికొంతధాన్యము నొసంగి జీతగానితో నావిప్రుని వెంటబంపెను. ఆ విప్రుండు మహాసంతోషముతో గృహంబు జేరెను.

ఈ కథచెప్పి నంబిళ్ళ శిష్యులంబారజూచి "నాయనలారా! యీకథ నెందులకు చెప్పితినో అర్థమైనదా! అని ప్రశ్నించెను. వారందఱును అర్థముకాలేదనునట్లు దేబెరమొగములతో ఒకరిమోము నింకొకరు చూచుకొనదొడంగిరి.

అపుడు నంబిళ్ళ "నిర్దయుడు-మూఢుడునైన ఖర్వాటుడు విప్రునికపట స్తోత్రంబునకు మెచ్చి అంతధాన్యం బొసంగెగదా! తాను బట్టతలవాడనని యాతడెఱుంగడా! ఎఱుంగును మరియేల పొంగిపోయెనన్నచో అది స్తోత్రపాఠముయొక్క మహిమ. దయాసముద్రుండును, లక్ష్మీపతియు సర్వేశ్వరుండు

నగు నారాయణుండు తన నిక్కంపుటాశ్రితులను రక్షించునా ! రక్షింపడా ! యను శంకయిూకేల అంకురించె !" అనిపలికెను.

శిష్యులందరును ఆ వాక్యములకు సంతసించిరి. ప్రతి దినమును నంబిళ్ళ శిష్యులతోగూడి కావేరీనదికి పోయి వచ్చు చుండును. ఆ మార్గమధ్యంబున నొకగృహంబుగలదు. అందు మధ్యమవీథి కుమారభట్టరు నామధేయుండు, పరాశరభట్టరు వారి కుమారుడు నివసించుచుండెను. అతనికి నంబిళ్ళ యందసూయ. అతడు "నేను కూరత్తాళ్వాను పౌత్రుండ. పరాశరభట్టార్య కొమరుండ. అట్టి నాకులేని యీ వైభవము, శిష్యవర్గము, ఈ నియోగిబ్రాహ్మణుని కేలగల్గె" అని విచారించెను. దుష్టబుద్ధితో నంబిళ్ళయందు ద్వేషమును పెంచుకొని యుండెను.

అత దుర్వ్యగ్రగ్రస్తుండని ఎఱింగియు, ప్రతినిత్యమును నంబిళ్ళ మధ్యమవీథి కుమారభట్టరు నింటికేగుచుండును. ఆసమయమున భట్టరు భార్యాద్వితీయుడై డోలికయందూగు చుండును. అట్టియెడ నంబిళ్ళ 'దాసోహ'మ్మని సాగిలి మ్రొక్కును. భట్టరు తిరిగి దాసోహమ్మనడు. వైష్ణవుని గాంచగనే ఎంత పెద్ద వైష్ణవుడైనను దాసోహమ్మనవలె నమస్కరింపడు. ఆదరాభిమానములు ప్రదర్శింపడు. కాని తృణీకరించుచు, "ఓయీ ! పిళ్ళా ! బాగుంటివా ! నీ శిష్యులేమనుచున్నారు" అని పలుకుచుండెను. అతడెట్లు వర్తించినను, పరమాచార్య పుత్రుండను గౌరవముతో నంబిళ్ళ

"అయ్యా! అయ్యా!" అని నమస్కరించి వెనుదిరిగిపోవు చుండెను.

ప్రతిదినము నీవిధముగా జరుగుచున్న తీరుతెన్నులు గమనించి, ఒకనాడు శిష్యులు నంబిళ్లతో "అయ్యా! ఈ దుర్గర్వపూరితుండగు నీతనికి మీరు ప్రతిదినము నమస్కరింప నేల? ఇట్టి దుష్టునకు నమస్కరింపవచ్చునా? మీరు నమస్కరించుచుండ నాతడు ప్రతినమస్కార మాచరించుటగాని, గౌరవించుటగాని లేదు. పైగా భార్యాసహితుడై యుయ్యెలపై తీవినోలకించుచు కూరుచుండును. ఇకముందు మీరు వానికి నమస్కరించితిరేని సహింపము" అని తెలిపిరి.

శిష్యుల వాక్యములకు మారుమాటాడక నంబిళ్ళు గృహమునకేగెను. ఆసాయంకాలమే ఉభయపార్శ్వములంబుల శ్రీ భూదేవులు విరాజిల్లుచుండ రంగేశ్వరుండు తిరువీధి వేంచేయుచుండెను. కన్నులపండువు గావించుచున్న రంగధాముని ప్రజలందఱును సాష్టాంగదండవత్ప్రణామంబు లాచరించుచుండిరి.

ఆ సమయమున నంబిళ్ల వీధిలోనికి వచ్చెను. రంగేశునిం గాంచెను. చేతులు రెండును జోడించుటకై పైకెత్తి నమస్కరింపక క్రిందికిదించెను. శిష్యులదిగాంచి, ఆశ్చర్యచకితులై "స్వామీ! శ్రీరంగభర్త కనులపండువుగా వేంచేసియున్నారు. మీరు నమస్కరించుటకు సంశయించినట్లుతోచినది. ఇదేమి వింత?" అని ప్రశ్నించిరి.

"నాయనలారా! ప్రొద్దున ఒక్క భార్యతో డోలా కేళిం దేలుచున్న వానికి నమస్కరించుచుండగా, మీరు నన్ను వారించితిరి. అట్లు నేను నమస్కరించినచో, మీరు సహింప జాలమని తెల్లమొనర్చితిరి. ఇప్పుడీ రంగనేత దేవీద్వయ సంగతుడై విమానారూఢుడై వచ్చుచున్నాడు. వీనికి నేను మరల నమస్కరించినచో మీరు బాధపడుదురేమో యని తలంచి, నమస్కరింపకమానితి''యని నంబిళ్ళ పలికెను.

శిష్యులు గురుని విశాలభావముగాంచి అచ్చెరువందిరి. "ఈ రంగభూమియందు వసించు వైష్ణవులెల్లరును, శ్రీరంగేశ్వర ప్రతిరూపులేయని గురుదేవుని భావము. అహా! ఎంతటి యున్నతదృష్టి"అని గురుదేవుని అర్చించి క్షమింపవేడుకొనిరి.

ఒకనాడు మధ్యమవీథి భట్టారకుడు చోళరాజసభకు చనుచుండెను. మార్గమధ్యమున నంబిళ్ళ శిష్యుడగు పింబళహారాన్ పెరుమాళ్లుజియ్యరు నిలువబడియుండెను. భట్టరాతనని అర్థించి తనతోపాటు రాజసభకు తీసికొనిపోయెను.

వారిరువురును రాజసభకుపోగా, రాజు వారిరువురను గౌరవించి సుఖాసనాసీనులగావించెను. ఆరాజు బహుశ్రుతుండు కావున మధ్యమవీథి భట్టారకునితో "దేశికోత్తమా! రామచంద్రస్వామి "ఆత్మానం మానుషం మన్యే"అని తలంచుచున్నాడుకదా! అట్టివాడు "మయాజ్ఞప్తః గచ్ఛలోకాననుత్తమాన్"అని పలికి జటాయువునకు మోక్షమెట్లొసంగె!"

అని యడిగి. శీఘ్రముగా నిర్వర్తింపదగు రాజకీయ వ్యవహారమును గూర్చి మంత్రులతో చర్చింపదొడగెను.

భట్టారకుడు తలబ్రద్దలుకొట్టుకొనెను. ఎంతచింతించినను సరియగు సమాధానము దొరికినది కాదు. పరాశర భట్టార్యునాత్మజుండనయ్యు ఈ రాజప్రశ్నకు తగునుత్తరంబీయనిచో హాస్యాస్పదుండనగుదునని యెంచి, ప్రక్క నుపవిష్టుడైయున్న పింబళిహారాన్ పెరుమాళ్ళజియ్యరుంగాంచి "స్వామీ! ప్రభుండడిగిన ప్రశ్న వింటివికదా! దీనికి మీగురువుండు నంబిళ్ళ యేమిచెప్పును?" అని అడిగెను. అప్పుడాతడు నంబిళ్ళ చెప్పిన విషయమంతయు చెప్పెను. భట్టరు విని గండము గడచినదని నెమ్మదించెను.

రాజు రాజకీయచర్చముగించి, నేనడిగిన ప్రశ్నకింకను సమాధానము చెప్పరైతిరి' అని భట్టరువంక జూచెను.

అప్పుడు భట్టరు, "రాజా రావణవధ పూర్తియగు పర్యంతమును తనను మానవునిగనే భావించెను. జటాయువునకు మాత్రము "సత్యేనలోకాన్ జయతి, దీనాన్ దానేన రాఘవః" అని రామాయణమునందు చెప్పబడియున్నది. అనగా "నా సత్యముచే జయింపబడిన దివ్యలోకములకు పొమ్ము" అని ఆదేశించినాడు. తన సత్యముచే జయింపబడినది మోక్షలోకము. కావున అట్టి మోక్షమునకు జటాయువేగెను. అంతియకాని, 'నేను పరబ్రహ్మమును. నీవు మోక్షమునకు పొమ్ము' అని మాత్రము చెప్పలేదు." అని వివరించెను.

ఆ సమాధానమునకు, నాచోళభూమీపతి సంతసించి, పరాశరభట్టరు నాత్మజుండవనిపించితివి. నీవుచెప్పిన దెంతయు మాకు హర్షదాయకమైనది." అని అమూల్యాంబరాభరణాదుల నొసంగి పూజించి పంపించెను.

మధ్యమవీధి భట్టారకుడు వానినిగ్రహించి గృహంబున కేగక, యొకొయొకి నంబిళ్ల యొద్దకువచ్చి, పాదములమీదపడి నమస్కరించి, లేచి, ఆ ధనమునంతయు నంబిళ్లముందుంచి "స్వామీ! ఇదిగో! ఈ ధనమునంతయు గ్రహింపుడు. ఇది మీవిద్యామహోదధియందు చిందిన ఒక బిందులేశముచే సంప్రాప్తించినది." అని జరిగినదంతయు వివరించి, ధనమును సమర్పించెను. నంబిళ్ల భట్టారకునకు ప్రతినమస్కారంబాచరించి, కౌగిలించుకొని, తద్ధనమాతనికే యొసంగి గారవమున వీడ్కొలిపెను. అప్పటినుండి మధ్యమవీధి భట్టరు నంబిళ్ళయందు భక్తిశ్రద్ధలు కలిగియుండెను.

ఇట్లుండ కొంతకాలమునకు నంబిళ్ళ దేహమునందు కొంత అనారోగ్యము పొడచూపెను. అపుడొక వైష్ణవుడు నంబిళ్ళ వద్దకువచ్చి "స్వామీ! మీఅనారోగ్యము పోగొట్టుమని రంగనాథు నర్థింపరాదా!" అనెను. అందులకు నంబిళ్ల 'నేనేమి మల్లయుద్ధము చేయబోవుదునా! దేవళమున కేగి స్వామిని దర్శించి వచ్చుచుంటి. ఇంకపై నారోగ్యమునాకేల! యని సమాధాన మొసంగెను.

కొందఱు శిష్యులు గురునివ్యాధినిచూచి సహింపజాలక గురునితో "అయ్యా! మీవ్యాధి భయంకరముగానున్నది. దీనిని పోగొట్టుటకై రంగనాథునకు ప్రపత్తిచేసెదము."అని తెలిపిరి.

గురుండందులకు మెచ్చక వారితో "అయ్యలారా! మీరుచేసెడిప్రపత్తి సర్వేశ్వరునకు రెండుదుర్గుణములు కలిగించును. నాబాధ సర్వేశ్వరునకు తెలియదా? మీరు ప్రపత్తి చేసినచో సర్వేశ్వరుడు నాబాధ నెఱుంగనివాడగును. అందుచే సర్వేశ్వరున కజ్ఞతకలుగును. తెలిసియు భక్తుని రక్షింపలేదనిన చో నాతఁడు దయావిహీనుండని నిర్ణయింపవలసివచ్చును. అదియుగాక అట్లుచేయుట జీవునకు స్వరూపహాని. భార్య భర్తకు పరిచర్యలొనరించి, కూలియడిగినచో నామె పతివ్రతయగునా? వెలయాలనదగును. అట్లే ప్రపత్తికావించి కూలి యడుగరాదు. మీరు నాయారోగ్యార్థమై ప్రపత్తిచేయుట మహాదోషము"అని సెలవిచ్చెను.

ఆ మాటలాలించి శిష్యులు. "స్వామీ! మీరు సర్వజ్ఞులరు. మేము మహాజ్ఞులము. ఈ విషయము మాబుద్ధి కెట్లుగోచరించును"అని మిన్నకుండిరి.

క్రమముగా వ్యాధి తనంతటతాను క్షీణింపదొడగెను. కొన్నినాళ్లకు పూర్తిగామాయమయ్యెను. ఆరోగ్యము చేకూరెను.

నంబిళ్ళ మరలఁ గాలక్షేపము చేయుచుండెను. సహస్రగీతి (తిరువాయిమొళి) కి నేకార్థములు వక్కాణించుచును, వాక్పతింబోలె విరాజిల్లుచుండె. నంబిళ్ళగోష్ఠి గొప్పదా? రంగనాథునిగోష్ఠి గొప్పదా? యను విచికిత్స ప్రారంభమయ్యెను. నంబిళ్ళ గోష్ఠినివిడచువారి జీవులు నిత్యవిభూతికి పోవుటకు సంశయించుచుండిరి.

పరాశరభట్టరు పుత్రుండగు మధ్యవీధి భట్టను నంబిళ్ళ శ్రీపదద్వయినాశ్రయించి, గురునిచ్ఛాయారూపంబున ఒకక్షణమైనను విడనాడక వెన్నంటి సేవించుచుండెను. ప్రతిదినమును నంబిళ్ళ పగలు ఉపదేశించునట్టి తిరువాయిమొళి వ్యాఖ్యానంబునువిని రాత్రివేళల దానినెల్ల లిఖింపనారంభించెను. కొంతకాలమునకు తద్గ్రంథమెల్ల వ్రాసి, ఆకులన్నింటిని పెద్ద మోపులుగాకట్టి తీసికొనివచ్చి గురునకు చూపించెను.

నంబిళ్ళ దానినెల్ల ఆమూలాగ్రముగా పరికించి, భట్టరునుఁగాంచి "వత్సా! నీవు వ్రాసిన గ్రంథంబిది విస్తారమై మహాభారతంబుబోలె సపాదలక్షగ్రంథమైనది. దీనిని పఠింపను టకుగాని, ఆకర్ణింపుటకుగాని ఎవ్వరును సాహసింపరు. మా యాజ్ఞ లేక యిట్లేల వ్రాసితివి? అవి పత్రముల నన్నింటిని సూత్రంబులనుండి విడదీసి వానినన్నింటినిపఱచి దానిమీద మంచినున్నపురీను చల్లించె. కాలానుగుణముగా వానిపై పుట్టలుబుట్టె. పత్రములన్నియు చెదకిపోయెను. దానినంతయు తీసి కావేరీనదియందు వేయించెను. అందు కొన్ని పత్రములు

నదీప్రవాహమున కెదురుగ వచ్చుచుండెను. వానిని గొనివచ్చి వైష్ణవులు నంబిళ్ల కొసంగిరి. వాని నాతడు పరిశీలించి గోకంబు నందు నిలిపె.

నంబిళ్ల శిష్యులలో నొకరు పెరియవాచ్చాంబిళ్లను తిరువాయిమొళి కొక వ్యాఖ్యానమును రచింపుమనికోరెను. ఆతడు శ్రీమద్రామాయణమువలె ఇరువదినాలాయిరంపడి రచించి గురునకొసంగెను. గురుండు దానిపఠించి సంతసించె.

నంబిళ్ల కొక శిష్యుండుగలడు. అతని పేరు శ్రీకృష్ణపాద దేశికుడు. ఇది ఆయన సంస్కృతనామము. ఆయనకే వడుక్కు తిరువీథిప్పిళ్ల యని ద్రావిడనామము. గురుండు కాలక్షేపకాలంబున, దివాభాగంబున తిరువాయిమొళిలోని యొక్కొక్క పాశురమునకు శాఖోపశాఖలుగా నర్థంబు వక్కాణించుచుండెను. అదియంతయు విని ఆ శిష్యుడు దాని సారంబంతయు రాత్రులయందు వ్రాయుచుండెను. అది శ్రుతప్రకాశికవలెనే ముప్పదియాఱు సహస్రపరిమిత గ్రంథంబయ్యె. దాని నాతండుకొనిపోయి గురునకు చూపించె. దాని నాతడు మూలాగ్రము కటాక్షించి, ఈ గ్రంథం బతివిస్తృతంబుగాక, అతిస్వల్పంబుగాక యున్నదని భావించి, దానినే శిష్యులకు చెప్పించెను. దానినే యొకరికొకరు చెప్పుకొనుచుండిరి.

ఇట్లుండ ఒకనాడు వైష్ణవుడొక్కరుండేతెంచి, నంబిళ్ళ పాదాభివందనం బాచరించి "స్వామీ! యీ దాసునకు

భగవద్విషయంబెల్ల నానతిందు" అని ప్రార్థించెను. నంబిళ్ళ యొక శిష్యునకాపని నొప్పగించెను.

ఆ శిష్యుం డావైష్ణవుని తనగృహంబునకు తీసికొని పోయెను. భగవద్విషయంబుపదేశింప ప్రారంభించెను. ఆవైష్ణవుండు చిత్రాస్తరణం బొకదానిని పరచుకొని దానిపై నధివసించెను. నంబిళ్ళ ఛాత్రుండదిగాంచి "ఓయీ! చెప్పువాడు ఆసనముపై కూర్చుండవలె. చదువుకొనువాడు క్రిందనుండవలె. ఇది గురుశిష్య సంప్రదాయము. నీవు తద్విరుద్ధముగా వర్తించుచున్నాడవు. ఇపుడు నేను నీకుచెప్పను. గురుదేవుని సన్నిధికింబోయి ఈ విషయమును విన్నవించుదము రమ్ము" అని వారిరువురును నంబిళ్ళ సన్నిధికేగి విన్నించిరి.

నంబిళ్ళ శిష్యునితో "వత్సా! అతఁడాచార్యపురుషుడు. అతడట్లే కూర్చుండును. ఐనను చెప్పుము." అని తెల్పెను.

చిత్తమని పలికి అతనిని తీసికొనిపోయి భగవద్విషయమును చెప్పుచుండెను. తిరువాయిమొళి వరుసగా వచ్చుచుండెను.

తిరువాయిమొళియందు 'పైలుంశుడరొళి'యను పాశురంబొండుగలదు. దానియందు భాగవతప్రభావంబు కొనియాడబడుచున్నది. నంబిళ్ళ శిష్యుండా వైష్ణవునకీ పాశురమును వివరించుచుండెను. వెంటనే వినుచున్న వైష్ణవుడు తాగూరుచున్న చిత్రాసనంబును తీసి దూరముగపారవైచి, "స్వామీ!

తెలియక నేను భాగవతాపచారంబు గావించితి. జ్ఞానోదయుం బైనని. ఇప్పుడు సెలవిండు. అద్యంతము వినిమెద"నని పలికెను.

అందులకా సూరిసత్తముండు "అయ్యా! అస్మద్గురుండు నిన్నాసనాసీను గావించి భగవద్విషయం బానతిమ్మనిమె. నీవిపుడు తద్వ్యతిరిక్తముగా ప్రవర్తించుచుంటివి. కావున మాగురునకు విన్నపించి యిట్లే ఆనతిమ్మన, వారి ఆజ్ఞగ్రహించి చెప్పద. రమ్ము"అని గురుదేవుని సన్నిధికిం గొనివచ్చెను.

విషయమంతయు గురునకు విన్నవించెను. ఆ జగద్గురుండు చిరుహాసంబుగావించి "తిరువాయిమొళి యందు "పైలుంశుడరొళి" పాశురము ప్రస్తావింపబడినదా!"యని ప్రశ్నించె. అయ్యా! ఆపాశురంబునే విశదీకరించుచుంటి"నని శిష్యుండు తెలిపె గురుండు నవ్వి "ఇప్పుడీతని యాభిజాత్యం బడంగినది. చెప్పినదంతయు నిక చక్కగా మనస్సున కెక్క గలదు. ఆనతిమ్ము"అని చెప్పిపంపించెను. గురుని వాక్యాను సారముగా అతడు తిరువాయిమొళి యంతయు నుపదేశించెను.

నంబిళ్ల యొకనాడు ఆత్మశిష్యవర్గంబుతో శ్రీకృష్ణపాద దేశికుని గృహంబునకరిగెను. శ్రీకృష్ణపాద దేశికులు తన యింటికే తెంచిన గురున కర్ఘ్యపాద్యంబు లొసంగిపూజించి, బ్రహ్మాసన మొకదానిని వైచెను. నంబిళ్ల దానిపై నాసీను డయ్యెను. శిష్యులందఱును పరివేష్టించియుండిరి. ఆ గృహ మందున్న వారెల్లవచ్చి గురునకు పాదాభివందనము గావించు

చుండిరి. ఒక వనితస్నాతయై ఆర్ద్రవస్త్రముతో వచ్చి, ఆ జగ
దేక గురునకు ముమ్మారు ప్రదక్షిణమాచరించి, పాదములకు
నమస్కరించెను. గురుండచ్చటనున్న వారింగాంచి, "యీవనిత
యెవ్వరు, తడిబట్టలతో మాకునమస్కరించుచున్న దెందులకు!"
అని ప్రశ్నించెను. అందులకచ్చటనున్న యొకవనిత "అయ్యా!
ఈమె మీశిష్యుండగు శ్రీకృష్ణపాద దేశికుని భార్య. ఈ దిన
మున నీమె ఋతుస్నానము కావించినది. తత్కారణముచేత
తడిబట్టలతో నమస్కరించుచున్నది" అని పలికెను.

గురుండా పిన్నదానిని తన సమీపమునకు రమ్మనిపిలిచి,
తన శ్రీహస్తముతో నామెపొట్ట యొక్కసారినిమిరి "అమ్మా!
నీకు లోకవిఖ్యాతినందగల కుమారుండుదయించుగాక" యని
దీవించి, సశిష్యుండై గృహమునకు మరలిపోయెను.

శ్రీకృష్ణపాద దేశికులు ఆరేయి తన ధర్మపత్నితో
నిష్టసుఖంబుల దేలియాడెను. ఆమె గర్భవతియై నవమాస
ములు గడచినమీద దశమమాసమునందు, ఒక శుభముహూ
ర్తమున దివ్యలక్షణ లక్షితుండగు నొక కుమారునిగాంచెను.
తండ్రి సంతసించెను. జాతాశౌచము వెళ్ళినపిదప, తనగురుని
నామంబుంపదలచి, నంబిళ్లకు లోకాచార్యుండను నామంబున్న
హేతువున, తనకొమరునకు ఆపేరే పెట్టెను.

రెండవదినమున గురుసన్నిధికేగెను. గురుండు శిష్యుని
గాంచి "వత్సా! నిన్న కాలక్షేపకూటమునకు రావైతివి. ఏమి
చేయుచుంటివి?" అని ప్రశ్నించెను.

అందులకాతడు "గురుస్వామీ! తమ అమోఘ దయాశీస్సుచే నాకు పుత్రోదయమైనది. అతనికి నిన్న నామకరణంబు గావించితి. కావున నిన్నరానైతి"నని తెలిపెను.

గురుండు నవ్వి "నీకు పుత్రుండు జన్మించెనా? చెప్పవైతివి. చాలసంతోషము. ఇంతకు నేమి పేరుపెట్టితివి!"యని యడిగెను.

శిష్యుడంగులకు చేతులుమోడ్చి "దేవరా! తమకు లోకాచార్యనామంబు జగత్ప్రసిద్ధంబుగదా! అదే నామముంచితి"ననియె.

గురుం డాగ్రహించెను. "ఓయీ! నీకు కలిగిన తనూజునకు రంగనాథుని పేరుపెట్టవలయునని నేనుతలంచియుంటిని. అట్టి నాతలంపెల్ల వ్యర్థముకావించితివి. నీకీ స్వాతంత్ర్యమెప్పుడువచ్చినది!"అని గద్దించెను.

శిష్యుండు పరితాపపూరితుండయ్యె. "గురునిభావమునకు వ్యతిరేకినైతి. స్వరూపహాని సంభవించెగదా!" యని మొగమువాంచి చేతులునలుపుకొనుచు నిలువబడియుండెను.

శిష్యులలో పెద్దలైనవారు కొందరు, శ్రీకృష్ణపాద దేశికుల అవస్థనుగమనించి. "అయ్యా! ఇతడు చాలపొరబడినాడు. దేవరవారి అభిప్రాయమెఱింగినవాడుకాడు. మీనామము కుమారునకుంచుట శ్రేయోదాయకమని భావించి యిట్లు గావించినాడు. కాని స్వరూపహాని కలుగునని తలంపలేదు.

స్వామివారి పేరుపెట్టిరే తీరవలయునను కుతూహలము మీకున్నచో ఈతనికి మరియొక ఆత్మజుండు కలుగునట్లు ఆశీర్వదింపుడు." అని పల్కి చెప్పిరి.

గురుండు శాంతివహించెను. "శిష్యా! నీకు మరియొక తనయుండు కలుగుగాక" యని దీవించెను. శ్రీకృష్ణపాదదేశికులు, మంచి తిథివార నక్షత్రముల నెన్నుకొని, ఆ దినము రాత్రి భార్యతో రమించెను. ఆమె గర్భవతియై దశమమాసము నందొక కుమారుని కనియెను. ఆ విషయమును శ్రీకృష్ణపాద దేశికులు గురునకు నివేదించెను. పురిటిదినంబులు గడచిన వెనుక నంబిళ్ళ శ్రీకృష్ణపాదదేశికుని గృహమునకేగి, ఆశిశువునకు 'అణహియుమణవాళ పెరుమాళ్ళునయనార్' అను నామ కరణంబొనర్చెను. ఆ పిల్లలిద్దఱును, అశ్వినీదేవతలవలె, శ్రీరామలక్ష్మణులవలె దినదినప్రవర్ధమానులగుచుండిరి.

ఒకదినమున కొందఱు వైష్ణవులు నంబిళ్ళంజూచి "స్వామీ! నాథ యామున, దేశిక, పరాశరభట్టరాదులగు మహాదేశిక సార్వభౌములందఱును నిత్యపదవిని పొందిరికదా! వారుపొందిన ఆ నిత్యపదవి పొందవలయునని మేము తలంచుచుంటిమి. బదసంసారులమగు మాకెట్లు నిత్యపదవిసిద్ధించు? అట్లు సిద్ధింపనిచో మాప్రయత్నములన్నియు వ్యర్థములేకదా! మేము భగవదారాధన చేయువలెంవలకు? ఈ మా సందేహము నివృత్తిచేయుటకు మీకంటెసమర్థులీలోకమునలేరు. ఈ విషయమె సెలవిండు" అని కోరిరి.

అపుడు నంబిళ్ళ "నాయనలారా! యామునమునులు సాయించిన శ్రీసూక్తి నాలకింపుడు.

శ్లో॥ యద్బ్రహ్మ శివమావధి యథామతి వాప్యశక్తః
స్తౌమ్యేవ మేవఖలు తేపి సదాస్తువంతః
వేదాశ్చతుర్ముఖ ముఖాశ్చ మహార్ణవాంతః
కోమజ్జతో రణుకులాచల యోర్విశేషః"

వేదములును, బ్రహ్మరుద్రేంద్రాది దేవతలును సర్వేశ్వరుండగు నారాయణుని వారివారి శక్త్యనుసారము స్తోత్రించుచుండిరి. మేమును మాశక్తికొలది నుతించుచున్నాము. ఆవిషయమున మేము బ్రహ్మాదిదేవతలతో సమానమే. సర్వేశ్వరుని మహిమను వారుసమస్తమును కొనియాడిరా! లేదు. వారికి తోచినంతవఱకు నుతించిరి అట్లే మేము మాకు తోచినంతవఱకు స్తుతించుచున్నాము. భూమిపై నుండగా పర్వతమునకును-చిల్లపెంకునకును పరిమాణవిషయమున గొప్పభేదము కలదు. అవిరెండును సముద్రమునందును మునిగినవాని తేడా గోచరించునా! లేదు. రెండును సమమే, ఇంతకు పెండితార్థమేమన మానవుల ఉచ్ఛనీచతలనుబట్టి సర్వేశ్వరుడు సంతసింపడు. రక్షింపడు. వారివారి భక్తినిబట్టియే రక్షించుచుండును, దీనికి నీకొక యుపమానమును వ్రాయుచున్నాను. నాలకింపుడు.

ఒకానొక ధనికుడు తనకూతునకు వివాహము చేసెను. మహాడంబరముగా కొన్నివేలరూప్యములు వెచ్చించెను. ఒకదు

నిరుపేద, అతడు తనఆత్మజకు నిరాడంబరముగా కొలదిడబ్బుతో పెండ్లిగావించెను. ఈరెండికిని భేదమేమి? విందులు-వేడుకలలో భేదమేకాని, కల్యాణ విషయమున భేదములేదు. రెండును పెండ్లిండ్లే. సౌఖ్యములనుభవించుటయందుకాని సంతానప్రాప్తియందుగాని, వారిలో తేడాలేదు. ఏపెండ్లికా పెండ్లికొడుకే ఉత్తముడు'అను సామెతను వినియుండలేదా!"యని వివరించెను. వారు సంతోషించి గురుని నిట్లుప్రశ్నించిరి.

"స్వామీ! భాగవతులు భగవంతున కెట్టివారు!"

గురువు :- "నాయనలారా! పాండవులు శ్రీకృష్ణున కెట్టివారో, సర్వేశ్వరునకు భాగవతులట్టివారు. శ్రీకృష్ణుడు పాండవదూతయై రాయబారార్థము కురుసభకుపోయెను. దుర్యోధనుడు భగవానునిగాంచి "స్వామీ! మీకేయే పదార్థములిష్టములో చెప్పినచో వానినెల్లచేయించెద"నని పలికెను. అపుడు భగవానుడు సుయోధనునితో నీయింట నేను భుజింపను. నీవు పదార్థములు చేయింపవలదు.

శ్లో॥ ద్విషదన్నం నభుంజీత ద్విషన్తం నైవ భోజయేత్
పాండవాన్ ద్విషసేరాజన్ మమప్రాణాహి పాండవా॥

శత్రుగృహముల భుజింపరాదు. శత్రువుల కన్నముపెట్టరాదు. మరణము స్వాభావికము. మనుజుడు శత్రునింట భుజించిన తదుపరి, స్వభావసిద్ధముగా మరణించినను, ఆవైరి ఏదో విషము పెట్టియుండవచ్చునని లోకముతలంచును. కావున నేను నీయింట భుజింపను. నీకును, నాకును వైరమేమున్నదని ప్రశ్నింతువేని,

నీవు పాండవుల రాజస్మద్వేషివి. పాండవులు నాకు బహిః ప్రాణములు. కావున నీవు నాకును శత్రుండవే." అని వచించెను. కావున భాగవతులు సర్వేశ్వరునకు ప్రాణము వంటివారు.

భగవానునకు భాగవతులు, శ్రీరామునకు సీతాపిరాట్టి వంటివారు. ప్రాణమునకు ప్రాణమైన సీతను విడనాడి, ఒక క్షణకాలమైన మనజాలనని రామచంద్రస్వామి వచించె. మరియు రామునకు లక్ష్మణునివంటివారు. సీతాపిరాట్టి వైకుంఠమునకు వెడలిపోయిన తరువాతగూడ శ్రీరాముడయోధ్యయందు నిలిచియుండెను. కాని లక్ష్మణుడు వెడలిపోయిన వెనుక రాముడొక క్షణమైనను భూమిపై నిలువలేకపోయెను.

సర్వేశ్వరునకు భాగవతులు కరచరణాద్యంగకముల వంటివారు. మానవులకు ఒకయంగమునందైన బాధకలిగినచో, శరీరమంతటికిని బాధకలిగినట్లే. అట్లే భాగవతులలో నొకనికి శ్రమకలిగినను, భగవాను డాబాధ తనకేకలిగినట్లు బాధనొందును. సర్వేశ్వరుడు తననెవరైన దూషించినను సహించునుగాని, భాగవతాపచారము గావించినవారిని మాత్రము సైరింపడు. భూదేవితో సర్వేశ్వరుడు "పద్మకోటి శతేనాఽపి నక్షమామి వసుంధరే" భాగవతాపచారముచేసిన వారిని, పద్మకోటి శతసంవత్సరములకైనను సహింపను, అని చెప్పియున్నాడు. "పైగా అట్టివారిని అసురయోనులందు

చిమ్ముచుంటి"వనియు తెలిపెను. అని సవివరముగా గురుండు బోధించె.

ఒకానొక వాసరమున రాజసప్రవృత్తిగల యొక ధనికుని తనయుండు శ్రీరంగమునకు వచ్చెను. రంగేశ్వర దర్శనప్రాప్తి కలిగినది. అచ్చటనుండి యాతండు లోకగురుండగు నంబిళ్ళ యొద్దకువచ్చి "స్వామీ! మీవంటి భగవద్భక్తులను సత్కరించినచో సర్వేశ్వరుడు సంతసించునని పెద్దలు వచింపగా వింటిని. కావున తమకీస్వల్ప సత్కారమునొనర్ప నేగుదెంచితి. స్వీకరింపుడు"అని కొంత ధనమీయబోయెను.

గురుండాతనితో "ఓ ధనికశేఖరా! మాకు భాగవతులు శిష్యులు చాలమందికలరు. వారిచ్చుద్రవ్యము మాజీవిత యాత్రకొనసాగుటకు చాలును. మీవంటివారి ద్రవ్యమును మేము గ్రహింపము. పోయిరండు"అని నిరాకరించిపంపించెను.

అతడట్లుపోక నంబిళ్ళగారికి తళిహా జేయు బ్రాహ్మణుని కడకేగి "ఓ విప్రసత్తమా! మీగురువరునకు ధనమీయ సంకల్పించి విఫలతజెందితి. నీకు కొంతధనము బహుమతిగా నొసంగెద. ఈవేళ నేనొసంగుద్రవ్యముతో గురునకు వంటచేసి పెట్టుము"అని తండుల సూపాజ్యఘృతాదులన్నియు తెచ్చి యిచ్చి, ఆతనికి కొంతధనమిచ్చి తనయూరికి మరలిపోయెను.

"ఏద్రవ్యముచే వంటగావించినదియు గురున కెట్లు తెలియును! తెలియదుగదా"యని భావించి, యాపాచకుడు ధనికుడొసగిన పదార్థముల పచన మొనర్చి గురునకు నివేదించెను.

గురుఁడు యథావిధి భుజించెను. ఆసాయంకాల మాతఁడు నిత్యమునువలె కాలక్షేపకూటమునకుఁబోయి భగవద్విషయ ముపదేశించుచుండెను. వేలసంఖ్యలో భాగవతులు, తనువులను మఱచి, భగవద్విషయామృతమును కర్ణేంద్రియముల ఁజుర్రు చుండిరి. భగవద్విషయము నుపన్యసించుసమయమున గురు నకు ఆవులింతవచ్చెను. అందులకు గురుండు విస్మయంబంది "అకటా! భగవద్విషయమును బోధించుతఱి నాకావులింత వచ్చుటయా! నాయందిప్పుడు తమోగుణ మావేశించినది. ఈ తమోగుణ మావరించుటకు హేతువేమి! నాకీవేళ ఆహార శుద్ధియమరినదికాదు. ఏదియో తామసాహారము ప్రాప్తించి యుండవచ్చును.

"ఆహారశుద్ధౌ సత్త్వశుద్ధిః సత్త్వశుద్ధౌ ధ్రువాస్మృతిః" ఆహారశుద్ధియున్నపుడే సత్త్వగుణము ప్రకోపించును. సత్త్వము వృద్ధినొందినపుడే జ్ఞాపకశక్తి ప్రకాశింపగలదని శాస్త్రము ఘోషించుచున్నది." అని మనస్సున భావించెను.

ఆసాయంసమయ మింటికివచ్చినంతనే, అసూపకారుని పిలిపించి, "ఓయీ! ఈరోజు నీవు మాకు వంటచేసిన పదా ర్థము లెక్కడివి! సత్యము తెల్పుము" అని మందలింపు స్వరమున ప్రశ్నించెను.

బ్రాహ్మణుడు వగచి "అయ్యా! తమతో నబద్ధమాడ గలనా! సత్యమునే చెప్పుచున్నాను. మీ రుదయకాలమున నిర సించిన ధనికుడు నన్నాశ్రయించి, అనేకవిధముల ప్రాధేయ

పడెను. నేను కొంతమెత్తిబాటును ప్రదర్శించితిని. అతడందు లకు బహుమానముగా నాల్గురూప్యములొసంగి, ఈ భోజన పదార్థములన్నియు తెచ్చియిచ్చెను. వానితో నేడు వంట చేసితి. ఇదిసత్యము. పైని దేవరయనుగ్రహము" అని చేతులు కట్టుకొని నిలువబడియుండెను.

అపుడు గురుండు "వత్సా! నేను నిరసించిన విషయ మెఱింగియు, నీవంగీకరించితివి. ఇంకనెవరైన పదిరూకలొసంగి మీగురునకు విషముపెట్టుమన్నచో, అట్లే యొనర్తువన్నమాట. కావున నీవు మాకిక పాచకునిగా నుండదగవు. ఇంకనెక్కడ నైన కుదుర్చుకొని జీవింపుము" అని పంపివైచెను.

నంబిళ్ళ కిరువురు భార్యలు. నంబిళ్ళ వారినిరువురను పిలిచి మొదటి భార్యతో "సాధ్వీ నీకు నేనెట్లు గోచరించు చుంటినో తెల్పుము" అని యడిగెను.

అందులకామె "మీరు నాకు సాక్షాద్రంగేశ్వరులుగా గోచరించుచుంటి"రని బదులుచెప్పెను.

గురుండు రెండవభార్య నట్లేయడిగెను.

ఆమె భర్తతో "స్వామీ! మీరు నాకు ప్రియతము లుగా గోచరించుచున్నా"రని పలికెను.

ఆమాటలాలకించి, గురుండగ్రమహిషితో "దేవీ! ఇక్కడనుండి వంటపనియంతయు నీవే కావింపుము. భగవ దారాధనముకూడ నీవే నిర్వర్తింపుము. పై పనులన్నింటిని

నీ చెల్లెలితో చేయింపుము. ఆమె మనస్సింకను పరిపక్వము చెందవలసియున్నది. ఆమెకు దైహికవాసనలు విడువలేదు.'' అని పలికెను.

అప్పటినుండియు నట్లే జరుగుచుండెను. ఒకానొక దిన మున పెద్దభార్య వెలుపలికిపోయెను నాల్గుదినముల వఱ కింటి లోనికి వచ్చుటకు వీలుకాదు. కావున చిన్నభార్యయే వంట కావించెను. మధ్యాహ్నమునకు నంబిళ్ళ కాలక్షేపమందిరము నుండి యింటికేగుదెంచెను. వాకిటనున్న పెద్దపెండ్లమునుజూచి ''తన్వీ! నీవీ దినమున వాకిటనుంటివికదా! వంట నెవ రొనర్చిరి?''అని ప్రశ్నించెను.

ఇంతలో చిన్నభార్య యింటిలోనుండి వెలుపలికివచ్చి ''స్వామీ! నేను మీయర్ధాంగిని కానా? సహధర్మచారిణి నైన నేనుచేసిన వంట మీకు పనికిరాదా?''అని వేదనతో గట్టిగాపలికెను.

ఆ మాటలకు గురుండంతరంగమున బాధపడి ''దేవీ! నీవుచేసిన వంటపనికిరాదని నేనంటినా?''యని, ఆ గ్రామమున గల ''పిళ్ళతిరువరయూరరయ''రను మహాభాగవతోత్తముని పిలిపించి, పదార్థములనన్నింటిని ఆయనతో స్పృశింపజేసి, అతనిని పంపించి, పరమభాగవత కరస్పర్శచే పదార్థములు పవిత్రీభూతములైనవని భావించి, వాని నారగించెను.

నంబిళ్ళకు చిన్నభార్య యందొక తనూజుడుద్భవించెను. అతనికి జాతాశౌచము వెళ్ళినతదుపరి నంబిళ్ళ యాతనికి

"ధూవియుంబిళ్ళ"యని నామకరణంబొనరించెను. గురు శిష్యుండెంతపిన్నవాడైనను, శిష్యులాతని నగ్రజునిగా భావింపవలయునను సంప్రదాయము ననుసరించి, శ్రీకృష్ణపాదదేశికాది శిష్యులు తమ కగ్రజుండుదయించెనని సంతసించిరి.

ఒకానొకదినమున కొందఱు భాగవతులేగుదెంచి గురునితో "ఆర్యా! భాగవతులన నెట్టివారు?" అని యడిగిరి.

అందులకు గురుండు "వత్సలారా! భాగవతశబ్దమునకు భగవత్సంబంధమే సరిపోవును. అయినను వారిలో తరతమ భేదములుకలవు. కొందఱు సర్వేశ్వరస్వరూపధారులు. కొందఱు తులసీనలినాక్షమాలాధరులు. కొందఱు పంచసంస్కారసంపన్నులు. కొందరర్థపంచక, ఆకారత్రయజ్ఞానైశ్వర్యులు. వీరు "సర్వంవిష్ణుమయం జగత్" ఈ జగత్తంతయు భగవద్రూపముగా, ఈశ్వరుని జగద్రూపిగా తలంతురు. వీరందఱును భాగవతులే. అయినను వీరిలో నొకరికన్న యింకొకరు విశిష్టులు. భాగవతులందఱును, సర్వదా, సర్వథా పూజనీయులే"యని భాగవత మాహాత్మ్యంబు సాకల్యంబుగ విశదీకరించెను.

ఏవంవిధ మహావైభవంబున నంబిళ్లగారు, అనేక హాయనంబులీ లీలావిభూతియందు గడిపి ఒకశుభదినమున నిత్యవిభూతికేగెను. అంత పెరియవాచ్చాంబిళ్ల, శ్రీకృష్ణపాదదేశికులు మొదలగు శిష్యులు ఆచార్యవియోగమును సహింపలేక స్తబ్ధులైపడియుండి, కొంతవడికి తెలివినొంది,

నంబిళ్ళ పుత్రుండగు 'భూవియంబిళ్ళ'ను వెంటనిడుకొని గురు నకు బ్రహ్మమేథాది సంస్కారంబులు యథాశాస్త్రంబనుష్ఠించి సుఖంబుండిరి.

ఓమ్ శాంతిశ్శాంతిశ్శాంతిః.

## పెరియవాచ్చాం బిళ్లవైభవము

నంబిళ్ల యనంతర మాయనశిష్యులలో పెద్దవాడు పెరియవాచ్చాంబిళ్ళ శ్రీవైష్ణవసిద్ధాంత పరిపాలకుడయ్యెను. ఆతడు నిరంతరము సకలజనులకు తత్త్వోపదేశము గావించుచు, భగవద్గుణానుభవ తత్పరుండై ఇహలోక వైకుంఠమగు శ్రీరంగ మున వసించుచుండెను.

ఒకనాడు కొందఱు వైష్ణవులు గురునిసమీపమున కరుదెంచి, "ఈజీవులు సర్వేశ్వర లీలావిధేయులా లేక, కృపా పాత్రులా! స్వామీ! తెలుపవలసిన"దని ప్రార్థించిరి.

గురుండిట్లు తెలుపదొడంగె "నాయకులారా! లీల యనగా క్రీడ లేక ఆటయని యర్థము. ఆటల కుపయోగించు నది ఈ లోకము. ఈ జీవులు కొంతకాల మిహమునందుండి, సంసారమునుచేపట్టి, అందే నిరంతరము పరిభ్రమించుచు, పాపపుణ్యంబు లాచరింతరు. ఆకారణమున దేవశరీర, యాతనాశరీరములు ధరింతురు. మరల భూలోకమునకు మరలి

వర్తురు. మరల ఇదేవృత్తము భ్రమించుచుండు. కనుక ఈ ఇహలోకమే లీలకు విషయము.

ఇక కృప. కృపయనగా దయ యని భావము. ఆయన దయాపాత్రుడైనవాడు ఈ లోకములకతీతుడై నిత్యలోకమును ప్రాపించును.

శిష్యులు గురునితో "ఆర్యా! ఈ రెండింటిలో మనము దేనికి పాత్రులము?" అని ప్రశ్నించిరి.

పెరియవాచ్చాంబిళ్ళై వారలగాంచి "వత్సలారా! అహంకార మమకారములు పరిత్యజింపక, దేహమే ఆత్మయని విశ్వసించి, ఆభిజాత్య మదంబును వదలక సంచరించువాడు సర్వేశ్వరునకు లీలాపాత్రుండగును. ఎవడీ జగత్తంతయు విష్ణుమయముగా దర్శించి, భాగవతసేవా తత్పరుండై యుండునో వాడు సర్వేశ్వర కరుణాపాత్రుడగు"నని వచించెను. శిష్యులందరును సంతసించిరి.

శ్రీరంగమునం దిరువురు వైష్ణవు లత్యంతమైత్రితో చాలకాలము కలిసిమెలసియుండిరి. ఏదోకారణమున, కొంత కాలమునకు వారిరువురి మధ్యవైరము ప్రాప్తించెను. వారిలో నొకడు చాలమంది వైష్ణవులకడకేగి రెండవవానిపై మితిలేని దోషములారోపించుచుండెను. ఆ విశేషములను కొందఱు గురుదేవుని చెవిసోకుకు చేర్చిరి. గురుండదియెల్ల నాలించి వారలతో "అయ్యా! సంయమి నీపురాధ్యక్షుని వాక్యములు వింటిరా? ఏపాపంబునకైన ప్రాయశ్చిత్తముకలదు. నరకములును

గలవు. కాని భాగవతాపచారుండగువాని కలుషంబులకు ప్రాయశ్చిత్తము లేదు. వానికి డెబ్బదిరెండు వేల నరకములును చాలవు. ఆతని నెట్లు శిక్షింపవలయునో నాకే అంతుబట్ట కున్నది.'' అని వచించినాడు.

జగన్మాతయగు సీతాదేవి హనుమకు చెప్పిన విషయము విన్నచో నెవడును పరదోషంబులుగ్గడింపడు. కరుణామయి వాక్యములు వచింతు. వినుండు. రావణవధ పూర్తియైనది. పావని పవనవేగంబున అశోకవనికింబోయి జనకజాతతో "అమ్మా! పంక్తికంధరుండు పొలికలనగూలె. లంకారాజ్యం బాతయు ప్రస్తుతము మనహస్తగతంబయి యున్నయది. రాముండు విజయలక్ష్మితో జగదభిరాముండై విరాజిల్లుచున్న వాడు. మీకీ శుభవార్త నెఱింగించుటకు, మీ ప్రాణేశ్వరుండే నన్నిచ్చటి కనిపినాడు.'' అని చేతులుజోడించి నిలువబడినెను.

ఆ మాటలువిని, సీతామహాదేవిని పరివేష్టించి మిక్కిలి బాధించుచున్న 'ఏకాక్షి' 'ఏకకర్ణి' 'దీర్ఘనాసిక' 'లంబోదర' మొదలగు రాక్షసస్త్రీలు భయభ్రాంతలై గడగడవడంక దొడంగిరి.

మారుతి మాటలనాలకించి, జగన్మాత మౌనమును పాటించి, ఏదో దీర్ఘముగానాలోచించుచు మిన్నకయుండెను.

ఆ నిశ్శబ్దమును భరింపలేని, వనచరముఖ్యుండు "తల్లీ! ఏమియు పలుకక, యూరకయుంటి రేల!'' అని ప్రశ్నించెను.

అందులకు జగజ్జనని, "వత్సా! యిదివఱకొక శుభ వార్తతెలిపి నాప్రాణములు కాపాడితివి. ఇప్పుడింకొక శుభ వార్తను మోసితెచ్చితివి. అట్టి నీకేమియిచ్చినను, నీఋణము తీరనదికాదు. కావున నేమి యీయవలయునా! యని చింతించుచుంటి"ననియె.

ఆమాటలకు ఉప్పొంగి హనుమ "తల్లీ! నిజముగా నీకట్టి ఆలోచనమున్నదా? ఐనచో నాకు కావలసినదానిని నేడే అడిగెద. దయతో ప్రసాదింపు"మని విన్నవించె.

జగదీశ్వరి "బిడ్డా! నీకోరికతీర్పుటకన్న నాకు మిన్న యగు నానందమెద్ది. ఆ కోరికయెట్టిదో తెలుపుము. అది యీయదగినదైనచో తప్పక యొసంగెద"నని మాటయిచ్చెను.

అపుడు వాయుతనయుండు "జననీ! నేను పూర్వము రామసన్నిధిధానమునుండి మీసన్నిధికి వచ్చినప్పుడీ రక్కసి ముండలు మిమ్ము బాధించుచున్నారు. ఇప్పుడుకూడ అట్లే బాధించుచున్నారు. వీరి తర్జనభర్జనలకు దశదిశలు చెవుడు వారుచున్నవి. నాకు తమరు దయతో ననుమతి యొసంగినచో నొక్కనిముసమున, నీరాక్షసస్త్రీల నందఱిని పచ్చడిపచ్చడిగా త్రొక్కి కాలుత్రోలి కతిథిజనములుగా పంపించెద. తామీయ దలచుకొన్నచో నీవరమొక్కండుచాలును. దయసేయుడు తామీవరమిచ్చినచో ముల్లోకములును నాకొసంగినట్లే"యని వేడుకొనియెను.

ఆమాటలువిన్న రాక్షసస్త్రీలకు ప్రాణములు పైనే లేచిపోయెను. శరీరము లొక్కసారి స్తంభించిపోయెను. వారికి హనుమంతుని శక్తి తెలియునుగావునదీనానలై గడగడవడకుచు, సీతాదేవి పాదసన్నిధి భూమిపై నిశ్చేతనముగా నొరిగి పోయిరి.

జగదీశ్వరి హనుమవాక్యంబులు విని "కుమారా! వరము వేడెదనని చెప్పి, యిట్టివరమును కోరితివా! ఈరాక్షస స్త్రీలు నన్ను దండించుచున్నారు కావున వారింబరిమార్ప నెంచితివి. అది వారిదోసంగుకాదు. వారిజీవితములు పరాధీన ములు వారు రావణపరతంత్రులు. రాజు చెప్పినట్లు సేవకు లాచరించుటతప్పా? వాడట్లొనరింప నాదేశించినాడు. వారట్లు ప్రవర్తించినారు. ఇప్పుడు మన మాజ్ఞాపించినచో మనము చెప్పినట్లుచేయుదురు. ఇప్పుడు రావణపత్ని మండోదరి నీడ్చు కొని రమ్మన్నచో నీడ్చి తెత్తురు. అట్టివారిని నీవు చంప వచ్చునా? తప్పుచేసినవారి నెల్ల దండింపవలసివచ్చినచో లోకము నందున్న యందరిని శిక్షింపవలయును. లోకమున తప్పుచేయని వాడొక్కరుండును లేడు.

శ్లో॥ పాపానాం వా, శుభానాం వా, వధార్హాణాంప్లవంగమ!
కార్యం కరుణమార్యేణ నకశ్చిన్నాపరాధ్యతి.

ఈ రాక్షసస్త్రీలు పాపులేకానిమ్ము. పుణ్యవతులే కానిమ్ము. వారుచంపదగినవారే కావచ్చును. కాని నాయభి ప్రాయము ప్రకారము వారురక్షింపదగినవారే. పుణ్యాత్ములు

నీచులయందుకూడ కరుణనే ప్రదర్శించుదురు. అది వారి నైజము. ప్రపంచమున నపరాధికాని వాడొక్కరుండుకూడ లేడు. కావున వారిజోలికిపోవలదు. పోయితివేని నాపాదముల యాన"యని పలికెను.

ఆ వాక్యములువిని హనుమ "తల్లీ! జనకరాజర్షి తనూజవు. భూమండలము నేకచ్ఛత్రాధిపత్యముగా నేలిన పంక్తిరథుని కోడలివి. పుణ్యశ్లోకుండగు రామునకు ధర్మ పత్నివి. అట్టి నీవే యిట్టిమాటలుమాటాడ నర్హురాలవు. ఇతరు లిట్లుమాటాడవలంతురా! మీయానతప్పి వీరిని నేనెట్లు సంహరింపనేర్తు!"నని యగ్గించెను.

రాక్షసస్త్రీలందఱున భయంబుదక్కియుండిరి.

సీతాదేవి యట్లే సాక్షాత్ సర్వేశ్వరుండగు రాముడు గూడ సుగ్రీవునితో తెలిపెను.

"దోషోయద్యపి తస్యస్యాత్ సతామేతద గర్హితం"

నాభక్తుడగువాడు భూమిపై నెవ్వండును దోసంగొనరింపడు. మీరు తప్పుచేసినట్లు వక్కాణించినను, అది తప్పుకాదు. ఒప్పేయగు. లోకమున తప్పుచేయనివాడుండడు. ఇతరుల దోసంగులు తనకు కొండంతలుగా గోచరించును. తన తప్పులు కొండంతలైనను నూవుగింజగా ద్యోతకమగును.

భాగవతులుకూడ పాంచభౌతిక శరీరయుక్తులే కాన ఒకప్పుడు వారియందును దోసంగులు దొర్లుచుందును. అంత

మాత్రమున వారిదోషముల నుగ్గడింపరాదు. అని దీర్ఘోపన్యాసము గావించెను. ఆ ఉపన్యాసమునకు శిష్యులెల్లరానందించి గురునికొనియాడిరి.

పెరియవాచ్చాంబిళ్ళకు, విద్యావిహీనుండైన ఒక శిష్యుండుగలండు. అతని నామధేయము వాదికేసరి. అతడొక దినమున, శిష్యులకు పాఠములుబోధించుచున్న సూరిసత్తము నొకనిసమీపించి "స్వామీ! మీరిపుడు ప్రవచింపుచున్న గ్రంథముపేరేమి?"యని యడిగెను.

అది విని ఆసూరిసత్తముడు "వీని పేరుగొప్ప. ఊరు దిబ్బ వాదికేసరియట. ఇది నేతిబీరకాయవంటిది విద్యాశూన్యుడు"అని మనస్సునతలంచి అతనితో హేళనగా "అయ్యా! విజ్ఞులరు. మీకు తెలియనిదేమున్నది! ఈగ్రంథ రాజముపేరు 'ముసలకిసలయము'అని తెలిపెను.

ఎంతటి విద్యాశూన్యుడైనను, ఇతరులభావముతెలియంగ నేరనివాడుకాడు వాదికేసరి. అతనికి సూరిసత్తముని మాటల యందలి అవహేళనమర్థమైనది. ఆగ్రంథముపేరును అబద్ధము చెప్పినాడని ఊహింపగలిగెను. వాదికేసరి తిన్నగా గురుని యొద్దకుబోయి పెరియవాచ్చాంబిళ్ళగారితో జరిగిన విషయ మెల్లచెప్పి "గురూత్తమా! ముసలకిసలయమను గ్రంథ మున్నదా! దాని నెవరురచించిరి! దానియందే విషయము ప్రసక్తమైయున్నది!"అని యడిగెను.

గురుండునవ్వి "వత్సా! ఆపేరుగల గ్రంథమేజగాన లేదు. నీకు విద్యరాదని ఆతను పరిహసించినాడు. ముసల మనగా రోకలి. కిసలయమనగా చిగురు. ముసలమునకు చిగురు పట్టనట్లే నీకు విద్యరాదు. నీవు వట్టిమూఢుడవని పరిహసించి నాడు"అని తెలిపెను.

ఆమాటలువిని వాదికేసరి సిగ్గుపడి, గుభాలున గురుని కాళ్లపైబడి, "స్వామీ! నన్ను సమస్తశాస్త్రపారంగతు గావింపుడు. మీరు కాదన్నచో మీపదసమీపమునందే పడి యుండి ప్రాణత్యాగమొనర్చెదను."అని లేవకుండెను.

గురుండు వానిని లేవనెత్తి కౌగిలించుకొని, "వత్సా! అట్లేనిన్ను విద్యాపారంగతుని కావించెద"నని చెప్పి తన ప్రభావముచే నతని నచిరకాలముననే గొప్పపండితుని కావించెను. ఆతండును గురుని పదారవిందముల సేవించుచును, తత్ప్రభావంబుచే శాస్త్రసమస్తము నధికరించి, విద్యయందు తీర్ణుడై, గుర్వనుగ్రహముతో ముసలకిసలయమను నొక దివ్యగ్రంథము నలంకారపూరితముగ రచించి, పూర్వము తన్నుపహసించిన సూరిసత్తము నొద్దకు తీసికొనిపోయి తద్గ్రంథమును చూపించెను.

ఆసూరిసత్తముండా గ్రంథము నాద్యంతము పరిశీలించి, సంతోషించి "వత్సా! గొప్పపని చేసితివి. విద్యాధికుండ వైతివి."అని వీపుమీద చేయివేసితట్టి అనేకవిధముల కొని యాడెను.

అంత వాదికేసరి సూరిసత్తమును పదంబులంబడి "స్వామీ! తమయనుగ్రహంబుచేతనే ఇంతవాడనైతి"నని అగ్గించి గృహంబునకేగెను.

ఈవిధముగా పెరియవాచ్చాంబిళ్ళ వైష్ణవదర్శనమును పరిపాలించుచు, కొంతకాలము శ్రీరంగమునందు వసించి, దేహమునువీడి, దివ్యధామంబైన పరంధాముని లోకంబునకు వేంచేసెను.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

## వడుక్కుత్తిరువీధిప్పిళ్లై వైభవము

పెరియవాచ్చాంబిళ్ల యనంతరము వడుక్కుత్తిరువీధిప్పిళ్లై శ్రీవైష్ణవదర్శనాచార్యుండయ్యెను.

"శ్రావణే బహుళాష్టమ్యాం స్వాతీజం సద్గుణార్ణవం
వందే శ్రీకృష్ణపాదార్యం వరదార్య పదాశ్రియమ్"

ఆయన సంస్కృతనామము శ్రీకృష్ణపాదదేశికులు. ఆయన విష్ణుదర్శనము నిర్వహించు తఱి కొందఱు వైష్ణవు లాయన యొద్దకువచ్చి నమస్కరించి "స్వామీ! ఈ ఆత్మకు స్వరూపం బెట్టిదో ఆనతిండు"అని కోరిరి.

అపుడా ఆచార్యవర్యుండు "అయ్యలారా! జీవుండు తొలుదొల్త అహంకారవర్జితుడు కావలయును. అహంకార

మనగా, ఈ జగత్తునకు నేనే ప్రభుండను. నేనే భోగసంపన్నుండను, సిద్ధపురుషుండను,"అని భావించుట అందులకే గీతాచార్యులు "ఈశ్వరోఽహమహంభోగీ సిద్ధోఽహం బలవాన్ సుఖీ" నేనే ఈశ్వరుడను, భోగిని, సిద్ధిపొందినవాడనని యెవ్వండు తలంచునో అట్టివాడు రాక్షసుడు."అని సెలవిచ్చియున్నారు.

కావున అహంకార మమకారములు విసర్జించి, భగవచ్ఛేష భూతుడై యుండవలయును. భగవచ్ఛేషత్వమేకాక, జీవుండు భాగవత శేషత్వము నుగూడ వహించియుండవలె. ఈ రెండింటిలో దేనిని విడనాడినను, వాడునిష్ప్రయోజకుడే. భగవానులు సెలవిచ్చిన రాక్షసత్వము మాత్రము వీనికి మిగిలియుండును. భగవద్భాగవత శేషత్వమునుధరించి, ఆచార్యాభిమానంబుకంటె అన్యమగు గతిలేదని తలంచియుండుటయే, యీ జీవునకు స్వరూపము"అని తెలియచేసెను.

ఈవిధముగా విష్ణుదర్శనము నిర్వహించుచు, తన తనూజులగు పిళ్ళలోకాచార్యులు, అళగియమణవాళప్పెరుమాళ్లునయనార్ లను సర్వశాస్త్రపారంగతులను గావించెను. వారితో కొంతకాలము ఆనందము ననుభవించెను. తదుపరి జ్యేష్ఠసుతుండగు పిళ్ళలోకాచార్యుని విష్ణుదర్శనదక్షునిగా నియమించి, తన గురుండగు వరదరాజు పదాబ్జంబులు తలంచుచు తిరునాడలంకరించెను.

కుమారులిరువురును తండ్రివియోగము భరింపలేక బాధపడి, తండ్రికి బహ్మమేధాది క్రియలన్నియు నిర్వర్తించి, విష్ణుదర్శనస్థాపక దక్షులై శ్రీరంగమున వేంచేసియుండిరి.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

# పిళ్ళైలోకాచార్యుల వైభవము

పిళ్ళైలోకాచార్యులు సమస్తచేతనోద్ధరణమునకై యనేక దివ్యగ్రంథములు విరచించిరి తత్త్వత్రయము, రహస్యత్రయము, అర్థపంచకము, శ్రీవచనభూషణము, మాణిక్యమాల, నవరత్నమాల, ముముక్షుప్పడి, పరందపడి, ప్రమేయశేఖరము, అర్చిరాదిగతియు, తత్త్వశేఖరము, ప్రపన్నపరిత్రాణము, మొదలుగాగల శతాధికసంఖ్యగల గ్రంథములు రచించెను.

అనేక బ్రహ్మవిదులు చనుదెంచి పిళ్ళైలోకాచార్యుల వారి శ్రీపాదములాశ్రయించిరి. పిళ్ళైలోకాచార్యులు తమ్మునితో గూడి విష్ణుదర్శనము నిర్వహించుచు, పరాశర, వ్యాస భట్టరులను విస్మరింపజేసెను.

ఒకానొకదినమున ఈర్ష్యాళువులగు కొందఱు వైష్ణవులు శ్రీవచనభూషణమునుచూచి సహింపజాలక, శ్రీరంగేశ్వరుని యొద్దకుబోయి "ప్రభూ! ధర్మసంస్థాపన దక్షులగు మీకొక విన్నపము చేసికొనుచుంటిమి. పిళ్ళైలోకాచార్యులు శ్రీవచన భూషణముగ్రంథం బొందురచించియున్నాడు. దానియందు కులధర్మములనన్నింటిని తిరస్కరించినాడు. కులములే లేవని, తద్వ్యవస్థనెల నిర్ద్వంద్వముగా ఖండించెను. ఆశ్రమధర్మముల నపభ్రంశమొనర్చెను. శ్రీవారాతని పిలిపించి శిక్షించవలె" నని విన్నవించిరి.

రంగేశ్వరు డావాక్యములనువిని పిళ్ళలోకాచార్యులను తీసికొనిరమ్మని యొక బ్రాహ్మణుని పంపించెను. అతడు పిళ్ళలోకాచార్యుల గృహంబునకేగెను. ఆసమయమున పిళ్ళలోకాచార్యులు తన గృహమునలేరు. వచ్చిన బ్రాహ్మణుడు లోకాచార్యుల అనుజుండగు అళహియమణవాళపెరుమాళ్లకు రంగరాజాజ్ఞ నివేదించెను. అన్నలేకుండుటచే, రంగనాథాజ్ఞ శిరసావహించి తానేరంగని చెంగటకేగెను.

రంగభూపుని దర్శించి, మంగళాశాసనముచేసి, వేద వాక్యములస్తుతించి, రంగేశ్వరుంజూచి "ప్రభూ! మాయన్న గారింటలేరు. దేవరయాజ్ఞతలదాల్చి నేనే తెంచితి. ఈకరుణా విశేషమేమో సెలవిండు"అని వేడుకొనెను.

అపుడు రంగేశ్వరుడు "ఓయీ! నే ననేకావతారము లెత్తి జగత్తున ధర్మసంస్థాపనముచేసితి. వర్ణాశ్రమధర్మములు కాపాడితి. మీయన్న వానినన్నింటిని త్రోసిపుచ్చి శ్రీవచన భూషణమును రచించెనట. అతడట్టు లెందులకు వ్రాసెను?" అని యడిగెను.

ఆమాటలువిని అణహియమణవాళప్పెరుమాళ్లనయ నారు "స్వామీ! మాఅన్నగారు విరచించిన గ్రంథము, దేవర వారి అభిప్రాయమునకు బాధకమైనచో నాశిరస్సు శతధా, సహస్రశః భిన్నశకలములుకావలె. శ్రీవారి మనస్సునకెక్కని గ్రంథము మాకేల! ఆ గ్రంథమంతయూ నామూలచూడముగ

నిపుడిచ్చుట పఠించెద. విని నిర్ణయింపుడు. అని తద్గ్రంథము నాసాంతిముచదివెను.

ఆగ్రంథమునందలి భావమేమన, ఈ ప్రపంచమునందలి కులములుగాని, మతములుగాని, ఆశ్రమములుగాని, ధర్మములు గాని, ఈ జీవుని రక్షింపజాలవు. భక్తియొక్కటియే సర్వేశ్వర సన్నిధానమునకుచేర్చు నుపాయము. కులాశ్రమ ధర్మములు, వ్యవహారకల్పితములు. ఇవి శాశ్వతములుకావు. రక్షకములును కావు. సర్వేశ్వరుని దయయొక్కటియే రక్షకము. అది ప్రాప్తించుటయే సర్వప్రాప్తి. ఆయన దయనుపొందుటకు సర్వభారములును శ్రీయఃపతి పదారవిందముల సన్నిధియం దుంచుటయే తప్ప నన్యమార్గములేదు.

భాగవతాపచారమునకు మించినపాతకము వేరొందు లేదు. భాగవతాపచారము జీవుని నశింపజేయుసమర్థము. భాగవతాపచార మనగా నేమి ? ఒక భగవద్భక్తునిగాంచి, నీది యేజాతి ? ఏకులము ? నీవుశూద్రుండవు. నీవు నీచజాతుం డవు-నిన్నంటరాదు-అని పలుకుటయే భాగవతాపచారము. ఇట్లు ప్రశ్నించినవాడు నిత్యసూరియైనను, తల్లక్రిందులుగా అధో గతియందుబడితీరును. ఇట్టిదే తద్గ్రంథసారము.

శ్రీరంగనాథు డాగ్రంథ మాద్యంతమును మహోత్సుక తతో నాలించెను. తద్భావమునకు సంతృప్తమానసుం డయ్యెను. ఆ గ్రంథమునుగూర్చి నేరమారోపించిన వైష్ణవుల నెల్ల పిలిపించి "శ్రీవచనభూషణము, శ్రీవచనభూషణమే.

దానిని విని పరవశించితి. మీరలఘధర్మవర్తనులు-దాంభికులు-అసూయాపరులు-ద్వేషదూషితులు నగుటచే,అట్టి దివ్యధార్మిక గ్రంథము మీకు దోషభూయిష్ఠముగా గోచరించినది. మీకు మహాపాతకులగుటచే, మీపాప మీరూపమున ప్రతిఫలించి, తదున్నతగ్రంథముపై నేహ్యాభావము జనింపజేసినది." అని అనేకవిధముల వారిని మందలించెను.

ఈగ్రంథముపై దోషమారోపించిన వారందఱు "అళహీయమణవాళపెరుమాళ్లునైనారును, మదీయ శిబిక యందారోహింపజేసి, దానిని మోసికొనిపోయి వారియింటి యొద్ద దించిరందు" అని అజ్ఞాపించి, నైనారునకు తీర్థప్రసాదము లను మధుపర్కమును ఇప్పించి సత్కరించి పంపించెను.

అతడు రంగరాజపెరుమాళ్ళకు ప్రణామములాచరించి, రంగేశ్వరికి మ్రొక్కి సెలవుదీసికొని బ్రహ్మరథాధిరూఢుడై యింటికివచ్చెను. ఈలోగా పిళ్లెలోకాచార్యులు గృహాంబున కేతెంచి, రంగేశ్వరుడు తనను పిలిపించుటయు, తమ్ముడు వెళ్ళుటయు తెలిసికొని, అనుజాగమనము నిరీక్షించుచు, గృహావేదికపై నాసీనుడై యుండెను.

తమ్ముడు ద్వారకమునందే పల్యంకమునుండి దిగ్గి అన్నను పరికించి, తత్పాదారవిందంబులపై వ్రాలి జరిగినదంతయు విన్నవించెను. అది యంతయువిని, ఆజగద్గురుండు తమ్ముని కౌగిలించుకొని, గొప్పపనిచేసితివని యగ్గించుచు, నానంద బాష్పములతో తమ్ముని శిరమభిషేకించెను.

ఆపిదప, అణయహీమణవాళ పెరుమాళ్లు 'ఆచార్య హృదయ'మనెడు దివ్యప్రబంధమును రచించెను. ఈవిధముగా నన్నదమ్ము లిరువురును దర్శననిర్వాహకులై యుండ, కొంతకాలమునకు, అణహియమణవాళ్ పెరుమాళ్లు తిరునాడలంకరించెను.

ఈ అనుకోని సంఘటనకు పిళ్లలోకాచార్యులు మిక్కిలి చలించిపోయిరి. తమ్ముని వియోగ బాధభరింపలేక వ్యథనందిరి. తమ్మునకు బ్రహ్మమేధాది సంస్కారములన్నియు నాచరించి, కొంత శోకవిముక్తుండై, యితర జనులకు భగవద్విషయమును బోధించుచు శ్రీరంగంబుననుండెను.

ఆసమయంబున మణవాళ మహాముసులకు గురుండగు తిరువాయిమొళిప్పిళ్లయు, మణవాళమహాముసుల తండ్రియగు 'తిహాళిక్కడందార్ తిరునాయుడయపిరాన్ తాధరయ్యరు'ను వచ్చి పిళ్లలోకాచార్యులవారి శ్రీపాదము లాశ్రయించిరి.

ఆసమయమున భారతదేశము మహమ్మదీయ దండయాత్రకు గురియయ్యెను. యవనులు హిందూదేశము నలుమూలల నాక్రమింపసాగిరి. కొందఱు తురుష్కులు దక్షిణ భారతముపై దాడిగావించి, అచ్చటి దేవాలయములు కొల్లగొట్టి కొన్నింటిని పడగొట్టిరి. కొన్నిగోపురముల ధ్వంసమొనర్చిరి. కొన్నివిగ్రహములు విరుగగొట్టి అవమానించిరి.

ఆయుపద్రవము శ్రీరంగమునకు వచ్చుచుండెను. ఆవార్త నీటిపై నూనెలావ్యాపించినది. పిళ్లలోకాచార్యులు మొదలగు

కొందఱు పెద్దలు శ్రీరంగనాథాలయమును ప్రవేశించి, రాలు రప్పలు ఎత్తుగాపోసి మూలవరులకప్పివేసిరి. నంబెరుమాళ్లను, తాయార్లతోకూడ తీసికొని ఒక విష్ణువిగ్రహమును వెలుపల నున్న ఒకమంటపమునందు ప్రతిష్ఠించి, బయలుదేరిరి. అనేక గ్రామంబులుగడచిరి. నదీనదంబులు గమించిరి. దుర్గమారణ్యంబులు దాటిరి. అతిగహనపర్వతముల నతిక్రమించిరి జ్యోతిషక్కుడియను గ్రామముచేరిరి.

ఆగ్రామమునందొక ఆలయమున రంగనాథుని ప్రతిష్ఠించి స్వామికి సర్వవిధకైంకర్యములు కావింపదొడంగిరి. పిళ్ళలోకాచార్యులు మిక్కిలివృద్ధులైరి. శరీరమున రుజాజరలు వ్యాపించెను. శరీరము జీర్ణమయ్యెను. అప్పుడాయన శిష్యులను బిలిచి "వత్సలారా! మీరు మేలుకోటకుపోయి, తిరునారాయణస్వామిని, శెల్వప్పిళ్లను దర్శించి, శరీరపతనావధి అచ్చటనే స్వామికి కైంకర్యములాచరించుచు, అంతమున దివ్యధామమునకు రండు"అని సెలవిచ్చి, శ్రీకృష్ణపాదదేశికుల పదసరోజములు మనస్సున ధ్యానించుచు, దివ్యలోకమునకు వేంచేసెను. శిష్యులందఱును గురువియోగమునకు నాకులత జెందిరి. తమ్ముతాము సంబాళించుకొని గురునకు బ్రహ్మమేధాది సంస్కారములన్నియు నాచరించి దుఃఖోపశమితులైరి

రంగేశ్వరుడు కొంతకాలము ఆయూరి యందే వసించి యుండెను. అచ్చటినుండికదలి సుందరభుజస్వామి సన్నిధికేగి అటకొంతకాలముండెను. తదుపరి అటనుండి కురుకాపురము

నకు పోయెను. అందు వకుళాభరణయోగి ఎదురువచ్చి రంగే శ్వరుని దర్శించి, పాదారవిందంబులకు నమస్కరించి, తన దేవాలయమునకు గొంపోయెను. కొంతకాల మారంగేశ్వరుడు శత్రురాతిచే నర్చితుండై అటనుండికదలి అనేక దివ్యదేశములు చూచుచు, యాదవాద్రికరిగి, అచ్చట కొన్నిదినములుండి, అనంతపద్మనాభమునందు కొంతకాలము వసించి, మళయాళ దేశము నలువై పులుచూచుచు అంజనాచలనాథుండగు శ్రీవేంక టేశ్వరుని ఆలయమునకేగుదెంచెను. రంగేశ్వరు డచ్చట పది రెండు వత్సరములు నివసించియుండెను.

ఆసమయమున విజయనగరప్రభువుల సేనానాయకుం డగు 'గోపసేనాని' వేంకటాచలమునకువచ్చి వృషాద్రినాథుం దర్శించి, రంగనికొనియాడెను. రంగేశ్వరుని అటనుండి తీసికొని పోయి శింజీపుర సమీపస్థంబగు సింగరాయపట్టణంబందొక కోవెలకట్టించి దానియందు రంగనిప్రతిష్ఠించి, నిత్యార్చనలు నిర్వహించుచుండెను.

అపుడు శ్రీరంగమునందు సింగప్పిరాన్ అనెడు నొక బ్రాహ్మణుడు తనవైదుష్యముచే, తురుష్క ప్రభునిలోబరచు కొని, అమాత్యుండై యుండి, శ్రీరంగ దేవాలయమునంతయు మరల చక్కజేసెను.

ఆసమయమున సర్వాంగసుందరియు, చాతుర్యలావ ణ్యాది సకలసద్గుణ మందిరయు, రంగనాథమాణిక్యమను నొక వేశ్య శ్రీరంగము నందుండెను.

శ్రీరంగపాలకుండగు తురుష్కనాయకుం డామెయందు బద్ధానురాగుడై యుండెను. కాని ఆమెమాత్ర మాతని ప్రేమను తిరస్కరించి, కేవల దేవదాసిగా కాలమును గడపుచుండెను.

శ్రీరంగ ప్రముఖులు కొందఱు మంతనములాచరించి, ఒక నిర్ణయమునకువచ్చి రంగనాథమాణిక్యము గృహంబున కరిగిరి. ఆమె వారిని సముచితముగ నాహ్వానించి, గారవించి, తామువచ్చినపని తెలియజేయవలసినదిగాఁ గోరెను. అందులకు వారు "ఓ విలాసవతీ! మేము నీకు గురువులము. నిన్నొక కార్యార్థమర్థింపనే తెంచితిమి. యవనుడు మన శ్రీరంగము నాక్రమించియున్నాడు, అతడిచ్చటనేయున్నచో మనకు క్షేమముకాదు. శ్రీరంగనాథుని నిత్యకార్యక్రమారాధన నిరంతరాయముగా ప్రవర్తింపదు. అతడు నీయందు బద్ధకాముండై యున్నవాడు. నీవాతని హావభావవిలాసములతో ఆకర్షించి, నీవశముచేసికొని అంతమొందింపవలయు. అట్లు చేసినచో దేశముసుఖించు. రంగేశ్వరుండు సంతసించు నీవే తత్కార్యమునకు సమర్థురాలవు." అని తెలిపిరి.

ఆమాటలాలించి, ఆవేశ్యాలలామ, "అయ్యలారా! మీమాటలన్నియు సత్యబద్ధములే. మీరిందరిచ్చటకే తెంచి, ఆజ్ఞాపించుచున్నారు. కావున మీయాజ్ఞ మీరజాల. భగవద్భాగవతవిషయమై శరీరమునర్పించినను జన్మసార్థకమే. ఈతురుష్కప్రభు నంతమొందించుట అంత తేలిక కార్యము కాదు. అతని నంతమొందించిన మరుక్షణమున నేమి దేహ

త్యాగ మొనర్పవలయు, లేదా వానిభటులు నన్ను చిత్ర హింసల పాలుచేయుదురు. మీ యాజ్ఞ శిరసావహించి, ఈ యాత్మను రంగేశ్వరాధీన మొనరించెద. నేను కావించిన ఈ త్యాగమునకు గుర్తుగా, రంగేశ్వర సన్నిధానమున, నాపేరు ఉత్సవములందు ముందుగా నుచ్చరింపవలె, ఈ వరము నను గ్రహింపుడు." అని కోరెను.

అందులకువారు, "సుందరీ! నీవింతటి త్యాగమునకు సిదపడి, యింతటి ప్రయోజనమును నిర్వహించినచో నీవు కోరిన మాత్రముచేయలేమా! మేమంతటి కృతఘ్నులమా! స్వామియొక్క ప్రత్యుత్సవమునకును ముందు నీపేరుతో సంకల్పమును చెప్పింతుము. ఇది ముమ్మాటికిని సత్యము" అని మాట యిచ్చిరి.

వేశ్య వారిని పంపించి, తగిన సమయమును చూచుకొని తురుష్క ప్రభు సన్నిధికేగెను. ఆమె రూపలావణ్య విభ్రమ లీలావిలాసాదులు మున్నెవిని చొక్కియున్న వాడగుటచే ఆమెను వీక్షించినంతనే మోహపరవశుండయ్యెను. తదేక దృష్టితో నామెసౌందర్యమును తనివిదీరగ్రోలెను. స్తంభీకృత మానసుండై చిత్తరువునందలి బొమ్మవలె చలనరహితుడై యుండెను.

కొంతసేపటి కాతడు విస్మయమునెటింగి "ఓ కంజాక్షీ! నీ సౌందర్యవిలాస విభ్రమరూపరేఖాదులగూర్చి వినియుంటిని. మనస్సున నభిలషించి దినంబులు యుగంబులుగా గడపుచు,

నీ పొందెన్నడు సమకూడునాయని యువ్విళులూరుచుంటిని. ఇంతకాలమునకు నన్ను కటాక్షించితివి. అల్లాపయనేటికి నాపై ప్రసరించినది. నీవిపుడు వచ్చినపనియేమి? అది ఎంతటి అసాధ్యమైనను సాధించితీరెద”నని యనేక ప్రణయోక్తు లాడెను.

అందులకామె “ఓపురుషపుంగవా! నీవీరప్రతాప శౌర్యా దులు ప్రజలు గాథలుగా చెప్పుకొనుచుండ వీనుల విందుగా వింటిని. మీ సాంగత్యమునకై తహతహలాడుచుంటి. నేటి కది సంప్రాప్తించినది. నీవు మహారసిక సమ్రాట్టువని విని యేతెంచితి. మీ పాదదాసినై మీ పాదసంవాహనమాచరింప తలంచి విచ్చేసితి”నని సమాధానమొసంగెను.

అతడానందముతో యుబ్బితబ్బిబ్బులాయెను. అప్పుడే ఆమెతో సంభోగింపవాంఛించెను. తనవాంఛ నామె కెఱి గించెను. అందులకామె “నరేశ్వరా! నేను మీపాదదాసిని. ఎందులకేగదను. ఈభవనములు, మన మదనవిహారముల కను కూలములుకావు. శ్రీరంగేశ్వరుని వెల్లగోపురముపైకి పోవు దము. అది చాలవిశాలమై చక్కనివిసతులతో నలరారు చున్నది. కావేరీనదీతరంగములపైనుండి మందమలయానిలము మహా హాయిగొలుపుచుండును. రతిసంజాతపరిశ్రమను పూర్తిగాతొలగించును. శ్రీరంగమంతయు కన్నులపండువుగా తిలకింపవచ్చును. సహ్యజాసాగరసంగమ ప్రదేశము కనువిం

దానరించును. మఱియది ఏకాంతస్థలము. అన్నివిధముల మన విహారమున కనుకూలము" అని తీయతీయగా వచించెను.

అతడు వలలోతగుల్కొనిన మృగమువలె, మాయా వాగురములలో తగుల్కొని ఆమెతోగూడి బయలుదేరెను. ఇరువురును రంగేశ్వరుని తూర్పుగోపురము నధిరోహించిరి. అందుయథేచ్ఛగావిహరించిరి. కావేరీనదీ ప్రవాహమునుచూపించుచు నామె, ఖర్జూరనారికేళ పూగీతరుమండమండితంబగు శ్రీరంగద్వీపమును చూపించుచు, తత్ప్రదేశముల ప్రాముఖ్యమును వివరించుచు, హావభావ శృంగారచేష్టలు ప్రదర్శించుచు, కొంతతడవు గడపెను. ఆ యవనప్రభుండామె విలాసలహరిలో తేలిపోవుచు సర్వప్రపంచమును విస్మరించియుండెను. మంచి అవకాశముకొఱకై వేచియున్న మాణిక్యము తటాలున అతనిని బట్టి గోపురమునుండి తూర్పుదిశగా క్రిందికి పడద్రోసెను. తాను రంగనాథుని స్మరించుచు, పడమరదిక్కుగా క్రిందికి దూకి, ప్రాణములువీడి, దివ్యధామమునకు వేంచేసెను.

క్రిందపడిన తుష్కప్రభుని శరీరము, తునాతునకలై పోయెను. అతడట్లు యమపురంబున కతిథిగా వేంచేసెను.

ఈ వార్త గోపనాయకునకు చేరినది. అతడు సర్వసైన్యసమేతుడై శ్రీరంగమునకేతెంచి, యవనసైన్యమునెల్ల చెండాడెను.

శ్రీరంగదేవాలయమును బాగుచేయించెను. రంగేశ్వరునితెచ్చి మరల శాలివాహనశకము పదునొకండవ శతాబ్దము

నంను, ప్రస్తుతంబగు పరీధావినామసంవత్సరము, వృషభమాస మున వేదాంతదేశికాది గురువులు ప్రణవమందిరమునందు పునః ప్రతిష్ఠించిరి.

పదునాల్గుసంవత్సరములు మైథిలితో గూడ అరణ్యవాసము కావించి, తిరిగి అయోధ్యకువచ్చి పట్టాభిషిక్తుడైన శ్రీరామచంద్రుని సమస్తజనులునువచ్చి దర్శించిరి. అట్లే దేశ దేశములనుండి ప్రజలు తండోపతండములుగావచ్చి రంగనాథుని దర్శించుచుండిరి. శరీరమును రంగార్పణము గావించి, దివ్యలోకములకు వేంచేసిన 'మాణిక్యము' పేరున రంగేశ్వర సన్నిధానమున ప్రతిదినోత్సవములందు 'శ్రీరంగనాథ మాణిక్యత్తాళుక్కరుళిప్పాడని' ఉచ్చరించుచుందురు. మరియు నామె వంశమునందు జనించిన వారలే కుంభనీరాజనంబొసంగునట్లు కట్టడిగావింపబడినది. తద్వంశమున నెవ్వరైన మరణించినచో వారికి దహనసంస్కారాదులకు శ్రీరంగనాథుని మహాసనాగ్ని నొసంగి, వారి చరమసంస్కారములకు శ్రీవారి ధాన్యాగారము నుండి, తెండులంబులు మొదలగునవి ఇప్పటికిని యొసంగు చుందురు.

పిళ్ళలోకాచార్యుల వారి తనియ.

శ్లో॥ శ్రీ మత్యాశ్వయుజే మాసేతులాయాం శ్రవణోదితమ్
శ్రీకృష్ణపాదతనయం లోకాచార్య మహంభజే॥

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

పిళ్లలోకాచార్యులు నిత్యధామమునకు వేంచేసినాడని విని ఆతని శిష్యురాలును, శ్రీశైలేశుల తల్లియునగు నామె గురుని వియోగమును సహింపజాలక, శరీరమును విడిచి, గురు సన్నిధికింబోయెను.

శ్రీశైలేశుడు తల్లిలేనిబిడ్డడాయెను. అప్పటినుండి ఆతని పినతల్లి పెంచదొడంగెను. ఇట్లుండ కూరకులోత్తము, దాసాకదినమున తిరువృత్తము నధ్యయనించుచుండెను. శ్రీశైలేశు లాతనినిజూచి "ఈ ప్రబంధము అతిమేని కాన తిమ్ము 'అని పలికెను. అందులకు కూరకులోత్తముడు "వత్సా! ఈ ప్రబంధము భగవచ్ఛటారాతికృతిము. దీనిని గురు సంబంధము లేనివారికి చెప్పదగదు"అని ఆనతిచ్చెను.

ఆవిషయమును శ్రీశైలేశులు పినతల్లి కెఱింగించెను, అప్పుడామె యతనితో "నాయనా! నీకు గురుసంబంధము లేకపోలేదు. చిన్నతనమునందే నిన్నుగొంపోయి నీతల్లి పిళ్ళ లోకాచార్యుల పాదంబులాశ్రయింపజేసెను. నీకు గురుండు పిళ్ళలోకాచార్యులు ఆవిషయము కూరకులోత్తముదాసునకు తెలుపుము"అని తెల్లమొనర్చెను.

అతం డావిషయమును కూరకులునకు నివేదించెను. అపుడు కూరకులుడు శ్రీశైలేశులతో "బిడ్డా! సాక్షాత్స ర్వేశ్వరుడే తన అవతారకాలములందు కొందఱను గురువులుగా స్వీకరించెను. అందువలన గురుశిష్య సంబంధము గొప్పది. నీవు పసితనమునందే లోకగురుని పాదాశ్రయము లభించినది,

ధన్యుఁడవు. నీకు సర్వవిషయ విశేషములును చెప్పెద రమ్ము"
అని శ్రీవచన భూషణాది దివ్యప్రబంధములన్నియు బోధించి,
"వత్సా! తిరువాయిమొళి అర్థానుసంధానపూర్వముగా
తిరుక్కణ్ణంగుడిప్పిళ్ళ యొద్ద నభ్యసింపుము" అని యాదేశించెను.
కూరకులోత్తముడు అప్పటికే మిక్కిలి వృద్ధుండగుటచే గురు
పాదములు స్మరించుచు, కాయమునువీడి, దివ్యధామంబున
కేగెను.

శ్రీశైలేశులు గురునివాక్యానుసారము తిరుక్కణ్ణం
గుడిప్పిళ్ల సన్నిధికరిగి, తానువచ్చిన విషయం బెఱింగించెను.
అతండంగీకరించి, తిరువాయిమొళి బోధించుచుండెను. ఆ అర్థ
వ్యాఖ్యానములను శ్రద్ధతోనాలించుచున్న శ్రీశైలేశునకు
కొన్ని సందియములు కలిగెను. వానిని గురుండు తీర్చుటకు
సమర్థుండు కాకపోయెను. అపుడు గురుండు శ్రీశైలేశుని
గాంచి "అయ్యా! నీవు మహామేధావివి. నీకు గ్రంథమును
చెప్పుట నాకుసాధ్యము కానిపని. నీకు దీనినుపదేశింపగల సమ
ర్థుండు తిరుప్పుళింగుడిజియ్యరు. ఆయన యొద్దకేగితివేని సర్వ
సందేహనివృత్తియగు. అచటికిపొమ్ము" అని పలికెను.

శ్రీశైలేశులు ఆ జియ్యరాచార్యుని కలియుటకై పోయెను.
శ్రీశైలేశుల ఆగమనమునకు పదిరెండుదినములపూర్వమే,
ఆ జియ్యరు ఆచార్యపదసన్నిధికింబోయె. ఆదినమున నారా
యణ బలియొనర్చుచుండిరి. ఆవిషయమెఱింగి శ్రీశైలేశులు
మిక్కిలిదుఃఖమునొంది, వచ్చినపని నెరవేరకపోయినను,
జియ్యరు పాదసేవయైన లభింపదయ్యెనని చింతించుచుండెను.

అచ్చట నాలూరాచ్చాంబిళ్ళ యను విద్వాంసుండు గలండు. ఆయనకు దేవరాజ గురుండనియు పర్యాయనామంబు గలదు. ఆయన శ్రీశైలేశులగాంచి కరుణించి "వత్సా! నీవేతెంచిన పనియెట్టిది!" అని ప్రశ్నించెను. అందులకు శ్రీశైలేశులు "అయ్యా! తిరుక్కణ్ణంగుడిప్పిళ్ళ సన్నిధినుండి, చనుదెంచితి. తిరువాయిమొళి అర్థానుసంధానపూర్వకముగా జియ్యరుస్వామి యొద్ద నధికరింపవలయునని వచ్చితి. సర్వేశ్వరుదండుల కంగీకరింపలేదు. కావున బాధనందుచుంటి" నని తెలిపెను.

దేవరాజ గురుండు ప్రసన్నుండై "వత్సా! నీ కట్టి పట్టుదలయున్నచో ఏతత్కార్యంబేను నిర్వహించెద. చక్కగా చదువుకొమ్ము" అని పాఠము చెప్పుటకు ప్రారంభించెను.

ఆసమయమున యాదవాద్రివాసులు కొందఱు తిరువాయిమొళి చదువవలయునని యెద నెంచిరి. దేవరాజగురుండు శ్రీశైలేశులకు బోధించుచున్నాడని యెఱింగిరి. వారు శ్రీదేవరాజగురుని ఆహ్వానించుచు, అభ్యర్థించుచు, "స్వామీ! మీరీయాదవాద్రికి శ్రీశైలేశులతో చనుదెంచి, యిచ్చటనేయుండి, ప్రబంధప్రవచనము నారంభించినచో, మేము చాలమందిమి నేర్చుకొనవలయునని భావించుచుంటిమి. ఇక తమదయ. సర్వేశ్వరకటాక్షము. మాభాగ్యము" అని శ్రీముఖముద్వారా తెలియచేసికొనిరి.

దేవరాజగురుండందులకు సమ్మతించెను. శ్రీశైలేశుని వెంటబెట్టుకొని యాదవాద్రికి పయనమయ్యెను. గురుండు వచ్చుచున్నాడని యాదవాద్రివాసులకు వార్తఅందినది. వారందఱును గురుదేవుని కెదురువచ్చి, సాష్టాంగదండవత్ప్రణామంబు లాచరించి, లేచి నిలువబడిరి. గురుండు వారినందఱను ఆలింగనాద్యుపచారముల తనిపి, యోగక్షేమంబుల నరసి, వారివెంట యాదవాద్రికేంజని, అచ్చటి విశేషములెల్ల నరయుచు బహ్యాభ్యంతరంగుండై కల్యాణీ పుష్కరిణియందు అవగాహించెను. ఆలయమును ప్రవేశించి, శ్రీమన్నారాయణు జుల దర్శించి సేవించెను. శ్రీభూనీళాది దివ్యమహిషీ సమేతుండై శంఖచక్రగదా శార్ఙ్గనందకాది దివ్యాయుధ ధరుండై యుగపదుదిత సహస్ర సహస్రకర ప్రభా భాసమానుండై హార కేయూర, కిరీటముక్తా దామోదరబంధన శింజానమంజు మంజీరాది భూషణ భూషితుండై అనవధికాతిశయ కారుణ్య గాంభీర్యౌదార్య చాతుర్యస్థైర్య సత్యకామ సత్యసంకల్ప కృతిత్వ కృతజ్ఞతాద్య సంఖ్యేయ కల్యాణగుణార్ణవుండును, భక్తాభీష్టప్రదుండును, నగు దేవాదిదేవుని, తిరునారాయణ స్వామిని దర్శించి అపాదమస్తకమనుభవించి, వారికి మంగళాశాసనముచేసి, తీర్థప్రసాదాది బహుమతులుపొంది, వారి యాజ్ఞగైకొని, మరలి, తటిల్లతాభాసమాన దివ్యవిగ్రహాత్మైు సుందరీమందారంబై వేంచేసియున్న ఢిల్లీసుల్తాను యుద్దుపట్టిం బట్టి జగన్మోహన విగ్రహుండై వేలనుల యాభిముఖ్యము విరీ

క్షించుచున్న శేల్వప్పిళ్ళరాయని దర్శించి, ఆనందాతిశయంబున మేనుమఱచి, ఆనందాశ్రువులు కందోయివర్షింప, వేదవాక్యం బుల వినుతించి, అచ్చటినుండి మరలివచ్చి యాదవాద్రియందు నివాసమేర్పరచుకొనియెను.

సుముహూర్తమున దేవరాజగురుండు, తిరువాయిమొళి, తిరువృత్తము, తిరుమంగై యాళ్వార్ల దివ్యప్రబంధములు, శ్రీవచనభూషణము మొదలగు దివ్యగ్రంథముల నన్నింటిని అర్థానుసంధానపూర్వకముగా శిష్యులకుపదేశింపప్రారంభించెను. ఇట్లు కొంతకాలంబుండి, శిష్యులనందఱి ను తీర్థులగావించి, వారిసత్కారములంది, యాదవాద్రీశ్వరు ననుమతిందీసికొని, యాదవాద్రినివీడి స్వగ్రామంబునకు విచ్చేసెను.

శ్రీశైలపూర్ణులును గురునితోఁగూడి విచ్చేసి, కొంత కాలము గురువు నొద్దనేయుండి శుశ్రూషచేయుచుండెను. దేవరాజగురుండు శ్రీశైలేశులు గావించు శుశ్రూషకు, అతని విద్యావైదుష్యమునకు, ఆనందించి, ఒక బాలగోపాలుని విగ్రహం బొసంగెను. శ్రీశైలేశులు, ధన్యోఽస్మి కృతకృత్యోఽస్మియని గురునియొద్దనుండి తద్విగ్రహంబును గ్రహించి, గురునియొద్ద సెలవుతీసికొని, తిరిగి స్వగ్రామంబగు కురుకాపురంబునకు విచ్చేసెను.

# శ్రీశైలేశుల వైభవము

శ్రీశైలేశులు కురుకాపురంబునకు విచ్చేయునప్పటికి, వకుళాభరణయోగి వలసపోయి తిరుక్కణ్ణాంబియను గ్రామము నందు వేంచేసియుండెను. శ్రీశైలేశు లావార్తవిని, కురు కాపురమునందలి గోపురప్రాకారమంటపాదుల నన్నింటిని ఉద్ధరింపించి, వకుళాభరణయోగిని తెచ్చి పునఃప్రతిష్ఠ కావించెను.

తదనంతరము శ్రీశైలేశులు తిరువనంతపురమునకుం జనెను. తద్దివ్యదేశవైభవంబున కచ్చెరువంది, దేవాలయంబు నకు జనెను. అక్కడ పద్మనాభస్వామి అహీంద్రశయానుండై యుండు, ఆస్వామిని ద్వారత్రయమునందును దర్శించి, సేవించి, మంగళాచరణము కావించెను. అనేక దివ్యదేశంబులు చూచుచు, తత్తద్దివ్యదేశవాసులగు భాగవతోత్తముల యొద్ద శ్రీభాష్యాదిగీర్వాణ భాషాప్రయుక్తంబులగు గ్రంథములను, శ్రీవచనభూషణాది ద్రావిడప్రయుక్త దివ్యప్రబంధములను పఠించుచు, తిరిగివచ్చి శ్రీనగరియందు నిత్యనివాసియై యుండెను.

సంస్కృత గ్రంథములన్నియు త్రైగుణ్య విషయికము లని ఆతడు గుర్తించెను. ఆళ్వార్లు పాడించిన ద్రవిడప్రబంధ ములన్నియు భగవత్పరములు. భక్తివైభవ ప్రతిపాదకములు. ఆ ద్రవిడప్రబంధములలో తిరువాయిమొళి శ్రేష్ఠతమము

కావున ప్రతిదినంబును, శఠారాతిప్రోక్తంబగు తిరువాయిమొళిం చదువుచు, తద్రసాస్వాదముచే నానందాతిశయంబునందుచు, సమస్తజనులకు తదర్థంబు నిర్ధరించి చెప్పుచు, కాలక్షేపము చేయుచుండెను. అందుచే ఆయనకు తిరువాయిమొళిప్పిళ్ళ యను నామధేయమేర్పడియెను. ఆనామమే లోకమున దశ దిశల వ్యాపింపంజెను. అట్లు తిరువాయ్మొళి చదువుచు, శఠారాతికైంకర్యమే నిత్యకృత్యముగా తలంచి, వకుళాభరణ యోగి నర్చించుచు కురుకాపురమున కాలమును గడపు చుండెను.

పాండ్యదేశము దివ్యదేశంబులకెల్ల నుత్తమోత్తమమని ప్రసిద్ధినందె. అట్టి పాండ్యదేశమునకు తిలకాయమానము కురు కాపురము. ఆ కురుకాపురమునందే తిహాళక్కిడందారు కాధరణ్ణరయ్యారను సూరిసత్తముండు గలడు. అతనిభార్య శ్రీరంగనాయకి. లోకమునందు ప్రపత్తి నిష్ఠనభివృద్ధిపరుప దలంచినవాడై శ్రీమదాదిశేషుడే, శ్రీపతి ఆజ్ఞచే ఆపుణ్య దంపతులకు, పుత్రుండై జనించె. ఉదయభానుండు ప్రాచీదిశను వెలిగించురీతిగా, నాబాలకుండు పురుటింటిని భాసింపజేసెను. ఆ పిన్ననిగాంచి తండ్రి ఆనందించెను. పదనొకొండు పురిటి దినములు తీరినతదుపరి, తామ్రపర్ణీనదీ తోయంబుల శుద్ధి స్నానం బాచరించి, కేశవాది ద్వాదశనామంబులు జపించుచు, ద్వాదశోర్ధ్వపుండ్రంబులు ధరించి, భగవచ్ఛాసనంబులుతీర్చి, పుణ్యాహవాచనం బాచరించి, మంగళవాద్యంబులు మ్రోద

మందముగ ప్రోయుచుండ నబ్బాలునకు "అళహియమణ వాళప్పెరుమాళ్ నయనా"రను నామకరణంబొనరించెను.

ఆ బాలుండు శుక్లపక్ష సుధాంశునింబోలె దినదిన ప్రవర్ధమానుండు కాదొడంగె. తండ్రి తగినసమయమున ఆ బాలునకు ఉపనయనంబొనరించి, వేదమునభ్యసింప జేయుచుండెను. అతండు సకృచ్ఛ్రవణమాత్ర, అధీత వేదవేదాంగుండై, షోడశకళాపరిపూర్ణ రాకాసుధాకరుని భాతిప్రకాశించుచుండెను.

వివాహయోగ్యమగు వయస్సున తల్లిదండ్రు లాతనికి నుద్వాహంబు వేడుకగా జరిపించిరి. ఆకన్య సుగుణవతి. సౌందర్యరాశి. ఉత్తమవంశప్రసూత. భార్యాభర్తలనుకూలములో తల్లిదండ్రులను సేవించుచుండిరి ఈవిధముగా తిహశక్రడందారు కాధరణ్ణరయ్యారు, ఐహికసుఖంబుల ననుభవించి, సంసారబంధంబు బాపుకొని, గురుని శ్రీపాదపద్మములు స్మరించుచు, నిత్యధామంబునకేగెను.

కుమారుండగు మణవాళప్పెరుమాళ్ళు తండ్రి వియోగంబు సహింపలేక కన్నీరుమున్నీరుగా విలపించుచు, తండ్రికి నుత్తరక్రియలు యథావిధిగానొనర్చి శాంతుండయ్యెను.

కురుకాపురంబుననే తిరువాయిమొళి చెప్పుచున్న మహాపురుషులు, శ్రీశైలేశుల దర్శింపవలయునను, ఆకాంక్షతో మణవాళప్పెరుమాళ్లొకనాడు, శ్రీశైలపూర్ణుల కడకరిగి వారి శ్రీపాదములకు మోకరిల్లెను. గురుండాతని నాదరంబున లేవ

నె_త్తి కూర్చుండ నియోగించి, మృదుమృదూ క్తులతో "వత్సా! నీవిపుడు మాయొద్దకు వచ్చిన కార్యంబేమి?" యని ప్రశ్నించెను.

అందులకు మణవాళప్పెరుమాళ్ళు "దేశికసార్వభౌమా! వకుళాభరణయోగీంద్రు లానతిచ్చిన తిరువాయ్ మొళికి, అనేక పూర్వవ్యాఖ్యానములు కలవు. వానితోపాటు, పూర్వులు సాయించిన దివ్యప్రబంధములనెల్ల తమయొద్ద నధికరింపవచ్చితి. ఈదాసునకు, వానిని చెప్పవలసినదిగా ప్రార్థించుచున్నాడ"నని వేడెను.

గురుండు సంతసించెను. తత్కార్యంబున కంగీకరించి, నాలాయిరప్రబంధముల నన్నింటిని వ్యాఖ్యానపూర్వకముగా ఆనతిచ్చెను. ఏకసంధాగ్రాహియగు మణవాళప్పెరుమాళ్లు వాని నెల్ల సాకల్యంబుగా నాకళించి, గురుండగు శ్రీశైలదేశికుని యందు దైవభావముంచి, యతని పాదములే ధారకపోషకము లుగానెంచి సర్వకాల సర్వావస్థలయందును సేవించుచు, గురు కైంకర్యమే పరమప్రాప్యంబనియెంచి తత్సన్నిధియందేయుండి శుశ్రూష చేయుచుండెను.

ఒకదినమున శ్రీశైలేశులు శిష్యునితో "వత్సా! ఈమతమునకు మూలభూతులు నమ్మాళ్వారలు. వారి శ్రీపాద ములే మనకు రక్షకములు. అట్లు భావించి రామానుజ యోగీంద్రులు జగత్తునంతయు పునీతముగావించి యుద్ధరించిరి. ముందు పరమపదమలంకరించిన వారికి, నిప్పుడున్న వారికి,

భవిష్యత్తునరాబోవువారికి భాష్యకారులే ఆచార్యులు. వారి విషయమున ప్రపత్తికలిగియుండుము. ఇది నాప్రగాఢ విశ్వాసము" అని సెలవిచ్చెను.

మణవాళ మహాముసులు గురులవాక్యంబులు విశ్వసించి, యతిరాజుల పదపద్మములే శరణమునని నమ్మి శ్రీనగరి యందొక దేవళమును కట్టించి, అందు శ్రీమద్రామానుజుల విగ్రహంబును ప్రతిష్ఠించి, నిత్యోత్సవాదులు చేయించుచు, 'యతిరాజవింశతి' యను స్తోత్ర మొండురచించి, గురుండగు శ్రీశైలదేశికునకు చూపించెను. గురుండు మిగులసంతసించెను. యతీంద్ర పదపద్మప్రవణతంజేసి, మణవాళ మహామునులకు 'యతీంద్రప్రవణు'లను నామధేయంబు విఖ్యాతమయ్యె. మరియు సౌమ్యజామాతృమునియనియు, రమ్యజామాతృముని యనియు నాతనికి ప్రసిద్ధనామంబులు కలవు.

శ్రీశైలపూర్ణులు సాత్వికతా స్తికతా విజ్ఞాన వైరాగ్యాది గుణంబులు శిష్యుండగు సౌమ్యజామాతృముని యందు నిశ్చలములుగా నుండుటంగాంచి తనమనంబున "ఈ నాశిష్యుండగు మణవాళప్పెరుమాళ్లు సామాన్యుండుకాడు. వైదుషీ విశేషంబున అపరశేషుండు. వాగ్ధాటియందు దేవగురుండు. జ్ఞానంబున సనత్కుమారుండు. వైరాగ్యంబున వాయు తన యుండు" నని యెంచి. ఆతనికి యతిరాజ విగ్రహంబొండు అర్చానిమిత్తమై యొసంగెను. శ్రీవారి వనమునుండి, పనస రంభావార్తాకాది శాకంబులును, కాంతోపయంతృసూరికి

పంపించెను. గురుండు పంపినవానినన్నింటినింజూచి, అతఁడు విస్మయంబంది, గురునింగాంచి, "అయ్యా! దేవరవారిట్లు ఈ దాసుని అనుగ్రహించుటకు కతంబేమి?'యని ప్రశ్నించెను.

అందులకు గురుండు "వత్సా! పూర్వము అర్చావతారాసక్తులమైయున్న మాకు, ఇప్పుడు నీకన్న అభిమతవస్తు వెయ్యదియు కానవచ్చుటలేదు. కావున అత్యాన్ప్రీతి"వని ఆనతిచ్చెను.

అందులకు మణవాళప్పెరుమాళ్లు "ధన్యోఽస్మి - కృతార్థోఽస్మి'అను గృహీతోఽస్మి"యని, గురునిపాదంబులకు ప్రణమిల్లి సంతసించెను. శ్రీశైలనాథుడు మణవాళమునులను తన సమీపంబుయందు కూర్చుండబెట్టుకొని భోజనాదులుసేయుచు, తన శ్రీపాద్యంబు నిత్యమాతనికొసంగుచు అతనిపై బద్ధానురాగుండైయుండెను.

అదిచూచి కొందఱు ఈర్ష్యాళువులైన వైష్ణవులు సహింపలేకపోయిరి. ఎట్లైనను, గురునకు, మణవాళమునుల యందనిష్టము కలిగింపవలయునని భావించిరి. వారు గురుని యొద్దకుంబోయి, మణవాళమునులపై లేనిపోని దోసంగులెన్నేనియు కల్పించిచెప్పిరి. అపుడు గురుండు సౌమ్యజామాతృసూరిం బిలిపించి "వత్సా! నీప్రభావంబేమియు నెఱుంగక యున్న ఈ మూఢజనులకు నీప్రభావము తెలియపరచుము" అనునట్లు సైగచేసెను.

మణవాళమహాముసులు గురుదేవుని కనుసన్నలోని అంతర్యము నెఱింగి, వేదవేదాంగేతిహాస పురాణధర్మశాస్త్రాది గీర్వాణగ్రంథములు, తిరువాయిమొళి, శ్రీవచనభూషణము నాదిగాగల ద్రవిడగ్రంథ విశేషంబుల సహస్రముఖంబుల నుపన్యసింపదొడంగెను. గంగాప్రవాహ సదృశవాగ్ఝరీవేగంబు నకు విస్మయంబంది ఈతండు సామాన్యుండుకాడు. సాక్షాదాది శేషుడే ఈరూపమ్మున నవతరించియుండవచ్చునని తలంచి, అందఱును ఆతని పాదములకు సాష్టాంగములాచరించిరి. అనేక విధముల నాయన మహిమనుకొనియాడి, తామొనరించిన తప్పునకు పశ్చాత్తప్త చిత్తులైరి.

కాంతోపయంతృయోగికి ఒకపుణ్యముహూర్తంబున కుమారసంభవమయ్యెను. ఆతనికి జాతాశౌచాదులు నిర్వర్తిం చెను. 'రామానుజయ్య'అను నామకరణంబొనరించెను.

మహాపూర్ణుల నాశ్రయించి, జగత్ప్రఖ్యాతిగాంచిన యతిరాజు చందంబున శ్రీశైలనాథు నాశ్రయించి, మణవాళ మహామునియు జగద్విఖ్యాతిగాంచెను. అట్టి మణవాళమహా మునినిగాంచి, వైష్ణవులెల్లరు, ఎంబెరుమానారుల అపరావ తారం బీతండని భావించి సేవించుచుండిరి.

శ్రీశైలనాథుని శరీరమును జరాభూతమాక్రమించెను. ఈ ప్రకృతిబంధముల పరిత్యజించి, నిత్యలోకమునకు వేంచేయ వలయునని, వాంఛించెను. ఒకదినమున ఒకగదియందు పవ్వ ళించి, ముసగువైచుకొనియుండెను. శిష్యులదిగాంచి, గురుని

పాదారవిందంబులకు వందనంబాచరించి "స్వామీ! మీరీరీతి శయనించుట నెన్నండును కానము. మీ మనస్సు చింతాక్రాంత మైయున్నదని భావింతుము. మీ యీదురంతచింతకు హేతు వేమి? ఈ దాసులకు దేవరవారు విశదపరచినచో, ఈ దాసులకు సాధ్యమగుచో దానిని నిర్వహించెదము." అని అనేక విధముల వేడుకొనిరి.

గురుండు వారికి బదులీయకుండె. అంతవారీయుదంత మును కాంతోపయంతృముని చెంతకుచేర్చిరి. అతడింకొంత మంది వైష్ణవప్రవరుల కూర్చుకొని, నక్షత్రపరివేష్టితుండగు సుధాంశునిభంగి గురుమఠంబునకువచ్చెను. గురుని పాదార విందంబులకు నతులొనర్చి "గురుమూర్తీ! మీరిట్లవగుంఠ నముపైచుకొని పరుండుటకు కతంబేమియో తెలియంగ వచ్చునా? మీమనస్సుననున్న కార్యమేమో, యీదాసునకు తెలియజేసినచో, ఏదు నెరవేర్చుటకు సిద్ధముగనున్నాడు. శ్రీశ్రియఃపతుల అనుగ్రహము స్థిరముగనున్నచో నీదాసుడు నెరవేర్చితీరును" అని విన్నవించుకొనెను.

శ్రీశైలేశులు ముసుంగును ద్రోసివైచి కూరుచుండిరి శిష్యులనందఱను కూర్చుండ నియమించి, మణవాళమునిం జూచి "వత్సా! పూర్వము కలియుగాదియందధర్మము విజృంభించి, నాస్తికవాదము ప్రబలిపోయెను. ఆసమయమున వ్యాసాదిమహర్షులు తమశిష్యులను దిగంతములవఱకు పంపి, భగవద్విషయమును ప్రచారమొనరింపజేసి, నాస్తికవాదము

నా_స్తియనునట్లు నశింపజేసిరి. తదుపరి సర్వేశ్వరుండు తన సేనానియగు విష్వక్సేనులను భూమండలంబునకంపెను. అతడు కారిసూనుడై జనించి, శఠరాతియను ప్రఖ్యాతాభిధానము వహించి, లోకమునుద్ధరించుటకై ద్రవిడభాషయం దనేక గ్రంథములు రచించెను. ఆళ్వారు లెన్నియో గ్రంథములు ద్రావిడభాషయందు సాయించిరి.

వ్యాసులు వేదములను సంస్కరించునట్లుగా నాథముని ద్రవిడ ప్రబంధముల సంస్కరింపదలంచిరి. వెంటనే శఠారాతి ప్రోక్తములగు తిరువాయి మొదలగు మూడుప్రబంధముల మూడువేదములుగా, కలిహైరిప్రోక్తములగు షట్ప్రబంధముల వేదాంగములుగాచేసెను. మిగిలిన ఆళ్వారులు చెప్పిన ప్రబంధములను, పైవానికి ఉపాంగములుగా కల్పించెను. వాని కన్నింటికిని స్వరసంతతినేర్పరచెను. తిరువాయిమొళిని సామవేదముగా నెన్ని దానికి గాంధారగ్రామము కల్పించి, వాని నన్నింటిని శిష్యులకును మనుమలకును చెప్పి లోకమునందు వానిని వెల్లడింపజేసెను.

పిమ్మట యామునమునులు, యతీంద్రులు ఆ ద్రావిడ ప్రపంచమును అభివృద్ధిపరచుచు వచ్చిరి. ఒకప్పుడు శ్రీరంగము నందొక జల్పాకుడు తిరువాయిమొళికి తనయిచ్ఛవచ్చినట్టు లర్థమును చెప్పుచుండెను. యతీంద్రు లద్దానిని విని చాల బాధపడి, తనశిష్యునిచే నొక దివ్యమైన వ్యాఖ్యానమును వ్రాయించెను.

తదుపరి పరాశరభట్టరు సంప్రదాయ గ్రంథముల కన్నింటికిని విశిష్టాద్వైత మతపరముగా అర్థమును చెప్పగా నంజీయ్యరు దానినెల్ల 'భగవద్విషయ' మనుపేర నొక బృహద్గ్రంథమును విరచించెను. దానిని నంబిళ్లై చేత వ్రాయించి, అతనికి దాని నామూలాగ్రముగా నుపదేశించెను. నంబిళ్లై దానిని విస్తృతపఱచిచెప్పెను, దానిని పెరియవాచ్చాంబిళ్లైయు, వడుక్కుత్తిరువీధిపిళ్ళయు మొదలగు శిష్యులు గొప్పగొప్ప వ్యాఖ్యానములు వెలయించిరి. ఆగ్రంథోదంతంబులన్నియు నేను మీకు విశదీకరించితి. ఆద్రవిడ గ్రంథములన్నియు ప్రపత్తి విషయికములైనవి. సత్సంప్రదాయకములైనవి. ఇకముందీ దివ్యగ్రంథములను శ్రద్ధగా పఠించువారు కనుపించుటలేదు. సర్వజనులకు గీర్వాణభాషాభిమాన మభివృద్ధియగుచున్నది. ఈప్రబంధముల జోలికెవ్వరునురారు. ఈసంప్రదాయము, ఈ ప్రపత్తివిద్య యింతటితో ముగిసిపోనున్నట్లు గోచరించుచున్నది. అందులకై మనస్సు మిగులవ్యాకులత చెందుచున్నది. తత్కారణంబున ముసుగిడుగొని పండుకొంటి'నని తన యావేదన నివేదించెను.

మణవాళముని ఆ విశేషములన్నియు శ్రద్ధగా విని "స్వామీ ! మీరీబాధను మనస్సునందుంచవలదు. ఈ మీ శిష్యుడు భవద్దయచే సజీవుండైయుండెనా, మీవాంఛితమీతడీడేర్పగలడు. అట్టిశక్తిని ప్రసాదింపుడు," అని విన్నవించుకొనియెను.

ఆ మాటలువిని గురుండు "వత్సా! ఊరక మాటలు చెప్పినంతమాత్రమున నా అరటమూరట చెందునా! నీవు ప్రమాణముగావించినచో నేను, శాంతివహింతు"ననియెను.

అంత కాంతోపయంతృయోగి శ్రీ శైలనాథుల శ్రీపాదములు స్పృశించి, "స్వామీ! మీపాదములు ముట్టి ప్రమాణముచేయుచున్నాడ. నేను సంస్కృత వేదములు, గీర్వాణభాషాగ్రంథములు చదువను. కేవలము ద్రావిడ గ్రంథములనే పఠించుచు కాలముగడపెద"ననెను.

గురుండు సంతసించి "వత్సా! నామనోవ్యాకులత వెనుబట్టినది. నీవు యతీంద్రులపై భక్తితో శ్రీభాష్యము నొకసారి అర్థమగునట్లు పఠింపుము. తనుపరి యీ ద్రావిడ గ్రంథములనే అధ్యయనింపుము. ప్రపత్తివిద్యను వృద్ధిపరచుచు, శ్రీరంగమును నిత్యధామముగా నంగీకరించి, శ్రీరంగని సేవింపుము"అని అనతిచ్చెను. తదుపరి శిష్యులనెల్ల రావించి "మీరందఱును, ఈ మణవాళ మహామునులను మాకు మాఱుగా గారవింపుడు"అని ఆదేశించి, పిళ్లలోకాచార్యులవారి శ్రీపదపద్మయుగళంబును ధ్యానించుచు, మేనువిడిచి, దివ్య లోకమునకు వేంచేసెను.

శిష్యులందఱును గురుని యెడబాటును సైపజాలక ఒకరినిపట్టుకొని, యొకరు దుఃఖించినవారై, కొంతతడవునకు, తమంతటతామే ఊరటచెందిరి. శ్రీశైలనాథులకు ఉత్తర క్రియలన్నియు యథాశాస్త్రంబుగా నిర్వర్తించిరి. శ్రీవైష్ణవ

జనంబులకు భోజనచందన తాంబూలాదులొసంగి బ్రహ్మమేధం బంతయు పూర్తిగావించి సుఖంబుగానుండిరి.

శ్రీశైలేశుల తనియ

శ్లో॥ శ్రీశైలేశ గురుం లోకదేశికాంఘ్రి సమాశ్రయమ్
వృషే విశాఖ సంభూతం వందే వరగుణార్ణవమ్.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

## మణవాళమహామునుల వైభవము

శ్రీశైలనాథుల యనంతరము మణవాళమహాముని వైష్ణవసిద్ధాంత ప్రవక్తయయ్యెను. ప్రమాతృప్రమాణప్రమేయంబులు విలక్షణంబులుగా వర్ణించుచు, శఠారాతి దివ్య పాదారవిందంబులు సదాధ్యానించుచు, నిత్యకైంకర్యధురంధరుండై, యతీంద్రప్రవణుండై శ్రీనగరియందు వేంచేసి యుండెను. ఆసమయమున అళహియవరదగురుండు, సేన మొదలియాణ్డా, మొదలగు సూరివరులేతెంచి, శాంతోపయంతృయోగి శ్రీపాదము లాశ్రయించిరి. వారు గురుని శ్రీపాదములే రక్షకములని తలంచి, సర్వవిధ శుశ్రూష లాచరించుచుండిరి.

మణవాళమహామునులకే వరవరముని యనియు, శాంతోపయంతృయోగి యనియు నామాంతరములు. అవర

వరముని, తన గురుదేవులు, అవసానదశ యందాజ్ఞాపించిన విషయమును స్మరించి, శ్రీరంగమునందుండదలంచి, కావేరి సూనుచరణంబులకు కైవారంబుచేసి, తదాజ్ఞవడసి, తన ఆశ్రితులతోడను, శిష్యులతోడను శ్రీవిల్లిపుత్తూరునకు పోయెను. అచ్చట విష్ణుచిత్తులసేవించి, తత్తనయగు గోదాదేవికి ప్రణమిల్లి వడపెరుంగోయిలు దయానునని పూజించి, శ్రీభూనీళాది జగన్మాతలకు జోతలిడి, మంగళాశాసనమొనర్చి కొన్నిదినము లచ్చటనుండెను.

పిదపవారి ఆజ్ఞగైకొని, అచ్చోటబాసి, మధ్యేమార్గంబు నందనేక దివ్యదేశంబులు దర్శించుచు, అటనున్న సర్వేశ్వరునకు మంగళాశాసనముచేయుచు చనిచని, విరజానదీవేష్టిత నిత్యధామంబువలె, మరుద్వృధావేష్టితంబై, సప్తప్రాకార పరివృతంబైన శ్రీరంగధామంబునకు చేరెను.

వరవరముని, పరివారయుతముగా, కావేరీ జలంబుల నిమజ్జనం బాచరించి, శ్వేతమృద్రచితాంతరాళికా విరచిత తప్తచామీకర ప్రభాభాసమాన శ్రీచూర్ణరేఖావిలసిత ద్వాదశోర్ధ్వపుండ్ర చిహ్నితద్వాదశస్థల శరీరుండై తన ఆశ్రితులందఱును వెంటరాగా, మునీంద్రపరివేష్టిత దత్తాత్రేయ మహర్షి భంగి వెలుంగొందుచు, శ్రీరంగధామంబును ప్రవేశించెను.

శుకపికాది శకుంతసంతానాక్రాంత మనోహరోపవనము లలో కమనీయకల్హార, కుముద, కమలినీ, శతపత్ర విలసిత

కాదంబసార సాదిజలవిహంగ సంభాసుర సరోవరంబులతో, క్రయవిక్రయార్థ జనసమాజ విరాజిత విశాలరాజవీధులతో, ప్రకాశించుచున్న శ్రీరంగనగర వైభవంబునకు అద్భుతాంబుధి నోలలాడుచు, రంగధాముని నివాసమందిరముచేర నరిగెను.

అచట కలివైరి నిర్మితసప్తప్రాకారములను, దివ్యమంటపముల వైభవంబును తిలకించి, పులకించుచు, సప్తప్రాకారములు దాటి గరుడునకునమస్కరించి, మూడులోకంబుల ప్రభుండితండని సూచించునట్లు గగనంబు నొరయుచున్న ధ్వజదండంబున కంజలించి, జయవిజయుల గొనియాడి, ప్రణవవిమానంబునకు ప్రక్రమంబొనరించెను ఆ ప్రణవవిమాన మధ్యంబున సహస్రఫణావిరాజిత దివ్యరత్న ప్రభాబాసమాన శేషపర్యంకంబున, పాదసరోజంబులుసాచి, యొక దివ్యహస్తమునుచాచి, యొక దివ్యహస్తంబు శిరస్సుక్రింద నుపధానంబుగానుంచి, బద్ధచేతనుల నుద్ధరించుచు, జీవవ్రాతముల అభిముఖ్యంబు నిరీక్షించుచు, శ్రీభూనీళాది దివ్యమహిషీమండలంబు పదపద్మముల సన్నిధినుండి సేవించుచు, ఆశ్రితసంతతికాభిముఖ్యంబు లొసంగుచున్న దేవాదిదేవుని రంగరాజభగవానుని దర్శించి, పెన్నిధింగన్న పేదపగిది, మేఘసందర్శనంబున ఆహ్లాదించు చాతకంబుభాతి, ఆనందించి వేదవాక్యంబుల సన్నుతించి, సర్వేశ్వరు నాపాదమస్తకం బనుభవించి భట్టనాథ ప్రణీతంబగు ద్వాదశగాథలు విన్నవించి, అటనుండికదలి రంగేశ్వరిని కన్నులార దర్శించి తరించి, యతీంద్రుల పదపద్మారాధనంబు నెఱపి

పదుగురాళ్వారుల దర్శించి, ఆలయమునుండి వెలువడి, స్వాచార్యసముండగు కేట్టూరణ్ణగారను మహాపురుషుని సవిూపించి, ఆయన శ్రీపాదములకు నమస్కరించెను.

కేట్టూరణ్ణ వరవరమునిని నిశితముగాపరిశీలించి, రామానుజుని యపరావతారము సుమూయని భావించి అర్ఘ్యపాద్యాది విధులగౌరవించెను. ఒక భవనమున విడిదిచేయించెను. తండులాది సమస్తభోజనపదార్థములను పంపించెను. వానినన్నింటిని పచనమొనరించి, వరవరమునివర్యుండు, సర్వేశ్వరునకు నివేదించి, నాపడి కొంతివడి విశ్రమించెను. తదనంతర మనేక సూరిజనులువచ్చి వరవరమునిని పరివేష్టించి కూర్చుండిరి. కేట్టూరణ్ణగారు వరవరమునింజూచి "మహాత్మా! తిరువాయిమొళియందలియొక పాశురమునకు మీగురుసన్నిధినివిన్న అర్థంబుపన్యసింపు"డని కోరెను.

ఆ వరవరముని, వేదవేదాంగాదులను సమన్వయము కావించుచు, విశిష్టాద్వైతపరముగా సహస్రవిధముల సమర్థించి వక్కాణించెను. సూరిసత్తములందఱు వద్భుతాశ్చర్య నిమగ్నులైరి. ఈ తండుసామాన్యుండుకాడు. నాతొందాది శేషుడే యీరూపమున నవతరించియుండనోపునని, కొనియాడుచు, అనేకవిధముల సేవించుచు, సాయంకాలము, వరవరమునితోగూడి రంగేశ్వర దర్శనార్థమై కోవెలకుపోయిరి.

రంగేశ్వరుడు అర్చకులచే కాంతోపయంతృయోగికి తీర్థప్రసాదము లిప్పించి, బహుమతుల నిప్పించి "వత్సా!

యామునరామానుజాది యోగులెట్లు శ్రీరంగమున నిత్య నివాసమొనర్చిరో అట్లే నీవును ఆ దేహపాత మీ శ్రీరంగ మునసే మాసన్నిధిని నివసించియుండుము. ఇది మీతల్లియగు శ్రీదేవియాజ్ఞ. నాశాసనము" అని ఆజ్ఞాపించెను.

వరవరముని ధన్యుండనైతినని తలంచి శ్రీరంగము నందే నివసించియుండెను. కొంతకాలమునకు తిరుపతికేగి శ్రీని వాసుని దర్శించి రావలయునను తలంపుకలిగెను. రంగరాజాజ్ఞ గైకొని కొంతమంది అంతేవాసులతో కావేరినుత్తరించి, ఏదేవి సర్వజనాభీష్టప్రదాయినియై ప్రకాశించుచుండెను. ఏమహాదేవ్యాలయమునకు తొల్లికలిహరుడు ప్రాకారములు నిర్మించెనో, సృష్టిస్థితిలయకారకుండగు శ్రీమన్నారాయణుండే దేవికి విధేయుడై వర్తించుచుండునో, పంచప్రాకార పరివేష్టిత దివ్యదేశమునందే జగజ్జనని వేంచేసియుండెను, అట్టి తిరువెళ్ళ రను దివ్యదేశంబునకు చనియెను.

ఆ జననికి ఆపాదమస్తకము మంగళాచరణంబాచరించెను. ఆదిమదంపతులగు పంకజవ్వోల్లితాయారు, శెందామరక్కణ్ణన్ అను శ్రీశ్రియఃపతుల స్తుతించి, వారి యనుగ్రహప్రాప్తుడై వారి యాజ్ఞగైకొని, అచటనుండి కదలి తిరుపతికింబోయెను.

అచ్చట యతీంద్రులచే ప్రతిష్ఠింపబడిన తిల్లిగోవింద రాజులను దర్శించి, రామాలయంబునకేగి, శ్రీసీతారామ లక్ష్మణుల దర్శించి ఆనందించి, అచట కొన్ని బహూకృతులు

స్వీకరించి, సత్త్వస్వరూపంబుననున్న శేషాచలము నధిరోహించెను.

అచ్చట బంగారుకోనేటియందు స్నానంబాచరించి. వరాహస్వామిని దర్శించి, త్రిప్రాకారపరివేష్టితంబగు శ్రీనివాసుని దివ్యదేవాలయమును ప్రవేశించెను. దివ్యగోపురమునకు కతులొనర్చెను. రెండు ప్రాకారములతరించి, పవిత్రమైన చాంపేయదేహళిదాటి, మేయన్ వరదరాజస్వామిని సేవించి, బంగారుద్వారయుతంబగు దివ్యరూపంబును వీక్షించి, మహానసలక్ష్మిదర్శనముచే పరవశించి, సమస్తానందనిలయమైన ఆనందవిమానమును కన్నులార సేవించెను. ఆదేవళమునకు సాష్టాంగదండవత్ప్రణామంబు లాచరించెను. ప్రదిక్షిణంబొనరించెను. సూత్రవతీశునకు కైమోడ్పుగావించెను. పదుగురాళ్వార్లకు మూరుగా నొక్కచేయున్న యతీంద్రుల పదపంకజములకు ప్రణతిరొనర్చి, యోగన్నృహరి పాదములచెంత మోకరిల్లెను. బలిపీఠంబునకు జోహారులిడెను. ధ్వజదండంబున కంజలించెను. వేదమయుండగు గరుత్మంతునకు ప్రణమిల్లెను, జయవిజయులకు మంగిడీలొనరించెను. దివ్యాలయమునందు ప్రవేశించి, వరుసగా కక్ష్యలనుదాటి, దివ్యదేహళీ రూపంబున నున్న కులశేఖర దివ్యసూరింగాంచి ప్రస్తుతించెను.

కోటిభాస్కర ప్రభాభాసమానుండై, సుధాధారా సమమందహాస సుందరవదనారవిందుండై, దివ్యరత్న ఖచితతప్త చామీకరవిలసిత కోటీరహార కేయూరకుండల గ్రైవేయ

కాంగద కటిసూత్ర కింజానురంజిత మంజీర పుంజాది దివ్యాలంకార భూషితుండై, చేతనాభిముఖ్య నిరీక్షకుండై బద్ధచేతన రక్షాదీక్షాధురంధరుండై, జగ జ్జన్మస్థేమలయలీలావిలాసవిలసితుండై, లక్ష్మీవిరాజితోరస్థ్సలుండై, వనమాలాలంకృత దివ్యదేహుండై కల్పకవృక్షంబున వ్రేలు నునుసుమగుచ్ఛంబులకైవడి హస్తద్వయంబున శంఖచక్రధరుండై, జ్ఞానశక్తి బలైశ్వర్యవీర్య తేజస్సౌశీల్య గాంభీర్యౌదార్య చాతుర్య స్థైర్య సత్యకామ, సత్యసంకల్పకృతిత్వ కృతజ్ఞతాద్య సంఖ్యేయ కల్యాణగుణ గణార్ణవుండై, 'కలౌ వేంకటనాయకః' అను సూక్తి సార్థకపరచుచు, తన శ్రీపతిత్వమును లోకములందు ప్రకటించుచు, నొకచేయి అధోభాగంబునకుచాచి, తనపాద పంకజయుగళంబుగప్ప నీజీవులకు రక్షకంబన్యంబులేదని సూచించుచు మరియొక శ్రీకరంబున నేనండగానుండగా భయంబు లేదని అభయముద్రను ధరించి వేంచేసియున్న శ్రీ శ్రీనివాస పరబ్రహ్మమును దర్శించి, ఆకొన్నవాడు సిద్ధాన్నమునుగాంచిన రేవ, నిరుపేద, పెన్నిధింగాంచినరీతి చకోరము చంద్రుని దర్శించి నట్లానందించి,

"శ్రియః కాంతాయ కల్యాణనిధయే నిధయేర్థినాం
శ్రీవేంకట నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్"

అని ప్రారంభించి, వేంకటేశ్వర దివ్యభవ్యాంగంబు లన్నింటికిని మంగళాచరణం గావించి, సుప్రభాతం బాలపించి, చేతులు జోడించి నిలువబడియుండెను.

శేషాద్రిరమణుండు వరవరమునిం గరుణించి, తీర్థప్రసాదముల నిప్పించి, తిరువాలవట్టము, తిరుత్తుళాయి మొదలగు బహుమతుల నిప్పించి, యోగక్షేమము లారసిపోయి రమ్మనియె.

శ్రీనివాసు నాజ్ఞకై సేసి, తిరుమలనుండి దిగివచ్చి తిరుచానూరున వేంచేసియున్న జగన్మాత, కల్యాణప్రదాయిని, భక్తమందార, శ్రీనివాసధర్మపత్ని యగు నలమేలుమంగా తాయారును భక్తితో సేవించి, తీర్థప్రసాదములుస్వీకరించి, ఆమె యనుజ్ఞగైకొని అనేక దివ్యదేశములు దర్శించుచు ఘటికాద్రినారసింహుని దర్శించి ప్రణామశతంబు లర్పించెను.

గృధ్రఘుష్టణియందు వీరరాఘవస్వామిని కనుల పండువుగా తిలకించి, పూజించెను. ఆయన ఆదరాభిమాన కటాక్షముల నాదరించె. వారికి మంగళాశాసనముచేసి, భూతపురికింజని, యందు లోకోద్ధరణమునకై పరమాకాశమునుండి రామానుజరూపమ్మున ధారుణికవతరించిన యతీంద్రుల భక్తిపురస్సరముగా దర్శించి అష్టోత్తరశతనామంబుల స్తుతించెను. ధన్యుండనైతినని సంతృప్తివహించెను.

శ్రీభాష్యమును పఠింపుమను గురునియానతి వరవరముని చెవులమార్మ్రోగుచుండెను. ఆ వాక్యములు శిరసావహించి, సత్యవ్రతక్షేత్రంబునకుంబోయెను. అచ్చట వేంచేసియున్న దివ్యనాభిస్థిత భవ్యమాణిక్యుని, పంచాయుధధారిని, శ్రీభూనీళాది దివ్యమహిషీ సంసేవితపదాబ్జుని, దేవాదిదేవుని,

బ్రహ్మాదిదేవతల కధినాథుండగుటచే దేవరాజ బిరదనాము సంభావితుని, వరదుని దర్శించి,

శ్లో॥ శ్రీనిధిమ్ నిధి మపారమర్థినాం, అర్థితార్థ పరిదాన దీక్షితమ్

సర్వభూత సుహృదం దయానిధిం దేవరాజ మధిరాజ మాశ్రయే.

లక్ష్మికి స్థానమైనవాడును, ఆశ్రితజనులకు తరుగని పెన్నిధాన మైనవాడును, ఆశ్రితరక్షాదీక్షా ధురంధరుండును, సమస్తభూత వ్రాతమునకు నిరుపాధికబంధువైనవాడును, దయాసముద్రుండును నగు వరదరాజస్వామిని ఆశ్రయించుచున్నాను,"అని స్తోత్ర పూర్వక మంగళాచరణమాచరించి, వరదుడొసంగిన బహు మతులు గ్రహించి, పేరుందేవితాయారు సన్నిధికింబోయెను.

శ్లో॥ ఐశ్వర్య మక్షరగతిం పరమం పదంవా,
కస్మైచిదంజలి భరం వహతే వితీర్య,
అస్మై నకించి దుచితం కృతమిత్యథాంబ
త్వం లజ్జసే కథయకోయ ముదారభావః॥

ఓ తల్లీ ! ఈ జీవుడు నీకొకసారి నమస్కరించి నంత మాత్రమున, వానికి సమస్తైశ్వర్యములను, కైవల్యము, పరమ పదము నొసంగుచున్నావు. ఇంతయొసంగియు నీవుచేసిన నమ స్కృతికి తగిన ప్రతిఫల మొసంగలేకపోయితినని సిగ్గుపడు చున్నావు. అట్టి నీయౌదార్యమును నేనెంతయని కొనియాడ

గలను ! అను శ్లోకముచేత నామెను స్తుతించి. ఆమె కటాక్షముల గ్రహించి, కృతార్థతం జెంది అచ్చటనుండి బయలు దేరెను.

పూర్వము యతిరాజులకు నిత్యమన్నపానము లొసంగిన కిడాంబియాచ్చనను దేశికోత్తముండు కలండు. ఆయన వంశమున కిడాంబినయనారను సూరివర్యుండు జన్మించెను. అతండు సర్వజ్ఞుండని జగత్ప్రతీతి. అయన ప్రఖ్యాతిని విని వరవరముని, ఆయన యొద్దకుం బోయెను

కిడాంబినయనారు వరవరమునిని కటాక్షించి "మహాత్మా! తామిచ్చటికేతెంచిన విషయ మేమి !"యని ప్రశ్నించెను.

అపుడు వరవరముని "స్వామీ ! తమవద్ద శ్రీభాష్యము శ్రుతప్రకాశికా సహితముగా నధికరింపవలయునని వచ్చితి"నని విన్నవించెను.

అందులకు కిడాంబినయనారు హర్షించి కొంతకాలమా వరవరమునిని సత్యవ్రతక్షేత్రమునందే వసింప నియమించి, శ్రీభాష్య మామూలాగ్రముగా బోధించెను.

వరవరముని విషయమెల్ల ఆకళించుకొని, ఆచార్యాజ్ఞ గ్రహించి, తిరుక్కోవలూరునకుంజని యందు త్రివిక్రమదేవుని, ఆదిమ ఆళ్వారులను దర్శించి, దేహళీపురంబు ప్రవేశించి, అందు వేంచేసియున్న దేవాదిదేవుని దర్శించి, అనేక దివ్యదేశవాసులగు అర్చామూర్తులకు మంగళాశాసనముచేయుచు శ్రీరంగం

బునకుంజని, రంగేశ్వరుని దర్శించి, తాబోయివచ్చిన విషయ మంతయు విన్నపించి వారి దివ్యాజ్ఞగ్రహించి, తన నిజనివాసం బునకేగి సుఖంబుండెను.

ఒకప్పుడు రంగేశ్వరున కొక దివ్యోత్సవము జరుగు చుండెను. వరవరముని తన్మయీభూతుడై, దేహేంద్రియ ప్రపంచంబుల విస్మరించి, నంబెరుమాళ్ళను దర్శించుచుండెను. ఆ సమయమున తనకు మృతాశౌచము వచ్చెనని తెలిసెను. అందులకు బాధపడి, సర్వేశ్వరోత్సవమును వీడలేక, వీడి పోయెను. పోవుచు, మనస్సున "ఈ సంసారము నిస్సారము. "జ్ఞాతేత త్త్వేకః సంసారః" తత్త్వ మెఱింగినవానికి సంసారంబు లేదు. 'నిస్పృహస్యతృణంజగత్' కోరికలేనివాని కీజగత్తం తయు తృణప్రాయము అని పెద్దలు చెప్పుచున్నారు ఈగృహ స్థాశ్రమము భగవదనుభవమునకు బలవద్విరోధి. కావుననే రామానుజాదియోగీంద్రు లందఱును, ఈ ఆశ్రమమును కాల దన్ని సుఖించిరి. నాకును ప్రాకృతజనంబుల సంగమంచిక పనికిరాదు. దీనిని వర్జించుట శ్రేష్ఠతమము"అని తలంచెను.

శఠగోపయతి యను బ్రహ్మవిత్తముడు కలడు. వరవర ముని వారి సన్నిధికేగి "స్వామీ! ఈ దాసునకు సన్న్యాసం బనుగ్రహింపుడు"అని ప్రార్థించెను. ఆయన అంగీకరించి, యథాశాస్త్రంబుగా, తురీయాశ్రమ మొసంగి, కాషాయము లిచ్చి, త్రిదండంబందించెను. వానిని గ్రహించి వరవరముని

శఠగోపదాసుండను నామమును ధరించి, నంబెరుమాళ్ళ సన్నిధి కేగి మంగళాశాసనంబొనరించి భగవత్సన్నిధిని నిలువబడియెను.

రంగేశ్వరుండు ఆయనను కటాక్షించి, తీర్థప్రసాదశఠ గోపాదుల నిప్పించి, దేవాలయాధికారి స్వప్నమున సాక్షాత్కరించి, అతనితో "వత్సా! ఈ మణవాళమహాముని సామాన్యుండు కాడు. అనంతుడే యీ రూపంబున నవతరించె. కావున సమర్యాదకముగా నీతనిని వల్లవరాయని మఠమునందు నిలుపుము" అని ఆనతిచ్చెను.

ఆలయాధికారియు, గౌరవపురస్సరముగా, పంచమహా వాద్య మంగళధ్వనులతో వరవరమునిని వెంటబెట్టుకొని తీసికొనిపోయి, ఆ మఠమునందు ప్రవేశపెట్టెను. తన వెంటవచ్చిన వారినెల్ల సత్కరించి, వరవరముని యందు సుఖమైయుండె.

అపుడు వానమామలజియ్యరు వరవరముని శ్రీపాదములాశ్రయించి, అవియే తనకు రక్షకములని విశ్వసించి, నిరంతరము సర్వవిధకైంకర్యములు కావించుచుండెను. జియ్యరు ఒక విశాలమైన శాలనునిర్మించెను. దానికి దృఢభిత్తికలమరించెను. చక్కగా అలికించి రంగవల్లికలుతీర్చి గురునకు చూపించెను. పర్ణశాలను నిర్మించి, లక్ష్మణుడు రామునకు చూపింపగా, శ్రీరామచంద్రు డానందించినట్లు గురుదేవుండాశాలనుగాంచి మిక్కిలి సంతసించి, యందుండి సర్వజనులకు భగవద్విషయము నుపన్యసించుచుండెను.

నానాదేశాగతానేక సూరిజనులు వరవరమునుల పాదములాశ్రయించిరి. వాధూలకుల శ్రేష్ఠుండగు వరదనారాయణ గురుండు అభిజనవిత్త విద్యాభిమానములువీడి వరవరముని పాదములాశ్రయించెను. ఈవిధముగా సౌమ్యజామాతృముని ద్రావిడామ్నాయములకెల్లను, అనేకవిధముల అర్థంబు వచించుచుండెను.

ఆసమయమున నొక అద్వైతివచ్చి గురుని సమీపించి, చిన్మాత్రనిర్విశేష బ్రహ్మమొక్కటియే సత్యమనియు, మిగిలినదెల్ల నసత్యమనియు (మిథ్య) కొన్ని తర్కవాదముల నాధారముచేసికొని ఉపన్యసింపదొడంగెను. ఆచార్యునిసన్నిధి గీర్వాణభాషను సన్న్యసించిన హేతువున గురుండాతనితో తర్కించుటకు వీలుకాక యూరకుండె. ఇది గురుని అసమర్థతగాభావించిన అద్వైతి, యిచ్చవచ్చినట్లుమితిమీరి వాదించుచుండె.

అపుడు. గురుండు విఠలప్పని పిలిపించెను. అతడు వచ్చి విద్వన్మహేంద్రుండైన గురునకు నమస్కరించి, విషయమును గ్రహించి, అద్వైతితో "ఏమీ! నీవెంత! నీవిద్యయెంత! ఎంతపొగరు! జగద్గురుండగు వరవరముని కట్టెదుటనా నీమాటలు. జగద్గురుడు సంస్కృతమున మాటాడనని స్వగురుని యొద్ద ప్రమాణంబుచేసె. కావున కారులరచుచుంటివి. సూర్యునిముందు మిణుగురువలె ప్రలాపించుచుంటివి. ఏదీ ఇపుడుపన్యసింపుము" అని పలికి వాదమునకు కడంగెను. ఆ యద్వైతి మారుమాటాడ సమర్థుండుకాక, పారిపోయెను.

వరవరముని విఠ్ఠలప్పనుజూచి "ఆర్యా! నీవు మామత మునందెల్లప్పుడునుండవలసినది. ఇట్లే పరవాదులు వచ్చి వాదింతురు. వారితో వాదించుటకు మాకు వ్రతభంగమగును" అని పలికెను.

ఆ సూరి శేఖరుడు గురునింజూచి "స్వామీ! క్షమింపుడు. ప్రతిదినంబును నాకు చల్దియన్నమును, గేదెపెరుగును కావలసియున్నవి. అవి తమ మఠంబున లభింపవు అవిలేనిచో నేను బ్రతుకజాల. కావున నేనిచ్చటనుండుటకు అవకాశము కుదురదు"అని విన్నవించి, గురునియానతిని గ్రహించి స్వగృహంబునకేగెను.

అపుడు సౌమ్యజామాతృ యోగీంద్రుడు శిష్యులంగాంచి వత్సలారా! పరవాదులతో గీర్వాణమున వాదింపగల సమర్థుండు కావలయును. అతడు మనతోపాటు ఈమఠంబున నివసింపవలె అట్టి వాడెవండు లభించునా?" యని విచారింపదొడంగె ఆ శిష్యులలో నొక్కరుండు లేచి "అయ్యా! కాంచీ నగరమున అణ్ణగారను, దివ్యపురుషుం డొకరుండుగలండు. అతడు బుద్ధియందు దేవగురుండు. తర్కశాస్త్రమున అపర గౌతముండు వ్యాకరణంబున పతంజలికి సముండు. అతడు పరవాది మత్తేభ మస్తిష్కలుంఠన కంఠీరవుండు. మీరు లేఖ వ్రాసినచో వచ్చి తప్పక యిచ్చట నుండగలడు ఆసూరి వర్యుండిటనున్నచో మనకీబెడద తప్పిపోగలదు"అని విన్నవించెను వెటనే గురుండొకపత్రముపై విషయమంతయువ్రాసి, శిష్యుల

కాపత్రమునొసంగి, "మీరుపోయి అసూరివరేణ్యుని తోడ్కొని రండు" అని ఆజ్ఞాపించెను. వారు బయలుదేరిరి.

కాంచీనగరము నందారేయి, వరదరాజస్వామి అణ్ణగారి స్వప్నమున సాక్షాత్కరించి "ఓయీ! నీవు శ్రీరంగమునకుపోయి జగద్గురుండగు వరవరముని యొద్ద ద్రావిడవేదము నంతయు అర్థానుసంధానపూర్వకముగా నధికరింపుము. అతండు సామాన్యుండని భావింపవలదు. అతఁడు యతీంద్రుని అపరావతారంబు. అతఁడు జగత్తునకే కాదు. నాకును గురుండే సుమీ!" అని ఆజ్ఞాపించి అంతర్హితుండయ్యెను.

ఉదయకాలమున అణ్ణగారు మేల్కాంచి, స్వప్నవిషయమును తలంచి, పులకించి, అత్యానందములో ధన్యుండనైతినని తలంచుకొని, దేవరాజస్వామికి నివేదించి, తదాజ్ఞగైకొని శ్రీరంగమునకు బయలుదేరెను. కంచినుండివచ్చు అణ్ణగారును, శ్రీరంగమునుండి యేతెంచు, గురుచంద్రుని అంతేవాసులును, మార్గమధ్యమున కలిసికొని, ఒకరివిషయము మరొకరెరింగి, మహానందము చెందినవారై శ్రీరంగమున కందఱును విచ్చేసిరి.

అణ్ణగారు, "నేను కావేరీ నీరమ్ములఁ గ్రుంకులిడి, రంగేశ్వరుని దర్శించి, గురు సన్నిధికేతెంతు"నని, తెల్పి వరవరముని శిష్యులను పంపించి, కావేరీ మహాప్రవాహంబున స్నానం బాచరించి, ద్వాదశోర్ధ్వ పుండ్రధారియై గురుపరంపరానుసంధానపూర్వకంబుగా భగవచ్ఛాసనంబులు తీర్చుచుండెను.

గురుని యంతేవాసులు, వరవరముని సన్నిధికేగి, వృత్తాంతమంతయు నివేదించిరి. గురుండు పరమప్రహృష్ట చిత్తుండై కొందఱు శిష్యులను అణ్ణాగారి కెదురుపంపించెను. వారందఱును అణ్ణాగారిని సమీపింప అతండు లేచి, ప్రత్యుత్థానం బాచరించి, భాగవతోత్తములకెల్ల ప్రణమిల్లి వారితోకలిసి, రంగనాథుని మందిరంబునకేగి, శ్రీ శ్రియఃపతుల దర్శించి, తీర్థప్రసాదములు స్వీకరించి, గురుసన్నిధికింబోయి వారి పదకంజములకు సాష్టాంగదండవత్ప్రణామంబు గావించెను.

గురుండాతనిని లేవనెత్తి కౌగిలించుకొని, కూర్చుండ నియోగించి "ఆర్యా! తమరు పరవాది మదిభమస్తిష్క విదారితతీక్ష్ణ నఖాంచల పంచాస్యుండవు. మేము సాధువులము. అట్టి మనకు పొందొనగూడుట యెట్లు!" అని పలికెను.

ఆ మాటల కాతండు నవ్వి "స్వామీ! పరవాదుల పాలిటనట్టివాడనే, కాని, మీవంటి జగద్గురువులకు భృత్యాను భృత్యుండ. భాగవతులసేవకులకు దాసానుదాసుండ"నని విన్న వించిన గురుండు హర్షించె.

ఆ తరువాత గురుదేవుండు తిరువాయిమొళి యందొక పాశురమునకు సమస్తశాస్త్రములు, వేదవేదాంగములనెల్ల సమన్వయించి ఉపన్యసించెను. అది విన్న అణ్ణాగారు ఆశ్చర్య నిమగ్నులై గురునితో "స్వామీ! ఈ దాసుని శిష్యునిగా

గ్రహించి, ద్రావిడవేద సముదాయమంతయును బోధింపుము" అని ప్రార్థించెను.

గురుండు "వత్సా! అట్లే బోధించెద. నీవు మాత్రము మామతమునం దేయుండవలె." నన అణ్ణగారు మహాప్రసాద మని అంగీకరించె.

అప్పటినుండియు పరవాదు లెవ్వరును మతముచాయలకు రాకుండిరి. అణ్ణగారు గురుసన్నిధిని ద్రావిడ గ్రంథముల నర్థాను పూర్వకముగా తెలిసికొని, గురునకు దేహచ్ఛాయపగిది వర్తిం చుచు, గురునకు సర్వవిధకైంకర్యము లాచరించుచుండెను.

ఇట్లుండ మణవాళమహామునికి పూర్వాశ్రమమందుండగా 'రామానుజయ్య'యను కుమారుండు కలిగెగదా! ఆరామాను జయ్యకు ఇద్దరుకుమారులుద్భవించిరి. వారికి పేరులేమి పెట్టు మందునో తెలుపుమని, శ్రీరంగమునందలి గురుని యొద్దకు రామానుజయ్య ఇరువురు వైష్ణవులను పంపించెను.

ఆ పిల్లలిరువురకు, పెద్దవానికి అణహియ పెరుమాళ్ నయనారనియు, రెండవవానికి విష్ణుచిత్తులనియు నామధే యంబు లుంచుమనిచెప్పి ఆవైష్ణవుల పంపించెను. వారా పిల్లల కవే పేర్లుపెట్టిరి. ఆ బాలురిద్దరును దినదిన ప్రవర్ధమాన దేహులై, ఉపనీతులై శ్రీవిల్లిపుత్తూరునుండి శ్రీరంగమునకువచ్చి వరవర మునిని దర్శించి పాదాభివందనం బాచరించిరి. విషయమంతయు నెఱింగి, చాలహర్షించి ఆ కుమారులకు సమస్తాగమంబులను, తర్క-వ్యాకరణాది శాస్త్రంబులను, ద్రావిడాగమంబులను

సర్వమునర్థాను సంధానుపూర్వకంబుగా నుపదేశించెను. పంచ సంస్కారంబొనరించెను. మంత్రార్థములగు హితములన్నియు నాచరించి, ఆకారత్రయ సంపన్నుల కావించెను.

పెద్దపిల్లవానిని శ్రీవైష్ణవమత దర్శనస్థాపకునిగా నియమించెను. ఆ దేశవాసులగు మనీషిశేఖరులు కొందఱు ఆదివ్యసూరి నాశ్రయించిరి. ఆచార్యపౌత్ర విషయముగా నొక్కతనియను,

శ్లో॥ అస్మా సువత్సల తయా కృపయాచ భూయః
స్వేచ్ఛా తీర్ణమిన సౌమ్యవరం మునీంద్రం
ఆచార్య పౌత్రమభిరామ వరాభిధాన
మస్మద్గురుం గుణనిధిం గురుమాశ్రయామః.

అని విన్నవించిరి.

సౌమ్యజామాతృముని తనజన్మస్థానంబగు తిరునగరికి విచ్చేయదలంచెను. తన ఆశ్రితులను తీసికొనిపోవుచు దారిమధ్యగల దివ్యస్థలముల పవిత్రీభూతమొనర్చుచున్న భగవన్మూర్తులకు మంగళాశాసనముచేయుచు స్వాచార్య జన్మస్థానంబగు కుంతీనగరమ్మునకు వేంచేసెను. అచ్చట మూడురోజులుండెను. ఆ దేశవాసులందఱిని కటాక్షించి, వారికి పంచసంస్కారాది హితమ్ములెల్ల నాచరించి, వారినందఱ కృతార్థుల కావించెను.

అటనుండి బయలుదేరి తామ్రపర్ణియందు స్నానంబాచరించి శ్రీచూర్ణరేఖావిలసిత ధవళోర్ధ్వ పుండ్రంబుల ద్వాదశస్థలంబుల తీర్చిదిద్ది భగవచ్ఛాసనంబులు నిర్వర్తించెను.

"వైకుంఠనాథ విజయాసన భూమిపాల
దేవేశ పంకజ విలోచన చోళనాట్యాన్
నిష్టప్త చిత్రమ కరాయత కర్ణపాశౌ
నాథం నమామి వకుళాభరణేన సార్థమ్"

అను న్యాయంబున, కేళవాది చతుర్వింశతి వ్యూహాధిష్ఠితంబు లగు సాంతానికలోకములకు మధ్యభాసించు పరమపదంబువలె, దివ్యదేశములమధ్య ప్రకాశించు శ్రీనగరింబ్రవేశించెను. జగద్గురుండు వచ్చుచున్నాడని విని యద్దివ్యదేశవాసులు ఎదురువోయిరి. వారివందఱను గురుండనేకవిధముల గారవించి; వారితోగూడి భావ్యకారులను సేవించి, దివ్యవాక్కుసుమంబుల పూజించి; ప్రపన్నజనకూటస్థులైన శఠారాతిం దర్శించి సేవించెను. అచట మధురకవి ఆళ్వారు రచించిన కణ్ణిశ్శిరుత్తాంబుచే వారిని స్తోత్రించి, తీర్థప్రసాదంబులు స్వీకరించి, శ్రీశైలనాథుని భవనంబునకుంబోయెను. శ్రీశైలనాథుండారాధించిన బాల గోపాలుండందుగలడు. ఆస్వామికి మంగళాశాసనం బాచరించి, తన గురుండు తొలుదొల్త నే ప్రదేశంబున గూరుచుండి తన ననుగ్రహించెనో, ఆప్రదేశమునకు సాష్టాంగవందనం బొనరించెను.

అటనుండి నిజమఠంబునకుంబోయెను. అచ్చటనుండి సమస్తజనులకు, ఆశ్రితులకు తత్త్వోపదేశంబు గావించుచుండెను. ఆచార్య హృదయంబును ఉపన్యసించుచుండగా, నొకవాక్యమునకు సమన్వయము కుదురదయ్యెను. తిరునారాయణపురంబున దేవరాజను పేరుగల మహాపురుషుండు, మహా

జ్ఞానికలడనివిని, వారియొద్దకుంబోయి, ఆవిషయమెఱుంగగోరి, ఆశిష్యులతోఁగూడి తిరునారాయణ పురంబునకుంబోవుచుండెను.

దేవరాజసూరి నమ్మాళ్వారిని దర్శింపవలయునను వాంఛతో శ్రీనగరికి వేంచేయుచుండెను. మార్గమధ్యమున నిరువురును ఒకచోటకలిసికొనిరి. వరవరముని దేవరాజసూరికి నమస్కరించెను. ఆతండు గురుని చాలమన్నించి, "యతివరా! ఏమిపనిమీద, ఎచ్చటకు బయలుదేరితిరి?" అని ప్రశ్నించెను.

అందులకు గురుండు, "స్వామీ! ద్రవిడగ్రంథములందు కొన్ని యెడల సన్వయక్లిష్టత గోచరించుచున్నది. కావున మీవంటి మహాపండితుల యొద్ద నామూలాగ్రముగా నెఱుంగవలయునని, తమ సన్నిధికే బయలుదేరితిని. వెదుకబోయిన తీవ ఎదురువచ్చినట్లు మీరే నాకిట తారసపడితిరి," అని విన్నవించెను.

దేవరాజసూరి సమ్మతించి, యతివరునితోఁగూడి శ్రీనగరి కరుగుదెంచి, శఠారాతినిభజించి, ఆప్రదేశంబున కతిపయదినంబులుండి, వరవరమునికి ద్రావిడాగమరహస్యము లన్నియు తెలుపుచుండెను. అపుడు వరవరముని గురువిషయముగా

"ఆచార్య హృదయ స్యార్థాస్సకలా యేన దర్శితాః
శ్రీశాన దాసమమలం దేవరాజ మహంభజే"

అను తనియను విన్నవించెను. దేవరాజసూరి వకుళాభరణయోగిని సేవించుచు కొంతకాలము కురుకాపురంబున సుఖముగానుండెను.

ఇట్లుండ కొందరసూయాగ్రస్తులు, దేవరాజగురుండు ఆచార్య పదంబు చెందె. ఆయనకింక సొంతఆస్తితో పనియేమి! అను నెపంబిడి, ఆయన గృహంబునగల సంపదనంతయు, తిరునారాయణపురమునగల సంపత్కుమారుని భాండాగారమునకు చేర్చిరి.

ఈవిషయము దేవరాజసూరికి తెలియవచ్చెను. అతడు శ్రీనగరినుండి తిరునారాయణ పురంబునకేగి, స్వగృహంబును ప్రాపించిచూడగా, నింటనొక్క వస్తువైనను లేకయుండెను. అతడు జరిగిన విషయమంతయు వినెను.

"యస్యానుగ్రహ మిచ్ఛామి తస్యవిత్తం హరామ్యహం"

ఎవనిని నేననుగ్రహింపగోరుదును, వాని ధనమును నేను హరించుచున్నాను" అను సర్వేశ్వరవాక్యమును స్మరించి, సర్వేశ్వరుడు తన్ననుగ్రహించుటకే యిట్లు చేసినాడని ఆనందించెను. వడపెరుంగోయిలుడయానను పేరుగల సర్వేశ్వరునకు విష్ణుచిత్తులవలె, రంగేశ్వరునకు విప్రనారాయణునివలె, దేవరాజగురుండు తిరునారాయణస్వామికి నిత్యపుష్పకైంకర్యమును గావించుచుండెను.

వరవరముని వకుళాభరణయోగికి నిత్యకైంకర్యము చేయుచు కొంతకాలము శ్రీనగరియందుండెను. కొందరు మూర్ఖాగ్రేసరులు గురుని గొప్పతనమును సహింపలేకపోయిరి. వారికెందరో వశులై యుండుట వారికి కన్నుకుట్టినది. గురుండు వసించుచున్న మఠము నొకనాటి సూర్యోదయకాలమున నిప్పు

పెట్టిరి. "ఏను ఘ్నంతి నిరర్థకం పరహితంతే కేన జానీమహే" తమకు ప్రయోజనము లేకపోయినను, పరులకార్యములకు విఘ్నం కావించువారి నేమని పిలువవలయునో తెలియదని భర్తృహరి వచించియున్నాడు. అట్లే ఆదుష్టులు నిష్కారణముగా గురుని మఠమును దహించిరి. ఆసమయమున గురుండు మఠము లోపలనే యుండెను.

ఆ గురుదేవుండు తనమనంబున "లోకులు కాకులు. సత్యాసత్యము తెలియంగజాలరు. వీరికి సాధువులు అసమర్థులుగా గోచరింతురు. అతిదుర్జనులు మహాసమర్థులుగా భాసింతురు. ఈయధములు నన్ను సామాన్యునిగా తలంచుచున్నారు. వారి కిప్పుడు నాసామర్థ్యంబు ప్రదర్శించెదగాక" యని వితర్కించి, ఆమఠముయొక్క జలనిర్గమరంధ్రమునుండి సూక్ష్మాహిరూపంబున వెలువడి, బయట తనదివ్యశేషస్వరూపంబును ధరించెను. తన సహస్రఫణములాకాశము నిరవకాశముగా క్రమ్మివేసెను. ఫణస్థగిత దివ్యరత్నప్రభాజాలము భాస్కరమండల తేజమ్మును గ్రసించెను. వ్యోమమండలంబంతయు నానావర్ణశోభితమై కనుపట్టెను. వదన సహస్రప్రభూత ఫూత్కారధ్వనులచే బ్రహ్మాండభాండము దద్దరిల్లుచుండెను. వదన వినిర్గత విష వాయువులు సమస్తజంతుసంతతికి ఉపద్రవకారకంబులగుచుండెను. స్వచ్ఛమగు దేహకాంతి సితభాను సహస్రకాంతి సమంబై కన్నులుచెదరగొట్టుచుండెను. శబ్దస్వరూపుండైన ఆదిశేషుని దర్శించి, నభంబున దేవతాసంతానము, మహర్షి

మండలము వేదవాక్యముల వినుతింపగడంగిరి. ఆ గ్రామజన సమాజమెల్ల విచ్చేసి శేషుని విజృంభణంబునుగాంచి భయ భ్రాంతులై నిటలతట ఘటితకరకమలులై "స్వామీ! నీవనం తుండవు. బహువన పాదపాబ్ధికుల పర్వతపూర్ణ సరస్సరస్వతీ సహిత మహామహీంధరమజస్ర సహస్ర ఫణాళిపై ధరించు చున్నావు. దేవాది దేవుండవు నీవెక్కడ! పరమనీచప్రవృత్తుల మగు మేమెక్కడ! విశ్వనియంతవు. ధర్మసంస్థాపనార్థ మవత రించితివి. నీమాహాత్మ్య మెఱుంగక కావించిన మాదోసంగులు మన్నించి క్షమింపుము. నీకనేక జోహారులొనర్చుచుంటిమి. బిడ్డలతప్పులు తల్లి క్షమించునట్లు మాతప్పులు సైరింపుము" అని జయజయ శబ్దంబుల ననేకవిధముల స్తుతించిరి.

సంతుష్టాంతరంగుండై గురుండు శేషస్వరూపము నుజ్జగించి, తన యథాస్వరూపమును స్వీకరించెను. అపుడు జనులందఱును సమీపించి గురునకు భక్తితో పాదారవిందంబుల కంజలించిరి. గురుండు వారలనెల్ల ఆదరించి, వారిని యిండ్లకుపంపించి, స్వకీయ ధామంబునకంతాశ్రితులకెల్ల సమస్త భగవద్విషయంబులును బోధించుచుండెను.

ఆసమయంబున తద్దేశాధీశుండు గురుని మాహాత్మ్యంబును విని, శ్రీనగరి కరుగుదెంచి, గురుని పదాబ్జములకు ప్రణ మిల్లెను. గురుండా నృపాలునకు పంచసంస్కారవిధు లాచరించి, మంత్రార్థంబు లుపదేశించెను. ఆరాజశిఖామణి శ్రీనగరియందు అనేక మంటపంబులు కట్టించి, వకుళాభరణ యోగీంద్రులకు పుష్పవనంబొకటి వేయించి, దానికి తామ్రపర్ణీనదినుండి జల

మార్గముల నొనరించి, సర్వకాలములందును గురునకు సర్వవిధ కైంకర్యము లొనరించుచుండెను.

ఆ తదుపరి వరవరమునివరుండు పరాంకుశయోగిపుంగవుని పీడ్కాని తిరుక్కురుం గుడికిపోయి యందొక్కచోట నివసించియుండెను. అప్పుడొక బ్రాహ్మణుండేతెంచి, వరవర మునులకు సాష్టాంగవందనంబు లాచరించి, "స్వామీ! హరిహర హిరణ్యగర్భులు ముగ్గురును సమానులని సమస్తశాస్త్రములు, మహర్షులు వక్కాణించుచుండ, మీరు విష్ణువొక్కడే సర్వ స్వాత్మ్వరుండని వక్కాణించుటకు కారణంబేమి? మీ సిద్ధాంతమునకు శాస్త్రప్రమాణమేమైనకలదా?" అని ప్రశ్నించెను. గురుండు వానికి సమస్తపురాణేతిహాసాదులందున్న విష్ణుసర్వోన్న తత్వమును సహస్రవిధముల నుపదేశింప నాతడు సంతసించి "స్వామీ! మీరు చేయుచున్న చక్రాంకణంబులకు వేద ప్రామాణ్యమున్నదా?" యని ప్రశ్నించెను.

వానికన్నింటికిని ప్రమాణంబులు చూపించెను. అచ్చట కొన్నిదినములుండి, వరవరముని శ్రీనగరి కరుగుదెంచెను. శఠగోపయోగి నర్చించి తీర్థప్రసాదంబులు స్వీకరించి, ఆమంత్రణంబువడసి, శ్రీరంగధామంబునకు చనుదెంచి, తనమఠంబున నుండెను.

ఒకసమయంబున ఇరుంబియప్పయను పేరుగల, ఒకానొక సూరివరుండు, శ్రీరంగమునకేతెంచెను. అటనున్న కోవెల కందాళయణ్ణయను మహనీయునింగూడి, కోవెల కరిగి,

శ్రీరంగేశ్వరుని దర్శించి, వరవరముని మఠమునకు చనుదెంచెను. ఆవేళ వరవరముని ఆశ్రితులకెల్ల భగవద్విషయంబునుపన్యసించుచుండెను. ఇరుంబియప్ప గురువరుని పాదపంకేరుహంబులకు ప్రణమిల్లి తదాజ్ఞవడసి కూరుచుండెను. సౌమ్యజామాతృముని. తిరువాయిమొళి యందలి ప్రథమపాశురమునకు సకలశాస్త్రములను సమన్వయపరచి, బ్రహ్మతర్కము నెల్ల వ్యక్తీకరించుచు వేయివిధముల నుపన్యసించెను.

ఇరుంబియప్ప ఆయుపన్యాసమును విని అద్భుతాంతఃకరణుడై "ఈయన ద్రవిడభాషయందే మహావిద్వాంసుండని వినియుంటినిగాని, బ్రహ్మతర్కము నందింతటి పండితుండని వినియుండనైతిని. ఇతండు సమస్తశాస్త్రంబులందును పరమనిష్ణాతుండు. ఇట్టి మహాసమర్థుండీ వర్తమాన ప్రపంచమున లేడు" అని మనస్సునభావించి, గురునిపాదారవిందంబులకు అభివాదనంబాచరించి, తన గృహంబునకుపోవ నుద్యుక్తుండయ్యెను. గురుండదిచూచి "వత్సా! ఇపుడు కాలాతీతమైనది. మఠమునందు సాపడి సాయంకాలము నీగృహంబునకు పొమ్ము" అని పలికెను. అందులకు ఇరుంబియప్ప యతీంద్రుల అన్నమును గృహస్థులు భుజింపరాదనెడు సామాన్యశాస్త్రధర్మంబును తలపోసి, గురువాక్యమును నుల్లంఘించి, స్వగృహంబునకరిగెను. అతని యభిప్రాయంబును గమనించి గురుండూరకుండెను.

ఇరుంబియప్ప గృహంబునకేగి స్నానంబాచరించి, ద్వాదశోర్ధ్వ పుండ్రధారియై తాను నిత్యమునర్చించు శ్రీసీతా

రామచంద్రుల దివ్యభవనంబునకుంజని, తలుపులు తెఱచుటకు ప్రయత్నించెను. ఎంత ప్రయత్నించినను ఘడియరాకపోయెను. తలుపులు రాకపోవుటకు విచారించి, చేయునదిలేక పరిదేవనం బాచరించుచు, ముసుంగునిడుకొని స్వామిగృహంబు ముందర నిద్రించెను. స్వప్నమునందు రఘునాథుండు గోచరించెను. ఇరుంబియప్ప శ్రీరామచంద్రస్వామి పాదపంకజములకు ప్రణమిల్లి "ఓ ప్రభూ! ప్రతిదినంబును స్వీకరించు నాయర్చనను నేడేల స్వీకరింప నిరాకరించితిరి? నామీఁద నింతటి ఆగ్రహము కలుగుటకు కారణమేమి! ఈ మహాపాతకమేమి?" అని పరిపరి విధంబుల ప్రార్థించెను.

ఆ మాటలువిని జగదీశ్వరేశ్వరుడు, "వత్సా! నీవు నేడొక భాగవతాపచారం బొనరించితివి. వరవరముని నాస్వరూపమే కాని భిన్నుడుకాడు. ఆతనిని సామాన్యయతిగాచింతించి, ఆతడీయదలంచిన ఆతిథ్యమును తిరస్కరించితివి. ఇప్పటికైనను మించిపోయినది లేదు. నీవు శ్రీరంగంబునకరిగి కాంతోపయంతృయోగి పాదములపైబడి క్షమాభిక్షను వేడుకొనుము. కానిచో భాగవతనిగ్రహంబునకు పాత్రుండవగుదువు." అని అంతర్హితుండయ్యె.

ఆ మరునాడుషఃకాలముననే మేల్కాంచి, ఇరుంబియప్ప సర్వేశ్వరవాక్యంబులు తలంచి, విస్మయావిష్టుడై, కాలకృత్యంబులను తీర్చుకొని, స్నానంబాచరించి, ద్వాదశోర్ధ్వ పుండ్రధారియై శ్రీరంగంబునకు బయలుదేరి మణవాది మహామునుల మఠమును సమీపించెను.

ఆ సమయమున మణవాళముని శిష్యులంగూడి రంగేశ్వర దర్శనమునకు వచ్చుచుండెను. మధ్యేమార్గమునసే యిరుం బియప్ప గురుని పదపద్మయుగ్మంబునకు సాష్టాంగంబాచరించి, లేచి చేతులుజోడించి నిలువబడియెను. గురుం డిరుంబియప్పను గాఢపరిష్వంగంబున తనియించి, ప్రేమపూర్వకముగా కుశల ప్రశ్నలువైచి శిష్యులను స్వామిదర్శనమునకు పోయిరండని యాజ్ఞాపించి, యిరుంబియప్పతో మరలి మఠమునకు చను దెంచెను.

కొంతసేపటికి శిష్యులు రంగేశ్వర దర్శనముకావించు కొని మఠమునకు వచ్చిరి. వారినిజూచి గురుండు "నాయన లారా! మీరు దర్శించిన సమయమున, రంగేశ్వరుండెట్టి భూషణవస్త్ర విశిష్టుండై యుండెనో, ఎట్టి పూజావిధి నిర్వ హింపబడుచున్నదో వచింతు. వినుండని; ఆ విషయమంతయు కన్నులయెదుట కాంచుచున్నట్లు వర్ణించిచెప్పెను. వారంద ఱును గురుని సర్వజ్ఞత్వమునకు విస్మితులైపోయిరి.

ఇరుంబియప్ప వరవరముని గురువరుని పదారవిందంబులే ధారకపోషక భోగ్యములని భావించి, గురునకు సర్వవిధ కైంకర్యంబులాచరించుచుండెను. ఉదయకాలమున గురుని సుప్రభాతగీతములతో మేలుకొలుపుచుండెను. గురుని సంధ్యా నుష్ఠానములకు కావలసిన సామగ్రినెల్ల సిద్ధపరచుచు, ఎప్పుడు నెడబాయక దేహచ్ఛాయభంగి వర్తించుచుండెను. గురుండు ఇరుంబియప్పకు, శ్రీవచనభూషణ, ఆచార్య హృదయాది

గ్రంథముల నర్థానుపూర్వకముగా నామూలాగ్రముగా సెల విచ్చెను.

ఒకానొక దినమున వరవరముని శ్రీరంగని దర్శనార్థ మాలయమునకుపోయెను. ఆ సమయమున రంగేశ్వరునకు ముందొక తెరవేయబడియుండెను. లోపలి అర్చకుండుస్వామికి తిరువాళపట్టు కైంకర్య మాచరించుచుండెను. వరవరముని యవనికకీవలనుండి మంగళాశాసనముచేయుచుండెను. వరవర ముని శరీరమంతయు గౌరవర్ణ పూర్ణమైయుండెను. అతడు శేషాహియగుటచే నారంగుకలిగియుండుట సహజమే కాని ఆ అర్చకుడు నేపథ్యముననుండి, గురుని శరీరచ్ఛాయను తిల కించి అది సహజవర్ణంబని భావింపక, ఇతడు 'స్త్రీ' యని తలంచి, వెంటనే అటనుండి వెడలిపొమ్మని శాసించెను. వరవర ముని తత్క్షణమే ఆలయమునుండి నిర్గమించెను.

ఆ నంబియింటికిపోయెను. ఆరేయి రంగేశ్వరు డాతనికి కలలోగోచరించి "ఓయీ! ఈవేళ నీవు మహాభాగవతాపచార మొనరించితివి. వరవరమునిని ఆలయమునుండి వెడలనడిపితివి. అతండెవ్వరని యెంచితివి. నాశయ్యయగుఅనంతుడు ఈ రూపం బున లోకోద్ధరణ మొనర్చుట కుద్భవించినాడు" అని తెలిపెను.

నంబి ఉలికిపడి నిద్రమేల్కాంచెను. స్వప్నవృత్తాంత మును తలపోసి, మిక్కిలి అనుతప్తచిత్తుడయ్యెను. స్నానము చేసి, ధౌతపరిధానముగట్టి వరవరముని మఠంబునకరిగి, ఆయన పాదపంకేజములపైవ్రాలి "స్వామీ! తమరు క్షమించితిమని సెలవిచ్చినచోగాని ఈ దాసుడు లేవడు. మీరట్లు పలుకనిచో

నిశ్చలపడియుండు"నని ప్రార్థించెను. కరుణాస్వభావుండగు గురుచంద్రుండు "వత్సా! క్షమించితిమి లెమ్ము. పశ్చాత్తాపమున కన్న ప్రాయచిత్తములేదు." అని పలికెను. నంబి పైకిలేచి జరిగినదెల్లయు విన్నవించి, గురుని చేతులమీదుగా తీర్థప్రసాదములు స్వీకరించి, అపరాధక్షమాపణంబుచేసికొని స్వగృహంబున కేగెను.

ఒకనాడు వరవరముని తనమంటపమున ఏకాంతముగా శయ్యాపై పరుండి, తన ఆదిశేష స్వరూపమును ధరించి, విశ్రాంతి తీసికొనుచుండెను. ఆసమయమున నొక సాధ్వీమతల్లిక మఠమునకు వచ్చెను. మఠమునకుగల కవాటములన్నియు బంధింపబడియుండెను. లోపల నెవరుండిరో యను నుత్సుకతతో ఆమె, యొక సూక్ష్మరంధ్రమునుండి లోనికిచూచెను. గురుని శేషస్వరూపము సాక్షాత్కరించెను. ఫణాసహస్ర రత్నకాంతులచే కనులు మిరుమిట్లు గొలిపెను. హృదయస్పందన మాగిపోయి కంతపని యయ్యెను. ఆమె నిశ్చేష్టితురాలై కొంతవడి అట్లే గురుని రూపమును చూచుచు నిలువబడియుండెను. కొంతసేపటికి గురుండు తన దివ్యస్వరూపంబు నుజ్జగించి, మానవస్వరూపధారియై తలుపులు తెరచెను. బయట శిష్యురాలు నిలిచియుండెను. ఆమెనుచూచి "వత్సే! తొందరగొనియుంటివి. ఏ శేష మేదియైన గాంచితివా!" యని ప్రశ్నించెను.

ఆమె గురునకు దూరమునందుండియే నమస్కరించి "స్వామీ! నేను జగత్తున నెప్పుడుచూడని విశేషమునే చూడ

గల్గితిని. అది నాఅదృష్టము. ఆ యదృష్టము జగత్తున నొరి యొకరు పొందియుండరనియే తలంచుచుంటిని." అని పలికెను.

అందులకు గురుండు సుప్రసన్నవదనుండై "సాధ్వీ! నీభక్తిభావబంధురతచే నీకట్లుకన్పించినది. అంతియేకాని మా యొద్ద మాహాత్మ్యము లేవియును లేవు." అని పలికెను. ఆమె తిరిగివచ్చి సమస్తజనుల కీవిషయమును విశదపరచెను.

రంగేశ్వరుం డొకసమయమున వరవరమునిని రావించెను. పూర్వము రామానుజ యతీంద్రులవలె, వరవరమునియు శిష్య సంఘసమన్వితుడై ఆలయమునకుపోయి స్వామికి మంగళా శాసనము చేయుచుండెను. అపుడు రంగేశ్వరుడు "వత్సా! తిరువాయి మొళి కెన్నో వ్యాఖ్యానములున్నవికదా! అవియన్నియు నీకు కరతలామలకములు. ఆ వ్యాఖ్యానములన్నియు నీముఖతః వినవలయునని, నేనును, మాతల్లియు నభిలషించుచుంటిమి. అందువలన, ఈ తిరుమామణి మంటపమునందు, నాకభిముఖ ముగానిలిచి, భగవద్విషయమును ప్రవచింపుము" అని బ్రహ్మా సన మొసంగెను.

వరవరముని మనమున ఆనందముప్పొంగి నింగికెగసెను. ఆ బ్రహ్మాసనముపై తనగురుండగు శ్రీశైలనాథుండు వేంచేసి యున్నట్లు తలంచి, దానికి ప్రక్కనే క్రింద నుపవిష్టుండయ్యెను. సహస్రసంఖ్యాకులగు బ్రహ్మవేత్తలు ఆ సభను పరివేష్టించి యుండిరి. దేవర్షి సముదాయ, సమేతుండగు సనత్కుమారుని

వలె గురుండు భాసించె. ఆ సభ బ్రహ్మలోకమను భావమును కలిగించుచుండెను.

ప్రసన్నాననుండై గురుండు భగవద్విషయమును క్రమముగా నుపదేశించుచుండెను. ఆ వాగ్ఝరియందు గంగాస్రవంతి పిల్లకాలువ. ఆ సభాస్తారులు తన్మయులై, దేహేంద్రియ ప్రపంచంబులు విస్మరించి, ఆనందమందాకినీ సుధాతరంగ డోలికల నోలలాడుచుండిరి. ఆ వార్త దేశదేశముల బ్రాకెను. ముముక్షువులైన బ్రహ్మవిత్తములెందరో నానాదిగ్దేశముల నుండి విచ్చేసి, శ్రీరంగమందు నిత్యనివాసమేర్పరచుకొని, శ్రద్ధతో భగవద్విషయామృతమును వీనులవిందుగా గ్రోలు చుండిరి. ఒక్క సంవత్సరకాలము గిఱ్ఱున తిరిగిపోయెను.

ఆ తదుపరి ఒకానొక దినమున, శ్యామసుందర సుకుమార శరీరుండైన ఒకబాలకుండు ముద్దులుమూటగట్టుచు, సభాసదుల చూపులదోచుకొనుచు, మానసముల నాకర్షించుచు, సభామధ్యమునకు వచ్చి గురుసత్తముని పదవనజంబులకు నమస్కరించెను. గురుండు లేవనెత్తి గ్రుచ్చికౌగిలించుకొని "నాయనా! ఎవ్వరిబాలుండవు. ఏమిపనిపై యిచ్చటకు వచ్చితివి!" అని ప్రశ్నించెను.

అంత నాబాలకుడు లేచినిలువబడి సభాసదులనుజూచి "అయ్యలారా! ఈ గురుమహారాజు, ఒక్క సంవత్సర కాలమునుండియు భగవద్విషయమును ప్రబోధించినారు. మన మందరము చిత్రార్పితమూర్తులపగిది, పాషాణధేనువులట్లు

ఏకాగ్రచిత్తులమై ఆలకించితిమి. పులకించితిమి, తరించితిమి. మనముకూడ గురుని సత్కరించుట మన కనిష్ఠధర్మము. మీ యందరి పక్షమున గురుదేవునకొక తనియను సమర్పించుకొను చున్నాడను. సావధానచిత్తులై మీరందఱును వినుడు.

"శ్రీశైలేశ దయాపాత్రం ధీభక్త్యాది గుణార్ణవం
యతీంద్రప్రవణం వందే రమ్యజామాతరం మునిమ్'

అను శ్లోకమును పఠించి, ఆ బాలుండొక్కపరి తళుక్కున మెఱసి అదృశ్యుండయ్యెను.

సభలోని వారందఱును ఆశ్చర్యాద్భుత రసనిమగ్న చిత్తులైరి. ఈ వచ్చినవాడు రంగేశ్వరుండేకాక అన్యుండు కాదని నిర్ణయించిరి. అప్పటినుండియు నీశ్లోకమును, ప్రతివిష్ణ్వాలయమునందును, ఆచార్య తనియలకు ముందు చదువదొడంగిరి.

ఒక భాగవతోత్తముండు అష్టోత్తర శతదివ్యదేశంబులు చూచు నుత్సుకతతో ఉత్తరదేశంబులకు చనియెను. అయోధ్యాది దివ్యదేశంబులు చూచుచు, బదరికాశ్రమంబునకుంజని యందు బదరీనారాయణు నర్చించుచుండెను. ఒకానొక దినమున బదరీనారాయణుండతని స్వప్నమునం గోచరించి "వత్సా! నీమనోరథంబెద్ది! దాని తీర్చెద కోరు"మని యడిగెను. అందులకా భాగవతోత్తముండు "స్వామీ! 'శ్రీశైలేశ దయాపాత్రమ్' అను శ్లోకముచే ప్రతిపాదింపబడుచున్న దివ్యపురుషుండెవ్వడు? అతని దర్శించుభాగ్యముకలదా? అనతిమ్ము" అని వేడుకొనెను. అపుడు నారాయణుండు "వత్సా! నీవు

దక్షిణభారతావనికింబొమ్ము. అచ్చట ప్రత్యక్షపరమపదంబు శ్రీరంగంబునా భాసించుచున్నయది. అచ్చట ఈ శ్లోక ప్రతిపాద్యుండగు మహనీయుడు నీకు దర్శనంబిచ్చు"నని ఆనతిచ్చి అంతర్హితుండయ్యె.

ఆ భాగవతోత్తముం డచటినుండి కదలి, అనేక దివ్యదేశంబులు దర్శించుచు, శ్రీరంగమునకు విచ్చేసి, ఆ శ్లోకమును సంధించుచు, తత్ప్రతిపాద్యుండెవ్వరని, రంగవాసుల నడిగిన, వారాయనను తీసికొనిపోయి వరవరమునిని దర్శింప జేసిరి.

ఆభాగవతుండు వరవరముని గురువరుని పదారవిందంబులకు సాష్టాంగంబులాచరించి, తనకు బదరీనారాయణుం డానతిచ్చిన తెఱంగెఱింగించెను. గురుండు సంతసించి, అతనికి పంచసంస్కారాదిహితంబులెల్ల నాచరించి, మంత్రమంత్రార్థముల నుపదేశించెను. ఆతం డమందానందకుండిల చిత్తుండై గురునకు సర్వవిధములగు శుశ్రూషలానరించుచు, అచ్చటనే యుండెను. వరవరమునీంద్రుండు లోకహితంబు కొఱకు శ్రీవచనభూషణాది దివ్యగ్రంథముల కన్నింటికిని వ్యాఖ్యానములు విరచించెను.

ఒకానొక దినమున నిర్వురు శిష్యులు శ్రీవచన భూషణము నధికరించుచు, మఠమునందొకరితో నొకరు కలహించు కొనుచుండిరి. గురుని సన్నిధానమను గౌరవమువారికి లేక పోయెను. గురుండదిచూచి సహింపనేరక మఠబహిఃప్రదేశము

నకువచ్చి కూరుచుండెను. అట్టి సమయమున అచ్చట రెండు కుక్కలు కలహించుకొనుచుండెను. గురుండు వానినిచూచి "సారమేయములారా! మీరును శ్రీవచనభూషణము నధ్యయనించుచుంటిరా? ఇంతతీవ్రముగా కలహించుకొనుచున్నారు!" అని బిగ్గరగా ప్రశ్నించెను. ఆ మాటలువిన్న వైష్ణవు లిరువురును సిగ్గుపడి, పోరాటమును విరమించుకొనిరి.

ఒకదినమున గురుండు భగవద్విషయమును వచించుచున్న సమయమున ఒక స్త్రీ యేతెంచెను. ఆమె దేహేంద్రియములు మఱచి వినుచు కాలమును మఱచిపోయెను. బాగుగా ప్రొద్దు పోయెను. ఆమె గృహమతిదూరమగుటచే నొంటరిగాపోజాలక, ఆమఠమునందే విశ్రమించెను. అదిచూచి గురుండు, మఠమునందు స్త్రీ నివాసము మంచిదికాదని శిష్యుల సాయమున నామెను సమీపగృహస్థుల యిండ్లకు పంపించెను. శిష్యులది గాంచి "స్వామీ! ఇదియేమి? ఆ స్త్రీకి ఒక్క రేయి మఠమునందాశ్రయ మీయకూడదా? మన పావిత్ర్యమునకు భంగము రాదుకదా!" అని పలికిరి.

అందులకు గురుండు

"మాతా స్వస్రా దుహిత్రా చ నైక శయ్యాసనో భవేత్
బలవా నింద్రియ గ్రామః విద్వాంస మపి కర్షతి"

తల్లితోగాని, కుమార్తెతోగాని పురుషుడు ఏకాసనముననుండుటకూడదు. ఇంద్రియగ్రామము బలమైనది. ఎట్టివానినైనను బలవంతముగా లోగొనును" అని తెలియజేసెను.

ఒకదినమున కొంతమంది శిష్యులు గురు సన్నిధికేగొంచి "అయ్యా! వైష్ణవుం డెట్లుండవలె!"నని ప్రశ్నించిరి. అందులకు గురుండు "అయ్యలారా! వినుడు. మానవుండనుభవింపదగు పురుషార్థములు నాల్గు. ధర్మార్థకామమోక్షములు. మొదటి మూడును ఐహికపురుషార్థములు. నాల్గవది ఆముష్మికము. మొదటి మూడింటిని త్రివర్గమందురు. ఈ మూడింటిలో నేది మంచిది! ఏది చెడ్డది! యని నిర్ణయించుటకు సాధ్యముకాదు. ధర్మార్థములు రెండును ఒకే కుదురునబుట్టినవి. వాని స్వరూపముగూడ నొక్కటియే. ధర్మమనగా, యజ్ఞయాగాదులాచరించుట. దానములిచ్చుట సత్రములుకట్టించుట అన్నదానముచేయుట కూపతటాకాదులు త్రవ్వించుట. మొదలగునవి. ఈ కార్యములు చేయుటకు పుష్కలముగు ధనము కావలయు. అదియే యర్థము. ఈ అర్థమును సంపాదించుటకు కృషి వాణిజ్యవ్యాపారాదు లవసరము. పైని పేర్కొన్న ధర్మకృత్యములు నిర్వహించుటకు ధనము నార్జింపవలయును.

"ధనమార్జయ కాకుత్స్థ! ధనమూల మిదం జగత్
అంతరం నాభిపశ్యామి, నిర్ధనస్య మృతస్యచ."

రామా! ధనమును సంపాదింపుము ఈ జగత్తంతయు ధనమూలమైనది. ధనహీనుడు జీవించియుండియు మృతునితో సమానము. ఇదియొక ఋషివాక్యము.

ఈ ధనము నెట్లు సంపాదింపవలె! న్యాయమార్గమున సంపాదింపవలయు. అబద్ధములాడక వాణిజ్యవ్యాపారముల

నిర్వహించుట ఎట్లు?" అని ప్రశ్నింతురేమో! కొన్నిసార్లు శాస్త్రానుసారముగా నబద్ధమాడినను దోసంగు లేదు. వ్యవసాయ క్షేత్రమును దున్నునపుడెన్నో ప్రాణులు హలాగ్రముపోకి మరణించుచున్నవి. ఐనను కృషివిధివిహితమైన కర్మ కావున కృషీవలునకు ఆహింసవలన దోసంగు పొసంగదు. అట్లే వర్తకమునందు శాస్త్ర విహితలాభలబ్ధికై అసత్యమాడినను అది పాతక హేతువుకాదు. పంచమవేదమగు భారతారణ్యము నందు, వ్యాసభగవాను లీవిషయమై సమగ్రముగా నిర్ణయించి యున్నారు.

మూడవ పురుషార్థము కామము. కామమునగా కోరిక. కోరికయే అన్నింటికిని మూలభూతము. ఇదియు శాస్త్రవిహిత మైనచో తప్పులేదు. ఈ కామము వ్యక్తిగత సంబంధములను బట్టి మారుచుండును. దైవమునందుగాని, గురునియందుగాని గల కామము భక్తియనబడును. అదియే భార్యయందున్నచో రతియనబడును. అదియే మిత్రులందున్నపుడు ప్రేమయనం బడును. ఇది మనకన్న చిన్నవారియందున్నచో వాత్సల్య మన బడును. పరస్త్రీయందున్నచో దూష్యరతియగును. ఈ కామము దుష్టమైనచో నరకహేతువగును. సత్క్రమకామము స్వర్గ హేతు వగును. దీనినే గీతాచార్యులు

"ధర్మా విరుద్ధో భూతేషు, కామోఽస్మి భరతర్షభ"

ధర్మవిరుద్ధముకాని కామము నాస్వరూపమేయని సెలవిచ్చి యున్నారు. రఘువంశరాజులు, "ప్రజాయై గృహమేధినాం"

సంతానము కొఱకే గృహస్థధర్మము నవలంబించియున్నారు. కర్మలు చేయనిచో శరీరయాత్ర దుర్ఘటమగునని భగవానులే వచించియున్నారు. కావున ప్రతిమనుజుడును కర్మను నిర్వర్తింపవలె.

ప్రతిమానవుడును, ఈ పురుషార్థములు మూడింటిని ఆశ్రయింపవలసినదే. గీతాచార్యులు "జహి శత్రుం మహాబాహో కామరూపం దురాసదం" దివ్యబాహువులుగల ఓ అర్జునా! కామరూపమైన శత్రువును జయింపుము" అని చెప్పిరి కదా! మీ రిట్లు చెప్పుచున్నారేమి? యని ప్రశ్నింతురేమో! గీతాచార్యులవారు దుష్టకామమును జయింపుమని సెలవిచ్చినారేకాని సత్క్రమ కామమును జయింపుమని కాదు చెప్పినది. కామములేనివాడు ప్రపంచమున లేడు. భగవానులు ప్రతివ్యక్తిని కర్మము చేయుమని ప్రోత్సహించెను. అది ఎట్టి కర్మము? ఫలత్యాగరూపకర్మము. భగవాను లర్జునునితో

"హతో వా ప్రాప్స్యసి స్వర్గం జిత్వా వా భోక్ష్యసే మహీం
తస్మా దుత్తిష్ఠ కౌంతేయ! యుద్ధాయ కృతనిశ్చయః."

అర్జునా! నీవు మరణించినచో స్వర్గలోకసుఖము ననుభవించెదవు. బ్రదికియుంటివా ఈ లోకసుఖమనుభవింతువు ఇట్టి నిశ్చయముకలవాడవై లేచి యుద్ధమొనర్పుము." అని తెల్పెను. కావున ఈ త్రిపురుషార్థము లేనిచో ఇహలోకమే లేదు.

నాల్గవ పురుషార్థము మోక్షము. ఇది ఆముష్మిక సంబంధి, ఈ పురుషార్థమును మోక్షేచ్ఛకలవారు మాత్రమే ఆచరింతురు దీనినెల్లరును పాటింపరు. మోక్షమునుగూర్చి పెద్దలైనవార లనేకవిధముల కొనియాడియున్నారు. శ్రీశంకర భగవత్పాదులు ఈ జీవుడు బ్రహ్మమునందైక్యమగుటయే మోక్షమని సెలవిచ్చిరి. అట్లు జీవుడు బ్రహ్మైక్యము పొంద వలయునన్న జ్ఞాన మావశ్యకము. భగవద్రామానుజులు పర బ్రహ్మతో సమానుడై బ్రహ్మానందము ననుభవించుటయే మోక్షమని వక్కాణించిరి. ఆ భగవంతునితో సమానుడగు టకు భక్తిప్రపత్తు లవసరము. పూర్ణప్రజ్ఞయాచార్యులవారు పరబ్రహ్మలోకమునకుపోయి జీవుడు బ్రహ్మానందము ననుభ వించుటయే మోక్షమనిరి. ఎవ్వరెట్లు చెప్పినను, ఈ మోక్ష లక్ష్మిని పొందుటకు పరబ్రహ్మోపాసన ముఖ్యమనిరి.

ఇక వైష్ణవతత్త్వము నుపదేశించెద. వైష్ణవుండగువాడు భగవంతునకు శేషభూతుడై సదాచార్యాశ్రయణము కలిగి భాగవత పారతంత్ర్యమును వహించి, భగవద్దాస్యనామమును ధరించి, సర్వేశ్వరచిహ్నములు స్వీకరించి, అర్థపంచక జ్ఞాన సంపన్నుండై పంచసంస్కారపరుండై ఆకారత్రయం బెఱింగి, మంత్రాంతర, సాధనాంతరములు రోసి నిత్యము భగవత్సేవ చేయవలయును. ఇంటికివచ్చిన భగవద్భక్తుల కుపచరించుచు, వారి నన్నపానాది సత్క్రియలం సంతసింపజేయుచు, భాగవ తాపచారంబులకు దూరముగానుండి, నిత్యమంత్ర రత్నాను సంధానపరుండు కావలయును. విషయలోలుండు కారాదు.

కర్మములన్నియు భగవదారాధనరూపంబులని తలంచి, ఫలాభి సంధిరహితుడై సర్వధర్మములు పరిత్యజించి, సర్వభారములు సర్వేశ్వరుని యందు నిక్షేపించి, కాలమును గడుపవలయును. పై త్రివర్గమును అట్లే అనుష్ఠింపవలయును" అని సెలవిచ్చెను.

అంతశిష్యులు గురునితో "స్వామీ! తామంతయు లక్షణము సెలవిచ్చితిరి. ఉదాహరణ పూర్వకముగా చెప్పినచో మామనస్సులకు గాఢముగా హత్తుకొనును. కావున అట్లు చెప్పుదురుగాక" అని ప్రార్థించిరి.

అపుడు దేశికుండు మందస్మితముతో "వత్సలారా! అట్లే చెప్పెద. పై ష్ణవుడు భగవంతునకు శేషభూతుడు. శేషుడనగా దాసుడు. శేషశబ్దమునకు శ్రీ ఆళ్వందారు చెప్పిన నిర్వచనమును పరికించుడు.

"నివాస శయ్యాసన పాదుకాం శుకో
పధాన వర్షాతప వారణాదిభిః
శరీర భేదై స్తవ శేషతాం గతైః
యథోచితం శేష ఇతీర్య తేజనైః" ......

సర్వేశ్వరుడు వసించుటకు గృహముగను, శయనించుటకు ప్రక్కగాను, కూరుచుండుట కాసనముగను, తొడుగుకొనుటకు పాదుకలుగను, కట్టుకొనుటకు వస్త్రముగను, నిద్రించునపుడు దిండుగాను, ఎండ, వానలు నివారించు గొడుగుగాను. తన శరీరము ననేక భేదములుగా కల్పించి నందువలన జనులచే నాతడు శేషుడని చెప్పబడుచున్నాడు.

వైష్ణవ ధర్మీయుండవలయును. శ్రీధరునకు సేవ లొనరించుట, దేవాలయమునంతయు శుభ్రపరచుట, కలయంపి చల్లుట, ముగ్గులిడుట శ్రీవారిపల్యంకికాదండమును భుజమున ధరించి మోయుట, శ్వేతచ్ఛత్రమును బట్టుట, పూలమాలలు సమర్పించుట దివ్వటీలు పట్టుట ఆదిగాగల క్రియ లాచరింపవలయు. ఇది దాసలక్షణము. దీనినే దాస్యము లేక కైంకర్యము అందురు.

సదాశ్రయణ మన సద్గురుపాదంబు లాశ్రయించుట. చేతనులు సంసారమునుండి తరించుటకు ఇది ప్రథమ సోపానము. గురుండు శాస్త్రజ్ఞానమును కలిగి తానాచరించువాడుగా నుండవలయును. భగవద్విషయమును చెప్పుటయందు సమర్థుండు కావలయును. భాగవతులను ప్రేమించువాడై యుండవలయును. కులమత ద్వేషదూరుండు కావలయును. ఆత్మగుణములు కలవాడు కావలెను. సమస్త భూతములను సమదృష్టితో దర్శించువాడు – అహింసాపరుండును కావలె. అతడు భగవచ్చిహ్నములు ధరించువాడు కావలె. ఇట్టి గురుని ఆశ్రయించినచో వీరు కృతార్థులగుదురు. గురుండు దుష్టుడయ్యెనా వీరధః పతితులగుదురు. ఈ విషయమునందు కొందరు గురుండు బ్రాహ్మణ కులస్థుండైన చాలుననియు, బ్రాహ్మణవంశము నందు అను వంశముగా గురుత్వమును వహించినవాడే ఆశ్రయణీయుడు. గుణములు ప్రధానములుకావు. ఎట్టి గుణసంపన్నుండైనను, ఎట్టి శాస్త్రజ్ఞుడైనను, ద్విజేతరు డాచార్యత్వమునకు

తగదని కొందఱు చెప్పుచున్నారు. గ్రంథములు వ్రాయు చున్నారు. పాపము ఆశ్రయించిన వృత్తినిబట్టి కులము లేర్ప డినవని వారికి తెలియదు. 'బ్రహ్మ విద్బ్రహ్మ' అని వారు పఠించుచునే యుందురు కాని యథార్థమునకు వచ్చుసరి కంగీక రింపరు. వారు సంకుచితహృదయులు. విశాలదృష్టిలేని అధ మాధములు వా రరచు కారుకూతలను లెక్కింపవలసిన పనిలేదు.

ప్రపంచమనగా నొక భారతమేనా? ఖండాంతరములందు కులవివక్షలేదుకదా! మరియచ్చట గురుశిష్య పరంపరలేదా! సోక్రటీస్ శిష్యుడు ప్లేటో. అతని శిష్యుడు అరిస్టాటిల్. అట్లే ఆగురుశిష్య పరంపరను వదింతురు. అచ్చటివారు బ్రాహ్మణ జాతీయులా?

సర్వేశ్వరు డందరికిని సముండు. రామాయణ భార తాదులను సమ్యక్దృష్టితో చూడనేరక, కూపస్థమండూక చక్రవర్తులవలె ప్రల్లదములు కూయుచున్నారు. ఇచ్చట ఆ చర్చ నెక్కువకొనసాగించుట మంచిదికాదు.

అయితే అట్టి గురుని తెలిసికొనుట ఎట్లు? ఆ గురున కేమి తెలిసియుండవలెనని ప్రశ్నింతురేమో! ప్రపంచమున నేవ్యక్తియు సర్వజ్ఞుండుండడు. ఈ భారతావనియందు సుప్ర సిద్ధములైన, విశిష్టాద్వైత, అద్వైత, ద్వైతవిషయములు పూర్తిగా తెలిసిన గురుండాశ్రయింపదగినవాడు.

మంత్రములన్నియు గ్రంథములందున్నవి! వానిని చదువుకొనవచ్చును కదా! అట్టిచో నొక గురువేల! యను ప్రశ్న నైతురేమో!

గురుశిష్య సంప్రదాయ మనాదిసిద్ధము. ఈ మంత్ర ప్రదానమున కితడర్హుడా? అనర్హుడా! యను విషయము నెఱింగి గురువు శిష్యునకు మంత్రోపదేశ మొనర్చును. గుర్వాశ్రయమును పొందినపిదప అర్థపంచకజ్ఞానము కలవాడు కావలయును. అర్థపంచకమనగా, ఐదు సంబంధములగు జ్ఞానమును సముపార్జింపవలె.

"ప్రాప్యస్య బ్రహ్మణోరూపం ప్రాప్తుశ్చ ప్రత్యగాత్మనః
ప్రాప్త్యుపాయం ఫలం ప్రాప్తే స్తథా ప్రాప్తి విరోధిచ"

స్వస్వరూపము - పరస్వరూపము - విరోధిస్వరూపము- ఉపాయస్వరూపము - ఉపేయస్వరూపము.

స్వస్వరూపమనగా తనయొక్క- అనగా జీవునియొక్క- స్వరూపము తెలిసికొనుట. జీవస్వరూపము గీతోపనిషత్తునందు- సాంఖ్యయోగమునందు పూర్తిగా భగవానులచే చెప్పబడినది.

"నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః
న చైనం క్లేదయం త్యాపః నశోషయతి మారుతః"

అర్జునా! ఈ జీవుని కత్తులు నరుకజాలవు. అగ్ని కాల్ప జాలదు. నీరు తడుపలేదు. వాయువు శోషింపచేయజాలదు. జీవుడెన్నడును చావడు. పుట్టడు. నశింపడు. వీడు శాశ్వత

స్వరూపముగలవాడు. జీవునకు చావు పుట్టుకలు కన్పించు చున్నవికదా! ఈ చావు పుట్టుకలు దేహమునకేగాని, జీవునకు కాదు. బ్రహ్మమెట్లు నిత్యమో—జీవుడును అట్లే నిత్యుడు, సర్వేశ్వరుడు

వాసాంసి జీర్ణాని యథా విహాయ
న వాని గృహ్ణాతి నరోప రాణి
తథా శరీరాణి విహాయ జీర్ణా
న్యన్యాని సంయాతి న వాని దేహి.

అని సెలవిచ్చియున్నారు. మనుష్యుడు ప్రాతవస్త్రమును విడచి క్రొత్తబట్టను ధరించినట్లు, ఈ జీవుడు జీర్ణమై ముదిసిన దేహమునువదలి నూతన శరీరమును దాల్చుచున్నాడు.

ఈ జీవపరమేశ్వరులొకేస్వరూపము. అవిద్యావరణము వలన పరమాత్మయే, నేను జీవుడను అనితలంచుచున్నాడు. అందువలననే జీవునకు సంసారబంధము సంక్రమించినది. ఆయవిద్య యెపుడునశించునో అనగా నెప్పుడు జ్ఞానముకలుగునో, అపుడీ జననమరణరూపసంసారమంతయు నశించి, బ్రహ్మైక్యము సంభవించును. అని కొందఱు తలంచుచున్నారు.

గౌతమ కణాదులీవిషయము నంగీకరింపరైరి. వారు ఆత్మలు పెక్కులుగా నిర్ణయించిరి.

"తత్రేశ్వరః సర్వజ్ఞః పరమాత్మా
ఏకఏవ జీవస్తు ప్రతిశరీరం భిన్నః"

సర్వజ్ఞుడును, ఈశ్వరుడునునగు పరమాత్మ యొక్కడే. జీవులు మాత్రము ప్రతిశరీరమున కొక్కడు. అనగా ననేకులు.

విశిష్టాద్వైత మతకర్తయగు భగవద్రామానుజులు కూడ జీవులనేకులుగా నిర్ణయించిరి. జీవేశ్వరులు భిన్నులను సిద్ధాంతమునందు ననేకదోషములు చూపించిరి.

కొందరీ దేహమే ఆత్మయని భ్రమించుచున్నారు. కొందఱు పంచప్రాణములు, అనగా ఖండవాయువులు ఆత్మయని యెంచుచున్నారు. ఈ వాయువు లఖండమహావాయువునందు సంక్రమించి పోవుచున్నవని వారి విశ్వాసము. ఇవియన్నియు శాస్త్రవిహితములు కావు. దేహమే ఆత్మయగుచో, దేహము పూర్తిగానున్నపుడు దానిని తగులబెట్టుటగాని, పూడ్చిపెట్టుటగాని సంభవింపదు. గాలిలోగాలి కలిసిపోవుట యదార్థమైనచో పూర్వజన్మ-పునర్జన్మలు రెండును లేకపోవలసివచ్చును. పూర్వజన్మ లేదనినచో ప్రత్యక్షమునకు విరోధము వచ్చును. కొందఱు పుట్టుగ్రుడ్డివాండ్రుగా, కొందఱు పిచ్చుకుంట్లుగా జనించుచున్నారు. వారేమి పాపము నీజన్మయందు కావించిరి ? ఒకడు ఆగర్భశ్రీమంతునిగా, మరియొక డాగర్భదరిద్రునిగా నుద్భవించుచున్నారు. ఒక డారోగ్యవంతునిగా, ఇంకొకడు నిత్యరోగపీడితునిగా జనించుచున్నారు. మరి వీనికి కారణములేమి ? పూర్వజన్మ పుణ్యావిశేషమని చెప్పవచ్చును కదా ! కావున ఆత్మశరీరముగాని-పంచప్రాణములుగాని కాదని తేలినది. పూర్వజన్మకృత పాపపుణ్యాను లీజన్మమున ననుభవింపబడుచున్నవి.

ఈ జీవులు మూడువిధములు. 1. బద్ధులు 2. ముక్తులు 3. నిత్యులు.

బద్ధులనగా, ఈ సంసారరూపబంధమునందు తిరిగితిరిగి, మ్రగ్గిపోయి జననమరణ రూప (నరక) యాతన ననుభవించును. స్వర్గమర్త్యపాతాళలోకములయందు వీరు సంచరించుచుందురు.

ముక్తులనగా, ఈసంసారబంధమునెల్ల తరించి, అర్చిరాది మార్గమున త్రిపాద్వి భూతికింబోయి భగవదనుభవము ననుభవించుచు, శాశ్వతసుఖులై విహరించువారు. ఈ ముక్తులలో మరియొక తెగగలదు. ఆత్మోపాసనచేసి కైవల్యమునకుపోయి ఆత్మావలోకనము చేయుచు సుఖంతురు. వీరు కేవలులని చెప్పబడుదురు.

నిత్యులనగా ఈ సంసారవాసనలేనివారై అస్పృష్ట సంసారగంధులై కేవలానందపరులై బ్రహ్మానందము ననుభవించుచు, నిత్యవిభూతియందు నివసించు, విష్వక్సేన గరుడ శేషాది నిత్యసూరులు. దీని నెఱుంగుట స్వస్వరూపజ్ఞానము.

ఇక పరస్వరూప వివరణముకావింతు. పరస్వరూపమనగా సర్వేశ్వరరూపము. ఇది ఐదువిధములు. 1. పర 2. వ్యూహ 3. విభవ 4. అంతర్యామిత్వ 5. అర్చావతారములు.

పరమనగా త్రిపాద్విభూతియందున్న శ్రీవైకుంఠము నందు తిరుమామణి మంటపమున శ్రీభూనీళాది దివ్యమహిషీ సమేతుండై శంఖచక్రాది పంచాయుధంబులు మూర్తిమత్వ

ములై సేవించుచుండ, అష్టశక్తులు వింజామరలు వైచుచుండ శేషపర్యంకంబున నిత్యసూరులు సేవించుచుండ యోగపరవశుడై వేంచేసియున్నరూపము. ఇది ముక్తులైనవారు గమింపదగు దివ్యస్థానము.

వ్యూహ మనగా, వాసుదేవ, ప్రద్యుమ్న, సంకర్షణ, అనిరుద్ధమను నాలుగు నామంబులుగల నాలుగు దివ్యధామములు.

వాసుదేవవ్యూహము విరజానదికావల పరమవ్యోమంబుననున్న స్థానము. కృష్ణావతార సమయంబున అర్జునునితో గూడిపోయి వైదికుని పిల్లలను తీసికొనివచ్చిన స్థానంబని పెద్దలు చెప్పుచున్నారు.

ప్రద్యుమ్నవ్యూహము, బ్రహ్మలోకమునుండి చతుర్దశభువనాత్మకంబైన ఈ బ్రహ్మాండముయొక్క యోగక్షేమముల నరయుచుండునట్టి మూర్తిభేదము.

అనిరుద్ధవ్యూహము, క్షీరసాగరముననుండి తద్దేశవాసుల రక్షాభారమున వహించి, భూభారమును హరించుటకు, ధర్మసంస్థాపన మాచరించుటకు రామ కృష్ణాద్యవతారములనెత్తి భూమిని రక్షించుచున్నట్టి దివ్యరూపము.

సంకర్షణవ్యూహము, పాతాళలోకమునందుండి మహాప్రళయమునందు ఈ చతుర్దశభువనాత్మకంబైన జగతీతలంబునెల్ల అగ్నిస్వరూపమున కాల్చివేయునది. ప్రళయకాలమునందీ

సంకర్షణవ్యూహము మండి లోకములను దహించివేయునని పెద్దలు నుడువుచున్నారు.

విభవ మనగా రామ కృష్ణ నారసింహాద్యవతారంబులు.

అంతర్యామిత్వ మనగా సకలజంతు హృదయాంతరాళ జాలమున నెవ్వరికిని గోచరింపకయుండి, జంతుజాలము నెల్ల తన దివ్యశక్తిచే ధరించియుండునది.

అర్చావతార మనగా శ్రీరంగ వేంకటాచలాహోబిల హస్తిగిరి సింహాచల భద్రాచలాది దివ్యదేశములయందుండి, భక్తాభీష్టములు తీర్చుచున్న దివ్యరూపము.

ఇక విరోధిస్వరూపము విస్తరించెద. 1. స్వరూపవిరోధి 2. పరత్వవిరోధి 3. ఉపాయవిరోధి 4. పురుషార్థవిరోధి అని విరోధిస్వరూపము నాలుగు విధములు.

స్వరూపవిరోధి :- అహంకారము. ఈ దేహమే 'నేను' అని తలంచుట. దేహము జీవస్వరూపమెట్లగును ! దేహ మనిత్యము. జీవుడు నిత్యుడు. జీవుడు నిత్యుడు కానిచో పరలోక ప్రయత్నమునుగాని, పునర్జన్మప్రయత్నమునుగాని చేయువలసిన అవసరములేదు. జీవునికి దేహమగుచో, నది అందరును చూచుచుండగనే యిచ్చట నశించిపోవుచున్నది. కొన్ని దేహములు భస్మముకాగా కొన్ని శరీరములు పురుగులగుచున్నవి. కొన్ని దేహములు మలరూపములగుచున్నవి. ఈ మూడురూపములును అంతమున భూమిగామారిపోవుచున్నవి. ఇట్టి దానికై

జీవుడు పరలోకప్రయత్న మొనరించుట వ్యర్థము. శ్రుతిస్మృతీతిహాసపురాణాదులన్నియు పునర్జన్మమున్నటుల ఘోషించుచున్నవి. కనుక దేహాత్మభ్రమస్వరూప విరోధియని చెప్పబడుచున్నది.

పరత్వవిరోధి :- మమకారము దీనిస్వరూపము. ఇది నాదియని తలంచుట తనను తాను స్వతంత్రునిగా భావించుకొనుట. ఈ జీవుడు సర్వేశ్వరునిసొత్తు. ఆయన ఇష్ట వినియోగార్హమైనది. "మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః", ఈ జీవుడు నాభాగము. వీడు సనాతనుడు. అని భగవద్వాక్యము.

"ద్వాసు పర్ణాస్సయుజా సుఖా యా సమానం వృక్షం
పరిష స్వజాతే
తయోరేకః పిప్పలం స్వాద్వత్తి, అనశ్నన్ అన్యోఽభి
చాకశీతి"

రెండుపక్షులు. మంచిరెక్కలుకలవి. మంచిస్నేహ ధర్మముగలవి. అవిరెండును ఒకేవృక్షమును సమానముగా నాశ్రయించియున్నవి. అందులో నొక పక్షికాహారము కావలయును. అది తీయని పిప్పలఫలమును తినుచున్నది. రెండవ పక్షికాహారమవసరములేదు. అది సాక్షీభూతముగానుండి చూచుచున్నది. అని ముండకోపనిషత్తు చెప్పుచున్నది. ఈ రెండు పక్షులును జీవేశ్వర పరమేశ్వరులు. అవి ఆశ్రయించిన వృక్షము సంసారము. అందుకర్మఫలము ననుభవించువాడు జీవుడు. పరమేశ్వరుడు కేవల సాక్షీభూతుడే. అతని కర్మఫల మంటదు.

బ్రహ్మసూత్రములలోని అపిస్మర్యతే' అనుసూత్రము నీవిషయమునే తెలుపుచున్నది. అందువలన నీ జీవుడు అస్వతంత్రుడు. పరతంత్రుడు. పరబ్రహ్మకు శేషభూతుడు. ఇట్లు భావింపకపోవుటయే పరత్వవిరోధి

ఉపాయవిరోధినిగూర్చి విస్తరించెద. సర్వేశ్వరప్రాప్తికి కర్మయోగ జ్ఞానయోగాదులు, యమనియమాదులు కారణములని తలంచుట, సర్వేశ్వరప్రాప్తికి భగవదనుగ్రహ మొక్కటియే కారణము కాని, అన్యములు కారణములు కావు.

పురుషార్థ విరోధియనగా భగవత్ప్రాప్తికన్న భిన్నమైన దానిని కోరుకొనుట.

శ్లో॥ వ్యవసాయాత్మికా బుద్ధిరేకేహ కురునందన!
బహుశాఖా హ్యనంతాశ్చ బుద్ధయోఽవ్యవసాయినాం"

నిశ్చయమై శాస్త్రీయమై మోక్షేచ్ఛగలవాని బుద్ధి యొక్కటియే. కామ్యకర్మరక్తుడైన వానిబుద్ధి అనంతవిధముల ప్రసరించును. అని గీతాచార్యులవారు సెలవిచ్చిరి. పరమేశ్వరునికోరక, యితరములను కోరుట పురుషార్థ విరోధియని చెప్పబడుచున్నది.

ఉపాయస్వరూపమును తెలిపెద. ఈ యుపాయము భక్తియని కొందఱును, ప్రపత్తియని కొందఱును భావించుచున్నారు, కొందఱు భగవదనుగ్రహమే ఉపాయమని చెప్పుచున్నారు.

పురుషార్థ స్వరూపమనగా భగవత్ప్రాప్తియైన మోక్షమని చెప్పరాదు. కైవల్యాదులుకూడా మోక్షమనియే చెప్ప

బడును. అందువలన భగవత్ప్రాప్తియే పురుషార్థస్వరూప మని పెద్దలు ప్రతిపాదించిరి. ఉపాయ పురుషార్థస్వరూపములు రెండును భగవత్ప్రాప్తియే యని ముఖ్యపిండితార్థము.

ఇక పంచసంస్కార విషయము నామూలాగ్రముగా వివరించెద. ఇవి ఐదు విధములైన సంస్కారములు.

శ్లో॥ తాపః పుండ్ర స్తథా నామ మంత్రో యాగశ్చ పంచమః
అమీ పంచసంస్కారాః పరమై కాంత హేతవః

1. తాపమనగా శంఖచక్రము లగ్నియందు తప్తముజేసి భుజ మూలములయందు ముద్రించుట.

2. పుండ్రమనగా, తిరుమణి శ్రీ చూర్ణములతో ద్వాదశ స్థలములయందు ఊర్ధ్వముగా బొట్టును పెట్టుకొనుట.

3. నామమనగా, తల్లిదండ్రులు పెట్టినపేరు విడచిపుచ్చి భగవ ద్భాగవతదాస్య నామమును ధరించుట. కృష్ణదాసు, రామ దాసు, రామానుజదాసు, పరాంకుశదాసు మొదలగు పేరులందొక దానిని పెట్టుకొనుట.

4. మంత్రము : భగవన్మంత్రములగు వాసుదేవ ద్వాదశాక్షరి, విష్ణుషడక్షరి, రామషడక్షరి, నారాయణాష్టాక్షరి; ఈ మంత్రములను ప్రతినిత్యమును జపించుట. అష్టాక్షరీ మంత్రార్థమగు ద్వయమంత్రమును సదాస్మరించుట.

5. యాగము :- తాను పచనముచేసికొనిన పదార్థముల నన్నింటిని, అనగా అన్నము, పప్పుకూరలు పిండివంటలు,

నేయి, పెరుగు, మొదలగువానిని భగవంతునకు ముందుగా నివేదించుట. నీ వేర్పాటుచేసికొనిన అర్చావిగ్రహము నెదుటనుంచి, ఒక్కసారి రెండుచేతులనుసాచి, భగవదర్పణచేసి, ఆ పదార్థమును భుజింపవలె. ఇది ప్రతిమనుష్యుడును తప్పక ఆచరింపవలె. అట్లు భగవదర్పణచేసినను దానియందు భగవంతుడే కొంచెమైనను స్వీకరింపడు. మన భక్తినిమాత్రమే గ్రహించును. ఇట్లుచేసినచో ఆపదార్థములన్నియు పవిత్రములగును. ఆ వంటకావించు వ్యక్తి స్నానంబాచరించి, శుభ్రవసనమును ధరించి, పరమపవిత్రహృదయముతో వంటచేయవలె. కానిచో నాపదార్థములు భగవన్నివేదనార్హములుకావు. రాత్రినిద్రించి వేగిలేచి కాలకృత్యములు తీర్చికొనినవ్యక్తి స్నానమాచరించినగాని పవిత్రుడుకాడు. అయినను శాస్త్రవిహితపదార్థములనే స్వామికి నివేదింపవలయునుగాని, మద్యమాంసాదుల నివేదింపరాదు. అవి తామసపదార్థములగుటచే భగవన్నివేదనకర్హములుకావు. సాత్వికపదార్థములను భగవన్నివేదనము కావింపక తామే అరగించినచో వారుదుష్టులు. గీతాశాస్త్రమున శ్రీకృష్ణభగవానులు

"యజ్ఞశిష్టాశిన సంతోముచ్యంతే సర్వకిల్బిషైః
తే త్వఘం భుంజతే పాపాయే పచంత్యాత్మకారణాత్"

దేవతానివేదనమైన పదార్థము యజ్ఞశిష్టమగును. ఆ పదార్థములను భుజించిన సత్పురుషులు సర్వపాపములనుండి

విడివడుదురు. ఎవరు తమకొఱకే వండుకొని తినుచున్నారో వారు పాపమును తినుచున్నారుగాని అన్నమునుకాదు. అట్లు తినువారు దొంగలు. భోజనమును స్నానముచేసి చేయుమని "స్నాత్వా భుంజీత" అని విధి తెల్పుచున్నది.

ఈ శబ్దమునకు విధి 'భుంజీత' (తినుట) యందుకాదు! 'స్నాత్వా' 'స్నానముచేసి' యను దానియందే. ప్రాతఃకాలము నందు శీతజలస్నానమొనరించిన వానికి, మారీ స్ఫోటకాది దుష్ట వ్యాధులు రావని పెద్దలు వచింతురు. రాత్రియందెల్ల నిద్రించుటచే మానవులకు దేహాంగములెల్ల చొక్కి యుండును. ఒక్కసారి శిరస్స్నాన మొనర్చినచో శరీరభాగములనియు నార్ద్రవంతములగును. శరీరమునగల మాంద్యము తొలగిపోవును.

కొందఱు శిరస్స్నానమును చేయక కంఠస్నానమునే కావింతురు. అది శ్రేష్ఠమగు పద్ధతికాదు. కంఠస్నాన మాచరించినచో శరీరమునందలి వేడియంతయు శిరస్సునకు ప్రాకును. అందుచేను ఉష్ణోదకస్నానము కూడదు. నీటియందలి శక్తి నంతయు నగ్ని దహించివేయును. 'ఉత్తమంచ నదీస్నానం' ఉషఃకాలమున నదీతోయములందు మునుంగుట ఉత్తమోత్తమము. నదీజలమునందలి పోషకపదార్థములన్నియు శరీరమునకుపట్టి ఆరోగ్యము నభివృద్ధిపఱచును. రాత్రిసమయములం దుష్ణోదక స్నానమురిగినదే. అది అలసిన శరీరమునకు కాపువేయుట వంటిది.

నదియందలి యొంద్రుమట్టిని శిరస్సునకు శరీరమునకు దట్టముగా దట్టించి, ఒకగంటకాలము వేచియుండి స్నాన

మొనర్చినచో శరీరమునందలి గజ్జి కురుపులు మొదలగు వ్యాధులు సమూలముగా నాశములగును. ప్రతిదినమును స్నాన మొనర్చి ధౌతపరిధానములను ధరించుట, లలాటమున పుండ్ర మును దాల్చుట యుక్తాహారమును భుజించుటయనునవి ఆరోగ్య దాయకములు.

శ్లో॥ యుక్తాహార విహారస్య యుక్త చేష్టస్య కర్మ సు
యుక్త స్వప్నావ బోధస్య యోగో భవతి దుఃఖహా ॥

తగిన ఆహారవిహారములు కలవాడును, ఉత్తమకర్మముల నాచరించువాడును యుక్తనిద్రకలవాడును సత్పురుషు డన బడును. అట్టివానికి నేను చెప్పుచున్న యోగము చక్కగా పట్టుచున్నదని గీతాచార్యులు సెలవిచ్చిరి.

ఆకారత్రయ మననేమియో వివరించెద. 1. అనన్యార్హ శేషత్వము 2. అనన్యభోగ్యత్వము 3. అనన్యశరణ్యత్వము.

అనన్యార్హ శేషత్వ మనగా ఈ జీవుడు సర్వేశ్వరునకు తప్ప నితరులకు దాసభూతుండు కాడు. సర్వేశ్వరున కొక్కనికే శేషుడు. అనగా దాసుడు.

శ్లో॥ మామేవయే ప్రపద్యంతే మాయామేతాం తరంతి తే॥

నన్నొక్కనినే ఎవ రుపాసించుచున్నారో, అట్టివారు ఈ ప్రకృతిబంధమునువీడి, సుఖించుచున్నారు. మరియితర దేవతల నేల యుపాసింపరాదన్నచో

శ్లో॥ కామైస్తైస్తైర్హృత జ్ఞానాః ప్రపద్యంతేన్య దేవతాః
తంతం నియమ మాస్థాయ ప్రకృత్యానియతస్స్వయా॥

పూర్వకర్మానరూపవాసనా సహితులై వారి వారి ప్రకృతికి తగినకోర్కెలు కలవారై ఆయాదేవతలను భజించు చున్నారు.

ఈ లోకమునందు మానవుల వాంఛలనంతములు. ఒకనికి సంతానము కావలె. మరియొకనికి ధనము. ఇంకొకని కారోగ్యము. ఇట్లు ప్రపంచమున నెందరు మానవులున్నారో అన్ని విధములైన కోర్కెలుకూడనున్నవి. ఇట్టి కోర్కెలు కలవారై ఆయా కోర్కెలనిచ్చుటకై ఆయాదేవతల నారాధించు చున్నారు. ఒక్కొక్క దేవతనారాధించిన ఒక్కొక్కకోర్కెను తీర్తురు. కాని 'సర్వలాభాయ కేశవః' అను సూక్తిప్రకారము సర్వలాభముల కొఱకు కేశవుని ధ్యానింపవలె.

"అంతవత్తు ఫలం తేషాం తద్భవత్యల్పమేధసాం"

కేశవుడు తక్క ఇతరులగు దేవతలందఱు నొసంగునట్టి వరముల కంతముకలదు. సర్వేశ్వరుడు ప్రసాదించిన కోరికకు మాత్ర మంతమే లేదు. అనగా అతడిచ్చునది యొక్కటియే. సర్వేశ్వరప్రాప్తి కలిగిన తరుపరి కోరికలేముండును! ఉండవు. కావున ఆతడొసంగు ఫలమనంతము.

అనన్యభోగ్యత్వము:- ఈ జీవుడు సర్వేశ్వరుని కొఱకునికి తప్ప ఇతరులెవ్వరికిని భోగ్యుడుకాడు. నారాయణ శబ్దోత్పత్తిచే ఈ జీవులందఱును సర్వేశ్వరునకు స్థానము. 'వసం త్యస్మిన్

జగంతిరి వాసుదేవః' అనగా జగత్తులన్నియు సర్వేశ్వరునియందే యుండును గావున నాతడు వాసుదేవు డనబడుచున్నాడు.

అనన్య శరణత్వమనగా, ఈ జీవునకు సర్వేశ్వరుడు తప్ప రక్షకులన్యులు లేరు. రక్షణయనగా దేవేంద్రుడు దేవతల నంద ఱిని రక్షించుచుండును. బ్రహ్మ సర్వులకు వరములిచ్చి కాపాడు చుండును. శంకరుడు వరములచే రక్కసులనెల్ల బ్రోచు చుండుట లేదా! మరి విష్ణువొక్కడే రక్షకుడనుటెట్లు? అని ప్రశ్నింతురేమో, రక్షణయనగా ఈ ప్రకృతిబంధమునుండి దాటించి, నిత్యసుఖమొసంగుట. దానినే భగవద్గీతయందు

శ్లో॥ ఆ బ్రహ్మ భువనాల్లోకా, పునరావర్తి నోర్జున!
మా ముపేత్య తు కౌంతేయ! పునర్జన్మ న విద్యతే"

బ్రహ్మలోకము వఱకున్న లోకములన్నియు పునర్జన్మ మును కలిగించును. నన్ను పొందినవాడు మాత్రము, మరల ఈ లోకమునకు తిరిగిరాడు.

శ్లో॥ బ్రహ్మ ద్యాస్సకలా దేవా మనుష్యాః పశవ స్తథా
విష్ణోర్మాయా మహావర్త మోహాంధ తమసా వృతా!

శ్లో॥ ఆ బ్రహ్మ స్తంబ పర్యంతా జగదం తర్వ్యవ స్థితాః
ప్రాణినః కర్మజనిత సంసార వశ వర్తినః

బ్రహ్మ మొదలు సమస్తదేవతలు, మనుష్యులు, పశు పక్ష్యాదులన్నియు సర్వేశ్వరుండగు విష్ణువుయొక్క! మహా మాయావర్తమునందు మునిగియున్నవి. బ్రహ్మ మొదలు స్తంబ పర్యంతముగల సర్వజీవులును, వారివారి కర్మాను వర్తియగు

సంసారమునందు పరిభ్రమించుచున్నారు. శ్రుతియునిట్లు వచించుచున్నది.

"ఏకోహవై నారాయణ ఆసీత్-న బ్రహ్మనేశానః న చంద్రః న సూర్యః న నక్షత్రాణి నేమే ద్యావా పృథివీ"

సృష్టికిపూర్వము బ్రహ్మలేదు, ఈశానుడు లేడు. సూర్య చంద్రులు లేరు. నక్షత్రములు లేవు. భూమ్యాకాశములు లేవు. నారాయణుం డొక్కరుండే యుండెను.

వేదాపహార గురుపాతక దైత్యపీడాద్యాపత్తులవలన నెవ్వడీ బ్రహ్మరుద్రాదుల రక్షించెనో, అట్టి నారాయణునకన్న రక్షకుడు లేడని పెద్దలు వచించుచున్నారు. అందువలన నారాయణున కొక్కనికే ఈ జీవుడు రక్ష్యభూతుడుగాని మరియొకనికి కాడు. అందువలన ఉపాయోపేయస్వరూపములు రెండును. సర్వేశ్వరుడేయనినమ్మి సర్వభారములు సర్వేశ్వరునియందునిక్షేపించి, నీపాదపద్మములు తక్క మరియొకటి నాకురక్షకము లేదని నమ్మి భగవద్భాగవత కైంకర్యము చేయుచు, నెవడు తన జీవితయాత్ర కొనసాగించునో, అట్టివాడే వైష్ణవుడు అని వైష్ణవత్వమును శిష్యులకెల్ల తేటతెల్లముగా ఉదాహరణ పూర్వకముగా వివరించెను.

శిష్యులు సంతసించి "స్వామీ! భాగవతాపచార మనగానేది! ఎట్టిరూపము కలదియో ఆనతిండు" అని కోరిరి.

వరవరముని ప్రవరుండు విద్యార్థులంగాంచి "అయ్యలారా! భాగవతాపచారంబనేక విధంబులు. భాగవతులగాంచి వీడే

కులమని ప్రశ్నించుట వీడు నీచజాతివాడని నిరసించుట, భాగవతుల వేషములనుజూచియు, కట్టుబొట్టుల గాంచియు, కంఠమాలికల చూచియు పరిహసించుట. భాగవతులు వసించు దివ్యస్థలములను నిందించుట. భాగవతులగాంచి కురూపియని ఈసడించుట ఇట్టివి యన్నియు భాగవతాపచారంబులు. పంచమవేదంబగు భారతమున దీనికి సంబంధించిన గాధ యొండుకలదు దాని వినిపింతు. నాకర్ణింపుడు.

పూర్వము గాలవుండను పేరుగల యొక ఋషికలదు. అతడును వైనతేయుండును చిన్ననాటి మిత్రులు. ఒకానొకదినంబున గాలవుని కార్యార్థమై గరుడుడతని తన వీపుపై నెక్కించుకొని వరుణలోకంబున కేగుచుండెను. వారిరువురును అస్తమయ పర్వతంబునకుపోగా, సూర్యభగవాను డంతర్హితుండయ్యె అపుడు వారిరువురు సాయంసధ్య నుపాసింపదలంచి, అపర్వతముపై దిగిరి. గరుడు ఆ పర్వతము నంతయు తిలకించుచుండ నొకచోట నొక పురంబుగోచరించె అపురంబు శైవశాక్తేయ మతసంకులంబై యుండె. ఆ గ్రామమధ్యంబున శాండిలిని యను పేరుగల యొక శూద్రస్త్రీ పరమభాగవతోత్తమురాలు వసించుచుండె. ఆమె యొకగృహమును నిర్మించుకొని దానిచుట్టును ఎత్తగు ప్రాకారము కట్టుకొని కవాటంబులు బిగించుకొని గృహమునందే యుండి భగవద్ధ్యాన తత్పరయై నివసించియుండె. ఆమె ఇంటి నుండి వెలుపలికి వచ్చినచో చుట్టుపట్టులగల పాషండు లామెను బాధించుచుండిరి. అందుచే నామె లోపలనే యుండెను.

ఇదియంతయు గరుడుడు గమనించెను. ఈ శాండిలిని గూర్చి "అయ్యో! ఈమె మహాభక్తురాలయ్యు, ఈ నికృష్ట దేశమునందున్న కారణమున చాలబాధపడుచున్నది. ఈమెను శ్రీవైకుంఠదేశమునకు తీసికొని పోయినచో, నీమె సుఖంపగలదు" అని మనంబున తలంచెను. ఈతడట్లు తలంచునంతలో నాతని రెండు పక్షములును దగ్ధమయ్యెను. గరుడు డమితవ్యధనందుచు మెల్లగాచని గాలవుని సమీపించెను. గాలవుం డడిగాంచి, విస్మయం బందుచు, గరుడునితో "అయ్యా! వైనతేయా! మహానుభావుండవగు నీకీయనర్థంబు వాటిల్లుటకు కతంబేమి! మనము భూలోకమునకు పోవు టెట్లు! ఇది చిత్రాతిచిత్రముగ నున్నది. దైవతంత్రమును తరింప నెవ్వారి తరము!" అని పలికెను.

ఆయిరువురును పరిపరిరీతుల పరితాపమునందుచు, ఆపర్వత సమీపమునగల నొక మౌని యొద్దకుంబోయి నమస్కరించి, విషయమునంతయును విన్నపించిరి. ఆ మహర్షి కొంతసేపు హృదయము నందాలోచించి, వారిని చూచి, అయ్యలారా! ఇందు మీదోసంబు చాలకలదు. శాండిలిని పరమభాగవతోత్తముగాలు. ఆమె వసించు నీ ప్రదేశము పరమపవిత్రమైనది. అట్టి ప్రదేశమును ఈ వినతాత్మజుండు పరమనికృష్ట దేశంబుగా భావించెను. కావున భాగవతాపచారము ఘటిల్లినది. కావున, మీరిపు డామె సన్నిధికేగుడు. ఆమెకు విషయమును సమస్తమును వివరింపుడు. ఆమెచేతిలో తీర్థప్రసాదములు స్వీకరింపుడు. అప్పుడు గరుడుని దోషమునశించి, తన పక్షద్వయమును పొందగలడు" అని ఆనతిచ్చెను.

అంతగరుత్మంతుడామె సన్నిధానమున కేగి, జరిగిన వృత్తాంతము నవిస్తరముగ విన్నవించెను. ఆమెతీర్థ ప్రసాదము లొసంగిన గరుడుడు భక్తితో స్వీకరించెను. వెంటనే గరుడునకు తనరెక్కలు యథాతథముగా వచ్చెను. నిత్యసూరియగు సుపర్ణునకు భాగవతాపచార మెంతటిశిక్ష ఘటిల్లచేసెనో చూడుడు. ఇక సామాన్యులనుగూర్చి వచింపనేల!" అని గురుండు శిష్యులకు ఉదాహరణ పూర్వకముగా వివరించెను.

కొంతకాలమిట్లు గడచిపోయెను. వరవరమునికి పుణ్యక్షేత్రములు దర్శింపవలయునను బుద్ధిజనించెను ఆవిషయమును రంగేశ్వరునకు తెల్పి బయలుదేరి, సత్యవ్రతక్షేత్రము. దేహళీపురము, వీక్షారణ్యము గృధ్రపుష్కరిణి, ఘటికాచలము, శ్రీపెరుంబుదూరు, తిరుపతి, తిరుమల మొదలగు దివ్యదేశంబులు సేవించి, తత్తద్దేశ ప్రశస్తులగు పెరుమాళ్ళకు మంగళాశాసనముచేసి, ప్రతిదేవాలయమునందు ద్రవిడవేదమున నధ్యయనించు నేర్పాటుచేసెను. ద్రావిడభాషాధ్యయనము లేకున్నను, నమ్మాళ్వారు, తిరుమంగైయాళ్వారు, తిరుప్పాణ్యాళ్వారుల ప్రతిష్ఠ లేకున్నను అది దివ్యదేశముకాదని నిర్ణయించెను.

దక్షిణదేశమునందు పన్నిద్దరాళ్వారులుకలరు. వారి విగ్రహములన్నియు ప్రతివిష్ణ్వాలయమునందుండవలె. అట్లు యజాలనిచో రామానుజులు నమ్మాళ్వారు, తిరుమంగైయాళ్వారులు, తిరుప్పాణ్యాళ్వారుల విగ్రహములనైనను ప్రతిష్ఠింపవలయు. అట్లులేనిచో ఆ దేవాలయము ప్రాకృత

మనియు, నందు సంస్కారసంపన్నులు తీర్థప్రసాదములు స్వీక రింపరాదనియు నిర్ధరించెను.

పూర్వమునుండియు హీనకులజులని నేడు చెప్పబడుచున్న వారే దేవతాలయములపూజారులుగనుండిరి. నేడగ్రకులస్థులుగా తలంపబడువారు దేవతాపూజారులుగా నుండెడివారుకారు. దేవాజీవుడు, దేవలుడు అను నామములుకలవారు డబ్బులకై దేవతలను పూజించువారు. "దేవాజీవస్తుదేవలః" అను శబ్దము లమరమున శూద్రవర్గమునందు చెప్పబడియున్నవి. ఇప్పటికిని ప్రతిగ్రామమునను, గ్రామదేవతా పూజలు నిర్వ హింపబడువారు, నేడు హీనకులజులుగా భావింపబడుచున్నవారే. అగ్రవర్ణములగు నాల్గువర్ణములవారును చేసెడివారుకారు. ఇప్పటికిని ఉత్తరదేశమున అదే ఆచారము కొనసాగుచున్నది.

నాథయామున రామానుజాదుల కాలములందు దేవా లయ పూజకై బ్రాహ్మణుల నియమించిరి. సంస్కృత వేదమును నెలకొల్పిరి. బ్రాహ్మణులున్నచో నాలయములు పరిశుభ్రము లుగ నుండుననియు, అన్ని కులములవారు తీర్థప్రసాదములు తీసికొనుట కనువగుననియు ఆలోచించి, యీ యేర్పాటుచేసిరి. దీనికి కారణముగా రామానుజులు పండరీపురమునందు, జగన్నాథమునందు నీయాగమముల నెలకొల్పవలెనని తలంచి, ఎంతో శ్రమించి, సాధ్యముకాక వదలివైచెను. ఇప్పటికిని ఆ దివ్యాలయము లట్లేయున్నవి. వానియం దాగమం లేదు

యును లేదు. ఆ రెండు స్థలములయందును ప్రతిమనుజుని స్వామిని తాకి పూజింపవచ్చును.

పండరీపురమునందు నెలకొనియున్న జగదీశ్వరుని ప్రతి మనుజుండును తాపత్రయాగ్ని చల్లారునట్లు ఆలింగనము చేసి కొన వచ్చును.

రామానుజుల తదుపరి వైష్ణవము తెన్కలై-వడకలై యను రెండుశాఖలయ్యెను. తెన్కలై సంప్రదాయమువారికి భక్తియే ప్రధానముగాని కులమునంతగా పాటింపరు. వడకలై వారికి కులమే ప్రధానము. వీరికి సంస్కృతాగమము పఠనీయము. తెన్కలై వారికి సంస్కృతాగమమునకన్న ద్రావిడాగమము ప్రధానము.

వరవరముని తెంకలై సాంప్రదాయమునందు ముఖ్యుడు. అందుచే సర్వదేవాలయములయందును ద్రావిడాగమాధ్యయనమును, శఠారాతి తిరుమంగైయాళ్వారు, తిరుప్పాణి యాళ్వారుల ప్రతిష్ఠ నెలకొల్పెను. పై ఆళ్వారులు ముగ్గురును బ్రహ్మణేతరులే. వరవరమునికి పరమాచార్యులగు పిళ్లైలోకాచార్యులు, శ్రీవచనభూషణమునందు, వారితమ్ముడు 'ఆచార్య హృదయము'నందు భగవద్భక్తికలవార లేకులమువారైనను వారే సేవ్యులనియు, అదిలేని వార లేకులము వారైనను త్యాజ్యులనియు వక్కాణించిరి. ఆ సంప్రదాయమును స్వీకరించిన వారిలో వరవరముని శ్రేష్ఠులగుటచే, కులగోత్రముల నశింపచేయవలయునని భావించెను. అందులకే పై చెప్పిన ఆళ్వారులను ప్రతిష్ఠించుట, ద్రవిడగ్రంథాధ్యయనమును, అల

యములందు ప్రవేశపెట్టెను. కావుననే తెన్కలై సంప్ర దాయముగల దేవళములందు తొలుత వరవరముని తనియ పఠించి, తదుపరి పూజావిధానమంతయు నిర్వహింతురు.

## వరవరముని తనియ

శ్రీశైలేశ దయా పాత్రం-ధీ భక్త్యాదిగుణార్ణవమ్,
యతీంద్ర ప్రవణం వందే, రమ్యజామాతరం మునిమ్.

ఇట్లు మణవాళ మహామునులు ద్రవిడవేదముల నుద్ధ రించి, దేవాలయములు సంస్కరించి, మానవజాతిని తరింపజేసి, ఈ భూలోకమునందు వందయేండ్లు జీవించి, తన దివ్యవైభ వమును చాలించి నిత్యవిభూతికి వేంచేసెను.

శిష్యులు-కుమారుడు-మనుములు గురుని వియోగంబును సహింపలేక బాధపడి, వరవరమునికి బ్రహ్మమేధాది క్రియ లన్నియు నాచరించి, సుఖంచిరి.

## మణవాళ మహామునుల తనియ

తులాయా మతులే మూలే పాండ్యే కుంతీ పురీవరే
శ్రీ శేషాంశోద్భవం వందే రమ్యజామాతరం మునిమ్.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

# వేదాంత దేశికుల వైభవము

శ్లో॥ రామానుజ దయా పాత్రం
జ్ఞాన వైరాగ్య భూషణం
శ్రీమద్వేంకట నాథార్యమ్
వందే వేదాంత దేశికమ్॥

సత్యవ్రత క్షేత్రంబునా ప్రసిద్ధికెక్కిన కాంచీపురమునందు అష్టాదశ దివ్య దేశంబులుకలవు. అందొక దివ్య దేశంబున దీప ప్రకాశకుండను పేరుగల నారాయణుండు భాసించుచుండు. ఆ దివ్య దేశమున 'అనంతసూరి' యను అఖ్యగల ఒక విప్రకుల శ్రేష్ఠుండుగలడు. అతడు వేదవేదాంగ విద్యాపారగుండు. న్యాయవైశేషికాది శాస్త్రములయందు ప్రజ్ఞాశాలి. అతడు సంతతాభ్యర్చిత నారాయణ పాదపంకేరుహుండు. నిరతాన్న దాత. నిత్యసత్యవ్రతుండు. అతడు తోతారమ్మయను పేరుగల ధర్మపత్నింగూడి, కాపురంబు సేయుచుండెను.

ఒకానొక దినంబున అసతీతిలకము భర్తతో "స్వామీ! మనకు సమస్తైశ్వర్యములును పుంజీభవించియున్నవి. శ్రీశ్రియః పతుల అతుల దయచే మనకేమిటను కొఱంత లేదు. మనము తినగా పదిమందికిపెట్టగల స్థితిలోనుంటిమి. వేదముల రూపు గైకొన్న మీకు నాభాగ్యవశమున ధర్మపత్నినైతి. ఆత్మస్తుతి నింద్యము. కాని సమస్తజనులు నన్నుగూర్చి "తోతారమ్మతో సమానముగు భాగ్యవతి నెందునుకానము. ఆమె పతివ్రతా

తిలకము. నిరతాన్నదాత్రి. కరుణామయి" యని కొనియాడు చున్నారు. ఎన్ని గొప్పతనములున్నను మనకు కన్నసంతానము లేని కారణమున, అన్నియు వ్యర్థములుగా తోచుచున్నవి పూర్వజన్మమున నేమి అఘుంబొనరించితిమో, యీ జన్మంబున సంతానహీనులమైతిమి. "అపుత్రస్య గతిర్నాస్తి స్వర్గే నైవచ నైవచ" పుత్రులు లేనివారలకు ఊర్ధ్వలోకప్రాప్తిలేదని శాస్త్రములు ఘోషించుచున్నవి. పుత్రులు కలుగకుండుటకు హేతువు పూర్వజన్మకృత పాపంబని పెద్దలు వచించుచున్నారు. ఆ పాపము నశింపవలయునన్న దైవారాధనమునకన్న మరియొక మార్గములేదని సూరివర్యులు నుడువుచున్నారు. కావున మనమే దివ్యదేశమున, నేరూపమున విలసిల్లుచున్న నారాయణుని కొల్వదగునో సెలవిండు" అని కోరెను

అందులకా యనంతసూరి భార్యతో "భాగ్యవతీ! ఇంతదనుక నాకిట్టికోరిక ఈరకలెత్తలేదు. యౌవనముననుండగా సంతానములేదను చింతజనులకుండదు. యౌవనమున మనస్సు విషయోపభోగపరంపరలయందు పరుగులిడుచుండును. అప్పుడే వాంఛయుపొంచియుండదు. వయస్సు ఉడిగినగాని, ఇహలోక చింత–పరలోకచింత ప్రబలములుకావు. నీవు చెప్పినదంతయును సత్యమే. ఇప్పుడు మనకు సంతానము ననుగ్రహించుటకు శ్రీవేంకటాచలనాథుండే సమర్థుండు. "కలౌ వేంకటనాయకః" శ్రీనివాసుడే కలియుగ ప్రత్యక్షదైవము. వేంకటేశ్వరుం డభీష్టఫలప్రదుండు. అట్టి దేవాధిదేవు నారాధింతము.

ఆ దయామయుని దయావీక్షణమున మన అభీష్టము సిద్ధింప గలదు'' అని పలికెను.

అంత నారదంపతు లిరువురును, శ్రీనివాసుని మనః ఫలకమున నిల్పి

మత్తకోకిల :- వేంకటాచలనాథ శ్రీవర! వేదవేద్య ! జనావనా!
పంకజాసన వంద్య ! మాధవ ! పాపతూల
హుతాశనా !
న్యంకు హృత్సరసీజ భాస్కర ! నవ్య
సారసలోచనా !
సంకటంబులు బాపి రక్షణసల్పు వేఖగవాహనా!

ఓ జగదధీశ్వరా ! ఈ లోకముల సృష్టి స్థితిలయములకు కారణుండవు. భక్తాభీష్ట ప్రదుండవు. మహాప్రళయకాలమున ఈ అనంతవిశ్వమును, నీయందు లీనమైపోయియుండును మరల నీ యిచ్ఛానుసారముగా జనించుచున్నది.

శ్లో॥ ఏకాన్త మంగళ గుణాస్పద మ_స్తహేయమ్
నిత్యం పదం తవ యత_స్తత ఏవ దేవ
ఆమ్నాయ తేత దిహ విశ్వవిరూప రూపం
తేనైవ నన్విదము శబ్దమరూప మాహుః.

ఓ స్వామీ ! నీ వనంత కల్యాణగుణ స్వరూపుండవు. హేయగుణ రహితుండవు. నిత్యుండవు ఆ కారణమున వేదము లెల్ల నీవు రూపరహితుండవనియు, విశ్వరూపుండవనియు కొని

యాడుచున్నవి. ఓ అనంతా! నిత్యపదమును వీడి వేంకటా చలమునందు భక్తసంతతిని రక్షించుటకువచ్చి నిలిచియున్నావు. నీ కటాక్షప్రాప్తిచే నీ జీవు లఖిలంబును ఉచ్చస్థితిని గాంచు చున్నవి. సర్వదేవతా సార్వభౌముండవగు నీకు మంగళమగు గాక. మేము అనపత్యదోషమున బాధనందుచున్నారము. మాకు మీవంటి కుమారు నొక్కని అనుగ్రహింపుము" అని అనేకవిధంబుల స్తోత్రంబాచరించిరి.

ఒకనాటిరేయి అనంతసూరి యొక కలగాంచెను. ఆ కలలో తాను, శ్రీ వేంకటాచలనాథుని దివ్యదేవాలయము నందున్న ఒక పెద్దగంటను మ్రింగినట్లు గోచరించెను. మేల్కాంచిన పిదప ఆ స్వప్నవృత్తాంతముకు చిత్తంబున పొంగి అనంతసూరి భార్యకు నద్దాని వివరించెను.

తోతారమ్మ ఆ యుదయముననే స్నానార్థమై వేగవతీ నదికేగెను. ఎందరో స్త్రీలు ఆమె వెంట అనుగమించిరి. అంద రును ఆ నదియందు తానమాడుచుండిరి. ఆ సమయమున శ్రీనివాసుడు కైతవబ్రహ్మచారియై నదీతటంబునకువచ్చి తోతారమ్మతో "తల్లీ! వేంకటాచలమున సకలభక్తవాంఛలు దీర్చు కల్పకంబాకందు భాసించుచున్నది. ఇది దానిఫలము. దీనిని స్వీకరించినచో, మీ అభీష్టమీడేరు"నని యొక దొండ పండు నిచ్చి అదృశ్యుండయ్యె.

తోతారమ్మ ఆ పండును మహానందముతో భుజించెను. ఇంతకు తనకు ఫలంబొసంగిన బాలకుండెవ్వడాయని చుట్టుపట్టుల

తిలకించెను. కాని ఆ బాలకుడు గోచరింపలేదు. ఇది భగవన్మహిమముగా భావించి, ఆనందించి, గృహమునకేతెంచి జరిగిన విషయమెల్ల భర్తకు నివేదించెను. అతడునుగూడ హర్షించెను.

తోతారమ్మ గర్భవతియయ్యెను. భర్త ఆమెకు సీమంత పుంసవనాది మంగళక్రియలు జరిపించి బుధుల హర్షాతిరేకమున వర్తించుచుండెను. ఆమె గర్భమును ధరించినది మొదలు పది రెండు వత్సరములు గతించెను. కొందరసలది గర్భము కాదనిరి. కొందరు తోతారమ్మ గర్భవాసమున నొక మహాపురుషుడుదయించునని నమ్ముచుండిరి. శ్రీ శ్రీనివాసుని తీర్థ వారి వాసరమగు భాద్రపద మాసమ్మున, శ్రవణానక్షత్రమునందు తోతారమ్మకు పుత్రోదయమయ్యెను.

ఆ సమయమున కలిదోషములు శమించె. పాపసమూహ రాసులు భస్మీభూతంబులయ్యె. సజ్జనుల మనస్సులు సుప్రసన్నత వహించె. పురిటిదినములు గడచిన్న పిదప ననంతసూరి, స్వాత్మజునకు వేంకటేశ్వరుండని నామకరణంబు చేసెను. ఐదుసంవత్సరముల ప్రాయమున తండ్రియే ఆ బాలునకు అక్షరాభ్యాసము గావించి, ఆయాకాలములందు చేయదగిన, ఉపనీతాది కార్యములెల్ల ముగించి, వేదబోధన ప్రారంభము గావించెను.

ఆ బాలుడు ఏకసంథాగ్రాహి. కావున సకృచ్ఛ్రవణమాత్రముననే వేదమునంతయు మరల చెప్పుచుండెను. కుమారుని విద్యావైశారద్యమునుగాంచి, తండ్రి మిక్కిలి ఆనందించుచుండెను. ఈతడు శ్రీమద్రామానుజుల అపరావతారమనియు,

శ్రీ వేంకటేశ్వరుని, ఘంటావతార మనియు ప్రజలు చెప్పుకొను చుండిరి.

తదుపరి ఆ వేంకట నాథుడే తనచే రచింపబడిన "సంకల్ప సూర్యోదయ నాటకమున" "ఉత్ప్రేక్ష్యతే బుధజనై రుపపత్తి భూమ్నా ఘంటా హరేః సమజనిష్ట యదాత్మ నేతి" అని తనను గురించి చెప్పుకొనెను. ఈయన మేనమామ ఆత్రేయ రామానుజాచార్యులు. అతడీ వేంకటనాథుని వెంటబెట్టుకొని తన గురుండగు వాత్స్యవరదాచార్యుల యొద్దకుం గొంపో యెను. ఆయన వరదరాజస్వామి సన్నిధియందున్న మంటపము నందు కూరుచుండి శిష్యులకు వేదాంతపాఠములు బోధించు చుండెను. అపుడచ్చటకుపోయిన ఆత్రేయరామానుజాచార్యు లాయనకు నమస్కరించెను. గురుండు కూరుచుండుమని నియో గించి, కుశలప్రశ్నలువేసి, లోకానుసారముగా కొంతసేపు ప్రసం గించుచు గడపెను. తరువాత శిష్యులకు పాఠము ప్రారంభించుట కుపక్రమించి, ఏ విషయమునందు విడిచినదియు స్మృతికిరాక విచారించుచుండెను. ఆ సమయమున బాలుండగు వేంకట నాథుండు గురుండు విడిచిన విషయమంతయు వివరించి చెప్పెను. అదివిని వరదాచార్యులు విస్మయావిష్టచిత్తుడై రామానుజాచార్యులగాంచి "వత్సా! ఈ పిల్లవాడు ఎవరి వాడు" అని ప్రశ్నించెను. అందులకాతడు "స్వామీ! ఈతడు ఈదాసుని భాగినేయుడు" అని బలికెను. అంత వరదాచార్యు లాపిల్లవానిని దగ్గరకుచీరి చేతితో శరీరమునంతయు నిమిరి.

శ్లో॥ "ప్రతిష్ఠాపిత వేదాంత, ప్రతిక్షిప్త బహిర్మత,
భూయాస్త్రై విద్యమాన్యస్త్వం భూరి కల్యాణ భాజనమ్"

లోకమునందు వేదాంత శాస్త్రమును చక్కగా ప్రతిష్ఠించి, దుర్మతములనెల్ల ఖండించి త్రైవిద్యులచే పూజింపబడిన వాడవై అపరిమితానంద భాజనుడవుకమ్ము" అని ఆశీర్వదించి, రామానుజాచార్యులగాంచి, "వత్సా! ఈ బాలుడు అప్రతిమ ప్రతిభాసంపన్నుడు సర్వవిద్యాధికుడు కాగలడు. నేనతివృద్ధుడనగుటచే ఇతనికి విద్య చెప్పు భాగ్యము మాకబ్బదయ్యె. నీవితనికి ఉభయ వేదాంతశాస్త్రములను, వేదములను చక్కగా చెప్పుము" అని ఆదేశించెను. అతండు వల్లెయని గురునకు నమస్కరించి, భాగినేయుని వెంటనిడుకొని యింటికితిరిగివచ్చెను.

అప్పటినుండి రామానుజాచార్యులు వేంకటనాథునకు వేదములు, ఉభయ వేదాంతములు, భగవద్రామానుజకృత శారీరక మహాభాష్యమును చక్కగాబోధించెను. వసంతోదయమైన వెంటనే వృక్షములకు సహజశోభ పొందినట్లు ఒకసారి వినినంతనే సమస్తశాస్త్రములు బాలునకు కరతలామలకములు కాజొచ్చెను. ఇరువది వత్సరములు వచ్చునప్పటి కాతడు సర్వశాస్త్రపారంగతుడయ్యెను. శ్రీభాష్యమును మేనమామ యొద్ద నియవది పర్యాయములు పఠించి "యతి ప్రవర భారతీ రసభరేణ నీతం వయః" యతీంద్రుల వాక్యామృత రసావిష్ట చేతస్కుడై వయస్సు గడపెను.

తదుపరి గురుదేవుని యొద్ద గరుడ మంత్రోపదేశమును పొందెను. అహీంద్రపుర సమీపమునగల గరుడ నదీతీరస్థ ఔషధాద్రియందనేక పర్యాయము లామంత్రము నావృత్తిచేసి గరుడ సాక్షాత్కారమునుపొంది సిద్ధినందెను. అపుడు వైన తేయులు వేంకటనాథునకు హయగ్రీవ మునుపదేశించిరి. దాని నావృత్తిచేసి హయగ్రీవానుగ్రహమునుపొంది సమస్తవిద్యల యందు తీర్ణుడయ్యెను. అట్టి సమయమున నీయనకు సాటియగు పండితుడు లోకమందెవ్వడును గోచరింపడయ్యె.

అట్టి వేంకటనాథుని వేదాంతదేశికుండనియు, సర్వ తంత్ర స్వతంత్రుండనియు, కవితార్కిక సింహంబనియు ప్రజలు భావించుచుండిరి.

వేదాంతదేశికులు గుణవతి, సౌందర్యవతియునగు తిరు మంగై యను పేరుగల కన్యను వివాహమాడెను. ఈ యాశ్రమ మును జాగరూకతతో పోషించుకొన్నచో, మిగిలిన ఆశ్రమ ములకంటె గృహస్థాశ్రమము గొప్పదని లోకమునచాటించెను.

హస్తిగిరియందు, శ్రీరంగమునందుగల కొందఱు కుమతులు విద్యాలయములందు పిశాచభాషయగు ద్రవిడము నధ్యయనింప తగదని పట్టుబట్టిరి. అపుడు వేదాంతదేశికులు కొందఱు పెద్దలపోత్సాహముతో వారిని డీకొని కొన్నిదినములు వాదించి, ప్రబంధాధ్యయనము శ్రేష్ఠమైనదని యొప్పించిరి. అపుడు వారి పాండిత్యప్రకర్ష లోకమునకు వెల్లడియయ్యెను.

వేదాంత దేశికులును, విద్యారణ్యులును చిననాటి స్నేహితులు. విద్యారణ్యులు నరసింహరాయ బుక్కరాయల యొద్ద మంత్రిపదవి నధిష్ఠించెను. వేదాంతదేశికులు మహాపండితుండయ్యు దారిద్ర్యబాధచే భిక్షాటనచేయుచుండెను. వేదాంతదేశికులు పెరిగి పెద్దవాడగుసరికి, అనంతసూరి ఐశ్వర్యమంతయు తగ్గిపోయి, పేదతనము ప్రాప్తించెను.

వేదాంతదేశికుల యాచకవృత్తి విద్యారణ్యులకు తెలియవచ్చెను. ఆయన యొక లేఖ వ్రాసి దాని నొకసేవకునిచే వేదాంత దేశికులకు పంపించెను. ఆ సేవకుడు ఆ లేఖను తెచ్చి వేదాంతదేశికుల కిచ్చెను. వేదాంతదేశికు లద్దాని మడతలు విప్పి చదివెను. దానియం దిట్లుండెను. "ఓయీ! వేదాంతదేశికా! నీవు మహావిద్వాంసుడవు. సమస్తశాస్త్రపారంగతుండవు. అట్టి నీవు భిక్షాటన చేయరాగదు. నీవీ విజయనగరమునకు వచ్చినచో, ఈ రాజాస్థానమునందు నీకు సముచితోద్యోగమిప్పించెద. దానిచే సుఖముగా జీవింపవచ్చును. కావున నీయుత్తరమును చూచినవెంటనే బయలుదేరి రమ్ము."

ఆ లేఖనుచూచి, వేదాంతదేశికు లాగ్రహోదగ్రుడాయెను. తన మనంబున "ఈ విద్యారణ్యుడు గర్వవిదగ్ధులగు రాజులకడజేరి వారిని, ఇంద్రుండవు-చంద్రుండవు-మహేశ్వరుండవని స్తుతించుచు, వారిన్ని భృతిని స్వర్గసమంబుగా భావించుచు, నాకిట్లు వ్రాసినాడు" అని వితర్కించి, వైరాగ్యపంచకమను శ్లోకములను వ్రాసిపంపెను. వానిని సేవకుడు విద్యారణ్యుల కందజేసెను.

అపుడు విద్యారణ్యులు దానిని విప్పి పఠింప దానియం దిట్లులుండెను.

శ్లో॥ శిలంకి మనలం భవేదనల మౌదరం బాధితుం
పయః ప్రసృతి పూర్యకం కిమున ధారకం సారసమ్
అయత్నమల మల్లకం పథి పటచ్చరం కచ్చరమ్
భజంతి విబుధా ముధాహ్య హహ కుక్షితః కుక్షితః.

జఠరాగ్ని శమింపవలయుననిన, అనగా ఆకలిబాధ తీర్చుకొనవలయునన్న లోకమునందు ఉంఛశిలావృత్తియున్నది. అనగా భిక్షాటనమున్నది. దాహనివృత్తికి అమృతోపేతములగు కొలంకులున్నవి. సిగ్గునుకాపాడుకొనుటకు, ధనికులు తీసి పారవైచిన వస్త్రములు గోచిగుడ్డలకుగా లభించుచున్నవి. వీనితో నీ దేహయాత్ర కొనసాగిపోవుచుండ దీనికై రాజుల అండజేరి, నీవే యింద్రుండవు, రుద్రుండవు, కమలజుండవు అని కపటస్తోత్రములు చేయుచున్నారలీ పండితశ్రేష్ఠులు. ఇది కేవలము పొట్టకూటికై కదా! ఏమీ వీరల దౌర్భాగ్యము.

శ్లో॥ దురీశ్వర ద్వార బహిర్వితర్దికా,
దురాసికాయై రచితోయ మంజలిః
యదం జనాభం విరపాయ మస్తిమే
ధనం జయస్యం దనభూషణం ధనం

దుష్టులగురాజుల బహిర్ద్వారవితర్దికల యందు, తలక్రింద నుత్తరీయములు పెట్టుకొని నిద్రించుచుండ రాజభటులు లేతెంచి పొడక్రింద కట్టెలువైచినెట్టుచుండ "అయ్యో! రాజదర్శనార్థమై

వచ్చితిమి. మమ్మేల నెట్టెదరయ్యా! అని వాపోవుచున్న పండి తుల దుర్దశ శోకనమస్కారము. అగతి మాకెప్పుడును కలుగ కుండుగాక. కాటుకకొండవర్ణముగలదియు, అర్జునుని రథమునకు భూషణమైనదియు. నిరపాయమైనదియునగు శ్రీకృష్ణుడను ధనము మాకు పుష్కలముగా కలదు.

ఇట్టి అర్థములువచ్చు ఐదుశ్లోకములు వ్రాసిపంపించెను. దానినిచూచి విద్యారణ్యులు భగ్నమనస్కుడై, పలువురు శిష్యులను పంపించెను. వారు కాంచీనగరమునకువచ్చి వేదాంత దేశికులను దర్శించి "అయ్యా! మీయొద్ద ధనము పుష్కలముగా నున్నదనివింటిమి. మేమాగర్భదరిద్రులము. కొంత ఆ ధనము నొసంగినచో, మీయనుగ్రహమున జీవింపగలము." అనిరి. ఆ వాక్యము లాలించి వీరిని విద్యారణ్యులు పంపించియుందురని మనస్సున భావించి, జగదీశ్వరియగు లక్ష్మినిగురించి కనక ధారాస్తవమును చెప్పెను.

శ్లో॥ ఈశానాం జగతోస్య వేంకటపతేః విష్ణోః పరాం ప్రేయసీం
తద్వక్షస్థల నిత్యవాస రసికాం తత్క్షాంతి సంవర్ధినీమ్
పద్మాలంకృత పాణిపల్లవ యుగాం పద్మాసనస్థాం శ్రియం
వాత్సల్యాది గుణోజ్జ్వలాం భగవతీం వందే జగన్మాతరమ్.

లోకములకధీశ్వరి యైనదియు, జగదీశ్వరుడగు వేంకటాచలనాథుని ప్రేయసియు సర్వేశ్వరుని వక్షస్థలముపై నుండి శాంతిని వృద్ధిచేయునదియు, పద్మములచే భాసిల్లు హస్తపల్లవములు కలదియు, వాత్సల్యాది గుణములకు ఆటపట్టైనదియు

నగు లోకమాతయు భగవతియునగు శ్రీదేవిని స్తుతించు చున్నాను. అని ప్రారంభించి స్తవమును చెప్పెను. గగనము నుండి బంగారపు వర్షముకురిసెను.అవచ్చిన విద్యారణ్య శిష్యులు ఆశ్చర్యనిమగ్నులై ఆ ప్రభావము వేనోళ్ల గొనియాడుచు, వేదాంత దేశికులకు ప్రదక్షిణము లాచరించి, అనేకవిధముల స్తుతించి, తిరిగి తమ గురు సన్నిధానమునకుపోయి జరిగిన విషయమును చెప్పిరి. విద్యారణ్యులు చేయునదిలేక విని యూరకుండెను.

ఒకసమయమున విద్యారణ్యులకు అక్షోభ్యుడను పేరు గల యొక సూరిసత్తమునకు వేదాంతవాదము జరిగెను. వారిరువురు కొంతకాలము వాదించి మధ్యవర్తిలేని కారణమున ఆ వాదమంతయును వ్రాసి వేదాంతదేశికులకు పంపించుచు, మాయిద్దరి వాదములలో నెవరివాదము నెగ్గినదో నిర్ణయించి పంపుమని వ్రాసిరి. వేదాంతదేశికు లాయిరువురి వాదములను ఆమూలాగ్రముగా పరిశీలించి, సారాంశమునంతయు నొక శ్లోకము మూలమున తెలియజేసెను.

శ్లో॥ అసినా తత్త్వ మసినా పరజీవ ప్రభేదినా
విద్యారణ్య మహారణ్య మక్షోభ్యముని రచ్ఛినత్

జీవేశ్వరుల భేదమును సాధించు తత్త్వమసి యనెడు ఖడ్గముచే విద్యారణ్యు లనెడు అరణ్యమును ఛేదించెను. అని వ్రాసెను.

వేదాంత దేశికుల కాలమునందే వడహాలసంప్రదాయము వృద్ధిలోనికి వచ్చెను. ఈతడే దానిని సృష్టించెనని కొందఅందురు. వడహాల సంప్రదాయమునందు కులము ప్రధానము. తెంగల సాంప్రదాయమునందు గుణము ముఖ్యము.

వేదాంత దేశికులు మహావిరాగి. ఈ ప్రపంచసుఖముల నెల్ల నీచములుగా భావించి తిరస్కరించినాడు. ఎందరో మహారాజు లీయనను, తమ ఆస్థాన విద్వాంసునిగా నుండుమని ఆహ్వానించిరి. కాని వారినందఱ తృణీకరించి, సర్వేశ్వర తత్పరుడై యుండెను.

ఈయన ఒకనాడు భిక్షాటనకుపోయెను. కొందఱాయన సద్గుణములకు వశులై బియ్యమునందు బంగారునాణెములను కలిపి జోలెయందు వైచిరి. అతడవి తెచ్చి భార్యకొసంగెను. ఆమె వాటిని శుభ్రరించి, అందలి బంగారు రూకలనుచూచి, అచ్చెరువుతో భర్తనుపిలిచి "స్వామీ! ఇటురండు. ఈ బియ్యమునందెవరో స్వర్ణనాణెములు వేసినారు. చూడుడు" అని చూపించెను. అవిచూచి, ఆతడు భార్యతో "ప్రేయసీ! అవి లద్దెపురుగులు. బియ్యమెక్కువకాలము నిల్వయున్నచో నట్టివి పట్టుచుండును. వానిని కాకకు." అని యొక పుల్లతో వానిని ఇంటినుండి బయటకు నెట్టివైచెను. అది గమనించిన జనులందఱు ఆయన వైరాగ్యమును వేనోళ్ళకొనియాడిరి.

ప్రతిదినమును ఆయన భిక్షాటనకు వచ్చుచున్నగాంచి, కొందఱుదుష్టులు చెప్పులు బహిర్ద్వారములకు వ్రేలదీసిరి. అనాను

దేశికసూరి భిక్షాటనమునకుపోయెను. ఆయన లోపలకు ప్రవే శించుకాలమున ఆ పాదరక్షలాయన శిరస్సును తాకినవి. అపుడా దేశికుండు

శ్లో॥ కర్మావలంబ కాకే చిత్ కే చిత్ జ్ఞానావలంబికాః
వయంతు హరి దాసానాం పాదరక్షావలంబకాః.

లోకమునందు వైష్ణవులలో రెండు తెగలున్నవి. వారిలో నొక తెగవారు కేవల కర్మప్రధానులు. జన్మరాహిత్య మునకు యజ్ఞాధ్యయనాదికర్మములే ప్రధానములని చెప్పు చున్నారు. (వడహాలవారు) కొందఱు జ్ఞానమే అనగా సర్వ మును శ్రీయః పతియే యని తలంచుట ముఖ్యమను చున్నారు. (తెంగలవారు) కాని మేము ఆ రెండింటికిని సమానులము కాము. మాకు హరిదాసుల పాదరక్షావలంబనమే ముఖ్యము. ఆహా! ఏమి భాగ్యము. ఓ శిరస్సా! హరిదాసుల పాదరక్షలు నిన్ను తాకుటవలన ధన్యవైతివి." అని పలికెను. ఆ మాటలు విని ముచ్చెలు కట్టినవారు వెంటనే వానిని ఊడదీసి గురుని పాదములపై బడి క్షమింప వేడిరి.

దేశిక సార్వభౌముండు, వేదాంత దేశికుండు సర్వతంత్ర స్వతంత్రుండు. పరవాది మత్తేభకంఠీరవుండు. అను తన బిరుదము లొకఫలకముపై వ్రాయించి తనగృహద్వారము సమీపమున నొక స్తంభంబును పాతి దానికి కట్టించెను. అదిచూచి మాయా వాదులనేకులు వాదార్థులై యరుగుదెంచి ఓటమినిపొంది వెను దిరిగిపోయిరి. అంత దేశికుండు మాయావాదుల యందు దెబ్బది

య్యైదు దోషములు, ద్వైతులయం దిరువదియ్యైదు తప్పులు
కలవని నిరూపించి, మొత్తము నూరుతప్పుల నుటంకించి, శత
దూషణియను సంస్కృత గ్రంథమును విరచించెను. అంత
ద్వైతులేకొంచి గురుని ఆశ్రయించిరి. వారిపై చెప్పిన యిరు
వదియ్యైదు దోసంగులను తీసివైచి, పేరుమాత్ర మట్టులేయుంచి,
ప్రబలతర్క సహస్రోపేతముగా పండితాభేద్యముగా నాగ్రంథ
మును రచించెను. దానితో భయపడి సర్వమతములవారును
వారితో వాదించుటకు రాకుండిరి.

గురునకు చతుష్షష్టి కళలయందు పాండిత్యమున్నదని
యెఱింగి తమతమ విద్యావిశేషములతో వచ్చి గురునితో
తలపడసాగిరి. ఒకసమయమున నొకానొక మాంత్రికుడువచ్చి
నాతో వాదింపుమనికోరెను. ఆసమయమున దేశికగురుండు
తలంటుకొనుచు, ఇది సమయముకాదు పొమ్మనియెను. అంత
వాడుపోయి ఒకగుంటలోని నీరు ఒక గొట్టముద్వారా త్రావు
చుండెను. దానిచే గురునకు కడుపుబ్బుటకు ప్రారంభించెను.
అంత గురుండొక శిష్యునిద్వారా మాంత్రికుని కృత్యంబెఱింగి
విశ్వకర్మను పిలిపించి, పందిరిగుంజకు బెజ్జమును కొట్టుమనెను.
ఆతడు రంధ్రముచేసెను. ఆ మాంత్రికుడు పీల్చునట్టి జలము
పందిరిగుంజ బెజ్జముగుండ బయటకుపోవుచుండెను. కొంత
సేపటికి ఆ మాంత్రికుడు విషయమును తెలిసికొనివచ్చి గురు
నకు జోహారులొనరించి క్షమాపణవేడుకొని మరలిపోయెను.

మరియొక సమయంబున కోలాహలుండను అహితుండొ
కండు క్రూరసర్పముల కొన్నింటిని తీసికొనివచ్చి గురునితో

"ఓ స్వామీ! నేను మళయాళ మహావాదిని మిమ్ము జయించుటకు వచ్చితిని. ఇదిగో నాపేటికయందు క్రూరజిహ్వాభీల సర్పజాతంబుకలదు. దానినంతయు నీపై ప్రయోగించెద. సమర్థతయున్నచో నిన్ను నీవు రక్షించుకొమ్ము" అని పలికెను. గురుడందులకు సమ్మతించి గృహాముఖద్వారవేదికపై మృద్వాసనముపై నాసీనుడై యుండెను.

ఆ జాంగలికుడొక్కొక్క సర్పమునుతీసి గురునిపై ప్రయోగించుచుండెను. గురుండు మంత్రప్రభావంబున వానిని నశింపజేయజొచ్చెను. పాములవాడు మహాదిట్ట. కొన్ని క్రూర సర్పములను బైటకుతీసి తనకాళ్లకు గజ్జెలుకట్టుకొని. సారకాయబుఱ్ఱ నూదుచు గురునిపై ప్రయోగింపజొచ్చెను. అవి ఆ భీల విషజ్వాలాముఖంబులై ఫూత్కారరవంబు లతిశయింప దేశికునిపైకి భయంకరముగ వచ్చుచుండెను. గురుండు వరుసగా బరులుగీయుచుండెను. కొన్ని పాములు బరులుదాటి వచ్చుచుండెను. అదికాంచి గురుండు దివ్యమంత్రంబుల నుచ్చరించెను. అపుడా ఫణీంద్రములు పడగలు వ్రేలాడవైచుచు, ఆ బరులమధ్యబడి విషము గ్రక్కుకొనుచు క్రిందబడి మరణించెను.

అదిచూచి మాంత్రికుడాగ్రహించి, కరాళఘోర వ్యాళము నొకదానినితీసి మళయాళమంత్రము ఉచ్చరించుచు మోళీవేసి, గురునిపై ప్రయోగించి "అయ్యా! ఇదిగో ఈ సర్పమునుచూడుము. దీనితో నీయాయువుతీరినట్లే" అని ఉగ్రముగా నఱచుచు పండ్లునూరుచు క్రోధతామ్రాక్షుడై తన

చేతియందున్న సొంతకాయబుఱ్ఱవాద్యమును ఊదుచు, ఆసర్పమును గురునిపైకి పురికొల్పెను. గురుండు బరులుగీయుచుండెను. ఆ యహీంద్రము బరులన్నియు దాటి వచ్చుచుండెను. అపుడు గురుం డశ్యాశువుగా గరుడ దండకమును పఠించెను. అపుడు సమస్తజనసందోహమును వీక్షించుచుండ, భూమీధ్రములు కంపించునట్లు, మహావృక్షములు పెళ్ళగిలిపడుచుండ, మహోదధులన్నియు నల్లకల్లోలములగునట్లు గగనసీమ తార్క్ష్యప్రభుండు ప్రత్యక్షముగావచ్చి ఆ సర్పమును కాళ్ళతోతన్ని చంపి యెత్తుకొనిపోయెను. ఆ పాములవాడు గురునిపాదములపై బడి క్షమింపవేడుకొని, పాము ప్రేలపైచుకొని తిరిగిపోయెను. అదిచూచి మానవులెల్ల విస్మయావిష్టులై "ఈ మహాపురుషుండు సామానుండుకాడు, కరిగిరీశుడో, వేకటాద్రివాసుండో, యీ రూపంబుననున్నవాడని వేనోళ్ళ ప్రస్తుతించుచు, ఎవరి యిండ్లకు వారు వెళ్ళిపోయిరి.

ఒకానొక సమయమున నొకశిల్పి గురుని యొద్దకువచ్చి "స్వామీ! తమకు కుడ్యనిర్మాణమునందుగూడ సమర్థత కలదని వింటిని. అదియొక కళగా ప్రదర్శింపు"దని కోరెను. అతని వాక్యానుసారముగా వేదాంతదేశికులు అహీంద్రపురంబునందొక బావినికట్టెను. వారి శ్రీహస్తములతో స్వయముగా కట్టబడిన బావి యిప్పటికిని కలదని పెద్దలు చెప్పుదురు.

వేదాంతదేశికుల తండ్రి తిథివచ్చెను. ఆయనపై నీర్ష్యాద్వేషములు పెంచుకొన్న వైష్ణవులు, భోక్తలుగా నెవ్వగును

ఆయన యింటికిపోరాదని నిర్ణయించుకొనిరి. అపుడు గురుండు కరిగిరి వరదుని ప్రార్థించెను. వరదుడు ప్రత్యక్షమై "దేశికా నన్ను ప్రార్థించిన కారణంబేమి?" యని యడిగెను. అందులకు దేశికులు" స్వామీ! రేపు నా జనకపాదులగు అనంతసూరి తిథి. ఆ కార్యమునకు, మీరు భోక్తలుగా విచ్చేయవలె"నని కోరెను. ఆ మాటలకు వరదుడు హర్షించి "వత్సా! భోక్తలు ముగ్గురు కావలెకదా! శఠగోపులను, యతీంద్రులను వెంట బెట్టుకొని వచ్చెద"నని తెల్పి, రెండవదినమున ముగ్గురును వేదాంత దేశికుని గృహమునకు వచ్చిరి. వారిని గురుం డాహ్వానించి, భోక్తలుగా కూర్చుండబెట్టి సమస్త పదార్థము లొసంగి పూజించెను.

భోక్తలుగా వచ్చుటకు నిరాకరించిన వైష్ణవులు కొందఱు, ఈతడు భోక్తలుగా నెవ్వరిని కొనివచ్చినాడో చూడవలయునని, గవాక్షములోనుండి లోపలకు చూచిరి. మొదట నీలమేఘశ్యామతనుండై, వనమాలాలంకృతోరస్థ్సలుండై, పీతాంబరధారియైన వ్యక్తికూర్చుని యుండెను. మొగలిపూ రేకువంటి దేహచ్ఛాయ గలిగి వకుళమాలాకలిత తలుండై మరియొకవ్యక్తి కూర్చొనియుండెను. సువర్ణ దేహచ్ఛాయగలిగి దివ్యయజ్ఞోపవీతము భాసించుచుండ నింకొకవ్యక్తి ఉపవిష్టుడైయుండెను. వారెవ్వరాయని ఆలోచించి, వారి రూపములనుబట్టి వరద, శఠగోప, యతీంద్రులుగా నిర్ధరించుకొనిరి.

వారి భోజనములు ముగిసినవి. వేదాంత దేశికులువారికి, శ్రీచందన తాంబూలాది సద్ద్రవ్యములనిచ్చి సత్కరించెను.

వారు దేశికుని దీవించి గృహమునుండి వెలువడుచుండగా దేశికులు వారివెంట బయటకువచ్చి వరుసగా వారి శ్రీపాదములకు నమస్కరించి, వారి యనుమతితో గృహమున ప్రవేశించెను. గ్రామవైష్ణవులందఱును లజ్జావిస్మయములు చెంది, వేదాంతదేశికులకు మనస్సులందే నూటికోళ్లర్పించి, మిన్నకుండిరి.

వేదాంతదేశికగురుండు, కురుకాపురము, తిరునారాయణపురము మొదలగు దివ్యదేశములు దర్శించుచు శ్రీరంగమునకు వచ్చెను. ఆయన కొంతకాలము శ్రీరంగమునందే యుండెను. శ్రీవైష్ణవులు పెక్కుమందివచ్చి వారికి శిష్యులై, వారివద్ద శ్రీభాష్యము నధికరించుచుండిరి.

ఆ సమయమున పిళ్ళలోకాచార్యులవారి అనుజుండగు అళహియమణవాళప్పెరుమాళ్ నయనారునకును, వేదాంతదేశికునకు రంగరాజస్వామి సన్నిధియందు వివాదము సంభవించెను. ఆ వాదమునందు, రంగేశ్వరుని పాదములగూర్చియు, పాదుకలగూర్చియు, వేయిశ్లోకము లొక్కరేయియందెవ్వరు చెప్పగలరో వారు జయించినట్లుగా పందెమువైచికొనిరి. వేదాంతదేశికులు తాను పాదుకాసహస్రము రచింపసిద్ధమయ్యెను. నయనార్ దేశికుడు పదకమల సహస్రము చెప్పుటకు సంసిద్ధుడయ్యెను. ఇరువురును వెడలిపోయిరి.

అప్పుడాలయమునందుండి యీపన్నిదమును విన్న వారందఱును, "అహా! ఏమి వీరిపందెము. లోకమున నెన్నో క్షుద్ర

విషయములపై పన్నిదము లొడ్డువారుకలరుగాని, రంగేశ్వర పాదారవిందములగూర్చి అశువుగా గ్రంథములు రచించుటకు పందెముపై చుకొన్నవారు కలగా! ఇందెవరు గెల్తురో!” యని ఆసక్తితో గృహములకు వెడలిచనిరి.

నయనారు దేశికుండు గృహంబున కేగి, స్నానాది కార్యములు ముగించుకొని, భోజనముచేసి దీపమును వెలిగించి, పదకముల సహస్రమును వ్రాయుటకు ప్రారంభించెను. దేశికులు గృహమునకుపోయి భోజనముచేసి పరుండెను. స్వప్నమున తండ్రియగు ననంతసూరి గోచరించి పందెముసంగతిని గుర్తుచేసి, మందలించెను. ఆతడు త్రుళ్ళిపడిలేచి, “అయ్యో! నేనెంత మందమతినై తినని విచారించి, చెప్పుటకు ప్రారంభించెను. తన యిష్టదైవమగు హయగ్రీవుండు వ్రాయుచుండెను.

తెల్లవారినని. నయనారు దేశికుడు ఐదువందల శ్లోకములను మాత్రము పూర్తిచేయగలిగెను. వేదాంతదేశికులు వేయి శ్లోకములను పూర్తికావించెను. ఇరువురును స్నానసంధ్యాద్యనుష్ఠానంబులు తీర్చుకొని గ్రంథములతో రంగరాజాస్థాన మంటపమునకు చేరిరి.

వారిరువురను చూచుటకు జనులు తండోపతండములుగా వచ్చిచేరిరి. రంగేశ్వరుని ముందు ఇద్దరును తమతమ గ్రంథములు విన్పించిరి. ఆ సమయమున అళహియమణవాళప్పెరుమాళ్ నయనారు వేదాంతదేశికులతో “స్వామీ! మీరు సర్వతంత్రస్వతంత్రులు అఘటనఘటనా సమర్థులు. మీరు వేయి

శ్లోకములు చెప్పగలిగితిరి. నేనైదువందల శ్లోకములనే చెప్పి నాడను, నేనోడిపోయితిని, తమరే జయించితిరి" అని శ్లాఘించెను.

అపుడు వేదాంతదేశిక గురుండు నయనారుతో

శ్లో॥ "సూతే సూకర యువతి స్సుత శతమత్యంత దుర్భగమ్
కరిణీ చిరాయ సూతే సకల మహీపాల లాలితమ్
కలభమ్"

స్వామీ! పందిదుర్భగమగు గర్భమును ధరించి నూరు పిల్లల నీనుచుండును ఏనుగు పం|డెండు సంవత్సరములు గర్భముధరించి రాజమర్యాదలనందుకొను నొక్క గున్న యేనుగు పిల్లనే|ప్రసవించును నాశ్లోకములు వేయిరైనను పంది పిల్లలవంటివి, మీరు ఐదువందలే|వ్రాసినను |స్రగ్ధరావృత్తమున |వ్రాసితిరి. కావున మీశ్లోకములు ఏనుగు గున్నలవలె నున్నవి. నా|గంథమునకన్న మీ|గంథము |శేష్ఠముగానున్నది" అని ఆయనకు సాష్టాంగములాచరించెను. నయనారు దేశికుండు వేదాంతదేశికులకు సాష్టాంగపడి, లేచి, వేదాంతదేశికుల గుణ సంపత్తి కానందించి, "వత్సా! నీవు రంగరాజ విజయ ధ్వజీ భూతుండవై శ్రీరంగమునందే నివసింపు" మని దీవించెను

ఆ సన్నివేశమును చూచుటకు వచ్చిన వారందఱును "మీరిరువురును జయించితిరి. ఎవ్వరును ఓడలేదు" అని యిరువురకు సాష్టాంగములాచరించి, వారియాజ్ఞల గైకొని తమ తమ గృహంబుల కేగిరి.

రంగేశ్వరుండు వారిరువురకు తీర్థము, శఠగోపము, తిరుత్తుళాయి, ప్రసాదము మొదలగు కానుకలనిప్పించి, తన శేషవస్త్రములతో నిరువురను సన్మానించి పంపించెను.

ఇంతలో శ్రీరంగమున తురుష్కుల దండయాత్ర కలిగెను. మ్లేచ్ఛసైన్యములు శ్రీరంగ పౌరులెందరినో క్రూరముగా హతమొనర్చిరి. శ్రీరంగమునందలి యనేక గృహంబులు ధ్వంసముచేసిరి. ఆ దండయాత్రకు భయపడి పిళ్ళలోకాచార్యులు మొదలగు కొందఱు పెద్దలు రంగేశ్వర మూలబింబమును కనబడకుండునట్లు కప్పి ఉత్సవమూలను తీసికొని, శ్రీరంగమునుండి బయలువెడలి యాదవాద్రి కేగిరి. అచట కొంతకాలముండి, అటనుండి అనేక దివ్యదేశంబులు దర్శించుచు తిరుమల వేంకటేశ్వర సన్నిధియందా రంగేశ్వరునుంచి, పూజించుచు, పదిరెండు వర్షంబులుండిరి. ఆసమయమున వేదాంతదేశికులు రంగేశ్వరునిగూర్చి 'అభీతిస్తవం'బును చెప్పెను. రంగేశ్వరుడు తురుష్కుల స్వప్నములగోచరించి, వారి ననేకవిధముల భయపెట్టెను. వారు దౌష్ట్యమునువీడి వెడలిపోయిరి.

ఆ సమయమున కూరేశగురుని మునిమనుమడు వ్యాసభట్టారకుని మనుమునగు సుదర్శనాచార్యుండను పేరుగల యొక మహాపురుషుండు భగవద్రామానుజకృత శారీరకమీమాంసాభాష్యంబునకు వ్యాఖ్యగా "శ్రుత ప్రకాశిక"యను ముప్పదిరెండువేల వ్యాఖ్యాన గ్రంథమువ్రాసి, దాని

వెల్లడింపకముందే తురుష్క దండయాత్రకు బలియయ్యెను. అంత నాతనితల్లి వేదాంతదేశికుల యొద్దకే తెంచి, "స్వామీ! మదీయపుత్రుండు రామానుజభాష్యంబునకు నొక వ్యాఖ్యాన గ్రంథమును వ్రాసి పరమపదించెను. మీరు మాయింటికే తెంచి, ఆ గ్రంథమునుజూచి, యుద్ధరింపు"మని వేడుకొనెను.

వేదాంతదేశికు లంగీకరించి, ఆమె గృహంబునకేగి పత్రములపై వ్రాసియున్న ఆ గ్రంథమునెల్ల ఆమూలాగ్రముగా పరిశీలించెను. తాను శ్రీభాష్యమునకు వ్రాసిన వ్యాఖ్యకన్న నిదియే మేలైనదిగానున్నదని తలంచి, శ్రుతప్రకాశికనే యుద్ధరింపసమకట్టి దానినే తన శిష్యులకుం జెప్పెను. అట్లు పరంపరగా వైష్ణవోత్తములందఱును దానినే గ్రహించి పఠించిరి.

కొంతకాలమునకు చెంజినాయకుఁడను పేరుగల యొక మహాపురుషుండు విజయనగరపాలకుల యాజ్ఞచే కొంతసైన్యములో వచ్చి తురుష్క సేనల వధించి దేశోపద్రవమును మాన్పెను. శ్రీరంగముద్ధరింపబడెను. తిరుమలయందున్న రంగేశ్వరుని తీసికొనివచ్చి, శిలలచేనాచ్ఛాదితుండై యున్న మూలవరుల మరలనుద్ధరించిరి. అర్చనాదులన్నియు యథావిధిగా కొనసాగించిరి. ఆ ఘనకార్యమొనర్చిన వానినిగూర్చి వేదాంతదేశికులు కొన్ని శ్లోకములు చెప్పిరి. వానిని శ్రీరంగ దేవాలయమునందు ఫలకములపై చెక్కించిరి. అవి నేటికిని దేవాలయ కుడ్యములపైనున్నవని పెద్దలు వచింతురు.

వేదాంతదేశికు లోకపరి తిరుమల దర్శింపవలయునని శ్రీరంగనాథునకు చెప్పిపోవుచుండెను. మార్గమధ్యమున నొక యూరు ప్రవేశించెను. అచట ప్రొద్దుగ్రుంకెను. ఒక వైశ్యుని వీధియరుగుపై నుత్తరీయమును ముసుంగిడుకొని శయనించెను. ఆ రాత్రి వేదాంతదేశికునకు భోజనములేదు. ఆరేయి ఆ యింటియజమాని స్వప్నమునందు సర్వేశ్వరుండు గోచరించి "ఓయీ! నీగృహబహిర్వితర్దికపై పవ్వళించిన వ్యక్తి నా స్వరూపమే. అతనికి గతరాత్రి ఆహారములేదు. నీవాతని పూజించి యర్చించుము. కృతార్థుడవయ్యెద"వని అదృశ్యుం డయ్యెను.

వైశ్యుడుదయముననే మేల్కాంచి, కాలకృత్యములు తీర్చుకొని బయటకువచ్చెను. వేదాంతదేశికులు మేల్కాంచి పయనమగుటకు సిద్ధమగుచుండెను. ఆ వైశ్యుడు వేదాంత దేశికుల పాదపంకేరుహములపై బడి "అయ్యా! మీరు సాక్షా ద్దైవస్వరూపులరు. సర్వేశ్వరుడు మీ విషయమును రాత్రి నాకు స్వప్నమునందు వినిపించినాడు. రాత్రి మీకు భోజనములేదట ఇవిగో క్షీరములు స్వీకరింపు"డని సమర్పించెను. కొన్ని ఫలములనుగూడ నొసంగెను. గురుండు స్నానంబాచరించి, ద్వాదశోర్ధ్వపుండ్రంబులుదాల్చి భగవచ్ఛాసనంబులుతీర్చి వైశ్యుడొసంగిన వానిని హయగ్రీవమూర్తికి నివేదించి అవి గ్రహించి, వైశ్యునాశీర్వదించి పయనమై తిరుపతికి వేంచేసెను.

తిరుచానూరునకుపోయి భగవతి అలర్మేల్మంగా తాయా రును సేవించెను. తిరుపతికిపోయి తిల్లగోవిందరాజస్వామిని

దర్శించి, సేవించి మంగళాశాసనమాచరించెను. గోదాదేవిం
గొనియాడి, పుండరీకవల్లితాయారునకు వందనంబాచరించి,
శ్రీరామాలయమునకేగెను. సీతారాములక్ష్మణులకంజలించెను.
ముముక్షుజనముల త్రిపాద్విభూతికిం గొంపోవునట్టి అర్చిరాది
మార్గమో యనట్లున్న శేషాచలముపైకెక్కి కల్యాణపుష్కరిణి
యందవగాహనంబుచేసెను. అంతరాళిక విరచిత శ్రీచూర్ణ
రేఖాలంకృత శ్వేతమృద్భాసమానద్వాదశోర్ధ్వపుండ్ర విరాజిత
ద్వాదశస్థలుండై, భగవచ్ఛాసనంబులుతీర్చి, వరాహస్వామిని
సేవించెను.

భవ్యగోపురంబున కంజలించెను. కల్యాణమంటపంబు
నకు జోహారుపు లర్పించెను. బలిపీఠముకడ మోకరిల్లెను. ధ్వజ
దండంబునకు సాష్టాంగదండప్రణామంబుగావించెను. మేయాన్
అను సర్వేశ్వరునకు చిన్నిపూలర్పించెను. తిరుమట్టపల్లె యం
దున్న శ్రీదేవిం గొనియాడెను. గరుడునకు వందనంబు లాచ
రించెను. జయవిజయులకు నమస్కరించెను. కక్ష్యాంతరంబులు
గడచెను. ఆనందవిమానమునకు ప్రదక్షిణము చేసి, తన్మధ్య
మున లక్ష్మీవిరాజితోరస్స్థలుండును, శ్రీభూనీళాది దివ్య
మహిషీ సమేతుండును వజ్రవైడూర్య గోమేధిక పుష్యరాగ
మరకతమాణిక్యాది దివ్యరత్నస్థగిత భర్మకోటీర విరాజితుం
డును, హారకేయూరకటక ముక్తాదామోదర బంధనకటిసూత్ర
శింజాను రంజితమంజు మంజీరాది దివ్యభూషణ భూషితుం
డును, నవ్యపీతాంబరరంజిత కటిస్థలుండును, జ్ఞానశక్తి బలై

శ్వర్య వీర్య తేజస్సౌశీల్య వాత్సల్యగాంభీర్యౌదార్య చాతుర్య ధైర్య సత్యకామ సత్యసంకల్ప కృతిత్వకృతజ్ఞ త్వాద్య సంఖ్యేయ కల్యాణ గుణగణార్ణవుండును, జగదుదయ విభవలయ లీలుండును, తప్తచామీకర భాసమాన కర్ణవేష్టనుండును, వేదాంత వేద్యుండునునగు శ్రీనివాసుని దివ్యమంగళ విగ్రహం బాపాద మస్తకంబనుభవించి

శ్లో॥ కలికలుష నిహంత్రే కాంక్షితార్థ ప్రదాత్రే
శ్రుతిశిర సివిహర్త్రే సుష్ఠు లోకో త్రి భర్త్రే
స్థిర చరకుల కర్త్రే శేషభూమీంద్ర నేత్రే
గరుడ గమన తుభ్యం మంగళం శాశ్వతంచ

అని మంగళాశాసనముంజేసి అక్కడ శ్రీవార లిప్పించు తీర్థ శఠగోపప్రసాదాది బహుమతులనుపొంది, అటనుండి గడచి, యతీంద్రుల దివ్యభవనంబుజొచ్చి, అందు భాష్యకారులకు నమస్కరించి, మూగిన వైష్ణవబృందంబునకు శ్రీభాష్యమహిమ చెప్పుచుండెను. ఇంతలో ఒక బాలుండు సభలో ప్రవేశించి, వేదాంత దేశికున కెదురునిలబడి నమస్కరించి,

"శ్రీమాన్ వేంకటనాథార్యః కవితార్కిక కేసరీ
వేదాంతాచార్య వర్యో మే సన్నిధత్తాం సదాహృది

అను తనియను పఠించి జనులందఱును చూచుచుండ నంతర్హితుం డయ్యెను.

వారందఱును విస్మయావిష్టచిత్తులై యీ వచ్చిన బాలకుండు సాక్షాద్వేంకటచల నాథుండనియెంచి, ఆనందపడి, ఈ

శ్లోకము భగవన్ముఖేరితము కాన దీని నందఱు నధ్యయనింప వలెనని భావించిరి. అప్పటినుండి వడగల తెంగల సాంప్రదాయకు లిర్వురును దీనిని పఠించుట కొప్పిరి.

ఈవిధముగా వేదాంత దేశికు లీభూమిపై నూటరెండు సంవత్సరముల కాలము జీవించియుండిరి. జీవిత చరమాంకమున

"నిర్వ్యూఢం యతి సార్వభౌమ వచసా మావృత్తిభి స్త్యావనమ్
నిర్ధూ తేతర పారతంత్ర్య నిరయా నీతాస్సుఖం వాసరాః
అంగీకృత్య సతాం ప్రవృత్తి రసతాం గర్వోపి నిర్వాపితః
శేషాయుష్య వి శేష దంపతి దయా దీక్షా ముదీక్షా మహే"

యతిసార్వభౌములగు రామానుజుల శ్రీభాష్యమున నధ్యయనించుచు నాయౌవనము గడచినది. భగవద్భాగవత వ్యతికరజన విషయపారతంత్ర్య నిరయనిరసనపూర్వకముగా దినములు గడచిపోయినవి. సత్పురుషుల కనుకూలముగా దుష్టులగు పండితుల గర్వమంతయు నిరసింపబడినది. ఇక మిగిలిన కాలమంతయును సర్వశేషి దంపతుల దయకెదురు చూచుచున్నా"మని చెప్పుచు, గురుని శ్రీపాదములు తలంచుచు శ్రీరామానుజుల పదపద్మంబులు స్మరించుచు, వైభవమును చాలించెను.

వేదాంత దేశికుల పుత్రుండగు వరదాచార్యుండు తండ్రికి బ్రహ్మమేధాదిక్రియల నన్నింటిని నిర్వర్తించి సుఖంబుండెను.

వేదాంత దేశికులు రచించిన గ్రంథములు శతాధికములుగానున్నవి. ఆ గ్రంథములన్నియు నేడు లభించుటలేదు.

పాదుకాసహస్రమునందలి యొక శ్లోకము నుదహరించు
ముగించుచున్నాను.

శ్లో॥ పాదపా పాదపా పాదపా పాదపా
పాదపా పాదపా పాదపాఽపాదపా
పాదపా పాదపా పాదపా పాదపా
పాదపా పాదపా పాదపాఽపాదపా

ఓమ్ తచ్ఛాంతిః తచ్ఛాంతిః తచ్ఛాంతిః

స మా ప్త ము

TIRUPATI
33623